# శ్రీ ప్రసాద్



# అప్పాజీ

# అప్పాజీ

దాదాపు నాల్గు వందల సంవత్సరాలకు పూర్వం విజయనగరం విద్యానగరం విజయలక్ష్మి విలసిత పీఠం. సంతత మృదు మధుర మంజులారవములతో ప్రవహిస్తున్న దదే తుంగభద్రాజలం. ఇది ఋష్యమూకం. అది మతంగ పర్వతం. ఆ కనిపించేది ఉగ్ర నరసింహుని దివ్య మంగళ విగ్రహం. అదిగో - అల్లంత దూరాన హజార రామాలయం. దాని కభిముఖంగా ఆంధ్ర వీర పరిరక్షితమైన సార్వభౌముని అంతఃపురం.

ప్రథమ యామం గడచిపోయింది. ద్వితీయ యామం ప్రవేశిస్తోంది కాని, రాజు ఇంకా అంతఃపురానికి రాలేదు. రాణి మనసుకు స్థిమితం లేదు, ఆమె హృదయం పరిపూర్ణంగా మహారాజుకంకితమైపోయింది. అత్యవసర కార్యముంటే తప్ప రాజు రాణిని విడిచి క్షణం నిలువలేడు, వయస్సు ముదిరినా. వారి ప్రణయంలోని వన్నె తరగలేదు. ప్రతి దినమూ ప్రథమ యామాంత సమయంలో రాజు రాణిని కలుసుకుంటాడు. వారిరువురూ కలసి అంతఃపుర ఉద్యానవనానికి విహారార్థం బయలుదేరుతారు. అచట వారు 'రాజు - రాణి' అను విషయమును పూర్తిగా విస్మరిస్తారు. గండు కోయిలను గొంతులు మార్చి వెక్కిరిస్తారు. ప్రియాగమనసంజనితోత్సాహంతో వన్నెచిన్నెలు తీర్చిదిద్దుకొని వికసించిన కలువ కన్నియను రాజు చిలిపిగా తన హస్తంతో స్థానభ్రంశం గావిస్తాడు అసహాయుడగు వెన్నెలరేడు తన అసమర్థతను కప్పిపుచ్చుకొనటానికి ఏ మబ్బుచాటునకో పోయి చూడనట్టు తొంగి చూస్తుంటాడు. రాణి కిలకిలా నవ్వుతుంది. రాజుకూడా శృతి కలుపుతాడు. అచటినుండి రాజూ రాణీ కలసి లతా మండపం చేరుతారు. దేవనే తరు శాఖలపైనున్న పావురాల జంట

వారిని చూసి వెక్కిరిస్తుంది. రాజుకు చిరుకోపం ఆవిర్భవిస్తుంది. రాణికి మోమున చిరునవ్వు అంకురిస్తుంది. వారిరువురూ తరు శాఖ వద్దకు చేరుతారు. పావురాలు జంట విడిపోతాయి. రాజు రాణి వంక "చూశావా - మా ప్రతాపం!" అన్నట్లు చూస్తాడు. రాణి విచిత్ర హాసంతో రాజు దృష్టిని వేరొక కొమ్మ మీదికి మళ్ళిస్తుంది. విడిపోయిన పావురాలు జంటగా క్రొంగ్రొత్త సొగసుతో కనిపిస్తాయి. రాజు రాణి చేయిపట్టుకొని చరచరా లతాగృహాంతర్భాగానికి తీసుకొని వెళతాడు. ద్వితీయ యామాంతాన గాని వారు అంతఃపురానికి రారు. కాని, ఆ రోజు రాజింకనూ రాణి వద్దకు రాలేదు.

రాదేల నారాజు రతిరాజు రారాజు
రమణీయ హృదయాబ్ధి రాకా సుధాకరుడు

రహిపుట్ట జంత్రగాత్రముల రాల్గరగించు విపుల గాంధర్వగానం మహారాణి హృదయాన్ని ఆకర్షించింది. రాణి తిరిగి చూచింది. వకుళ విపంచిని చేపట్టి శృతిచేసి పాడుట కుపక్రమించింది. రాణి ఏమీ మాట్లాడలేదు. ఆమె వినుచున్నదో, లేదో కూడా చెప్పుట కష్టం.

రాదేల నా రాజు రతిరాజు రారాజు
రమణీయ హృదయాబ్ధి రాకా నిశాకరుడు
రాకా సుధాకరుని రమ్య జ్యోత్స్నలలోన
మలయ పవనాలలో మరులు గొలిపే వేళ
ఎదను సంతోషాబ్ధి నోలలాడింపగా
బిగి కౌగిటను జేర్చి మదన తాపము బాప
రాదేల నా రాజు రతిరాజు రారాజు
రమణీయ హృదయాబ్ధి రాకా నిశాకరుడు.

వకుళ మహారాణికి అత్యంత సన్నిహితురాలు. బాల్య స్నేహితురాలగు వకుళను మహారాణి తన పుట్టినిల్లయిన కటకం నుండి తీసుకొని వచ్చింది. వకుళ వద్ద మహారాణికి అంతరంగిక విషయాలు ఉండవు. అందువలననే మహారాణి వకుళ పాటను మన్నించగలిగింది. వకుళ పాట మహారాణి ఎదలోని మాట.



కెలరాజు సోయగము వెలవెలా పోయింది
కలువ కన్నియ కాంతి నిశిలోన కలిసింది
కోకిలమ్మల స్వరము ఘోషగా తోచింది
హృదయ మారాటాన వలవలా ఏడ్చింది
రాదేల ఈ రేయి రతిరాజ సుందరుడు
రమణి మనోహరుడు రాజ పరమేశ్వరుడు.

"వకుళా! చాలు-ఇక ఆ పాట ఆపు," అంది మహారాణి.

వకుళ స్వరమాధుర్యం ఆగిపోయింది. ఆమెవీణను యథాస్థానంలో పెట్టడానికి వెళ్ళిపోయింది. పాట ఆపమన్నదే గాని, మహారాణి ఆ పాటను భావమును తన హృదయంలో ప్రసరింపకుండా ఉండలేకపోయింది.

ప్రేమికులకు ప్రపంచ జ్ఞానం సున్న: ఈర్ష్య ఎక్కువ. మహారాణి హృదయమున ఒక్క అనుమానం ఛాయా మాత్రంగా అంకురించింది. మహారాజు తన సపత్నులతో ఎవరి మందిరమునకైనా వెళ్ళినేమో అన్న ఊహ ఆమెను క్షణకాలం ఆరాటపరిచింది. మరుక్షణమువనే ఆ అసందర్భపు ఊహకు ఆమెకు నవ్వు వొచ్చింది. అంతఃపురమున అన్నపూర్ణా చరణా చారణ చక్రవర్తిగా బిరుదునొందిన సార్వభౌముడు వేరొక రాణితో నుండుటా? అసంభవమనుకొంది మహారాణి. రాజేదో రాచ కార్యంలో మంత్రణాలయంలో ఉన్నాడేమోనని ఆమె అనుకొంది. కాని, తనను కూడా విస్మరింపచేయగల రాచకార్యముంటుందా? రాణిలో అహంభావమంకురించింది. ఒకవేళ విస్మరించినా, ఆ యామ ద్వితీయ పూర్ణచంద్రుడైనా రాజుకు జ్ఞప్తి చేయడా అని ఆమె ఆశ. చంద్రదర్శనమైన తరువాత తనకు నాథుని వియోగం మరింత దుర్భరంగా తోచింది. రాజుకు మాత్రం అలా ఎందుకు ఉండరాదని ఈమె కోపం. బాహ్య ప్రపంచమున కాతడు మహారాజే కావొచ్చు. కాని, ఆమె అతని హృదయసామ్రాజ్యమున కధికారిణి.

ఇంతలో వకుళ వొచ్చి వీరేంద్రపాత్రుని ఆగమనాన్ని తెల్పటంతో మహారాణి ఆలోచనావాహినికి అవరోధం కలిగింది.

వీరేంద్రుడు మహారాణికి ప్రేలు విడిచిన మేనత్తకొడుకు. అతడు ఇటీవలనే మహారాణిని చూచి పోవటానికి వచ్చాడు. కాని, నెలలు గడుస్తున్నా పోవటం మాత్రం జరుగలేదు. భార్య పుట్టినింటివైపు బంధువవటం చేత మహారాజుకు అతడంటే వాత్సల్యం. అంతఃపురంలో-అందులోనూ మహారాణి అన్నపూర్ణాదేవి అంతఃపురంలో - అతనికి సర్వ స్వాతంత్ర్యముంది. వచ్చిన రోజునుండీ మహారాజునకు తలలో నాల్కవలె మెలగుతూ రాజానుగ్రహాన్ని సమగ్రంగా సంపాదించాడు. వరుసకు రాజు తనకు అన్నగారైనప్పటికీ, శ్యాలక సంబంధం వాత్సల్యాన్ని వృద్ధి చేస్తుందనే ఉద్దేశ్యంతో "బావా-బావా" అని సంబోధిస్తాడు

వీరేంద్రుని చూడగానే మహారాణి మనస్సుకు కొంచెం ఊరట లభించినట్లయింది. 'వీరేంద్రా! మహారాజును ఎక్కడైనా చూశావా?' రాణి ప్రశ్నించింది.

వీరేంద్రుడు మహారాణి చిన్నతనంలో ఒక ఇంటిలో కలసి మెలసి ఆట పాటలతో పెద్దవారైనందువల్ల, వీరేంద్రుడామె కన్నా వయస్సులో పెద్ద అయినప్పటికీ ఆమె అతన్ని పేరు పెట్టే పిలుస్తుంది. వీరేంద్రుడు మాట్లాడలేదు. రాణి రెట్టించి అడిగింది.

"మాట్లాడవేం వీరేంద్రా!"

"ఏం మాట్లాడమంటావు?"

"మహారాజును ఎక్కడైనా చూచావా?"

"ఏమో!" వీరేంద్రుని సమాధానంలో రాణికి కొంటెతనం గోచరించింది. "చూస్తే చూచి ఉండవచ్చు. ఒకవేళ నేను చూశానే అనుకో, నీకు వొరిగేదేమిటి?"

ఈ ప్రశ్నకు రాణికి సమాధానం దొరకలేదు. మహారాజు ఇంకా రాలేదు" అని మాత్రం అంది.

"ఔను. ఒకే వ్యక్తి, ఒకేసారి రెండు చోట్ల ఎలా ఉండగలడు!"

ఈ సమాధానం మహారాణి హృదయంలో అంకురించిన అనుమానాన్ని రెచ్చగొట్టింది. ఆమె వీరేంద్రుని వంక దీనంగా చూస్తూ - "మహారాజు ఎక్కడున్నారు?" అని ప్రశ్నించింది.



"నాకెలా తెలుస్తుంది? ఇక్కడలేరు కనుక వేరొక చోట ఉండాలని ఊహించాను. అయినా అంత్యనిష్ఠూరం కన్నా అది నిష్ఠూరమే మంచిది." వీరేంద్రుడు తనకు తెలిసిన రహస్యమును మరుగుపరుస్తున్నాడని మహారాణి గ్రహించింది. ఆమె ప్రేమైకహృదయం ఆరాటాన్ని అణచుకోలేక పోయింది. వీరేంద్రుని అనేక విధాల బ్రతిమాలాడింది. చివరకు వీరేంద్రుడు ఒప్పుకున్నాడు.

"చెప్పక తప్పదంటారా?"

"అవును తప్పక చెప్పవలసిందే."

"అయితే చెప్తున్నా, ఒక్కమాట! ఎవరినైనా అంతగా ప్రేమించరాదు. అతి ప్రేమ బందిఖానా వంటిదని ఆర్యులకు తెలియరాదు సుమా!" వీరేంద్రుని మాటలు వక్రంగా నున్నా, వాస్తవ సదృశములుగా నుండుట ప్రత్యేకత. కాని, ఈ సమాధానం రాణికి సహజంగా కోపం తెప్పించింది ఆమె ప్రచండ తీక్షణ వీక్షణముల ధాటికి ఓర్వలేక వీరేంద్రుడు నిజం చెప్పివేశాడు. అతడు రాజును తులాభారమండపోద్యాన వనంలో చూచాడు. ఈ సమాధానం రాణిని విపరీతంగా కలచివేసింది. తులాభారమండపోద్యాన వనం మహారాణి తిరుమలాంబికది. తిరుమలాంబిక ఆంధ్ర సామ్రాజ్య పట్టమహిషి. మహారాజును శాస్త్రీయంగా వివాహమాడిన ప్రథమ భార్య.

అన్నపూర్ణాదేవి మనోవేదన ఆమెకు తెలియకుండానే వచన రూపంలో వెలువడింది. "వసంతం వెల్లివిరిసిన ఉద్యాన వనసీమ, ప్రక్కన సంతత కింకిణీస్వరముతో జల-జలా ప్రవహించే తుంగభద్ర. పైన స్వచ్ఛ జ్యోత్స్నలు చిందించు రాకా పూర్ణ నిశాకరుడు. ఆమె వీరేంద్రుని వైపు తిరిగి—'అక్కడ నువ్వేం చూశావు, వీరేంద్రా?" అని ప్రశ్నించింది.

"నువ్వు చెప్పినవన్నీ చూచాను."

"అంతే గదా!" మహారాణి సంతృప్తిగా నిట్టూర్చింది.

"ఆ పైని కూడా చెప్పమంటావా? అయినా నా కెందుకులే- సతీపతుల మధ్య తల దూర్చటం? అందులో రాజదంపతులు,"

మహారాణిలో మళ్ళీ ఆరాటం పెల్లుబికింది. "రాజదంపతులమైనా ఆంతరంగికులమే కాని, అన్యులం కాదు కదా!" అని ప్రాధేయపడింది. అయినా వీరేంద్రుడు అయిష్టమును సూచిస్తూ—

"మహారాణీ! చెప్తాను. కాని, నువ్వు ఓర్చుకోగలవా? అని ప్రశ్నించాడు.

మహారాణికి వీరేంద్రుని తాత్సారం విసుగు కలిగించింది. చివరకు వీరేంద్రు డుపక్రమించాడు. "రాత్రి ఉద్యానవన సీమలో పూచిన పూల మధ్య, పట్టమహిషి తిరుమలాంబిక శిఖలో విర పూచిన మల్లెల చెండు వాసనలు చూస్తూ, కొప్పు దిద్దుతూ....'

ఇక పైన వినలేకపోయింది మహారాణి. ఆమెలోని ఈర్ష్యానలం ఒక్కసారి ప్రజ్వలించింది. 'పట్టమహిషి తిరుమలాంబిక పూజా పునస్కారాలలో నలుబది వసంతాలు తెల్లవార్చిన ముది వగ్గు తిరుమలాంబికకు ఈనాటికి శృంగారం కావలసి వొచ్చింది కాబోలు, సుఖం ఎవరికి కావాలో వారికియాలి కాని, నా నాధుడు ఆమె వద్దకెందుకు పోవాలి?"' అంది మహారాణి.

వీరేంద్రునకు విపరీతమైన నవ్వు వచ్చింది. 'మహారాణీ! తిరుమలాంబిక పూజా పునస్కారాలవల్ల అఖండమైన శక్తిని ఆర్జించింది. ఆమె బాంధవ్యానికి వయసుతో నిమిత్తం లేదు. దాన్ని అనుభవించేది ఆర్య ధర్మం. కాని, నీవు రాజునకు ప్రణయ సామ్రాజ్య పట్టమహిషివి వయసు ఉన్నంత కాలమే ప్రణయం - వయసు ఒకరి కోసం ఆగదు,' వీరేంద్రుని విపరీత వ్యాఖ్యానానికి రాణి చలించింది.

'అయితే నాకు కూడ వయసు మించుతోందా?'

"ఆఁ! లేకపోతే ఎల్లకాలం యవ్వనవంతురాలిలా యిలాగే ఉంటావా?" వీరేంద్రుని సమాధానం రాణిని మరింత కలవర పరిచింది.

"ప్రేమకు వయస్సుతో నిమిత్తమేముంది?" రాణి మరల ప్రశ్నించింది.

"నామటుకు నాకు ప్రేమకూ, కామానికీ భేదమేలేదు." వీరేంద్రుడు



తన ఉద్దేశమును వ్యక్తీకరించాడు. "పోనీ, మీ ఇరువురి మధ్య ఉన్నది ప్రేమే అని నిర్ధారణ ఏమిటి?"

"నేను నా ప్రభువును విపరీతంగా ప్రేమిస్తున్నాను.

"నేను చదివిన నిఘంటువు కర్త విపరీతమైన ప్రేమనే కామం అని నిర్వచించాడు."

మహారాణి తన కోపాన్ని లోలోపలే దిగమింగింది. "నీవన్నీ అసందర్భపు విపరీత వ్యాఖ్యలు."

"ఔనౌను. వాస్తవాని కతి సన్నిహితాలు. కాని, ఒక్కమాట అడుగుతాను. చెప్తావా? ప్రేమ స్వచ్ఛమైంది." వీరేంద్రుడు నిర్వచించాడు.

"ఔను."

"నిష్కళంకమైంది"

"ఔను."

"ఈర్ష్యారహితమైంది."

"ఔను."

"కాని, నీ ప్రేమ సపత్నులపై ఈర్ష్యతో మిళితమై ఉంది. ఔనని చెప్పు. ఔనా."

మహారాణి ఒక్కక్షణ మాలోచించింది. ఔనని తల వూపింది.

"నీ ప్రేమ స్వచ్ఛమైంది కాదు. కాని విపరీతమైంది. నీ ప్రేమే ఇలా ఉంటే, నీ విభుని ప్రేమ అన్యథా ఎలా వుంటుంది? అతడు నీ అందాన్నే ప్రేమిస్తున్నాడు. నీ యవ్వనాంతాన అతని ప్రేమ అంతరిస్తుంది. అతడు తిరుమలాంబిక అందాన్ని ఏ నాడూ ప్రేమించలేదు కాబట్టి ఆమె మీద ఉన్న అతని ప్రేమ శాశ్వతమైంది ఏమంటావ్?"

మహారాణికి ఏమనటానికి తోచలేదు. అతడు చెప్పేది సత్యమని, ఆమె విశ్వసించటానికి ప్రయత్నిస్తుందేమోనని వీరేంద్రుడు మళ్ళీ మొదలు పెట్టాడు.

"అదిగాక తిరుమలాంబిక పట్టమహిషి-మహారాజు ఆదర-అనాదరాలతో ఆమెకు నిమిత్తంలేదు. గౌరవం రాదు! పోదు. ఆమె గౌరవం

విశిష్టమైంది. ఇక నువ్వు- నీ గౌరవం కేవలం రాయలవారి నిర్హేతుక పరిపూర్ణ కటాక్షంమీద ఆధారపడి ఉంది."

వీరేంద్రుని మాటలు రాణి చెవులకు ములుకుల్లా తాకాయ్. పాపం! ఆమెకు పూజాపుస్కారాలు చేతకావు. ఆమె చేయగలిగింది ఒక్కటే. ప్రేమించటం, ఏదైనా తరుణోపాయాన్ని చెప్పమని వీరేంద్రుణ్ణి ప్రాధేయపడింది. వీరేంద్రుడొక్క క్షణం ఆలోచించాడు.

"మహారాణీ! ఇల్లు చక్కబెట్టుకోటానికి నీపై మార్గమే చాలు. రాజుకు నీపై ఇంకా మోజు తగ్గలేదు. ఇప్పుడిచటికి వస్తాడు. వచ్చిన రాజును ఏ విధంగానైనా మరులు గొలిపి నీ కుమారుని యువరాజ పట్టాభిషేకానికి ఒప్పించు. అప్పుడు నీవు రాజమాతవౌతావు. ఆ పదవిలో నీ గౌరవం శాశ్వతమవుతుంది.

వీరేంద్రుని ఉపదేశం మహారాణికి వింతగా తోచింది. తన ఆరేళ్ళ బాలునికి పట్టాభిషేకమా? .... ఇంతలో వకుళ వొచ్చి రాజాగమానాన్ని సూచించింది."

మహారాణి వీరేంద్రుడి వంక తిరిగి - "ఇప్పుడు నన్నేమి చేయమంటావు!" అని అడిగింది.

"అఁ కొద్దిగా కోపాన్ని దుఃఖంతో కలిపి అభినయించు" అంటూ వీరేంద్రుడు వెళ్ళిపోయాడు.

"అన్నపూర్ణాదేవి అలక గృహాన్ని అలంకరించింది.

* * *

రాజు అన్నపూర్ణాదేవి అంతఃపురంలో అడుగుపెట్టేసరికి తృతీయ యామం ప్రవేశించింది. అంతఃపురిమంతా ప్రశాంతంగా ఉంది ఈ నిశ్శబ్ద గాంభీర్యానికి రాజు కొద్దిగా కలత చెందాడు. తానేవేళ వొచ్చినా, స్వర్ణ మణిమయ భూషణావళిని తాల్చి, రత్నకంకణ కింకిణీ రవళితో ఘల్లు ఘల్లుమని ఎదురు వొచ్చి చిరునవ్వు దొంతరలతో సంభావించే రాకేందువదన ఆ నాడు రాజునకు ఎదురు రాలేదు. ఇంతలో రాజునకు వకుళ కనిపించింది.



"వకుళా? మహారాణి ఎక్కడ?" అని రాజు ప్రశ్నించాడు.

వకుళ అలక గృహం వేపు దారి చూపించింది. రాజుకు పరిస్థితి దాదాపు అర్థమైంది. కాని, దాన్ని ఎదుర్కోవటమే ధీరోదాత్తుని లక్షణం. రాజు అలక గృహాన్ని ప్రవేశించి పాన్పుపై నిరాభరణగా శయనించి ఉన్న రాణిని చూశాడు. ఆప్యాయంగా తన పాదముల చెంత ఆసీనుడౌతున్న రాజును చూచి రాణి తన తలను ప్రక్కకు తిప్పుకుంది.

రాజు మృదువుగా "రాణీ!" అని పిలిచాడు.

రాణికి "రాణీ," అనే పిలుపు వెగటుగా తోచింది. ఔను. ఎందరో ఆప్యాయంగా తన పాదాలచెంత ఆసీనుడౌతున్న రాజును చూచి రాణి తన తలను పక్కకు త్రిప్పుకొంది

రాజు మృదువుగా "రాణీ!" అని పిలిచాడు.

రాణీకి "రాణీ" అనే పిలుపు వెగటుగా తోచింది. ఔను. ఎందరో రాణులు! "ప్రేయసీ!" అని సంబోధించనందుకు ఆమె ఎద కుమిలిపోయింది. రాజుకు రాణిని ఏ విధంగా కదిలించాలో అర్థం కాలేదు.

"రాణీ! ఆరోగ్యం సరిగా లేదా?" రాజు ఎలాగైతేనేం, ధైర్యం చేశాడు. కాని, సమాధానం రాలేదు. కొన్ని క్షణాలు గడిచాయి. "బాధగా ఉందా?" రాజు మళ్ళీ ప్రశ్నించాడు. "రాజవైద్యుణ్ణి పిలిపించమంటావా, దేవీ?"

రాణి ఆ మాటకు సమాధానం చెప్పింది-నిజంగా రాజవైద్యుడొస్తాడేమోనని భయంతో. "మనసులోని బాధకు వైద్యుడు మందిస్తాడా, మహారాజా?"

రాణి సమాధానం రాజుకు ఔషధతుల్యంగా ఉన్నా, సంతసించాడు.

"శారీరకమైన బాధ కాదన్న మాట? మరి...."

"మీకు తెలీదా?"

"నీవు చెప్పకుండా ఎలా తెలుస్తుంది?" రాణి రాజు వంక తీవ్రంగా చూచింది. రాజు ఆ చూపులకు తట్టుకోలేక పోయాడు. "నా వల్ల ఏమైనా

అపచారం జరిగిందా, దేవీ?" రాజు కంఠం ప్రాధేయపూర్వకంగా ధ్వనించింది. కాని, రాణి దృష్టిలో మార్పులేదు. "ఈనాడు నేను ఆలస్యంగా రావటమే కదా, నీ కోప కారణం." రాణి దృష్టిలో కొద్దిగా మార్పు వొచ్చింది. "నన్ను క్షమించు దేవీ! ప్రథమ యామంలోనే నీ అంతఃపురానికి రాబోతుంటే అప్పాజీ వారు మంత్రాంగ రచనకని కబురు పంపించారు. మహామంత్రి మంత్రాంగంనుండి బయట పడటానికెంత కాలం పట్టింది.

అంత కోపంలో కూడా మహారాణికి నవ్వు వచ్చింది. రాజు హృదయం ఆనందభరితమయింది.

"ఇంత వరకూ మంత్రాంగ రచనేనా?" మృదువుగా ప్రశ్నించింది.

"ఔను, దేవీ! ఆకాశాన పూర్ణచంద్రోదయమైన వెంటనే నా హృదయంలో అన్నపూర్ణా వదనచంద్రోదయమైంది. కాని, ఎదురుగా మహామంత్రి తిమ్మరుసు. హృదయాన్ని చీల్చి చదవటంలో మేటి. ఒకటి రెండు పర్యాయములు లేవటానికి ప్రయత్నించినా వారి నిశిత వీక్షణలకు కట్టుబడి కాలు కదల్చలేక పోయాను."

"అయ్యో, పాపం, తిమ్మరుసయ్యవారంటే మీకెంత భయమండీ! వారు-పసిపాపలనే కనికరం లేకుండా మిమ్మల్ని కట్టిపడేశారు కాబోలు!" రాణి సానుభూతి ప్రకటించింది.

రాజు మారు మాట్లాడకుండా విషగుళికను మింగి వేశాడు. "ఈ విషయం నాకే మాత్రం తెలిసినా, ప్రథమ యామాంతాన ఇక్కడికి వొచ్చిన మహామంత్రితో చెప్పి విడుదల చేయించి ఉండేదాన్ని."

రాజు నిర్ఘాంతపోయాడు. తిమ్మరుసయ్యవారు ఇక్కడకు వొచ్చారా? అని మాత్రం అనగలగాడు. తరువాత కొన్ని క్షణాలకు "అవును, నాకు దారిలో కొంత ఆలస్యమైంది," అన్నాడు మహారాజు.

"ఔను. తులాభార మండపోద్యానవనంలో తిరుమలాంబిక వల్ల ఆలస్యమైంది."



రాణి తోక త్రొక్కిన త్రాచువలె లేచింది. "తిరుమల" శబ్దమంటే ఆమెలోని ఆవేశానికి అవధి ఉండదు. రాజుకు విషయగోపనంలో నమ్మకం నశించింది.

"దేవీ! కావాలని నేనామె కోసం వెళ్ళలేదు. కాని, దారిలో కనిపించినప్పుడు సంభావించకుండా ఉండటం న్యాయమా?" మహారాజు తన్ను తాను సమర్థించుకోటానికి చూచాడు. ఈ సమాధానంతో రాణికి ఆవేశం ఉపశమింపక పోగా హెచ్చుపెరిగింది.

"దారిలో కనిపించిందేం! పట్టమహిషి అంతఃపురం వొదిలి దారులు కాస్తున్నదా తమ కోసం?" రాణి కంఠంలో వ్యంగ్యమూ, అహంభావమూ గర్వమూ ఒక్క మారుగా ధ్వనించాయి.

రాజుకిది అసహ్యంగా పరిణమించింది. ఆయనలోని పురుషత్వమొక్కసారి పెల్లుబికి "అన్నపూర్ణా!" అనే మేఘ గర్జనలో ధ్వనించింది.

రాణి నోట మాట లేదు. దృష్టి మళ్ళలేదు. ఒక్కసారిగా మ్రాన్పడి పోయింది.

మహారాజు కూడా తన నిగ్రహశక్తిని ఒక్క అతివముందు కోల్పోయినందుకు లోలోన సిగ్గుపడ్డాడు. తరువాత అనునయ పూర్వకంగా 'అన్నపూర్ణా!' అని సంబోధించాడు. రాణికి దుఃఖం తెరలు-తెరలుగా వొస్తున్నది. ఆమె ఏడ్చి ఏడ్చి చివరికి నాథుని వంక తిరిగి మీకు తిరుమలాంబిక అంటే ఇంత అభిమానమని నాకు తెలీదు. అలా అయితే మీరు ఆమె అంతఃపురంలోనే ఎందుకు ఉండకూడదు." దీనంగా ప్రశ్నించింది.

ఆ దీన వదనం రాజుకు గమ్యాతి రమ్యంగా గోచరించింది. ఒక్కసారి వొంగి ఆమె అధరాన్ని చుంబించాడు. రాజు రాణికి మళ్ళీ దాసుడయ్యాడు. "లేదు, దేవీ! తిరుమలదేవి నెన్నడూ నా ప్రేయసిగా చూడలేదు. అమె నా ధర్మపత్ని. కాని, నీవు నా ప్రేయసివి. నా ప్రణయ సామ్రాజ్యానికి నీ వేకైక సామ్రాజ్ఞివి" రాజు రాణిని లాలించాడు.

"కాని, ఆ సామ్రాజ్య మెచ్చటో?" రాణి గొంతు మాధుర్యంగా ధ్వనించింది.

"ఇచ్చట." రాజు వక్షస్థలాన్ని చూపించాడు.

"అచ్చట తిరుమలాంబికా వక్షోజ కురంగనాభ మున్నది." రాణిలో మరల ఈర్ష్యారేఖ ఉత్పన్నమైంది.

"కాదు. తిరుమలాంబికకు ఈ శృంగారం చేతకాదు. ఆమెసాత్విక. ఇక్కడ సకల కళా విశారద అయిన అన్నపూర్ణా వక్షోజకురంగనాభమే జెన్నొందాలి." రాయలు తన కోర్కెను విశదీకరించాడు.

కాని, వీరేంద్రుని ఉపదేశాలవల్ల మహారాణికి ప్రణయంలో విశ్వాసం నశించింది. ఆమె కిప్పుడు త్రికరణశుద్ధిగా అయ్యని ధర్మపత్ని కావాలనే కోరిక. "నాకీ ప్రణయం వొద్దు, నాకీ సకల కళా ప్రావీణ్యమూ వొద్దు. నేనుకూడా తిరుమలాంబిక కన్నా అధికమైన ధర్మపత్నిని కావాలి."

రాజుకు ఈ కోరిక వింతగా తోచింది. అన్నపూర్ణ తిరుమలాంబిక ఎట్లా ఔతుంది? ఒకరు ఐహికానందదాయిని, మరొకరు అఖిల పురుషార్థముల కాటపట్టు. అన్నపూర్ణ లేకుంటే రాజుకు జీవితమే వ్యర్థం, తిరుమలాంబిక లేకుంటే తరించటానికి మార్గమే లేదు. రాజుకు ఇరువురూ ముఖ్యులే. ఈ విభిన్న విషయాలను రాజు సమన్వయపరచాడు. "దేవీ, నీవు కేవలం ప్రేయసివి నీ జన్మ ప్రియురాలిగనే తరించాలి గాని, పరమ కఠోరమగు ధర్మపత్నిత్వ దీక్షవల్లకాదు. దాని కనుగుణంగా నీలోని ప్రకృతి లక్షణాలు మేళవించలేదు. అదే విధంగా తిరుమలదేవి ప్రేయసిగా రాణించలేదు. సతీత్వ లక్షణాలవల్లనే ఆమె భాసిస్తుంది."

రాజు సమాధానం రాణికి కర్ణకఠోరంగా ఉంది. తాను ఇహ లోక శారీరక వాంఛ సాధనావిశేషమై రాజుకు నచ్చానేమో అనుకుంది. ఆమెకు ప్రేమ అంటే విశ్వాసం నశించింది. కాని, కానిమ్మని ప్రణయానికి ఆమె పణం పెట్టింది. తన ప్రేమ తత్త్వం మీద రాజుకంత పరిపూర్ణపూర్ణ విశ్వాసముంటే, పట్టమహిషిని కన్నెత్తి చూడనని ప్రతిజ్ఞ చేయమని పట్టు పట్టింది. మహారాణికీ పణం హద్దు మీరిందిగా తోచింది. కాని,రాజు రాణిని స్వాతికంగా అనునయించటానికి ప్రయత్నించాడు.



"దేవీ! తిరుమలాంబిక నీ సపత్ని కాకుండా ఆంధ్ర సామ్రాజ్య పట్టమహిషి. నాకొరకు కాకున్నా, లోకం కొరకైనా నీవామెను గౌరవించాలి." రాజు విన్నపం రాణికి లోకువైంది.

"నాకు లోకంతో ఏం పని? ఆమెను పట్టమహిషి అని మీ ఆంధ్రులు పూజిస్తే పూజిస్తారు కాక, ఆమెను పట్టమహిషిగా గుర్తించవలసిన అవసరం సార్వభౌమ పుత్రికనైన నాకు లేదు." రాణి సమాధానం వెగటుగా తోచింది.

"ఆమె ఆంధ్రులకే కాదు సువిశాలమైన ఈ విజయనగర సామ్రాజ్య మందలి సర్వజనులకూ, నీకూ, నీ తండ్రియైన ప్రౌఢ గజపతికీ, నీ నాథుడైన నాకూ, నా అభ్యుదయ సర్వస్వానికి కారణభూతుడైన అప్పాజీ వారికి సైతం ఆమె మహారాజ్ఞి. ఆమెను మన్నించవలసినబాధ్యత నీపైన ఉంది. దేవీ! నీవు పవిత్ర ప్రేమమూర్తివి నిష్కళంక ప్రేమలో ఈర్ష్యకు తావులేదు.

మహారాజు తిరుమలాంబికను వెనుక వేసుకొని రావటం రాణికి నిప్పుపై గుగ్గిలం చల్లినట్లయింది.

""ఔను, నేనీర్ష్యాళువును: ఆమె సర్వలక్షణ లక్షితయగు మహా పతివ్రతా తిలకం, వెళ్ళండి. కేవలం సామంతరాజా తనూజ అయిన ఆమెను—చక్రవర్తి పుత్రికనైన నేను సంభావించాల్సిన అవసరం లేదు. కావాలంటే మీరూ, మీ అప్పాజీ కలసి ఆమె అడుగులకు మడుగులొత్తండి"

"రాణీ!" మహారాజు కంఠం మహోగ్రంగా ధ్వనించింది. తననేమన్నా సహిస్తాడు: తన పట్టమహిషినేమన్నా సహిస్తాడు. కాని, అప్పాజీని తన ఎదుట తూలనాడటం రాజుకు శిరచ్ఛేదం. కాని, రాణికి తనలో తనకు విశ్వాసం సహజంగా మెండు. మహారాజు సింహగర్జన మహారాణికి అసమర్థుని ఆక్రోశంగా తోచింది. రాణి నిర్లక్ష్యంగా వేరొక వైపుకు ఒత్తిగిల్లింది. ఆ వొత్తిగిల్లటంలో మహారాణి వామపాదం మహారాజు శరీరానికి తగిలింది. రాజుకు విపరీతార్థం గోచరించింది. భృకుటి ముడివడింది. కళ్ళనుంచి విస్ఫులింగాలు రాలాయి. ముఖం గంభీరరూపం దాల్చింది. రోషం పెల్లుబికింది. చివాలున మహారాజు పాన్పు మీదినుంచి లేచి రాణి

వంక తీక్షణంగా చూచి "ఇకపై నీ ముఖం చూడను...." అంటూ నిష్క్రమించాడు.

# 2

సర్వలక్షణ లక్షితమై, సర్వ కళలకు ఆకరమై సమస్త భోగ భాగ్యాలకు ఆలవాలమై, సప్తప్రాకార పరివేష్టితమై 'సప్రస్థలీ చుంబితాంబర సౌధ సుధాప్రభా ధవళితప్రాలేయ ఋగ్మండలీ హారిణంబై శత్రుజన దుర్భేద్యమై దక్షిణ భారత దేశమున ఏకఛత్రాధిపత్యం వహించిన విజయ నగర సామ్రాజ్యాన్ని మూరురాయరగండ జగనొబ్బగండ శ్రీశ్రీశ్రీ కృష్ణ రాయ భూపాలుడు పరిపాలిస్తున్నాడు. అతడు శౌర్య ధైర్య పరాక్రమ సంపదల అసదృశుడు, తేజస్సులో దుర్నిరీక్ష్యుడు, శాత్రవజన భయం కరుడు, శిష్టజన రక్షకుడు కళామతల్లికి ప్రధాన పోషకుడు, సాహితీ సమ రాంగణ సార్వభౌముడు.

విజయనగరం దక్షిణ భారత దేశమునందలి తుంగభద్రానది ప్రక్కన నిర్మింపబడిన మహత్తరమైన గిరి దుర్గం. నైసర్గికంగానే కాక పౌరాణికంగా కూడా ఆ స్థలం విశిష్టమైంది. రామాయణ కాలమున దుష్టసంహార మొనర్చుటలో శ్రీరామచంద్రునకు తోడ్పడిన కపిశ్రేష్ఠులగు వాలి సుగ్రీవ హనుమంత జాంబవంతాది మహా వీరుల కాటపట్టు ఈ దివ్య సీమ. మతంగ పర్వతము, ఋష్యమూకము మొదలయిన పర్వత రాజములు విజయనగర దుర్గానికి పెట్టని కోటలు. పడమటి కనుమలలో జన్మించి, తూర్పునకు ప్రవహిస్తూ, కృష్ణానదిని కలియు తుంగభద్రామ తల్లి ఈ దుర్గానికి సహజమైన అగడ్త. ఈ దుర్గ నిర్మాణమును గూర్చి ఒక విచిత్రమైన సంఘటనను ఈ నాటికీ ప్రజలు అనుశ్రుతంగా చెప్పు తుంటారు.

ఢిల్లీ సుల్తానైన అల్లావుద్దీన్, అతని సేనా నాయకుడగు మాలిక్ కాఫర్ ల నిరంతర దండయాత్రా ఫలితంగా కాకతీయ సామ్రాజ్యం పతనమైన తరువాత అక్కడ కాకతీయుల కొలువు చేయుచున్న హరి



హరరాయలు, బుక్కరాయలు అను సోదరులు దక్షిణమున ఆర్య ధర్మ సంరక్షణార్థం - నూతన సామ్రాజ్యమును స్థాపించే ఉద్దేశంతో - తుంగ భద్రా తీరమున చేరారు. వారొకనాడు పంపాతీరమున కాషాయాంబర ధారియై, ముఖమున బ్రహ్మ తేజస్సు ఉట్టిపడ ఎదుట వొచ్చిన సమున్నత శరీరుని తేజోమూర్తిని చూచి సాష్టాంగ దండప్రణామములాచరించి, అతనిని మహా శక్తి సంపన్నుడగు విద్యారణ్యస్వామిగా తెలుసుకొని తమ మనోరథం వెల్లడించారు. విద్యారణ్యస్వామి కూడా వారి కోరికను విని సంతసించి, వారిని దీక్షాబద్ధులనుచేసి, శిష్యులుగా స్వీకరించి ముహూర్తము కొరకు నిరీక్షిస్తున్నాడు. ఇలా ఉండగా ఒక రోజు హరిహరరాయలు, బుక్కరాయలు వేటకై బయలుదేరారు. అక్కడ ఆ అపూర్వ సహో దరులకొక అద్భుత దృశ్యం కన్పించింది. ఒక కుందేటిపిల్ల రెండు జాగి లములను విపరీతమైన శక్తి సామర్థ్యములతో ఎదిరించటమేకాక, వెంట బడి తరుముతూంది. కుందేలు కుక్కల తరమటమా? రాజసహోదరుల కిది చాలా ఆశ్చర్యంగా తోచింది. వారు వెంటనే తమ గురువుల సన్నిధి చేరి, తాము చూచిన వింతను చెప్పి—"స్వామీ! దాని ఫలితార్థమును తెల్పుడు!" అని ప్రార్థించారు.

విద్యారణ్యుడు కూడ "వెదుకబోయిన తీగ కాలికి తగిలినందున" సంతోషాంతరంగుడై—"నాయనా! మీరు సామ్రాజ్యమును స్థాపించు శుభ ముహూర్తం దగ్గరకు వచ్చింది. స్థల నిర్ణయంకూడా జరిగింది. ఇక శంకు స్థాపనమే తరువాయి. మీరు చూచిన వింత సంఘటన ఘటిల్లిన ఆ పవిత్ర భూమిని నాకు చూపించండి" అనగా ఆ రాజ సోద రులు మహర్షిని ఆ ప్రదేశమునకు తీసుకొని వెళ్ళారు. ఆ దివ్యభూమిని చూడగానే మహర్షి భక్తి ప్రపత్తులతో ఆ స్థలమునకు ప్రణమిల్లి, వినమ్రతతో అచటి ధూళిని తన దక్షిణ హస్తంతో పరిగ్రహించి, శిర స్సునధరిస్తూ రాజసహోదరులనుకూడా ఆవిధంగాచేయమని ఆజ్ఞాపించి ఇలా అన్నాడు. యవన దండయాత్రా ఫలితంగా కృంగి కృశించిపోయిన ఆర్య సామ్రాజ్యలక్ష్మి ఈ కుందేటిపిల్ల. అయినా ఈ స్థల మహాత్మ్యం చేత

యవన జాగిలముల నెదిర్చి, స్వాతంత్ర్యమును నిలబెట్టుకోవటమే
గాక ఈ శతృవులను తరిమివేసింది. ఇది పవిత్రభూమి. మహాబల సంపన్ను
డగు వాలిని శ్రీరామచంద్రుని సహాయంతో - బలహీనుడగు సుగ్రీవుడు
జయించింది ఈ ప్రదేశంలోనే. ఇది మీ నూతన సామ్రాజ్యానికన్ని విధ
ములా అనువైన ప్రదేశము. రేపు ప్రాతఃకాలమున మీరు తుంగభద్రా
తీరమునకు వెళ్ళి, స్నాన సంధ్యాధికములు పూర్తిచేసి శుచులై ఈ ప్రదే
శానికి రండి. నేను కూడా తుంగభద్రా పావన జలములో పునీతుడనై
జపతపానుష్ఠానములు పూర్తి చేసి, సరిగా శంకుస్థాపన సుముహూర్తమున
విజయ శంఖమును పూరిస్తాను. ఆ శంఖనాదం వినిన వెంటనే మీరు శంఖు
స్థాపన చేయండి। దక్షిణ భారతమున ఆర్య ధర్మ పరిరక్షణ గావిస్తూ,
ఈ మహా సామ్రాజ్యం శత సహస్ర సంవత్సరాధికంగా, జగజ్జేగీయ
మానంగా విలసిల్లుతుంది.

మహర్షి వాక్కులకు పరమ సంతుష్టాంతరంగులై హరిహర
రాయలు, బుక్కరాయలు తమ నివాసములకు వెళ్ళి ఎప్పుడు ప్రాతఃకాల
మవుతుందా, ఎప్పుడు ఆర్య ధర్మ సంరక్షణార్థం సామ్రాజ్య స్థాపన
జేయు సుముహూర్తం సమీపిస్తుందా అని ఆ రాత్రి అంతా జాగరణలో
గడిపివేశారు.

ఇంతలో నాల్గవ యామం ప్రవేశించింది. రాజ సోదరులిరువురూ
శీఘ్రంగా తుంగభద్రను సమీపించి, పరమ నిష్ఠాగరిష్ఠులై స్నానాదికములు
నిర్వహించి, వేగిరముగా పరమ మహిమాన్వితమైన ఆ పురాణ స్థలమును
చేరి, తమ ఖడ్గాగ్రములతో శంకు స్థాపనార్థ మొక గుంట త్రవ్వి, మహర్షి
శంఖా నినాదమునకై నిరీక్షించసాగారు. కాని, ఎంత సమయమైనా
మహర్షి నుండి ముహూర్త సూచకంగా శంఖధ్వని రాలేదు. హరిహర
బుక్క రాయలకు ఆతురత అధిక మవసాగింది. తాము ముందుగా వొచ్చా
మన్న గమనిక వారికిలేదు. మహర్షి ఏ ప్రమాదమునకు లోనై జాగు
చేస్తున్నాడో అన్న భావమే వారిని కలచివేసింది. ఇంతలో వారికి హృదయా
నందకరంగా దూరమున ఒక శంఖధ్వని విస్పష్టంగా వినిపించింది.
వెంటనే హరిహరరాయలు- 'సుముహూర్తమస్తు' అంటూ శంకుస్థాపన



గావించాడు. 'జయీభవ! ఆంధ్ర సామ్రాజ్య లక్ష్మీ దిగ్విజయీభవ: ....'
అంటూ బుక్కరాయలు వినమ్రుడై ప్రణామం గావించాడు. ఆ తరువాత
రాజ సోదరులు ముకుళిత హస్తులై అంజలి ఘటించి ఆ ప్రదేశమునకు
ప్రదక్షిణం చేసి, ఒక మహా ఘనకార్యమును నిర్వహించామన్న సంతృప్తి
ముఖమున తాండవించగా ఆ ప్రక్కనే ఉన్న శిలా ఫలకంపై తమ గురు
వర్యులగు మహర్షి విద్యారణ్యస్వామి ఆగమనమునకై నిరీక్షించసాగారు.

ఎంతసేపటికినీ మహర్షి రాలేదు. వారి హృదయమున సంతుష్టి
ఉన్నప్పటికీ మనసు పరిపరి విధాల పోసాగింది ప్రాతఃకాలమైంది.
తూరుపు తెలతెలవార వొచ్చింది. వారికా సమయమున వొక దివ్య శంఖా
నాదం వీనులకు సోకింది. తామేదో పొరపాటు చేశామనే అనుమానం వారి
మనస్సు నాక్రమించింది. సోదరు లిరువురూ వడివడిగా నడుస్తూ తుంగ
భద్రా తీరాన్ని చేరునంతలో విద్యారణ్యస్వామి ఎదురైనాడు. ఆ మహాను
భావుని చూడటంతోనే హరిహరుడు ప్రణమిల్లి తాము రెండు శంఖ ధ్వనులు
విన్నామనీ, అందు మొదటి ధ్వని వినవచ్చినంతనే శంకుస్థాపన గావించా
మనీ విద్యారణ్యులకు విన్నవించాడు.

జరిగిన పొరపాటు మహర్షికి అర్థమైంది. వారు మొదటిసారి
విన్న శంఖ ధ్వని ఎవరో జంగము భిక్షాటనకై తెల్లవారు ఝామునే లేచి,
పొరుగూరు పోతూ దారిలో పూరించింది. విద్యారణ్యస్వామి నిర్ణయించిన
మహాశక్తివంతమైన ముహూర్తబలం వ్యర్థమైంది. ఈ విషయం తెలిసి
రాజ సోదరులు బాధ పడసాగారు. మహర్షి వారిని అనునయించి
ముహూర్త విషయంలో ప్రమాదం జరిగినా, స్థల మహత్యాన్ని బట్టి,
మొదటి శంఖధ్వని వినవొచ్చిన ముహూర్త బలాన్ని బట్టి ఆ సామ్రాజ్యానికి
నాల్గువందల సంవత్సరాలు మహాయోగం ఉన్నదనీ, ఆర్యధర్మ సంరక్షణా
భారాన్ని జయప్రదంగా నిర్వహిస్తుందనీ, దక్షిణ భారత దేశాన్ని ఏక
ఛత్రాధిపత్యం క్రిందకు తీసుకురాగలదనీ చెప్పి వారికి ఊరట కల్గించాడు.
హరిహరరాయలూ, బుక్కరాయలూ ఆ మహానగరానికి తమ గురుదేవులైన

విద్యారణ్యస్వామివారి పేరు మీదనే నామకరణం చేశారు. అదే విద్యానగరం, తరువాతి కాలంలో విద్యానగరాధీశ్వరులు సాగించిన దండయాత్రలలో సాధించిన విజయపరంపరల వల్ల విద్యానగరం విజయనగరమనే సార్థక నామంతో వ్యవహరింపబడసాగింది. అదే ఈనాడు కృష్ణరాయభూపాల పరిపాలితమైన విజయనగరం.

కృష్ణదేవరాయల కాలమునకు విజయనగరం దినదిన ప్రవర్ధమానమై ప్రపంచమునందలి మహానగరములలో అద్వితీయంగా విరాజిల్లుతోంది. ఆ నాటి సమకాలిక విదేశీ యాత్రికులగు నికోలో కోంటి, అబ్దుల్ రజాక్ న్యూనిస్ మొదలైనవారంతా ఆ నగర వైభవాన్ని వేనోళ్ళ ప్రస్తుతించారు.

విజయనగర సామ్రాజ్యం ఉత్తరాన కృష్ణానది సరిహద్దుగా, దక్షిణాన కన్యాకుమారి వరకు వ్యాపించి ఉంది. ఈ విశాల సామ్రాజ్యం అనేక సామంత ప్రభువులచేత పరిరక్షితమై ఉంది. వారికి రాజరాజేశ్వరుడు విజయనగరాధీశ్వరుడు శ్రీకృష్ణదేవరాయ సార్వభౌముడు అతని రాజధాని విజయనగరం.

మహా పర్వత ప్రాకార పరివేష్టితమైన విజయనగరం ఆనాటి భారతదేశ మందలి అతి బలిష్ఠమైన దుర్గరాజం. ఆ బాహ్య ప్రాకారపు చుట్టుకొలత అరవై నాలుగు మైళ్ళు. ఒక దానిలో మరొకటిగా ఏడు ప్రాకారాల కావల మహారాజు అంతఃపురం దేదీప్యమానంగా విరాజిల్లుతోంది. దుర్గాన్ని సర్వదా తొంబది వేలమంది ఆంధ్రవీరులు విచ్చుకత్తులతో కాపలా కాస్తుంటారు.

ప్రాకారం లోపలనే వ్యాపార కేంద్రాలు, ఉద్యానవనాలు. ఫలపుష్ప వృక్షజాతులు, పంట కాలువలు, పొలాలు ఉండటంవల్ల నగరానికి కావల్సిన ధన-ధాన్య ప్రతతి నగరంలోనే ఉత్పత్తి అవుతున్నది. అందువల్ల యుద్ధకాలంలో కోట తలుపులు మూసి వేసినా నగరం లోపలి వారికి ఆహారానికి ఏ విధమైన బాధా ఉండదు. సంవత్సరాల తరబడి, ఇలా శత్రుజన అభేద్యంగా నిర్మించబడిన దుర్గం భారతదేశంలో ఇది ఒక్కటే.



మొదటి ప్రాకారం నుండి మూడవ ప్రాకారం వరకూ పొలాలతోనూ, కృషీవలుల గృహాలతోనూ, ఉద్యానవనాలతోనూ, పండ్లతోటలతోనూ; మూడవ ప్రాకారం నుండి ఏడవ ప్రాకారం వరకూ ప్రజలూ, వర్తకులూ, సైనికులూ- మొదలైనవారి గృహాలతో, సువిశాలమైన రాజమార్గాలతో, వ్యాపార కేంద్రాలతో విరాజిల్లుతున్నది. ఇక్కడే ఆరవ ప్రాకారాన్నానుకొని సైనిక కార్యాలయాలూ, ఉన్నతాధికారుల గృహాలూ ఉన్నాయి.

నగరంలోని శిల్ప కళాఖండాలైన దేవాలయాలకూ, చుక్కలను చుంబించే గోపురాలకూ, తెల్లని పాల గచ్చు చేయబడిన భవన రాజాలకూ లెక్కలేదు. ముత్యాలూ, నీలాలు కెంపులూ, వజ్రాలూ మొదలైన నవరత్నాలనూ రాసులుగా పోసి బహిరంగంగా విక్రయిస్తున్నారు, అక్కడి వణిక్ ప్రముఖులు. ఏడవ ప్రాకారం లోపల మహేంద్రుని రాజధాని అమరావతిని మరపించే మహోన్నత సౌధాలతో, నందనోద్యానవనాన్ని తృణీకరించే ఉద్యానవనాలతో కన్నుల పండువు చేసే రాజనగరు విరాజిల్లు తున్నది.

రాయలవారి అంతఃపురం ఒక విశిష్టమైన మహానగరం. అంతఃపురాన్ని పరివేష్టించి సుమారు ఏడుమైళ్ళ చుట్టుకొలత కలిగిన బలిష్ఠమైన యాభై అడుగుల ఎత్తు, పది అడుగుల వెడల్పుగల ప్రాకారం. దాని ప్రధాన ద్వారాన్ని ఇరవై వేలమంది అశ్వికులు సర్వకాల సర్వావస్థలయందూ విచ్చు కత్తులతో కాపలా కాస్తుంటారు. ప్రధాన ద్వారాన్ని అనుమతి లేకుండా అధిగమించటం దేవతలకైనా దుస్సాధ్యం

ఈ ఏడవ ప్రాకారంలోగల శిల్ప కళా ఖండాలను తిలకించటానికి మహారాజు వైభవాన్ని కళ్లారా చూడటానికి సామాన్య ప్రజలు తహతహలాడుతుంటారు. అట్టివారికా సదవకాశాన్ని కలిగిస్తాయి, పండుగలూ, పబ్బాలూ. పండుగదినాలలో విచక్షణ లేకుండా ప్రతివారూ అంతఃపురంలో ప్రవేశించవచ్చు. అయితే రాణివాసపు ఛాయకు మాత్రం పోగూడదు.

కోట లోపల చూడదగిన ప్రధాన శిల్ప కళా ఖండమూ, ఐశ్వర్య నిలయమూ మహర్నవమి మండపం. గజపతిని ఓడించి తిరిగి వొచ్చిన

నాడు ఈ అపూర్వ శిల్ప కళానికేతనాన్ని నిర్మించాడు ప్రభువు తన దిగ్విజయ సూచకంగా ఉన్నతమైన ఈ వేదిక చుట్టు అనాటి రాజకీయ, సాంఘిక, సామాజిక సైనిక వ్యవస్థను చిత్రించే అనేక అపూర్వ శిల్పాలను చెక్కారు మహా శిల్పులు.

చతురంగ బలాలు, వాటి తీరుతెన్నులు, ఆంధ్ర మహాయోధులు, వారి వేషభాషణలు, వెలయాండ్రు, వారి నాట్య భంగిమలు, నాట్యానికి సహకరించే వాద్యగాండ్రు. వారి ప్రక్క తాళం చేపట్టిన ముసలి పడుచులు, ఛెంగున లంఘించు హరిణవత్సాలు, వాటిని వెంటదవులు మృగయా వినోదులైన రథికులు. నడి వీధులందు రత్నముల రాసులుగాపోసి వర్తకము చేయు వణిక్ ప్రముఖులు; వాని క్రయమునకు దూరదేశం నుండి శ్రమ దమాదులకోర్చి నడచి వొచ్చిన విదేశీయ యాత్రికులు, మేలైన అరబ్బీజాతి అశ్వాలు, వాటిని ఆంధ్ర సార్వభౌమునికి విక్రయించి ఐశ్వర్య సంపాదనకు అర్రులు చాచే అరబ్బీలు—ఒకటేమిటి ఆ మహర్నవమి మండపం విజయనగర సామాజిక వ్యవస్థకు చెక్కు చెదరని ప్రతిబింబం.

ఆ మహర్నవమి మండపం మీదే రాయలు కొలువుతీరుస్తారు. ఆ మహర్నవమి మండపం మీదే శిష్టరక్షణ, దుష్ట శిక్షణ జరుగుతుంది. ఆ మహర్నవమి మండపం మీదే యావద్భారతదేశ భవిష్యత్తునూ తీర్చిదిద్దే నిర్ణయాలు జరుగుతుంటాయి. ఆ మహర్నవమి మండపం మీదే రాజపరమేశ్వరుడికి సామంత రాజులు నవరత్నాలతో పాదాభిషేకం చేస్తారు. ఆ మహర్నవమి మండపం మీదే కవిరాజులకు రాయలు స్వహస్తాలతో కనకాభిషేకం చేస్తారు. ఆంధ్రజాతి గర్వించదగింది ఈ మహర్నవమి మండపం.

దీని కల్లంత దూరాన అత్యద్భుతమైన వొక నీటి కొలను ఉంది. ఇది రాయలవారు కృత్రిమంగా అంతఃపుర అతిథుల కొరకు నిర్మింపచేశారు ఈ కొలను పొడవు నూరు గజాలు, వెడల్పు ముప్పై గజాలు ఈతకొలనులోకి సర్వదా స్వచ్ఛమైన నీరు తుంగభద్రా నదినుండి ప్రవహిస్తుంటుంది. వాడిపోయిన నీరు రాతిగొట్టాలద్వారా ఎప్పటికప్పుడు మళ్ళీ



తుంగభద్రలో కలుస్తుంటుంది. విజయనగర వాస్తు శాస్త్రజ్ఞులు తమ ప్రతిరూపంగా నిర్మించారు-ఈ అపూర్వకట్టడాన్ని. ఇక్కడే మహర్నవమినాడు ఈత పందాలు జరుగుతాయి.

ఈ కట్టడానికి సమీపంలోనే సమున్నత ప్రాకార పరివేష్టితమై చంద్రకాంత శిలాసోపాన పంక్తి నడుమ మరొక అత్యద్భుతమైన కొలను ఉంది. ఇది రాణివాసం కొరకూ, మహారాజు కొరకూ ప్రత్యేకించబడింది. దీనిలోనికి కూడా తుంగభద్రా జలం సతతమూ ప్రవహిస్తుంటుంది.

దీనికి చేరువనే రాణివాసం. రాణివాసం ఒక భవనం కాదు. ఒకదానికొకటి సంబంధం లేదు. ప్రతి రాణీ తన భవనంలో అశేషపరివారంతో అనంత ధన కనక వస్తు వాహనాలతో విరాజిల్లుతుంటుంది. అలాంటి రాణీవాసాలెన్ని ఉన్నయ్యో రాయలవారికి తెలిసే అవకాశం లేదేమో! ఆయనచే యుద్ధంలో ఓడిపోయిన ప్రతి రాజూ, ప్రతి మండలాధీశుడూ తమ కుమార్తెలనిచ్చి సాదరపూర్వకంగా వివాహం చేశారు. వారే రాయలవారి అంతఃపురంలో తమ కన్యలకు తగిన రీతిగా భవన నిర్మాణం గావించి ఇచ్చారు. నిజానికి రాయలవారు వారితో కొందరిని పెండ్లినాడు చూడడం తప్ప ఆ తరువాత చూడలేదేమో కూడా.

అయితే, మహారాజు వస్తుతః రసిక సుందరుడు కావటంవల్ల "కన్యనిస్తాను, మహారాజా!" అని ఏ రాజైనా—కాదు, ఎవరైనా సరే అంటే, "వద్దు!" అని మాత్రం అనడు ఆ విధంగా పెరిగిపోయింది-రాయలవారి రాణివాసపు జనాభా.

ఈ రాణివాసపు మధ్యే రాయలవారి రాజగృహం ఉంది. అది ప్రపంచంలోకెల్లా ఐశ్వర్యవంతమైన భవనం. ఆంధ్రసార్వభౌముని అనంత సంపదలకాలవాలం, నానా దేశ రాజన్యులు సమర్పించిన రత్న మాణిక్యస్వర్ణాభరణాలతో, అపూర్వ శిల్పాన్ని ప్రతిబింబింపజేసే కాంస్య విగ్రహాలతో, విదేశీ రాయబారులు కానుకలుగా సమర్పించుకొన్న అపురూప వస్తు సముచ్చయంతో, విజయనగర రాజుల అపూర్వ వైభవాన్ని చిత్రించే త్రివర్ణ తైల చిత్రాలతో కన్నులకు మిరుమిట్లు గొలుపుతుంటుంది.

పాలరాతితో నిర్మింపబడిన రాయల శయ్యాగృహంలోని హంస తూలికా తల్పానికెదురుగా ఉన్నది హజార రామాలయం.

అది ఒక నల్లరాతి కట్టడం. అందులో రాయల ఆరాధ్య దైవం నిలువెత్తు కోదండ రాముడు. ఆ ఆలయపు శిల్పంలో భారత, భాగవత రామాయణ గాథలు సజీవంగా రూపం ధరించాయి నల్లరాతిలో.

రాజగృహానికి కుడిప్రక్కన రాయలవారి ఆలోచనా మందిరమూ, ఎడమ ప్రక్కల రాజ సందర్శనా మందిరమూ ఉన్నాయి.

ఒక దానిలో రాయలవారు తన మంత్రులతో, దండ నాథులతో మంత్రాలోచన చేస్తారు. ఏ వైపునుంచి చూచినా ఈ రెండంతస్తుల పాల గచ్చు కట్టడం పద్మంవలె కన్పించటంతో దీనికి పద్మమహల్ అని పేరు.

మరొక దానిలో విదేశీ రాయబారులకు దర్శనమిస్తాడు ఆంధ్ర సార్వభౌముడు.

ఏడవ ప్రాకారాంతస్థితమైన అష్టరూపాలలో ఉన్న ఉగ్రనర సింహుని దివ్యమంగళ విగ్రహం సాటిలేనిది.

దాదాపు ముప్పై అడుగుల ఎత్తూ, పదిహేనడుగుల వెడల్పూ గలిగి ఏక శిలా నిర్మితమైన ఆదిలక్ష్మీ సమేత ఉగ్రనరసింహుని సృష్టించిన శిల్పికి రాయలవారు అగ్రహారాలిచ్చి సత్కరించి "మహాశిల్పి" బిరుదం ప్రసాదించి, మన్నించి కొలువులో స్థానం ఇచ్చాడు.

రాయచూరు విజయానికి చిహ్నంగా మహారాజు ప్రస్తుతం నిర్మించిన విఠలాలయం మరో విశిష్ట కళాఖండం. సువిశాలమైన ఈ దేవాలయ ముందరి మండప స్తంభాలలో సప్త స్వరాలు పలికించారు శిల్పులు. ఒకే ఏకాండపు రాయి. ఆ రాతిలో తొలచబడిన అనేక పిల్ల స్తంభాలు పైనా-క్రిందా ఒకటిగానే ఉంటాయి. ఎవరైనాసరే, ఒక రాయి తీసుకొని ఆపిల్ల స్తంభాలపై మ్రోగిస్తే సరిగమలు పలుకుతాయి. ఈ అద్భుతం చూచి మురిసిపోయి రాయలవారా శిల్పులకు స్థంభానికి లక్ష వరహాలు పారితోషికం ఇచ్చి సంతోష పెట్టాడు.

విఠలాలయానికి పోయే దారిలోనే తులాభార మండపం వుంది. ప్రతి జన్మదినోత్సవ సందర్భంలోనూ, రాయలకు నవధాన్యాలతో, వెండి



బంగారాలతో తూనిక తూగి ఆ ఎత్తును ప్రజలకు, బీద సాదలకు దాన ధర్మాలు చేయటం అలవాటు. దాని కొరకు నిర్మింపబడిన దీ తులాభార మండపం.

ఆ తరువాత ఎన్నదగినది విరూపాక్షుని దేవాలయం, విరూపాక్షుడికి పంపాపతి అనే బిరుదుకూడా వుంది. దీన్నే దక్షిణకాశి అని వ్యవహరిస్తున్నారు.

తుంగభద్రా నదీమతల్లికి మారు పేరు పంపా. ఈమె బ్రహ్మదేవుని కుమార్తె. అక్కడ కనిపించిన నానావిధ పుష్ప సముచ్చయాన్ని సేకరించి మరలిపోతూండగా, దారిలో ఒక ఋషివాటిక ఆమెకు కనిపించింది వెంటనే ఋషివాటిక లోనికి వెళ్ళి తన వద్దనున్న పుష్పాలతో తాపసుల పాదపూజ చేసింది. అక్కడి ఋషివర్గం ఆమె భక్తికి మెచ్చి "అమ్మా! పరమేష్ఠి నీకు భర్తగా లభిస్తాడమ్మా!" అని దీవించారు.

తత్ఫలితంగా మహాదేవుడైన విరూపాక్షుడు మాల్యవంత పర్వత సానువుల్లో అవతరించి, తుంగభద్రను పరిణయమాడి అనుగ్రహించాడు. వారే పంపా విరూపాక్షులు. వారిదే ఆ చుక్కలను చుంబించే గోపురాలతో ఠీవిగా నిల్చున్న దేవాలయం. ఆ గోపురాలను రాయలవారు తమ పట్టాభిషేక సమయంలో స్వయంగా నిర్మింప చేశాడు. ఆ దేవాలయ పరిసర ప్రదేశాన్ని పంపా నగరమని పిలుస్తున్నారు ఆంధ్రులు. కన్నడులు నోరు తిరుగక హంప పట్నం అని వ్యవహరిస్తున్నారు. అది అరవల నోటబడి హంపీగా వ్యవహరింపబడుతున్నది.

సర్వసౌభాగ్యాలతో, సమస్త శిల్ప కళా సంపదతో, దుర్నిరీక్ష్య పరాక్రమ సముపేతులైన ఆంధ్రవీరుల శక్తి సామర్థ్యాలతో అలరారుతున్న విజయనగరాన్ని ఆనాడు యూరప్ ఖండంలోని ఖండాంతర ఖ్యాతిగాంచిన రోమ్, లిస్బన్ నగరాలకన్నా అన్ని విధాలా అత్యధికమయినదనీ, అత్యంత రమణీయమయినదనీ అభివర్ణించారు పాశ్చాత్య యాత్రికులు.

రాజు మహాబలవంతుడు. అమోఘ శక్తి సంపన్నుడు. అసాధారణ పరాక్రమ సాహసోపేతుడు, సమున్నత శరీరుడు, అతని ముఖం మీద స్ఫోటకపు మచ్చలు అతని పూర్ణచంద్రసదృశ ముఖారవిందానికొక వింత

సోయగము చేకూరుస్తుంటాయి. మెలి తిరిగిన మీసకట్టు అతని వదనానికి ప్రత్యేకత. తిరుచూర్ణాంకితమైన అతని విశాల ఫాలభాగం సకల కళా నికేతనం. మణిమయ రత్న మాణిక్య సహితమైన అతని మకుటరాజం అతని భోగభాగ్యాలకు నిదర్శనం. సామంతరాజ మకుటాగ్రమణి కాంతి నీరాజనంతో అతని పాదయుగళి సర్వదా వెలుగొందుతూ వినూత్న కాంతులను వెదజల్లుతుంటుంది. రాజు వైష్ణవుడు కాని, అన్యమతాలకు కూడ సమానమయిన ఆదరం, రక్షణ అతని పరిపాలనలో ధారాళముగా లభిస్తున్నవి. రాజు కవి పండిత పోషకుడు. స్వయంగా ఆంధ్రమున మహాకవియే కాక పండితుడు. ఈ రెండునూ సాధారణంగా ఒక వ్యక్తిలో కలియవు. కాని రాజు ఈ రెండు లక్షణముల విలక్షణమయిన కలయిక, రాజు రాజపరమేశ్వరుడే కాక రసిక సుందరుడు.

మన కథా కాలానికి రాజు రాజ కార్యాలందు విముఖుడై కవి పండిత గోష్ఠిలో కర్తవ్యనిష్ఠను విస్మరించాడు. రాజు రాజ సభలకు అరుదెంచటం కానీ, రాజ్యాంగ వ్యవహారాలు పరిష్కరించి పరిపాలనను నిర్వహించటం కానీ మానివేశాడు. అతని సభ కేవలం ఒక పండిత గోష్ఠి కవితా కన్నియ వివాహమండపం. అతని కవితా గోష్ఠిని విస్మరింప చేయగలిగింది ఒక్కరు మాత్రమే. ఆమే మహారాణి అన్నపూర్ణాదేవి. రాజు కాలము నాద నేకులను వివాహమాడాడు. కాని, ఈనాడు వారెవరెవరో కూడా ఆయనకు సరిగా తెలీదు. బహుశః ప్రజలకసలే తెలీదేమో! ప్రస్తుత మాయన దృష్టిలో ఇరువురే భార్యలు. ఒకరు అన్నపూర్ణ, గజపతిరాజ పుత్రి. అతని ప్రణయ సామ్రాజ్య లక్ష్మి. రెండవ ఆమె పట్టమహిషి తిరుమలాంబిక శ్రీరంగపట్నపు రాజయిన గంగరాజు కుమార్తె. ఆంధ్ర సామ్రాజ్యమున కామె పట్టమహిషి. విరత ధర్మనిష్ఠా గరిష్ఠ మహా పతివ్రత. రాజు ఆమె నెన్నడూ ప్రేమించలేదు. కాని, ఆమెను విపరీతంగా గౌరవించాడు. ఆంధ్ర సామ్రాజ్యమున ఆ ఏకైక గౌరవానికి మహామంత్రి తిమ్మరుసు తరువాత ఆమే అర్హురాలు. రాజు ఆమె ఏది కోరితే అది క్షణాల మీద నెరవేరుస్తాడు. కాని, ఆమె కోరరాని కోరికేనీ కోరదు. ఆమె రాజును కూడా శాసించగలదు. కాని, శాసించదు.



కృష్ణరాయ తిరుమలాంబికల వివాహాన్ని గూర్చి ఒక వింత గాథ ఉంది. కృష్ణరాయల బాల్యమంతా మహామంత్రి తిమ్మరుసయ్యవారి ఇంటిలోనే అజ్ఞాతవాసములో గడిచింది. కృష్ణదేవరాయలవారి తండ్రి అయిన తుళువ నరసరాయలకు తిప్పాంబ, నాగాంబ, ఓబాంబ అను ముగ్గురు భార్యలు. అందు తిప్పాంబ పట్టమహిషి, యువరాజగు వీరనరసింహరాయని తల్లి; రాజమాత. అంతేగాక, సవతి అయిన నాగాంబను చదరంగంలో ఓడించి, ఆమెను కొన్ని క్షణాలు తన దాసిగా పరిగ్రహించిన ఖ్యాతి కూడా ఆమె కున్నది. రెండవ భార్య అయిన నాగాంబ సంతానం శ్రీకృష్ణరాయలు. పూవు పుట్టగానే పరిమళించినట్లు రాయలు మహా సార్వభౌమ లక్షణాలతో జన్మించాడు. తిప్పాంబ ఆ బాలుడివల్ల తన సంతానపు రాజరికానికి ప్రమాదం ఊహించి, విషప్రయోగాది అనేక పద్ధతులతో బాలుణ్ణి హతమార్చటానికి ప్రయత్నించింది. కాని, దైవికంగా ఆమె ప్రయత్నాలన్నీ వ్యర్థాలై, రాయలు శుక్లపక్ష చంద్రునివలె దినదినాభివృద్ధి చెందసాగారు. చివరకు పట్టమహిషి విసుగెత్తి కృష్ణదేవరాయల కన్నులు పీకి తనకు చూపించమని మహామంత్రి తిమ్మరుసుకు ఆజ్ఞాపించింది. మహామంత్రికి చెయ్యాడలేదు. అతని హృదయం ఆ బాలుడి మహారాజ లక్షణాల కంకితమై పోయింది. ఆంధ్ర సామ్రాజ్య భావి సామ్రాట్టతడేనని అతని మనస్సు జోస్యం చెప్పింది. బాలుణ్ణి తన రహస్య మందిరంలో దాచి, గుర్తు కొరకు ఒక మేకను చంపించి, దాని నెత్తురులో రాజకుమారుని బట్టలను తడిపి ఆ దుస్తుల మధ్య మేక కళ్ళను వుంచి మహారాణికి సమర్పించాడు. రాణి తృప్తి చెందింది. నరసరాయల మూడవభార్య అయిన ఓబాంబ సంతానమయిన అచ్యుతరాయలు, రంగరాజు మరీ అర్భకులుగా కనిపించుట వలన తిప్పాంబ వారిని అంతఃపురంలోనే ఏ ప్రమాదమూ లేకుండా పెరుగనిచ్చింది.

అప్పటి నుంచీ రాయలు అమాత్య తిమ్మరుసు మందిరంలోనే సకల శస్త్రాస్త్ర విద్యల నభ్యసించాడు. రాజ్యాంగ మంత్రాంగ సూత్రాలను

మహామంత్రి దివ్యశిక్షణలో పుక్కిట పట్టాడు. మహామంత్రి చరణ సన్నిధిని సకల కావ్యాలనూ పఠించి, పండిత ప్రకాండుడైనాడు. మహామంత్రి స్వతహా మహాకవి, సంస్కృతంలో ఉద్దండ పండితుడు. కాని, అతనికి కార్యభార మధికమైన కొద్దీ కవితా వ్యాసంగానికి అవకాశం లేక పోయింది.

రాయలవారు అప్పాజీ మందిరంలో అజ్ఞాతవాసంలో ఉన్నకాలంలో తండ్రి నరసరాయలవారు మరణించారు. అన్నగారైన వీరనరసింహ రాయలు సింహాసనం ఎక్కాడు.

కొంతకాలం తరువాత వేటకరిగిన మహారాజు, కృష్ణరాయని అగ్రజుడు వీరనరసింహరాయలు మరణించటంతో మంత్రి శేఖరులు ఉపమంత్రులతోనూ, సామంతులతోనూ, దండనాథులతోనూ సంప్రదించి, చనిపోయిన మహారాజు సంతానం శిశుప్రాయాని ఉండటం చేత అతణ్ణి త్రోసిరాజని కృష్ణరాయలను సింహాసనాసీనుని గావించాడు.

రాయలు తిమ్మరుసు ఇంట్లో అజ్ఞాతవాసంలో ఉన్నప్పుడే అదే వీధిలోని "చిన్నాదేవి" అనే వెలయాలును-ఆమె రూప లావణ్య సమస్త కళావిశారదం చేత ఆకర్షించబడి-హృదయ పూర్వకంగా ప్రేమించాడు. రసికతలో అతనికామె గురుపీఠం. వారి రహస్య ప్రణయాన్ని వెన్నెలరేడు తప్ప మరెవ్వరూ చూడలేదు. సంవత్సరాల తరబడి చందమామ సాక్షిగా వారు కలుసుకుంటున్నారు. అపూర్వ మేధా సంపన్నుడగు మహామంత్రికి సైతం ఈ గ్రంథం ఇసుమంత కూడా తెలీదు. రాయలు రాజుగా పట్టాభిషిక్తుడైనా చిన్నాదేవిని విస్మరించలేకపోయాడు. ప్రథమయామాంతంలోనే రాజు ముసుగు వేసుకొని రాజ వీధుల తిక్రమించి వెలయాలి ఇంటికి బయలుదేరుతాడు. తృతీయామంతానగాని మళ్ళీ అంతఃపురమున ప్రవేశించడు.

ఒకనాడు రాయలు తన ప్రేయసి చిన్నాదేవినుండి వీధి గుమ్మం దగ్గర వీడ్కోలు తీసుకుంటున్నాడు. ఆసమయంలో ఆ దారిన పోతున్న ఒక వ్యక్తి వారి ప్రణయ ప్రసంగ రచనా నైపుణ్యానికి ఆశ్చర్యపడి. ఆ పురుష కంఠధ్వని అతనికి సుపరిచితమవటంవల్ల- కొద్దిక్షణాలు ఆలోచించి "రాయా!" అని బిగ్గరగా పిలిచాడు. ఆ అదునుకు ఆ వెలయాలు



చెంగుమని లోపలకు దూకి గడియ బిగించింది. ఆ రసికుడు వెనక్కి తిరిగి చూడకుండా పరువెత్తి,పరువెత్తి అంతఃపురం చేరి తలుపు వేసుకొని హంసతూలికాతల్పంపై శయనించి ఒక దీర్ఘ నిశ్వాసం విడిచాడు. ఆ కంఠధ్వని అతని శ్రవణ రంధ్రాలలో ఇంకా గింగురు మంటూనే ఉంది. ఆ పిలుపు మహామంత్రిది.

ఆ మరునాడు రాజు సభకు రాలేదు. మహామంత్రే అంతఃపురానికి వెళ్ళాడు. రాయల వారింకా నిద్ర లేవలేదని వార్త. "మేం వచ్చాం. లేవమన్నామని చెప్పు." అని మహామంత్రి ఆజ్ఞ. నిజానికి రాయలవారు నిద్రపోవటంలేదు. కాని, మహామంత్రిని చూడటానికి మాత్రం భయపడుతున్నాడు. కాని, మహామంత్రి ఆజ్ఞ మహారాజుకు అనుల్లంఘనీయం. అతడు రాజకంఠీరవుడే కావొచ్చు కాని, మహామంత్రి నిశిత వీక్షణాలు అతణ్ణి పిల్లివలె మార్చివేస్తాయి. ఒకవేళ రాయలు బయటికి రాకున్నా, మంత్రి శయ్యాగారంలోకి ప్రవేశించి, తను వొచ్చిన కార్యాన్ని నిర్వహించుకొనిగాని పోడు. విజయనగర సామ్రాజ్యంలో నరస నాయకుల కాలం నుండీ మహామంత్రి అడుగిడరాని ప్రదేశాలు లేవు. అవి అంతఃపురాలు కావొచ్చు. అభ్యంతర మందిరాలు కావొచ్చు, మహారాజు వద్ద నుండి సేవకునివరకూ వినమ్రులై మహామంత్రికి దారి ఇవ్వవలసిందే. అతడు చండశాసనుడు. రాజు మంత్రిని అప్పాజీ అని పిలుస్తాడు.

రాజుకు మంత్రి వద్దకు రావటం కన్నా గత్యంతరం లేకపోయింది పిల్లివలె వొచ్చి ఎదురుగా కూర్చున్న రాజును- మంత్రి ఒక్క- క్షణం తీవ్రంగా చూశాడు. ఆ చూపులధాటినుండి తన్ను తాను నిలుపద్రొక్కుకోటానికి రాజు విపరీతంగా ప్రయత్నం చేశాడు. మంత్రి మాట్లాడలేదు. రాజు సమాధానం ఇవ్వలేదు. మహామంత్రి కనుసన్నలచే సేవక జనం నిష్క్రమించారు క్షణాలు గడుస్తున్నాయి. మహామంత్రి స్థాణువులా కూర్చున్నాడు. ఎట్టకేలకు రాజే ధైర్యం చేశాడు. "నేనామెను ప్రేమించాను."

"నీ విప్పుడు సార్వభౌముడివి." మహామంత్రి మహారాజును ఒంట

రిగా నున్నప్పుడు "నీవు, నీవనే" సంబోధిస్తాడు. ఆ సంబుద్ధి వారి అప్యాయతకు చిహ్నం.

"సార్వభౌములకు ప్రేమించే హక్కు లేదా?"

"దానికి ప్రజామోదం కావాలి, వెలయాలుకు మహారాణి అయ్యే హక్కు లేదు."

"ఆమె నా ప్రేయసి. ఆమె నా హృదయరాణి కావాలని కోరుతున్నదే కాని, మహారాణి కావాలని కాదు ఆమెకు పట్టమహిషి కావాలనే కోరిక లేదు."

"అయినా, ఇకపైన నీవామె ఇంటికి వెళ్ళటానికి రాజతంత్రం అంగీకరించదు. నూతనంగా సార్వభౌముడవైన నీకు అడుగడుగునా ప్రమాదాలను శంకించవలసి ఉంటుంది. మహారాజు అర్ధరాత్రాన ముసుగు వేసుకొని కోట వెలుపలికి వెళ్ళటం ప్రమాద హేతువు."

"అలా అయితే, ఆమే కోటలోనికి రావొచ్చా?"

మహామంత్రికి ఈ ప్రశ్నాపూర్వక సమాధానానికి వొళ్ళుమండింది. కాని, రాయల రాచరికాన్ని గుర్తించటం తన విధి అనుకొన్నాడు. తెచ్చిపెట్టుకున్న ప్రశాంతతతో ఇలా అన్నాడు మహామంత్రి. "కాని, దానికి ప్రజలంగీకరించరు. అవివాహితుడైన మహారాజు కోటలో వెలయాలితో కులకటం సామ్రాజ్యానికే అప్రతిష్ఠ:"

"ఆమెను వెలయాలనకండి, అప్పాజీ! క్షమించండి. మీరన్న మాట మరొకరే కనక అని ఉంటే...." మహామంత్రి నిశిత వీక్షణం మహారాజుకు వాగ్బంధనం గావించింది. మహామంత్రి నొచ్చుకున్నాడు.

"రాయా! నీ ప్రణయానికి అవరోధం కావటం నా ఉద్దేశ్యంకాదు. ఆమెకు నీ అర్థాంగి అయ్యే అధికారమున్నా, పట్టమహిషి అవటానికి హక్కు లేదు." అప్పాజీ అనునయ వాక్కులు మహారాజున కమృతధారలయినాయి.

"ప్రప్రథమంగా ధర్మశాస్త్ర సమ్మతంగా నీ వివాహం జరగాలి. ఆపైన చిన్నాదేవిని కోటలోనికి తీసుకుని రావచ్చు. కాని అంతవరకూ నీ వామె గృహానికి పోరాదు సుమా!" మహామంత్రి ఆజ్ఞ విధించాడు.



రాయలు నిజానికి సమ్మతించక చేసేది లేదు. ఇన్నాళ్ళ నుండీ మహామంత్రి వివాహ ప్రసంగం ఎత్తినప్పుడెల్లా అయిష్టతను నటించే రాయలకిప్పుడు వివాహమంటే ఆదుర్దా హెచ్చసాగింది. "నా వివాహం వెంటనే జరిపించండి అప్పాజీ!" అన్నాడు.

రాయలవారి ఆతురతకు మహామంత్రి చిలిపి నవ్వు నవ్వాడు. "పెళ్ళికుమార్తెలు కావాలనంగానే దొరుకుతారా, రాయా?"

"దేశంలో రాజ కన్యలకు కరువు వొచ్చిందా?"

"కాని, కాబోయే ఆంధ్ర సామ్రాజ్య పట్టమహిషి అభిజాత్యంలో సద్వంశ సంజాతగానూ సర్వసద్గుణ సముపేతగానూ ఉండాలని ఆంధ్రుల వాంఛితం."

"అలాంటి కన్య మీ దృష్టిలో ఎవరూ లేరా?"

"ఉన్నా మన ఆజ్ఞను శిరసావహించి, క్షణాల మీద తన తనయనిచ్చి వివాహం చేసేపాటి మహారాజు కావాలిగా, రాయా! తొందర పడితే ఎలా?"

"అయితే ఎవరయినా సామంతరాజ తనూజను నిర్ణయించండి."

మహారాజుకు మహామంత్రి అంటే ఎంత భయమున్నా, పుట్టుకతో వొచ్చిన రాజ ఠీవీ, దర్పమూ అతని ప్రతి మాటలోనూ ప్రతిధ్వనిస్తుంటాయి. సామంత రాజనగానే శ్రీరంగ పట్నాన్ని పరిపాలిస్తున్న గంగరాజు - మహామంత్రికి స్ఫురణకు వొచ్చాడు.

అతనికి ఒక ఈడు వొచ్చిన కుమార్తె ఉంది. పేరు తిరుమలాంబిక. ఆమె చిన్నతనంలో ఒకసారి విజయనగరం చూడటానికి వొచ్చి తన తండ్రితో మహామంత్రి దర్శనం కూడా చేసింది ఆ నాడే ఆమెలో మహారాజ్ఞి లక్షణాలు గమనించి ఆమెను సామ్రాజ్ఞివి కమ్మని ఆశీర్వదించాడు మహామంత్రి, ఆ సంఘటన గుర్తుకొచ్చింది మహామంత్రికి.

"కాని, నీవు కన్య నొకసారి చూడాల్సిన అవసరం లేదా!"

"లేదు. మీకూ, ఆంధ్రులకు నచ్చిన ఏ మగువకైనా నన్నిచ్చి పెండ్లి చేయండి. నా ఇష్టాయిష్టములతో నిమిత్తం లేదు." మహారాజు

ఆసనం మీదనుంచి లేచాడు, "కాని, వివాహం మాత్రం రెండు రోజుల్లో జరిగిపోవాలి." అంటూ మహారాజు శయ్యాగారంలోకి వెళ్ళిపోయాడు.

మంత్రి నిశ్చేష్టుడైనాడు. మహామంత్రి ఎంతటి మొండి ఘటమైన పట్టు విడుపులు గలవాడు. తాడు తెగే వరకూ బిగించ రాదనుకున్నాడు. వెంటనే గంగరాజును కుమార్తెతో కూడా బయలుదేరి విజయనగరం రమ్మని కబురు చేశాడు. గంగరాజుకు తన కుమార్తె వివాహం జరుగబోతున్నదని తెలియదు. తిరుమలాంబికకు తను ఆంధ్ర సార్వభౌముని అర్ధాంగి కాబోతున్నానీ తెలియదు. వేళ అతిక్రమించకుండా గంగరాజు కూతుర్ని వెంటబెట్టుకొని మహామంత్రి ఆజ్ఞ మేరకు విజయనగరం వొచ్చి చేరాడు. ఏ నోట విన్నా అతనికి మహారాజు వివాహపు విషయమే విన వొచ్చింది. కాని, ఎవ్వరికీ వధువెవరో తెలేదు. మహారాజొకరితో చెప్పడు; మహామంత్రి మరొకరికి చెప్పలేదు.

సుముహూర్తం ఇంకా కొద్దిక్షణాల్లో ఉన్నదనగానే గంగరాజుకు కూతురును పెండ్లికుమార్తెనుచేసి కళ్యాణ మండపమునకు తీసుకొని రావలసిందని వార్త పంపాడు మహామంత్రి. గంగరాజుకు పరమ సంతోషమయింది. సిరిరా మోకాలొడ్డువా రుండరు కదా? ఆంధ్ర సామ్రాట్టు తన కల్లుడు. అంతకన్నా వేరే ఏం కావాలి? మహామంత్రి ఈ వివాహ సంబంధ విషయం ఇంత రహస్యంగా ఉంచటానికి కారణం లేకపోలేదు. కృష్ణరాయల తల్లియగు నాగాంబ చతురంగమున ఓడి సవతియగు తిప్పాంబకు కొద్ది క్షణాలు దాస్యం చేయటంవల్ల కృష్ణరాయలకు దాసీపుత్రుడను పేరు కిట్టనివారిలో ప్రచారంలో వుంది. అందువల్ల రాయలకు అభిజాత్య సంపన్నులు తమ కన్యనివ్వటానికి సందేహించవచ్చు. అదే మహామంత్రి ఈ వివాహాన్ని ఇంత రహస్యంగా జరిపించటానికి కారణం. కాని, గంగరాజుకి ఊహ ఇసుమంతకూడా లేదు. వరులాతనికి బోధ చేసేందుకు మహామంత్రి అవకాశమివ్వలేదు తిరుమలాంబికా కృష్ణరాయలుల వివాహము ఆ విధంగా జరిగింది. అందువల్లనే వారిరువురి సంబంధమూ ధర్మబద్ధము. ప్రణయసూత్ర నిబద్ధము కాదు. ఆ తరువాత కాలేదు.

విజయనగర సామ్రాజ్యమందలి ప్రధాన వ్యక్తి మహామంత్రి



తిమ్మరుసు. సార్వభౌమునితో సమాన గౌరవాదరములను అతడు అనుభవిస్తున్నాడు. రాజు రాజ కార్యములను నిర్లక్ష్యం చేయటానికి ప్రధాన కారణం అతనికి మహామంత్రి శక్తి సామర్థ్యములందున్న అపారమైన అచంచల విశ్వాసమే. రాజు మంత్రిని "అప్పాజీ" అని పిలుస్తాడు. రాజ బంధువులందరూ మహామంత్రిని అప్పాజీ అనే సంభావిస్తారు. రాజ దర్శనార్థం వొచ్చిన సామంత రాజు లందరూ మహామంత్రిని చూచికాని రాజ దర్శనం చెయ్యరు. రాజ సందర్శనమునకెంత సంతోషంతోపోతారో మహామంత్రి దర్శనానికి అంత భీత హృదయంతో వెళుతుంటారు. కవి పండితాదులకు తప్ప మహామంత్రిని కన్నెత్తి చూడటానికి సామ్రాజ్యాన మరెవరికీ ధైర్యంలేదు. అతని పేరు విన్న శత్రు రాజన్యులు తమ సింహాసనాల్లో గడ-గడ వణకిపోతారు. అతని నిశిత వీక్షణ ఎంతటి శక్తివంతుడగు మహారాజునైనా క్షణ మాత్రంలో భస్మీపటలం చేసివేస్తుంది.

మహామంత్రి కత్తి యుద్ధాన సాటిలేని మేటి. కాని, తన కార్య సాధనకు సాధారణంగా కత్తి నుపయోగించడు. ఖడ్గధారణ ఆయనకు కేవలమొక అలంకారం మాత్రమే. ఆ ఖడ్గ చాలనమున జగత్తును శాసిస్తాడే కాని, ప్రాణాలను స్వయంగా హరించడు. అతని ఖడ్గానికి రుధిరపానం అలవాటు లేదు కాని, ఆ ఖడ్గరాజము తన సోదర ఖడ్గములకు త్రావినంత రుధిరమును కావలయునన్నప్పుడెల్ల ప్రసాదిస్తుంటుంది. మంత్రి తన మంత్రాంగ సాకర్యార్థ మెవ్వరడ్డు వొచ్చినా మట్టుబెట్టిస్తాడు. కాని, తను స్వయంగా మట్టుబెట్టడు. మహామంత్రి తోటి వ్యవహారం కత్తిమీది సాము.

మహామంత్రి అగ్నివంటిమనిషి. అతని నిశిత వీక్షణాలు ముక్కంటి మూడవ నేత్రం నుండి వెలువడే అగ్ని జ్వాలలను పోలి వుంటాయి. అతని విశాల ఫాలమున దుర్నిరీక్ష్యమగు బ్రహ్మ వర్చస్సు సర్వదా ప్రకాశిస్తుంటుంది. అతడు ఆరువేల నియోగి. ఇంటి పేరు సాళువ వారు. జననమొక దరిద్ర బ్రాహ్మణ కుటుంబమున. తండ్రి పేరు సాళువ రాచరాజు. జన్మస్థలం గుంటూరు జిల్లా కొండవీడు సీమ. చిన్ననాడే తల్లిదండ్రులు కన్నుమూశారు.

మాతాపితలు కరువైన తిమ్మరుసుకు, అతడి సోదరుడికి గర్భదరిద్రదేవతే తల్లిగానూ, తండ్రిగానూ ఆదుకుంది. ఉన్న ఊరు అచ్చిరాక దేశాలు పట్టారు. గౌరవంగా జీవిద్దామని ప్రొద్దుటే లేచి, విస్తరాకులు సేకరించి కుట్టి విక్రయించటం మొదలుపెట్టారు. ఎవరి విస్తరి వారు కుట్టుకునే ఆరోజుల్లో విస్తళ్ళను కొనేదెవరు? ఆ వృత్తి అచ్చిరాక పోవటంతో మాధూకరం చేపట్టారు, "ఉపనయనం నాటి విద్య ఉన్నది సుమ్మీ!" అనే ఆర్యోక్తి ననుసరించి. కాని, ఆనాడు రాయలసీమ రతనాల సీమకాదు; రాళ్ళ సీమ. రాళ్ళతోనే వారి జోలె నిండింది. కాని, బ్రతకాలి. ఎలా? ఎలానో వారికి తెలీలేదు. సత్రంలో ఒకరోజు భోజనం పెడతారు. కాని, మరునాడు....? మరునాడు సత్రంలోని ప్రజలు భోజనం చేసిన తాలూకు పుల్లిస్తరాకులు వీధిలో పడెయ్యటం చూశారు. ఒక్కసారిగా నాలుగు కుక్కలు పోట్లాడుతున్నాయి. వాటికోసం అన్నదమ్ములిద్దరూ ఆ నాలుగు కుక్కలనూ ఎలాగైతేనేం- వెళ్ళగొట్టి నాటికి పొట్టనింపుకోగలిగారు. కాని, అలా జీవించటం దుర్భరమనిపించింది. పరువుగా బ్రతకాలనే ఉద్దేశంతో దేశ దేశాలు తిరిగారు. కాని, ఉద్యోగమిచ్చిన నాథుడు లేడు చివరికి చంద్రగిరిలో ఒక వ్యవసాయదారుడు తన గొడ్లు మేపటానికి రోజూ గంజిపోసే షరతు మీద ఇద్దరు పిల్లవాళ్ళనూ ఊడిగానికి పెట్టుకున్నాడు, ప్రొద్దుట తరవాణి తిని. గొడ్లను అడవికి తోలుకెళ్ళిన ఈ బానిస బిడ్డలకు మళ్ళీ గొడ్లు రాత్రి కొష్టాన్ని చేరేవరకూ గంజినీళ్ళకు కూడా గతిలేదు. అయితేనేం- ఈ వృత్తిలో తిమ్మరుసుకు గౌరవం, తృప్తి కనిపించాయి.

ఆ రోజుల్లో ఒకనాడు తిమ్మరుసు మిట్టమధ్యాహ్నాన తిండికి లేక మలమలా మాడుతూ, శోష వొచ్చి అడవిలో ఒక చెట్టు క్రింద స్పృహ తప్పి పడిపోయాడు. ఆ సమయంలో ఒక కోడె త్రాచు కృతాంతుడి పాశంలా జర జరా ప్రాకుతూ, ఆ బాలుణ్ణి సమీపించడం దారినపోతున్న ఒక సాధు పుంగవుడు దూరాన్నించి చూచి, పరుగెత్తుకుంటూ దగ్గరకు వచ్చాడు. కాని, అక్కడతను చూసిన దృశ్యానికతనికి చాలా ఆశ్చర్యం వేసింది. ఆ త్రాచు బాలుని కాటువేయకపోగా, మధ్యందిన భానుని తీక్షణ కిరణ కాంతి బాలునికి సోకకుండా పడగ విప్పి గొడుగు పడుతున్నది.



దగ్గరకు వొస్తున్న సాధు పుంగవుణ్ణి చూచి, ఆ త్రాచు మెల్లగా జరిగి వెళ్ళిపోయింది. ఆ సాధువు బాలుణ్ణి తేరిపార చూచాడు. మహాపురుష లక్షణాలతో, అఖండ మేధాసంపత్తితో, అనన్యసాధారణ బ్రహ్మవర్చస్సుతో అనంత శేముషీ సంపదతో, జ్వాజ్వల్యమానంగా మిరుమిట్లు గొలుపుతున్నదా బాలుని ముఖ వర్చస్సు. వెంటనే ఆ సాధువు ఆ బాలుని తన కమండలోదకంతో సేదదేర్చి, తన జోలెలో ఉన్న కందమూలాదులతో అతని క్షుద్బాధను నివారించి, కుశల ప్రశ్నలు వేసి, అతనిని తన తోడ తీసుకొని వెళ్ళి, అతడెరిగున్న సామంతరాజు వద్ద లేఖకుడిగా నియమించాడు. ఆ తరువాత తిమ్మరుసు జీవితం విచిత్రమైన మెలికలు తిరిగింది. అనేక దుర్గాధీశుల కొలువు చేశాడు. క్షణ క్షణానికీ తన అపూర్వ మేధా సంపత్తిని ప్రదర్శిస్తూ యజమానుల మన్ననలను పొందుతూ; తన గౌరవాన్నీ, హోదానూ పెంచుకున్నాడు. చివరకు ఆయన తుళువ నరసరాయల వద్ద మంత్రిగా చేరాడు. నరసరాయలకు తిమ్మరుసుయందు విపరీతమైన గౌరవం. తుళువనరసనాయకుని అన్న ప్రస్తుత విజయనగర సామ్రాజ్యాధీశుడైన కృష్ణరాయ భూపాలుని తండ్రి. అప్పటికాయన సామంతరాజమాత్రుడు. విజయనగర రాజులకు కప్పంకడుతూ ఉండేవాడు.

అంతే కాకుండా పలు యుద్ధాలలో తన ప్రచండ పరాక్రమం ప్రదర్శించి విజయనగరానికి దండనాథుడు కూడా కాగలిగాడు నరసరాజు.

ఇంతలో మహారాజయిన సాళువ నరసింహరాయలకు విపరీతమైన జబ్బు చేసింది. రాజు తన మరణావస్థలో తన పిల్లల నిరువురినీ, రాజ్యభారాన్నీ దండనాథునికి ఒప్పగించి వెళ్ళిపోయాడు. నరసరాయలు వెంటనే నరసింహరాయల పెద్దకుమారుడైన తిమ్మరాజును విజయనగరానికి పట్టాభిషిక్తుణ్ణి చేసి, తాను సర్వాధికారిగా రాజ్యభారాన్ని వహించాడు. పరాక్రమవంతుడైన నరసరాయలకు తిమ్మరుసు బుద్ధి విశేషం తోడైంది. విజయనగరం దినదినాభివృద్ధిగాంచి, సర్వతోముఖమైన అభివృద్ధిని సాధించ సాగింది.

ఇంతలో దురదృష్టవశాత్తు మహారాజు నెవరో హత్య చేశారు. ఆ నెపం తుళువ నరసరాయల మీద పడింది. ఈ అపవాదు బాపుకోవటానికి నరసరాజు-చనిపోయిన రాజు తమ్ముడూ, సాళువ నరసింహరాయల ద్వితీయపుత్రుడూ అయిన నరసింహరాయలను సింహాసనాభిషిక్తుణ్ణి చేశాడు. కాని, సాళువ వారికి శత్రువు లనేకులు సాళువ నరసింహరాయలు నరస రాజు సహాయంతో విజయనగరాన్ని అన్యాయంగా ఆక్రమించినందువల్ల సాళువవారంటే విజయనగరవాసులకు చాలామందికి శత్రుత్వం. ఈ నరసింహరాయలను కూడా ఎవరో హత్య చేశారు ఒకనాటి అర్ధరాత్రి. అందుతో రాజ రక్షకుడగు నరసరాయలకు పిచ్చి ఎక్కినంత పనైంది, వెంటనే తిమ్మరుసు కొరకు కబురు పెట్టాడు.

తిమ్మరుసు ఈ అదను చూచి తోటి సామంతులతోనూ, దండ నాథులతోనూ, సంప్రతించి, విజయనగర ఆంధ్రసామ్రాజ్య పరిరక్షణార్థం తన స్వామియగు తుళువ నరసరాయలను విజయనగర సామ్రాజ్యసింహ పీఠయందు అధిష్ఠితుని చేశాడు. ఆ తరువాత కృష్ణరాయలవరకూ మహా మంత్రి ఆమోద ముద్రతో సింహాసనమెక్కినవారే. అతని నిర్హేతుక పరిపూర్ణ కటాక్ష మెవరిపై ప్రసరిస్తే వారే సార్వభౌములు.

మంత్రి రాజు కాకున్నా రాజ సదృశుడు.

రాజునకొక సవతి తమ్ముడున్నాడు, అతను ముమ్మూర్తులా రాయలను పోలి ఉంటాడు. అతని పేరు అచ్యుతదేవరాయలు. ఆరు సంవత్సరముల క్రితం వరకూ అతడే యువరాజుగనూ, రాజునకు వారసుడుగనూ సామ్రాజ్యమున పరిగణింపబడుతుండెడివాడు. కాని, రాయలకు అన్నపూర్ణాదేవి యందొక మగశిశువు జన్మించుటతో అచ్యుతదేవరాయలవారి విశిష్టస్థానమునకు భంగం వాటిల్లింది. అతనిప్పుడు కేవలం సోదరుడు మాత్రమే! అతడూ తిమ్మరుసును "అప్పాజీ" అని పిలుస్తాడు. మహామంత్రి కృష్ణరాయల పట్టాభిషేక సమయాన అచ్యుతరాయలను బంధించి, పెనుగొండ దుర్గానికి బందీగా పంపించాడు. రాజరికానికి అతడు కూడా వారసుడు కావటంవల్ల రాజనీతి ననుసరించి అప్పాజీ ఆ విధంగా చేశాడు. దేశక్షేమానికి ఆ విధంగా చేయటం అవసరమని త్రికరణ శుద్ధిగా విశ్వసించాడు అచ్యుతదేవరాయలు.



ఇంతకన్నా అప్పాజీ వారి మీద అచ్యుతరాయలకుండే గౌరవ ప్రతిపత్తులకు వేరే నిదర్శనం అవసరం.

విజయనగర సామ్రాజ్యపు సర్వ సైన్యాధిపతి పెమ్మసాని రామలింగనాయకులు. బ్రహ్మాండమైన విగ్రహం, అసదృశమైన భుజబలం, మూర్తీభవించిన పరాక్రమం. విజయనగర సామ్రాజ్యంలోని రథ గజ తురగ పదాతి దళాలు అతని కనుసన్నలలో మెలగుతుంటాయి. అనేక యుద్ధాలలో తన శక్తి సామర్థ్య పరాక్రమ విజృంభణతో విజయనగరానికి విజయలక్ష్మిని ఆర్జించి పెట్టినందువల్ల రాయలవారికి రామలింగ నాయకుడంటే అభిమానం. రామలింగ నాయకులకు మహారాజు ఎడ అభిమాన గౌరవాలూ, మహామంత్రి ఎడల భక్తి విశ్వాసాలూ, భయము కూడా ఉన్నాయి.

* * *

రాజున కత్యంత ప్రేమపాత్రురాలు చిన్నరాణి అన్నపూర్ణాదేవి. ఆమె కటకాన్ని పాలించే ఓఢ్ర ప్రభువగు గజపతికి ముద్దుబిడ్డ. ఆమె అసలు పేరు తుక్కాదేవి. ఓఢ్రి దేశాన దుర్గ అనే శబ్దానికి రూపాంతరం 'తుక్క'. గజపతులు వీరశైవులు. దుర్గాదేవి వారి కులదైవం. ఆ పేరుతోనే గజపతి తన ముద్దుల బిడ్డను పిలుస్తూ, దుర్గాదేవే తన గర్భవాసాన జన్మించినంత ఆనందాన్ని పొందుతుండేవాడు. 'తుక్క' ఆనాడు భారతదేశ విఖ్యాతి గాంచిన సౌందర్యరాశి. సకల కళా ప్రావీణ్య, సర్వలక్షణ శోభిత అయిన తుక్కను రాయలవారి కిచ్చి పెళ్ళి చేయాలని మహామంత్రి సంకల్పం. దానివల్ల ఆయన రాజకీయ మస్తిష్కానికి ఒక పెద్ద సమస్య పరిష్కారమౌతుంది. ప్రథమంగా ఆమె సార్వభౌమ పుత్రి. ఆమె తండ్రి సామ్రాజ్యం ఆనాడు మహా విశాలమైనది. అందు సంపూర్ణ ఓఢ్రిదేశమే కాకుండా గోదావరీ, కృష్ణా, పెన్నా పరివాహికములగు ఆంధ్రనగరాలు కూడా చేరి ఉన్నాయి. నెల్లూరు మండలంలోని ఉదయగిరి, గుంటూరు మండలంలోని కొండవీడు, కృష్ణా మండలంలోని కొండపల్లి అతనికి మహా బలిష్ఠమైన కోటలు. ఈ దుర్గాల నాధారంగా చేసుకొని ఆంధ్ర దేశాన్ని నిరాటంకంగా పరిపాలిస్తూ, అదను చిక్కినప్పుడు విజయనగరం

మీద దెబ్బ తియ్యాలనే సంకల్పంతో సమయంకోసం ఎదురుచూస్తున్నాడు గజపతి. అలాంటి మహా బలిష్ఠుడైన గజపతితో వియ్యమందటం ద్వారా విజయానికి ఓఢ్రులనుండి దండయాత్ర భయం లేకపోగా, వారి సహాయంతో కయ్యానికి కాలు దువ్వుతున్న బహామనీ సుల్తానులను మట్టుబెట్టటానికి అవకాశం ఉంది. మహామంత్రి ఈ రాజకీయ ప్రయోజనాన్ని ఆశించే ఈ వివాహాన్ని నిశ్చయించాడు. కాని, ఈ విషయం మొదట్లో కృష్ణరాయలకు తెలియదు. చెప్పాల్సిన అవసరం మహామంత్రికి కలుగలేదు. ఆయనకు గజపతిలో విశ్వాసం అస్లే లేకపోవటమే దీనికి కారణం. పెండ్లి రాయబారాలకు వెళ్ళిన విజయనగర పురోహితులను గజపతి అహంభావంతో తిరస్కరించాడు. శైవమతావలంబి అయిన తాను పందులను పూజించేవారికి పిల్లనివ్వనన్నాడు. విజయనగర రాజులు సర్వ జగన్నాథుడగు శ్రీవిష్ణువును ఆది వరాహ రూపంలో ఆరాధిస్తారు. వారి పతాక లాంఛనంకూడ వరాహ చిహ్నమే. రాజదండం మీద వరాహ చిహ్నమే చిత్రింపబడి ఉంటుంది. అంతే కాక, దాసీ పుత్రుడగు రాయలకు పిల్లనిచ్చి తన వంశాన్ని - బొందిలో ప్రాణం ఉన్నంతదాకా కళంకితం చేయనన్నాడు. అలాంటి అసంబద్ధపు కోరిక కోరినందుకు రాయబారులను బ్రాహ్మణులు కాబట్టి విడిచిపెడుతున్నాననీ, మరొకరైతే ప్రాణాలతో పోనిచ్చేవాణ్ణికాదనీ గర్జించాడు. అవమాన భారంతో కృంగిపోతూ పురోహితులు తిరిగి వచ్చి, మహామంత్రికి తాము పొందిన దూషణ తిరస్కారాదులను విన్నవించారు. మహామంత్రికి ఈ పరిస్థితి ఇలా పరిణమిస్తుందని ముందుగానే తెలుసు. అయినా, జరిగిన అవమాన కాండను వారి నోటినించి వింటుంటే-అగ్గిమీద గుగ్గిలం వేసినట్లుంది మహామంత్రికి. కాని, జరిగిన సంగతి రాయలవారికి విన్నవించకుండా కట్టుదిట్టం చేశాడు. ఆయనకు తెలుసు- రాయలవారికీ విషయం తెలిస్తే పోరు క్షణాలమీద ముంచుకు వొస్తుందని. కాని, పోరు విషయంలో మహామంత్రి తాత్సారం చెయ్యలేదు. దండయాత్రకు కావలసిన సర్వస్వం తన స్వంత పర్యవేక్షణలో జరుపుతున్నాడు. సహజంగా మహామంత్రి చారచక్షువు. ఆయన అప్పుడే తన వేగులను గజపతి రాజ్యంలోని దుర్గాలన్నిటికీ పంపి - వాటి



సైనిక పటాలనూ, వానిలోని చతురంగ దళాల వివరాలనూ, కోటలో వున్న ఆహార ధాన్యపు నిల్వల లెఖ్ఖలనూ సేకరించటం మొదలుపెట్టాడు. గజపతికి ముఖ్యబలం ఆయన కన్ని విధములా సన్నిహితులగు పదునార్గురు పాత్రులు, వారు గజపతికి సామంతరాజులు. వీరి దుర్గములు ఆంధ్రదేశమంతట ఉన్నాయి. మహాబల పరాక్రమ సంపన్నులైన వీరంతా తమతమ అపార సేనావాహినులతో గజపతి సార్వభౌమత్వాన్ని పరిరక్షిస్తున్నారు. వీరికి గజపతి అంటే విపరీతమైన విశ్వాసం. గజపతికి వీరంటే అపరిమితమైన నమ్మకం. గజపతిని జయించాలంటే వీరిని ముందు జయించాలి. మహామంత్రికి వీరిని జయించటం అంత సులువుగా తోచలేదు. కావలసింది సేనావాహిని కాదు. శేముషీవిభవం.

ఈ పరిస్థితులిలా ఉన్నా రాయలవారికి వీటి విషయం సరిగా తెలియదు. ఆయనకు మహామంత్రి పూర్వ దిగ్విజయ యాత్ర సన్నాహంలో ఉన్నారని మాత్రమే తెలుసు. కాని, తత్కారణం మాత్రం తెలియదు. ఇంతలో రాయలవారి జీవితంలో ఒక మహా దుర్ఘటన జరిగింది. ఆయన చిన్ననాటినుండీ ప్రేమించి, మహామంత్రిని సైతమొప్పించి, అనేక విపరీతమైన పరిస్థితుల నెదుర్కొని, పెండ్లియాడిన ప్రేమైకరాశి, ప్రణయ సామ్రాజ్య లక్ష్మి చిన్నాదేవి కన్ను మూసింది. రాయలవారికి ప్రపంచమే అంధకారంగా పరిణమించింది. పొంగి పొరలే అతని యౌవ్వనం బూడిదలో పోసిన పన్నీరులా, అడవిని కాచిన వెన్నెలలా తోచసాగింది. శీతాంశు కిరణాలు చండప్రచండంగా మాడ్చివేస్తున్నాయి మహారాజును. మహారాజు మమత కోల్పోయి, ఎండిపోయిన మ్రానులా అంతఃపురంలో కాలం గడుపుతున్నాడు. అతని హృదయ సామ్రాజ్య పీఠం ఖాళీగా ఉంది. ఆ సింహాసనాన్ని మరొకరు అధిష్ఠిస్తేనే కాని, రాజు రాజుగా మారడు. మహామంత్రి దృష్టిలో లావణ్యరాశి అన్నపూర్ణ క్షణ మాత్రం తాండవించింది. వెంటనే పురోహితులకు కబురుపెట్టాడు. మహామంత్రి ఆజ్ఞ మేరకు పురోహితులు వెనువెంటనే దర్శనానికి వొచ్చారు. వారిని చూచి మహామంత్రి రాయలవారికి 'తుక్కా దేవి తైలచిత్రాన్ని అందించమనీ, ఈవిషయం తనకు తెలిసినట్లు రాజుగారికి తెలియ కూడదనీ ఆదేశించాడు. పురో

హితులు మహామంత్రివద్ద సెలవుపుచ్చుకొని బయలుదేరారు రాజ సందర్శ నార్థం.

పురోహితులు వెళ్ళిన తరువాత దాదాపు గంటకాలం మహామంత్రి ఆలోచనా మందిరంలోనే గడిపాడు. ఆయన మనస్సు శోకాకులితుడగు మహారాజును కార్యోన్ముఖుడిని చేయటం ఎలగా అని పరి పరి విధాల ఆలోచింపసాగింది దాని కొరకు కొతడొక గంట క్రితం ఒక వ్యూహాన్ని రచించాడు. దాని ఫలితం ఎలా ఉంటుందా అని ఎదురు చూస్తున్నాడు. ఇంతలో చారుడు ప్రవేశించి మహారాజు ఆగమనాన్ని మహామంత్రికి విన్నవించాడు. మహామంత్రి ఆలోచనా మందిరంలో ఉన్న వారందరూ చారులే. అందుకే అక్కడి గోడలకు కూడా చెవులుంటాయని చెప్పుకుంటారు ప్రజలు. దాదాపు మూడునెలలుగా అంతఃపురం వొదలని మహారాజు హఠాత్తుగా అలా రావటం చారుడికికూడా వింతగానే ఉంది. మహామంత్రికి తన వ్యూహం రూపం దాలుస్తున్నదనే సంతోషం ఛాయామాత్రంగా ముఖాన అంకురించింది, ఇంతలో మహారాజు ఆలోచనా మందిరంలో ప్రవేశించాడు. మహామంత్రి ఎదురు వెళ్ళి సాదరంగా పరామర్శ చేసి, రాజును సుఖాసీనుణ్ణి చేశాడు.

"అప్పాజీ! ఈ చిత్రాన్ని ఎప్పుడైనా చూశారా?" తుఖాదేవి చిత్ర పటాన్ని చూపెట్టాడు మహారాజు. ఆ పటం సందర్శించటం వల్లనే మహారాజులో ఇంత చలనం బయలుదేరితే, వ్యక్తి ఇంకెంత విప్లవాన్ని లేవదీయగలదో అనుకున్నాడు మహామంత్రి. కాని, తన కార్యసానుకూల్యతకు ప్రస్తుతం ఆ చిత్రమే ఆధారం.

"ఎక్కడో చూచినట్లుంది. ఆమె గజపతి పుత్రిక తుఖాదేవికదూ?" అన్నాడు మహామంత్రి ఏదో గుర్తుకు తెచ్చుకుంటున్న వాడిలా.

"అవును. అప్పాజీ! మన పురోహితులు చూపించారీ చిత్రాన్ని నాకు. అప్పాజీ! నిజంగా ప్రపంచంలో ఇంత సౌందర్యరాశి ఉంటుందంటారా?"

"ఉన్నదిగా మరి!"

"చిత్రలేఖకుని లేఖిని వాస్తవాన్ని అతిక్రమించిందేమో?" ఆ



చిత్రంలోని సుందరి ఉన్నది ఉన్నట్లుగా కావలయు నన్నట్లున్నది రాయల వారి ధోరణి. మహారాజు రసికతయందు మహామంత్రికి సంపూర్ణ విశ్వాసం. అందువల్లనే మహామంత్రి మహారాజు మానసిక వ్యథను పోగొట్టటానికి ఈ మార్గాన్ని అన్వేషించాడు"

"లేదు రాయా, నేనుకూడా ఆమె రూప వయో లావణ్య కళా సంపదలను గురించి చాలా గొప్పగా విన్నాను.'

రాయలవారికి మహామంత్రి వార్తాసేకరణపట్ల విశ్వాసం మెండు. అతని ముఖంలో సంతృప్తి కనిపించింది. కాని, ఒక్క క్షణంలో రాయల ముఖం వివర్ణమైంది. బాధ ఛాయామాత్రంగా గోచరించింది. చిత్రంలోని కన్య శీర్షాన ఉన్న పాపిటబిళ్ళ నాగాకారంగా వుండటం రాయలవారికి బాధ కలిగించింది.

"అప్పాజీ! ఈమె శైవ వంశ సంజాత కాకున్న ఎంత బాగుండేది! అంతే కాదు, ఈమె పేరు తుఖ."

"ఆమె ఏ వంశ సంజాత అయితే, నీకేమిటి రాయా? ఆమె తల్లిదండ్రులు పెట్టిన పేరుకు ఆమేం చేస్తుంది?" మహామంత్రి సాభిప్రాయ వచనాలు అన్యాసక్తుడగు మహారాజుకు అర్థం కాలేదు. కానీ, మనసులోని మాట మహామంత్రి దగ్గర దాస్తే, ప్రయోజనం లేదని మాత్రం రాయల వారికి తెలుసు. అడగంది అమ్మైనా పెట్టదు.

"నేనీమెను ప్రేమించాను."

"అయితే?" అన్నాడు మహామంత్రి.

"కాని ఈమె పేరు తుఖ. వీరు శైవులు." మహారాజు తనకున్న అవధిని మహామంత్రికి నివేదించాడు. మంత్రికి నవ్వు వొచ్చింది.

"రాయా! సామాన్యులకు సార్వభౌములకు కాని సర్వ మతాలు సమానమే! అదీగాక, వివాహమైన నాటినుండీ భార్య భర్తను అనుసరిస్తుంది. ఆమెకు పుట్టినింటి ఆచార వ్యవహారాలతో సంబంధం లేదు. ఇక పోతే పేరు: పేరు భర్త ఇష్టానుసారం మారుతుంది. భర్త ఏ పేరుతో పిలిస్తే, ఆ పేరుతోనే పిలుస్తుంది లోకం." అప్పాజీ అభిప్రాయాలు

కార్య సాధనానుకూలంగా మారుతుంటాయ్. అది ఆయన ప్రత్యేకత. రాయలకు మంత్రి శేఖరుడిచ్చిన అన్వయం నచ్చింది.

"అయితే అప్పాజీ! మా ఇరువురి వివాహం జరిపించండి." రాయలు ప్రాధేయపూర్వకంగా మహామంత్రి కరద్వయాన్ని స్వీకరించాడు. వారిద్దరిది ఒకవిచిత్రమైనసంబంధం. రాయలకు మహామంత్రియన్న ఎంతగౌరవమో అంత విశ్వాసం. ఎంత విశ్వాసమో అంత భయం. ఎంత భయమో అంత చనువు. అడుగదగిన ప్రశ్నయైననూ, అడుగరానిదైననూ మహామంత్రిని పసిపిల్ల వాడడిగినట్లు అడిగి వేస్తాడు. ఆయనకు మంత్రి కదా దాపరికాలు లేవు. చేయదగినదైనా, చేయరానిదైనా రాజడిగిన వెంటనే తనకు నచ్చితే క్షణాల మీద చేసేస్తాడు మంత్రి.

"మీ వివాహం జరిపించటానికి నాకేమీ అభ్యంతరం లేదు. కాని, రాయా! ఆ పిల్ల తండ్రి—"

"ఒప్పుకోడంటారా అప్పాజీ? ఏం మనకేం తక్కువ? ఆమె సార్వభౌమ పుత్రిక అయితే నేను సార్వభౌముణ్ణి."

"అది కాదు రాయా! గజపతికి గర్వం, ధనమదాంధత ఎక్కువ. అంతే కాకుండా అతని విశాల సామ్రాజ్యాన్ని చూసుకొని, తన కన్ని విధాలా అండ దండలుగా ఉంటున్న తన పదహారుగురు సామంత పాత్రులను చూసుకొని విఱ్ఱవీగుతుంటాడు."

"హుం! అతని పదహారుగురు పాత్రులనూ మట్టుబెట్టటానికి, మీ బుద్ధి విశేషానికి పదహారు ఘడియలు చాలు, అప్పాజీ! నాకు తెలుసు, అంతే కాదు! అతని అనంత సామ్రాజ్యాన్ని అర ఘడియలో నా అరికాలి క్రిందికి తీసుకొని రాగలరు మీరు తలుచుకుంటే!" రాయలవారి గర్వం అప్పాజీ వారిమీద అతనికున్న విశ్వాసంతో అంతర్లీనమై ఉంది. ఆ నగ్నసత్యం అప్పాజీ వారికి తప్ప అన్యులకు తెలీదు.

"రాయా! అయినా గజపతి నీకు పిల్లనిస్తాడని నాకు నమ్మకంలేదు. ఈ సంబంధం కొరకు నేనిదివరకే ప్రయత్నించాను. కాని, కార్యం సాఫల్యం కాలేదు" మహామంత్రి జవాబు రాయలకు ఆశ్చర్యంగా ఉంది. ఈ చిత్రపటం వెనుక కొంత కథ నడిచిందని ఆయనకు తెలీదు.



"మరి విఫలం కావటానికి కారణం ?"

"గజపతి నిన్ను దాసి పుత్రుడని భావిస్తున్నాడు."

ఈ వార్త రాయల అభిజాత్యాన్ని ప్రశ్నించేది. మరో సందర్భంలో అయితే మహామంత్రి ఈ వాక్యాన్ని జారవిడిచేవాడు కాదు. కాని, ఆయన కిప్పుడు రాయలు కార్యోన్ముఖుడు కావటం చాల ముఖ్యం. అందుకే ఈ ప్రశంస ఎత్తి రాయల హృదయాన్ని బలహీనంగా దెబ్బగొట్టాడు మహామంత్రి. మహామంత్రి వాంఛించిన ఫలితం రానే వొచ్చింది రాయల వారిలో. తన అభిజాత్యాన్ని అవమానపరచిన గజపతి పుత్రికను ఒకవేళ గజపతే వొచ్చి కాళ్ళ మీ[illegible]పడి వేడుకున్నా, తిరస్కరిస్తానని హూంకరించాడు రాయలు. ఈ నిర్ణయం మహామంత్రి వాంఛించిన ఫలితాన్ని అతిక్రమించి వ్యతిరేకించింది. మహామంత్రికి మరొక కొత్త సమస్య ఎదురైంది.

"రాయా! కన్య ఏం చేసింది? నీ అభిజాత్యాన్ని కించపరచిన గజపతిని అవమానించటం కోసమైనా నీవా కన్యను వివాహమాడాలి. బలవంతంగానైనా సరే, గజపతిని అతని సర్వసైన్యాన్ని సర్వనాశనం చేసి అయినా సరే, నీవా కన్యను రాక్షసంగానైనా పరిణయం ఆడి తీరాలి. నేను చేస్తున్న ఈ దండయాత్రా ప్రయత్నమంతా గజపతి మీద కక్ష సాధించటానికే" అన్నాడు మహామంత్రి రాయలను కార్యోన్ముఖుడిని చేయటానికి.

"అవును, అప్పాజీ! ఆమెను రాక్షసంగానైనా సరే, వివాహమాడతాను; మహాగర్వి అయిన గజపతిని సర్వనాశనం చేసి అయినా సరే, ఆమెను వివాహమాడి యావజ్జీవితం కారాగృహంలో బంధిస్తాను-తండ్రీ కూతుళ్ళను."

"రాయా! వివాహమాడిన స్త్రీని మన్నించటం ఆర్యధర్మం. కలకంఠి కంట కన్నీరొలికిన ఇంట సిరి నిల్వదన్నారు పెద్దలు. నీవు చేయాల్సింది గజపతిని కించపరచటం కాదు, ఓఢ్ర పరిపాలనలో సతమత

మాతున్న ఆంధ్రదేశాన్ని స్వతంత్రం చేసి విజయనగరాంధ్ర సామ్రాజ్యంలో కలపటం కాని, గజపతి పుత్రికను క్షోభ పెట్టటం కాదు. అనంత పరాక్రమ సంపన్నుడవగు నిన్ను ఆమె మనసారా ప్రేమించింది. తండ్రి మాటను త్రోసి రాజని నీ మూర్తిని హృదయ పీఠం మీద ఆసీనమొనర్చి ఆరాధిస్తున్నదని వేగులు సమాచారం తీసుకొచ్చారు. ఆమెను వివాహమాడాలి నువ్వు. మన్నించాలి. వంశోద్ధారకుడైన, సార్వభౌమ లక్షణ లక్షితుడైన భావి సామ్రాట్టు మీ దంపతుల గర్భవాసాన జన్మించాలి" మహామంత్రి కర్తవ్యోపదేశం చేశాడు. రాయలు ఆమోదించాడు. నాటినుండీ విజయనగరంలో దండయాత్రా సన్నాహాలు ద్విగుణీకృతోత్సాహంతో సాగాయి.

నాటి ప్రాతఃకాలాన విజయనగరమంతా బ్రహ్మాండంగా అలంకరించబడింది. ప్రజలలోనూ, సైన్యంలోనూ సమరోత్సాహం వెల్లివిరిసింది. దేవతా ప్రీత్యర్థం విజయనగర దేవాలయాలలో అర్చకులు ఆరాధనలు సాగిస్తూ ఋక్కులను పల్లిస్తున్నారు. రాయలవారు తుంగభద్రలో స్నానమాడి, కుమ్మై హజారా రామాలయంలో దేవతార్చన చేసి, కులదైవమైన వరాహమూర్తిని పూజించి, ఉగ్ర నరసింహుని దర్శనం కావించుకొని అంతఃపురం చేరి వీరోచితమైన వేష భూషణలతో అలంకరించుకొని, సాలంకృతమగు పట్టపు టేనుగునెక్కి కోట ప్రధాన ద్వారం సమీపించారు. అక్కడ చేరి ఉన్న మంత్రి సామంత దండనాథులు, రథ గజ తురగ పదాతి దళములు, మహారాజునకు వీడ్కోలు చెప్పవొచ్చిన విజయనగర సామ్రాజ్య పౌరులు మహారాజును చూడటంతోనే జయజయ ధ్వానాలు గావించారు. తిమ్మరుసు మహామంత్రి ఈ దండయాత్రకు తానే స్వయంగా ఆధ్వర్యం వహించాడు మహామంత్రి ఎదురేగి మహారాజును సంభావించి, ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నాడు. ఇంతలో గవిని మీద ఉన్న రణభేరి ధణ ధణ ధణ ధణమని చండప్రచండంగా మ్రోగింది "ఆంధ్ర సామ్రాజ్యలక్ష్మీ విజయీభవ, విజయనగరసామ్రాజ్య రమాహృదయేశ్వరా జయీభవ, రాజాధి రాజ రాజపరమేశ్వరా విజయీభవ, మూరురాయరగండ జగనొబ్బగండ శ్రీశ్రీశ్రీ కృష్ణరాయ భూపాలా



దిగ్విజయీభవ!" అనే నినాదముల మధ్య సేనావాహిని పూర్వాంధ్ర దండయాత్రకు పురోగమించింది.

ఎనిమిది లక్షల కాల్బలంతోనూ, పదిహేడువందల గజబలంతోనూ, ముప్పైయ్యారువేల అశ్వికదళంతోనూ ఆ అపూర్వమైన ఆంధ్రసేనా సమూహం మహాసముద్రంలా ఉంది. ఈ బలాలు కాక, వీరి వినోదాల కొరకు ఆటగత్తెలు, దొమ్మరివాండ్రు, విప్ర వినోదులు అసంఖ్యాకంగా వారిని అనుసరిస్తున్నారు. దాసదాసీజనానికి లెఖ్ఖయేలేదు.

ఇక రాయలవారి వెంట ఆయన రాణివాసం, ఆయన కత్యంత ప్రీతిపాత్రులు, మహాకవి పండితశ్రేష్ఠులు అయిన అష్టదిగ్గజాలు ఉన్నారు.

అది చూపరులకు దండయాత్రవలె కనుపించలేదు: కదులుతున్న మహాపట్నాన్ని పోలిఉంది.

కతిపయ దినాల్లో ఆ అనంత ఆంధ్రసేనావాహిని ఉదయగిరి చేరుకుంది. అది దుర్భేద్యమయిన గిరిదుర్గం. గజపతికి ఉన్న బలిష్ఠమైన కోటలలో అది ముఖ్యమైంది. కోటను సమీపించే మార్గం దుర్గమం: రాయలవారు పదునెనిమిది మాసాలు ఆ దుర్గాన్ని ముట్టడించినా ప్రయోజనం లేకపోయింది. ఆ తరువాత ఒకనాటి సంధ్యాసమయాన తిమ్మరుసు మంత్రి కాకతాళీయంగా కోటలోనికి పోతున్న ఒక గొల్లపడుచు ననుసరించి ఒక సన్నని మార్గాన్ని కనుకున్నాడు. ఆ నాటి రాత్రి ఆంధ్రసేనావాహిని మహత్తర కృషిచేసి తెల్లవారేసరికి పది ఏనుగులు నడిచిపోగలిగినంత విశాలమైన బాటను నిర్మించింది.

ప్రాతఃకాలంలో కోటద్వారాలకు ఆంధ్ర గజాదళాలు తమ కుంభస్థలాలను మోటించి ఘీంకరించాయి. మధ్యాహ్నమయ్యే సరికి సింహద్వారం కూలిపోయింది. ఆంధ్రసైన్యం ఉదయగిరిని ఆక్రమించింది. గజపతిమామ, దుర్గాధ్యక్షుడూ అయిన తిరుమల కాంతరాయుడు బందీగా చిక్కారు. ఉదయగిరి కోటమీద ఆంధ్రపతాకం నాట్యం చేసింది.

ఆ తరువాత రాయలవారికి విజయం కరతలామలకమై పోయింది- ప్రతి యుద్ధం లోనూ.

రాయలవారి కసలు యుద్ధం చేసినట్లే లేదు. గజపతి దుర్గములను

సాధించటానికి మహామంత్రి వింత వింత మార్గము లవలంబించ సాగాడు. ఆయన సైన్యమును రెండు మూడు భాగములుగా విభజిస్తాడు. ప్రతి సైన్య విభాగం ఒక్కొక్క కోటను ముట్టడిస్తుంది. అంతటితో ఆ కోటలోనికి రాకపోకలు ఆగిపోతాయి. లోపలి వారికి ఆహార ధాన్యాల కొరత క్రమక్రమంగా పెరుగుతుంటుంది. ప్రజలలో లేమివల్ల అసంతృప్తి ప్రబలుతుంది. ఒక కోటలోని శత్రు సైన్యానికి- మరొక కోటలోని వారు సహాయం చేసే అవకాశం లేదు. ఇలా నెలలు గడుస్తాయి, ఏదో ఒకరోజున సుముహూర్త మస్తంటూ మహామంత్రి రణభేరీ వాయింపిస్తాడు. మిగిలిన రెండు భాగాల సైన్యంలోని మూడు వంతుల బలాలు ఆనాటికి మహామంత్రి ఆజ్ఞాబద్ధంగా, రహస్యంగా అక్కడికి చేరుకుంటాయి. ఆ అనంతమైన సేనావాహినికి ముందు పేరు మోసిన విజయనగర గజదళం పురోగమిస్తుంది. కోట సింహద్వారం బ్రద్దలు కొట్టటానికి మహామంత్రి గజ బలాన్నే వినియోగిస్తాడు. ఆ మత్తగజేంద్రాలు తమ కుంభస్థలాలతో దుర్గ ద్వారాలను క్రుమ్ముతుంటే, వాటి ఘీంకారాలతో భూన భోంతరాళాలు దద్దరిల్లి నట్లుంటుంది. శత్రు జన భయంకరంగా, కుంభస్థలాలనుకున్న ఇనుప కవచాలు- సింహద్వారపు ఇనుప గుబ్బల ప్రతిఘటనకు పగిలి, చర్మం చితికి, నెత్తురు ధారాపాతంగా ప్రవహిస్తున్నా పట్టు విడువని మేటి జాతివి ఆ గంధగజాలు, ఎంతటి బలమైన సింహద్వారమైనా వాటి ధాటికి లొంగిపోవలసిందే. సింహద్వారం ఫెళఫెళారావాలతో కూలటం ఆలస్యం — అశ్వికదళం ఛెంగున ముందుకు దూకుతుంది; ఆ వెంట రథ దళం.... దుర్గంలోకి చొచ్చుకొని వెళ్తాయి. కాల్బలాలు సాధారణంగా దుర్గాగ్రాలపైనుండి అశ్విక గజ దళాలను చీకాకు పరుస్తున్న శత్రు సైన్య ప్రభావాన్ని తమ వాడి తూపులతో నిరోధిస్తుంటాయి. ఆ తరువాత సింహద్వారం పతనానంతరం దుర్గాక్రమణలోనూ, అంతఃపురాక్రమణలోనూ, ఖజానాను పట్టుకోవటంలోనూ కాల్బలానికి సాటివచ్చే బలంలేదు. మహామంత్రి సర్వజ్ఞుడు. ఆయనకు ఏ పని ఏ దళం సాధిస్తుందో స్పష్టంగా తెలుసు. ఆయన వ్యూహ రచనా ప్రభావానికి ఉదయగిరి, అద్దంకి, అమ్మనబ్రోలు, నాగార్జునకొండ, బెల్లం



కొండ మొదలయిన గజపతుల బలిష్ఠమైన దుర్గాలన్నీ పతనమైపోయాయి. ఆంధ్ర సైనికులు విజయోత్సాహంతో కటకం వైపు పురోగమిస్తున్నారు. ఓడిపోయిన దుర్గాధిపతులందరూ రహస్య మార్గాల ద్వారా ప్రాణాలు దక్కించుకొని, మిగిలిన సేవక పరిజనులతో కటకేశ్వరుని వద్దకు పరుగులు తీశారు.

తన దుర్గాలన్నీ పతనమయి పోవటం, సామంత రాజులు ప్రాణాలు అరచేతిలో నుంచుకుని పరుగులు తీయటం విని కటకేశ్వరుడైన ప్రతాపరుద్ర గజపతి 4300 ఏనుగులతోనూ, 20000 గుర్రాలతోనూ ఓఢ్రం నుండి బయలుదేరి కృష్ణానదికి ఉత్తరాన విజయవాడ వద్ద బ్రహ్మాండమయిన సమర సన్నాహాలతో విడిది చేశారు. ఈ వార్త విని రాయలు తన సేనలతో వేగిరంగా తరలివొచ్చి కృష్ణకు దక్షిణ తీరాన విడిశారు. ఇరుపక్షాల వారూ కొంత కాలం బలా బలాలు పరిశీలించుకుంటూ కూర్చున్నారు. చివరకు రాయలవారు గజపతిని- రెండు మైళ్ళు వెను దిరిగి తాము నదినిదాటి యుద్ధం చేయటానికి అవకాశం ఇవ్వమనీ, లేకపోతే తాము రెండు మైళ్ళు జరిగి వాటికి నదిని దాటి రావటానికి అవకాశం కల్పిస్తామనీ అనవసరంగా నదిలో యుద్ధం చేసి నష్టాలు కలిగించుకోవటం ఉభయులకు మంచిదికాదని కబురు పెట్టారు. కాని, గజపతి నుండి ఏ విధమైన సమాధానమూ రాకపోయే సరికి ఒకనాటి రాత్రి మూడవయామంలో తమవద్దనున్న గజాయూథముతో కృత్రిమమైన వంతెనను నిర్మించ వలసిందని మహామంత్రి గజ దళాధిపతికి అకస్మాత్తుగా ఉత్తరువులు జారీ చేశాడు. వెంటనే గజదళం బయలుదేరింది. ఒక ఏనుగు ప్రక్క మరొక ఏనుగు, కృష్ణానదీమ తల్లికి చూస్తుండగానే వారధి నిర్మింపబడింది. నాలుగో యామం ప్రారంభానికి, వెంటనే కాల్బలం అ వారధి మీద నదిని దాటటానికి అజ్ఞలు ఇవ్వబడ్డాయి.

ఇంకేముంది? తెల్లవారే సరికి సర్వ నాశనం. గజపతి గుడారాలు పీనుగు కుప్పలతో నిండిపోయాయి. వెయ్యి ఏనుగులూ, పది వేల అశ్వాలూ అతి సులభంగా విజయనగరానికి లభించాయి. కటకాధీశ్వరుల నుండి, కట

రేశ్వరుడు ప్రాణాల కోసం పరుగులు తీస్తూ, కటకం చేరే వరకూ తిరిగి చూళ్లేదు.

ఆ తరువాత రాయలవారు కొండవీడు, కొండపల్లి, రాజమహేంద్రవరం, పొట్నూరు మొదలైన దుర్గములను జయించారు. ఇక మిగిలింది. కటకం, ఓఢ్ర గజపతి రాజధాని.

కృష్ణరాయల విజయ పరంపర కటకాధీశుణ్ణి జాగ్రదవస్థకు తీసుకుని వచ్చింది. అతని కిప్పుడు రాజ్యం కన్నా ఆత్మ వంశ గౌరవ పరిరక్షణ ముఖ్యంగా కనిపించింది. తానోడితే తన కుమార్తెను రాయలు బలవంతంగానైనా పరిగ్రహిస్తాడనే విషయం గజపతికి తెలుసు. అందుకోసం బంధుకోటికి, సామంతులకు లేఖలద్వారా సందేశాలు పంపి, క్షణాలమీద ససైన్యంగా కటకానికి పిలిపించాడు. గజపతి సామంతులు, పదహారుగురు పాత్రులు తమ అపారసురక్షిత సేనావాహినులతో మహానది వొడ్డున గుడారాలు నిర్మించుకొని రాయల రాకకొరకు ఎదురు చూస్తున్నారు. గజపతికి తన సామంత రాజన్యుల సేనావాహినిని చూడటంతోనే అపారమైన ఆత్మవిశ్వాసం లభించింది. ఆంధ్రసైన్యాలు కటకాన్ని ముట్టడించాలంటే ముందు శతసహస్రాధికమైన సామంతరాజ సైన్యాన్ని ఎదుర్కోవాలి. వారిని జయించి మహానదిని దాటాలి. ఆ నదికి గజపతి స్వంత సేనలు రేబవళ్ళు కాపలా కాస్తుంటాయి. వారి నిరోధాన్ని అతిక్రమించి నదిని దాటగానే గజపతుల చతురంగ బలాలను ఎదుర్కోవాలి. ఆ తరువాత కాని ముట్టడి సాధ్యంకాదు. అసంభవాలు సంభవాలు కావటానికి దశాబ్దాలు కాదు, శతాబ్దాలు పడతాయి- ఎంతటి సుశిక్షితమైన ఆంధ్ర సైన్యానికైనా అనుకున్నాడు గజపతి.

ఇక ఆంధ్ర సైన్యాల సంగతి. విజయపరంపరను నిర్విరామంగా సాధిస్తున్నా, నిరంతర పోరాట ఫలితంగా, ఆంధ్ర సైన్యాలు క్రమంగా సంఖ్యలో క్షీణించిపోయాయి. విజయ గర్వాన అతిశయించిన ఆత్మబలం తప్ప విజయనగర సేనలలో అసలు బలం అడుగంట సాగింది. ఈ విషయాన్ని గ్రహించింది మహామంత్రి మాత్రమే. కృష్ణరాయలకు దండయాత్ర బొమ్మలాట లాగుంది అతని మనస్సులో తుక్కాదేవిని వివాహ



మాడాలన్న కసి విపరీతంగా వ్రేళ్ళు నాటుకుంది. ఆ కసి అతనిలోని వాస్తవ పరిశోధనా దృష్టిని అణచివేసింది. మహామంత్రి ఎంతగా నచ్చచెప్పినా రాజు మనస్సు పురోగమనాన్నే వాంఛించింది. మహామంత్రి చేసేదిలేక విజయనగరానికి అదనపు సేనలకోసం కబురుపంపి, కటకాన్ని సమీపించటానికి అజ్ఞ ఇచ్చాడు ఆంధ్ర సేనావాహినికి. కతిపయ దినాలలో ఆంధ్ర సేన కటకానికి పదిమైళ్ళ దూరాన మహానదికి ఈవల ఉన్న చిట్టడవిలో విడిసింది. రాజు వెంటనే యుద్ధాన్ని ప్రకటించమంటాడు. మంత్రి జాగువేయమంటాడు. చివరకు రాజుమాటే నెగ్గింది. మహారాజు ముద్దు చెల్లించటం మహామంత్రికొక సరదా, దానివల్ల ప్రమాదం వొస్తుందని తెలిసినా, ఆ విషయం మహారాజు కనుభవపూర్వకంగా అవగాహన కావాలని మహామంత్రి ఉద్దేశ్యం. అయితే, రాజుకు అందువల్ల ఏదైనా ప్రమాదం సంభవిస్తే, దాన్ని తన బుద్ధి విశేషమున క్షణ మాత్రంలో అంతం చేయగలనన్న ఆత్మవిశ్వాసం మహామంత్రి కుంది. పాత్రుల సైన్యాని కల్లంత దూరాన ఆంధ్ర సైన్యాలు విడిశాయి. కాని, యుద్ధం మాత్రం ప్రకటించలేదు.

ఆ మరునాడు రావాల్సిన ఆహార పదార్థాలు రాకపోవటంతో ఆంధ్ర సైన్యంలో కల్లోలం బయలుదేరింది. ఆలోచనా శిబిరంలో ఉన్న రాజుకు మంత్రికీ ఈ విషయం కొన్ని క్షణాలలో తెలిసిపోయింది. మంత్రి రాజు వంక తీక్షణంగా చూస్తూ "రాయా! చూశావా, పాత్రులు మన చుట్టూ చక్రబంధాన్ని ప్రయోగించారు! మన సైన్యాలు తిండికి లేకుండా మలమలా మాడిపోవాలి. నీ ముద్దు ముచ్చటలు తీర్చటానికి ఈ పురోగమనానికి అనుమతించాను. దాని ఫలితం మహా ఘోరంగా పరిణమిస్తుందని తెలిసి ఉండికూడా, చూడు ఈ నాడు నీ ఆంధ్ర సైనికులు "అన్నమో రామచంద్రా!" అని అలమటిస్తూ దిక్కులేక నిస్త్రాణతో మలమలా మాడి చావాలి. శత్రువుల నెదుర్కొందా మంటే ఉన్న బలం చాలదు. అదనపు బలాలు రావటానికి పదిహేను రోజులన్నా పడుతుంది" అన్నాడు.

మహామంత్రి మాటలు వింటుంటే మహారాజుకు కళ్ళ వెంట గిరగిరా నీళ్ళు తిరిగాయి. అప్పుడర్థమైంది- తన కోరిక ఎంత ఉపద్రవాన్ని

తెచ్చి పెట్టిందో, ఎంత అసంబద్ధంగా పరిణమించిందో. "నన్ను క్షమించండి. అర్థం లేని ఆవేశం నా ఆలోచనను అణచి వేసింది. నా కొరకు కాకపోయినా, అమాయక ఆంధ్ర సైన్యాల కొరకైనా తరణోపాయాన్ని ఆలోచించండి అప్పాజీ...." అంటూ వ్యథ చెందుతున్న మహారాజును చూచి మహామంత్రి "అర్థం లేని ఆవేశం అనర్థాలకు దారి తీస్తుంది...." ఆలోచనా నిమగ్నుడయ్యాడు.

పది క్షణాలు గడిచిపోయాయి. మహామంత్రి కంఠం ధ్వనించింది. "ఎవరక్కడ?"

సేవకుడు సవినయంగా నిష్క్రమించాడు. మరో పది క్షణాల్లో లేఖకుడు ప్రవేశించాడు. మహామంత్రి లేఖ చెప్పటం ప్రారంభించాడు :

శ్రీ శ్రీ శ్రీ ఓఢ్ర గజపతుల సామంత మండలేశ్వరులగు ప్రహరేశ్వరపాత్రులకు—విజయనగర సామ్రాజ్యాధీశ్వర, ఆంధ్ర రాజ్య రమా హృదయేశ్వర, రాజాధిరాజ, రాజ పరమేశ్వర, మూరురాయరగండ జగనొబ్బగండ శ్రీ శ్రీ శ్రీ కృష్ణరాయ సార్వభౌములు వ్రాయునది —

ఉభయ కుశలోపరి. గతరాత్రి మా ఆలోచనా శిబిరమున జరిగిన మన సమిష్టి సమావేశ నిర్ణయముల ననుసరించి_

కృష్ణరాయలకీ లేఖోదంతమర్థం కాలేదు. "సమిష్టి సమావేశమా? ఎప్పుడు జరిగింది అప్పాజీ!...." అంటూ ఆశ్చర్యపోయాడు మహారాజు.

"జరిగిందిలే రాయా! నీకు తెలియదు" మహామంత్రి ఛాయా మాత్రంగా నవ్వుతూ ప్రత్యుత్తరం చెప్పాడు. మహారాజు కింకా అవగాహన అయినట్లు లేదు.

"రాయా! ఇవి రాజకీయాలు; వీటి తీరే అంత."

రాయలింకేమీ మాట్లాడలేదు. మహామంత్రి లేఖను చెప్పుట కుపక్రమించాడు :

రేపు ప్రాతః కాలమున మేము మహానది నధిగమించగలం. ఆ సమయమునకు మీరు మిగిలిన మీ పదునైదుగురు పాత్రులతో కూడి కలసి గజపతి రాజేంద్రుని బంధించి మాకప్పగించి, మమ్ము ఓఢ్ర సింహాసనాసీనులను చేసి మీ వాగ్దానములు మీరు నిలబెట్టుకొనగలరు. కటక సింహ



పీఠి నలంకరించిన వెంటనే మీకు మేమన్న మాట ప్రకారం సంపూర్ణమగు స్వేచ్ఛ ప్రసాదింపగలవారం.

మన మైత్రీ చిహ్నంగా ఈ చందనపు పేటికలోని అమూల్య రత్నహారముల గైకొని మమ్మానందింప జేయగలరు.

ఇట్లు
రాజాధి రాజ, రాజ పరమేశ్వర,
మూరురాయరగండ,
జగనొబ్బగండ
శ్రీ శ్రీ శ్రీ
శ్రీకృష్ణదేవరాయలు."

"లేఖాంతమున రాజ ముద్రికను ముద్రింపుడు, అంతేగాక మిగిలిన పదిహేనుగురు పాత్రుల పేరుతోనూ ఇట్టివే పదునేను లేఖలు సృష్టింపుడు." మహామంత్రి ఆజ్ఞమేరకు లేఖకుడు తన సృష్టి కార్యము ప్రారంభించాడు. ఇంతలో కనుసన్నసే పదునారు చందనపు పెట్టెలు రాజ శిబిరంనుండి కొని తేబడ్డాయి. వాటి వాహకులు చారవిద్యలో ఆరితేరిన పదునార్గురు ఘటికులు. రాయలిదంతా ఆశ్చర్యంతో చూస్తున్నాడు. ఇంతలో "రాయా! నీ అమూల్యాభరణాలన్నీ అక్కడ కుప్పవెయ్యి." అని పరచి ఉన్న ఒక తివాచీని చూపించాడు మహామంత్రి. అంతే కాకుండా సామంతుల వద్ద నుండి క్షణాల మీద వారి వద్దనున్న అమూల్యాభరణాలన్నీ వొలిపించి తెప్పించాడు. అవన్నీ పదహారు పెట్టెలలోనూ సర్దబడ్డాయి. ఆ రాత్రి సరిగ్గా ప్రథమ యామాంతాన పదునార్గురు సేవకులు మహామంత్రి నిర్ణయాన్ననుసరించి, గజపతి స్వంత భటులు కాపుదల కాస్తున్న మహానదీ తీరానికి అభిముఖంగా బయలుదేరారు. రాయలవారి కళ్ళకు ఆ దృశ్యం అంతా ఒక కలలాగా గడిచిపోయింది.

ఆ రాత్రి గడిచి తెల్లవారింది. రాయలవారు ప్రాతఃకాలాన్నే నిద్ర లేచి, స్నానం చేసి, సంధ్యావందనాదికా లాచరించి, శిబిరం నుండి వెలికి

వొచ్చి వాహ్యాళికి బయలుదేరారు. సచివోత్తముడైన అప్పాజీ అనతి దూరంలో రాయలవారిని కలుసుకున్నారు. కొంత దూరం నడక సాగిన తర్వాత రాయలు అప్పాజీ వంక తిరిగి – "నిన్న మీ ప్రవర్తన చాలా ఆశ్చర్యంగా కనిపించిందప్పాజీ! దాని వివరాలూ, ఫలితాలూ వివరించండి" అని అడిగారు.

అప్పాజీ చిరునవ్వు నవ్వుతూ – "రాయా! ఆ వంక చూడు...." అంటూ చేయి చూపించాడు.

రాయలు తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. ఒక్క క్షణం నిశ్చేష్టుడయ్యాడు మహారాజు. నోట మాట రాలేదు. దృష్టి మార్పలేదు. ఆశ్చర్యమూ, సంతోషమూ, ఉత్సాహమూ ఒక్కసారిగా ఆయన దృష్టిలో మేళవించాయి "అప్పాజీ!...." అంటూ ఆనంద బాష్పాలు రాలుస్తూ మహామంత్రి చరణయుగ్మాల మీద మోకరించి సాష్టాంగ ప్రణామం కావించాడు మహారాజు. మహామంత్రి పుత్రవాత్సల్యంతో మహారాజును లేవనెత్తి కౌగలించుకొని సమాశ్వాసించాడు.

మహారాజు చూచిన దృశ్యం నిజానికి అసాధారణమైంది. మహామంత్రి చూపమన్నవైపు రాజు దృష్టి మళ్ళగానే ఎదురుగా, ఇన్నాళ్ళుగా విడిదిచేసి ఉన్న పాత్రుల శిబిరాలు కళావిహీనంగా, అరక్షితంగా కనిపించాయ్. శత సహస్రాధిక లక్షాధి కృతజన వ్రాతపాలితమైన ఆ ప్రదేశం ఎడారిలా మారిపోయి నిర్జనంగా ఉంది. ఆ తరువాత రాయల దృష్టి మరొక కోణానికి మళ్ళింది! మహానది కావలి గట్టున యుద్ధ సన్నద్ధమై, రేబవళ్ళు కావలి కాస్తుండే గజపతుల చతురంగ బలాలు అక్కడ లేవు. ఆ పైన మహారాజు దృష్టి కటకపు కోట మీదికి ప్రసరించింది. చుక్కల చుంబించే ఆ కోట ధ్వజస్తంభం మీద నిన్నటివరకూ ఎగురుతున్న గజపతుల విజయపతాకం అదృశ్యమై, ఆ స్థానంలో సంధిని కోరుతూ శ్వేతపతాకం ఎగురుతున్నది. ఎంతలో ఎంత మార్పు! ఒక్క రాత్రిలో ఒక్క నెత్తురుబొట్టు చిందకుండా, ఒక మహాసామ్రాజ్యం అంతరిస్తూ, వేరొక సామ్రాజ్యపు సార్వభౌమాత్యాన్ని అంగీకరించటానికి సిద్ధపడ్డదన్న మాట.



"అసలు జరిగిన విషయమేమిటంటే, మహామంత్రి చేత నియుక్తులయిన చారులు సేవకుల వేషంలో కావాలని పోయి గజపతి భటులకు పట్టుబడ్డారు. తనుతమ చందన పేటికలతో, వాటిలోని లేఖలతో అమూల్య మణిమయాభరణాలతో సహా, సహజంగా ఆ సేవకులు గజపతి వద్దకు తీసుకు వెళ్ళబడ్డారు. గజపతి ఆ లేఖలను చూచి మండిపడ్డాడు. తన పాత్రులే తనకు ద్రోహం చేస్తే తాను చేయగలిగిందేమిటి? కంచే చేను మేస్తే వేరే దిక్కేమిటి? గజపతి తన పరిస్థితి చాల ప్రమాదకరంగా ఉందనుకున్నారు. ఆత్మీయులచేత బంధింపబడటం కన్నా, తానే రాయలకు లొంగిపోవటం ఉత్తమమనే నిర్ణయానికి వచ్చాడు- కటక సామ్రాట్. కాని, తనవారు తనకు తలపెట్టిన ద్రోహానికి మాత్రం ఆయనకు చాలా బాధగా ఉంది. అందుకని అత్యవసరాలోచనా సమావేశమనే మిషతో సామంత పాత్రులనందరినీ క్షణాల మీద పిలిపించాడు. నిముషాల మీద నరికించాడు. ఆవేశానికి, రుధిరదాహానికి ఆ విధంగా తృప్తి లభించిన తరువాత ఇక జన నష్టం అనవసరమనే ఉద్దేశంతో రాత్రికి రాత్రి పాత్రుల సైన్యాన్ని మహానది దాటి వెనుకకు రావలసిందిగా ప్రధాన యుద్ధాధికారిని ఆదేశించాడు. ఆ తరువాత స్వంత సైన్యాన్ని కూడా ఉపసంహరించి కోట బురుజు మీద సంధి సూచకంగా తెల్ల జండా ఎగుర వేయించాడు." మహామంత్రి ఊహించి చెప్పుకుపోతున్నాడు, రాజు కంతా ఒక దివ్య స్వప్నంలా గుంది

"రాయా! పద. శిబిరానికి వెళ్దాం. బహుశః గజపతి వద్దనుండి రాయబారులు వొచ్చి ఉంటారీపాటికి...." మంత్రి శిబిరానికి దారితీశాడు. రాజు ఆనంద పారవశ్యంతో అప్పాజీని అనుసరించాడు. శిబిరం ప్రవేశించటంతోటే మహామంత్రి అప్పాజీ వారికి లభించిన దివ్యదృష్టి ఏ పూర్వ జన్మ పుణ్య ఫలితమో అనుకున్నాడు ఎదురుగా ఉన్న గజపతి రాయబారులను చూచి కృష్ణరాయ భూపాలుడు.

రాయబారులు రాజు పక్షాన మహామంత్రి విధించిన షరతులన్నిటికి వొప్పుకున్నారు, సంధి ఫలితంగా గజపతి పాలితమైన ఆంధ్రదేశమంతా శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు విజయనగర సామ్రాజ్యంలో అంత

ర్భాగమైపోయింది. అంతే కాకుండా కృష్ణరాయలవారి పూర్వ దిగ్విజయ యాత్రకైన ఖర్చంతా గజపతి స్వంతఖజానానుండి భరించాడు. పైపెచ్చు కులహీనుడనీ, దాసీపుత్రుడనీ ఏ రాయలను దూషించాడో, ఆ రాయల పాద పద్మాలనే బంగరు పళ్ళెరంలో కడిగి, అత్యంత శోభాయమానంగా వివాహం చేశాడు గజపతి. పెళ్ళయిన వెంటనే మహారాజు కోరిక ననుసరించి మహామంత్రి తుక్కాదేవి పేరును వైష్ణవ శైవమత సామరస్య చిహ్నంగా అన్నపూర్ణాదేవిగా మార్చివేశాడు. ఆమె నేటి ఆంధ్ర సార్వభౌముని ప్రణయ సామ్రాజ్యలక్ష్మి అన్నపూర్ణాదేవి. రాయలవారు తన ప్రణయిని అయిన చిన్నాదేవి పేరుతో అన్నపూర్ణాదేవిని అప్పుడప్పుడు పిలుస్తుండటం వల్లనే కావొచ్చు. కొందరు చరిత్రకారులు చిన్నాదేవికి-అన్నపూర్ణాదేవికి, తుక్కాదేవికి అభేదాన్ని పాటించారు.

## 3

**అ**న్నపూర్ణాదేవికి ప్రణయ కలహం నాటినుంచీ మనసు మనసులోలేదు.

ప్రియ పురుషుని వియోగం ఆమెకు దుర్భరంగా పరిణమించింది. నిజానికి తెలిసి చేసిన తప్పుకాదు. కాని, తప్పు తప్పే. మహారాజు మహారాణిని చూడటానికి కూడా రావటం మానేశాడు. ప్రేమైక హృదయిని అయిన మహారాణి నానాటికి విరహ జ్వాలలలో దహించివేయబడుచున్నది. పశ్చాత్తాపం ఆమె హృదయానికి శాంతిని ప్రసాదించకపోగా, అగ్నిపాలిటికి ఆజ్యధారగా మారింది. మహారాణి బాధ అనిర్వచనీయం.

ఆనాటి సాయంకాలం అన్నపూర్ణాదేవి ఉద్యానవనానికి బయలుదేరింది. ఆమెకు ఆమెకు ప్రతి పువ్వు తన్ను వెక్కిరిస్తున్నట్లుగానే తోచింది. ప్రతి లతానికుంజమూ ఆమె ప్రవేశాన్ని వొద్దువొద్దంటున్నట్లుంది ప్రతి గువ్వల జంటా ఒంటరిగా వొస్తున్న ఆమెను వింతగా చూస్తున్నట్లనిపిస్తున్నది. కోయిల కూతలో భేదం లేకపోయినా, శబ్దం భేదించి తన్ను ఎగతాళి చేస్తున్నట్లనిపిస్తున్నది మహారాణికి. మహారాణి



ఒక చంద్రకాంత శిలా వేదిక మీద ఆసీనురాలయింది. చల్లని ఆ వేదిక ఆమెకు మదన తాపాన్ని కలిగించసాగింది. ఆమె కళ్ళవెంట అప్రయత్నంగా రెండు కన్నీటి బొట్లు జలజలా రాలాయి.

రాబోదు రాబోదు నాదు హృదయేశ్వరుడు
రహిపుట్టగా నన్ను లాలింపగాబోడు
కమనీయమౌ రూపు కనుపింపదికమీద
రాజపరమేశ్వరుడు రాబోడు నా వంక
విరిగి పోయిన కొమ్మ ఎండి పోతుంది
తృంచి వేసిన పువ్వు వాడి పోతుంది
గతమంత మధురమౌ గాథ ఔతుంది
వెతలతో భవితవ్య మంతరిస్తుంది

మహారాణి హృదయావేదన మధురసంగీతరూపం ధరించింది. వకుళ కంఠస్వరం ఆమె పాటకు అవరోధం కలిగించింది.

"మహారాణీ! మనస్సు పాడుచేసుకోకండమ్మా" అంది వకుళ,

"మరులు గొలిపే మహారాజు మన్నించటం మానివేసిన నాడే మనస్సు పాడైపోయిందే!" అన్నది తీవ్ర వేదనా ప్రకంపిత స్వరంతో. "కన్ను మిన్ను కానని అహంకారంతో, కట్టుకున్న భర్తను అవమానించిన అతివకు మనస్సనేది ఉందటే పాడుచేసుకోవటానికి?"

మహారాణి ధోరణి వకుళకు చాల ఆందోళనకరంగా ఉంది. ఆమె మాటల్లో పశ్చాత్తాపోద్రేకంలో జన్మించిన ఉన్మాదపు ఛాయలు గోచరించాయి.

"అమ్మా? అలా అంటూ ఆ విషయాన్నే ఆలోచిస్తుంటే, హృదయంలోని గాయం మానకపోగా శలలు వేస్తుంది. మహారాజు మనస్సు మారేవరకూ—"

"మహారాజు మనస్సు మారదే! నేను చేసిన అపచారం అలాంటిది. నా పూర్వజన్మ సుకృతం ఇలాంటిది." నిస్పృహ ధ్వనించింది మహారాణి స్వరంలో. వకుళ మహారాజు మనస్సు మార్చగల సాధనా విశేషం కోసం అన్వేషించ సాగింది.

"అమ్మా! మహారాజు మహామంత్రి అప్పాజీవారి మాటను ఆజ్ఞగా స్వీకరిస్తారు. ఒక్కసారి మహామంత్రులను ఇక్కడకు తీసుకు రమ్మంటారా?"

"లాభం లేదే!"

"అదేమిటమ్మా అలా అంటారు? మహారాజు అప్పాజీవారి ఆజ్ఞాబద్ధులు కదమ్మా? వారి మాటను తిరస్కరిస్తారా- ఏ పరిస్థితిలో అయినా?"

వకుళ ప్రశ్న మహారాణికి పూర్వ స్మృతిని కలుగజేసింది. అవును. ఆనాడు తన శోభనం. తన్ను తన దాసదాసీజనం పన్నీట స్నానమాడించారు. నిలువుటద్దం ముందు కూర్చుండబెట్టి, ఏడు వారాల నగలతో మనోహరంగా, జగన్మోహనంగా అలంకరించారు. చివరకి తన శోభనపు గదిలోకి ప్రవేశిస్తుండగా తల్లితండ్రులు విడిగా అభ్యంతర మందిరంలోకి తీసుకుని వెళ్ళి ఛురిక కట్టిన మొల నూలితో తన కటి ప్రదేశాన్ని అలంకరించారు. తాను ఇదెందుకంది అమాయకంగా. తన కోసం తన వంశ గౌరవ ప్రతిష్ఠలు నిలబెట్టి తన శీలాన్ని ఒక దాసీ పుత్రుడి పశుప్రవృత్తి నుండి కాపాడుకోవటం కోసం కట్టిన రక్షరేఖగా నిర్వచించారు తన తల్లితండ్రులు. తండ్రి తన్ను ఆ ఛురికతో రాయల రక్తాన్ని చవిచూడమని బ్రతిమిలాడాడు; ప్రార్థించాడు; ఒప్పించటానికి ప్రయత్నించాడు. చివరకు ఆజ్ఞాపించాడు. తనకా కోరికా విపరీతంగా తోచసాగింది. వంశ గౌరవాదరాల కోసం కట్టుకున్న భర్త ప్రాణాలు తీయటం కన్నా వేరే ఘోరం లేదనిపించింది. వలవలా హృదయం పగిలి బద్దలయ్యేటట్లు ఏడ్చింది. కాని, అనుల్లంఘనీయమైన తన తండ్రి ఆజ్ఞకు కట్టుబడి ఇష్టం లేకపోయినా, వంశ గౌరవ సంరక్షణకు ఆ పాడు పని చేయటానికి ఒప్పుకుంది.

సాలంకృత అయిన తాను ఏడ్చి ఏడ్చి జేవురించిన కళ్ళతో చెలికత్తెలు సాగనంపుతుండగా అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని శోభనపు గదిలోకి ప్రవేశించింది. ప్రవేశించిన వెంటనే చెలులు తలుపులు బిగించి వెళ్ళిపోయారు.

మహారాజు నిశ్చింతగా మల్లెల దొంతుల మధ్యన హంసతూలిక



తల్పం మీద నిద్రపోతున్నాడు. తనను కాటందటానికి కాలనాగును పోలిన కాల పాశంలా తను కట్టుకున్న అందాలరాసి ఛురిక ధరించి శోభన గృహ ప్రవేశం చేస్తుందని ఆయనకు తెలియదు పాపం. తాను ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తూ భర్తను సమీపించింది. ఒక్కసారి పరాక్రమం మూర్తీభవించిన ఆ దివ్య మంగళ విగ్రహాన్ని చూడాలనిపించింది తనకు. కాని, క్షణం మాత్రంలో అస్తమించబోయే భర్తను చూడకుండా ఉండటమే మేలనిపించింది. మరొక్క క్షణంలో అతనెవరో, తానెవరో .... ఆంధ్ర దేశం యావత్తూ తన్ను బ్రహ్మరాక్షసిలా పరిగణిస్తుంది. తన్ను మహారాజును పొట్టపెట్టుకున్న నారీ పిశాచం అని దుమ్మెత్తి పోస్తుంది. అయితే ఏం —తమ సామ్రాజ్యాన్ని సర్వనాశనం చేసిన నర రూప రాక్షసుణ్ణి రక్త పిపాసిని అంతం చేసిన మహిషాసుర మర్దనిలా తనను ఓఢ్ర ప్రజ సంభావిస్తుంది. దేశం కోసం తన స్వంత భర్త ప్రాణాలను స్వహస్తాలతో హరించిన మహాత్యాగమూర్తిగా తన పేరు ఓఢ్ర దేశంలో శాశ్వతంగా నిలిచిపోతుంది. తండ్రి నూరి పోసిన పాఠం క్రమక్రమంగా తన తల కెక్కింది. మానవత్వాన్ని కోల్పోయి, ఉన్మాదావస్థలో చెయ్యి పైకెత్తింది ఒర నుండి తీసిన ఛురికతో. ఒకసారి ఛురికవంక చూసింది. మిల మిలా మెరిసిపోతున్న ఆ ఛురిక తన చేతిలో గజగజ వణుకుతున్నది. ఛీ! పాడు ఆడజన్మ. ఆడవాళ్ళు సహజంగా అబల లెందుకు కావాలి అనుకుంటూ మానసిక బలాన్ని కేంద్రీకరించుకుని, ఒక్కసారి శక్తినంతా భుజంలోకి క్రోడీకరించి, ఒక్క లిప్తలో భర్త శరీరంలోకి .... అబ్బ! ఎంత ఘోరం, తాను ఛురికను బయటకు లాగింది. "ఈ దుర్మార్గాన్ని చేసింది అన్నపూర్ణేనా?" అని చూడటానికి పరుగెత్తుకొచ్చినట్లు వొచ్చింది రక్తం భర్త దేహం నుండి. రక్తపు దాగులతో తన వొళ్ళంతా అరుణవర్ణంగా మారిపోయింది.

కెవ్వున కేకవేసి, తాను భర్త శరీరం మీద తూలి పడిపోయింది స్పృహ లేకుండా. ఆ తరువాత చాలా కాలానికి తెలివి వొచ్చింది. భర్త శరీరంపై నిర్జీవంగా పడి ఉంది. తనలోని స్త్రీత్వం ఒక్కసారి పెల్లుబికింది. భర్త దేహం మీద పడి వలవలా ఏడ్చింది. ఇంతలో ఎదురుగా భర్త

ఆకారం నడిచి వొస్తున్నది. చనిపోయిన తన భర్త ప్రేతరూపం ధరించాడు. అబ్బ! తలుచుకుంటేనే గుండె ఝల్లుమంటుంది ఆ సన్నివేశాన్ని గురించి. అలా వొస్తున్న భర్తను తాను అచేతనంగా చూస్తున్నది. "ఛీ! పాతకీ! వంశానుక్రమంగా వొస్తున్న నీ సహజ నైచ్యాన్ని పోనిచ్చావు కావు. నీవు చంపానని కులుకుతున్నది నన్ను కాదు– అపూర్వ మేధా సంపన్నులూ, ఆగత అనాగతాలు తెలిసినవారూ అయిన మా అప్పాజీవారు సృష్టించిన ప్రతిరూపాన్ని. నీవు చేసిన ద్రోహానికి, ఆడదానివి కాబట్టి చంపకుండా విడిచాను. పో! నీవిక నా పత్నివి కావు, నేను నీకు భర్తను కాదు!" అన్నాడు మహారాజు మహా కోపంగా, భర్త మరణించ లేదన్న సంతోషంతో, తన గతి ఇలా పరిణమించిందే అన్న బాధతో అనేక విధాల తన ప్రవర్తనను మన్నించమని వేడుకుంది. కాని, మహారాజు అణుమాత్రమైనా సుముఖుడు కాలేదు. ఆ క్షణాన తన హృదయావేదనను అర్థం చేసుకొని, తన్ను పరిగ్రహించమనీ, పశ్చాత్తాపంతో పునీతమైన హృదయం పరమ పవిత్రంగా భర్త కంకిత మౌతుందనీ రాజు కాదేశించి ఆజ్ఞాపించి తన సంసారం నిలబెట్టిన మహానుభావుడు అప్పాజీ. నిజానికి అప్పాజీవారి కసాధ్యమైంది లేదు. కాని. ఆ అప్పాజీవారి సహాయం కోరాలంటే తనకు మొహం చెల్లటం లేదు. ఇన్నేళ్ళు వొచ్చిన తరువాత, ఇంత కాలం కాపురం చేసిన తరువాత భర్తను కాలితో తన్నానని ఏమని చెప్పుకుంటుంది – అందులో అప్పాజీ వారితో. మహారాణి మౌనంతో, అప్పాజీవారి సహాయాన్ని అర్థించటంలో ఆమెకున్న అయిష్టతను చదువ గలిగింది వకుళ.

"అమ్మా! పోనీ. వీరేంద్రుని సహాయాన్ని అర్థించకూడదా?"

వీరేంద్రుని ప్రస్తావన వింటే, మహారాణికి వొళ్ళు మండుతుంది.

"పోవే! వాడే నా సంసారంలో చిచ్చు పెట్టిన ఘాతకుడు. విన్న వరకూ అతని సలహా చాలు."

వకుళ కింకేమీ పాలుపోలేదు. మహారాణికి సహాయం చేయగలిగిన వారి జాబితాను మననం చేసుకుంటూంది వకుళ.

"అఁ–అమ్మా! మన నంది తిమ్మనగారిని తీసుకొనిరానా?"



రాణికి ఈ ఊహ సబబుగా తోచింది. నంది తిమ్మనగారు మహాకవి. ఆయన స్వస్థలం కృష్ణాతీరం. ఆ రోజుల్లో గజపతులు తీరస్థ ఆంధ్రదేశాన్ని పరిపాలించే కాలంలో నంది తిమ్మన గజపతుల ఆస్థాన కవీంద్రుడుగా ఉండేవాడు. గజపతి పుత్రికను రాయలవారు పెండ్లాడటంతో ఆమె వెంట అరణంగా విజయనగరానికి వొచ్చాడా మహాకవి. ఆయన రాయల సభాస్థలి నలంకరించిన అష్ట దిగ్గజములలో ఒకడు. ఈ ఊహ మహారాణి మనసుకు నచ్చింది. తన కంతకన్న ప్రస్తుతంలో సాధక బాధకాలు చెప్పుకునేందుకు మరెవ్వరూ లేరు. అదీ కాక, రాయలు నంది తిమ్మనగారి కవిత్వం అంటే చెవి కోసుకొని వింటాడు. వకుళ ఉద్దేశానికి మహారాణి సమ్మతించింది. వకుళ వెళ్ళి వార్త నందించిన అనతి కాలంలోనే నంది తిమ్మనార్యుడు అంతఃపురంలో అడుగు పెట్టాడు. మహారాణి మహాకవిని సాదరంగా అహ్వానించి సముచిత ఆసనంమీద అధిష్ఠింపజేసి సంభావించింది.

నంది తిమ్మనగారు సంసార సాగరమందున్న కష్టసుఖాలు తెలిసినవాడు. ఆమె ఏ విషయంలో తన్ను పిలిపించిందో ఆ విషయం వకుళ నుండి ముందుగానే సమగ్రంగా సేకరించాడు.

"అదేమిటమ్మా!–అంత పని ఎలా చేశావమ్మా? వకుళ చెప్పిందిలే!"

మహారాణీ వకుళ వంక ఒక్క– క్షణమాత్రం తీవ్రంగా చూచింది. కాని, మరుక్షణంలో, "అవును నా నోటి మీదుగా చెప్పించకుండా వకుళ సహకరించింది. ఎలాగూ చెప్పక తప్పదు కదా?" అనుకుంది.

"పొరపాటు జరిగింది మహాకవీ!"

"అవునులే. కావాలని ఎవరన్నా భర్తకు పాదతాడన సన్మానం చేస్తారేమిటి? అయినా, భార్యా భర్తల మధ్య అనేక చిలిపి విషయాలు జరుగుతుంటాయి. నీవొక వేళ ఆ పని చేశావే అనుకో. మహారాజు దాన్ని మరో విధంగా ఎందుకు తీసుకోవాలి, తల్లీ?" నంది తిమ్మన అనునయించటానికి ప్రయత్నించాడు.

"మీరు చెప్పిన సహృదయతే మహారాజులో ఉంటే, నాకీ బాధెందుకు మహాకవీ?" ఇసుమంత ఆధారం దొరికే సరికి ఆమె పశ్చాత్తాపం అంతరించగా, తప్పంతా మహారాజుపైకి త్రోయటానికి మహారాణి మనస్సు ఏమాత్రం వెనుకాడలేదు. "నన్ను ఏ విధంగానన్నా రక్షించండి, మహాకవీ.... నా రాజును మరల నాకప్పగించండి. ఎండిపోయిన నా జీవితాన్ని మరల వసంత శోభలతో చిగురింపజేయండి. మీ కసాధ్యమయింది లేదు; మీ కవితా ప్రతిభ సాధించలేనిదంటూ ఏదీ లేదు."

"అలాగేనమ్మా! సాధ్యమైనంతవరకూ ప్రయత్నిస్తాను...." అంటూ నంది తిమ్మన మహారాణి వద్ద సెలవు తీసుకొని అంతఃపురం నుండి నిర్గమించాడు.

# 4

మహారాజు సాహిత్యాభిమాని. సాహిత్యానికున్న విలువ సామ్రాజ్యంలో మరి ఏ ఇతరాలకు లేదు ఎవరైనా సరే, ఒక కమ్మని పద్యాన్ని చెప్పగలిగితే చాలు. దానిని రాయలవారికి వినిపించి అక్షర లక్షలు సంపాదించవచ్చు; లేకపోతే అగ్రహారాలు పరిగ్రహించవచ్చు.

రాయలవారికి ఆంతరంగికులందరూ మహాకవులే. మరొక విధంగా చెప్పాలంటే రాయలవారి సాహిత్య సంపాదనకు కవిత్వం ప్రధానసాధనం. మహారాజు రాజపరమేశ్వరుడైనా కవిరాజుల వద్ద మాత్రం సామంతరాజు; భృత్యానుభృత్యుడు.

రాయలవారికి అల్లసాని పెద్దనార్యుడంటే విపరీతమైన అభిమానం. ఆయన వ్రాసిన మనుచరిత్ర అంకితం తీసుకొని ధన, కనక, వస్తు వాహనాలతో కోటక అగ్రహారాన్ని ఇచ్చి సత్కరించాడు రాయలు. అంతేకాదు; "ఆంధ్ర కవితా పితామహ అల్లసాని పెద్దనామాత్యా!" అని ఆప్యాయంగా గౌరవంతో వినయం ఉట్టిపడుతూ సంబోధిస్తాడు. ఆ అంకితం గైకొన్న రోజున మహారాజు ఆ ఆంధ్ర కవితా పితామహుణ్ణి బంగారు పల్లకిలో కూర్చుండబెట్టి, స్వయంగా పల్లకిని ఎత్తి సభాస్థలి వరకూ పాదచారియై



అనుసరించాడు. నవరత్న ఖచితమైన గండపెండేరాన్ని సకల సామంత దండనాయక మహాకవి పండిత ప్రతతి ముందు నిండు పేరోలగంలో స్వయంగా పెద్దనగారి కాలికి తొడిగాడు మహారాజు. వీధి వెంట వెళ్తుంటే ఎక్కడ పెద్దనగారు కనిపిస్తే అక్కడ తన మదకరీంద్రాన్ని నిలిపి కేలూత నిచ్చి ఎక్కించుకునేవాడు.

పెద్దన మహాకవియేక, మంత్రాంగ రచనావేత్త. కొన్ని సంవత్సరాల క్రితం దక్షిణ దేశంలో అల్లరులు చెలరేగినప్పుడు మహామంత్రి తిమ్మరుసు పెద్దనార్యుని పిలిచి తగిన సైన్యంతో కాంచీపురానికి పంపి, అక్కడ ఆయనను అమరనాయకునిగా అభిషిక్తుని చేశాడు.

తన విధిని తాను దిగ్విజయంగా నిర్వహించి తమిళుల విప్లవాన్ని అణచివేసిన కీర్తి కాంత ఛాయలు అనుసరింపగా మార్తాండ తేజంతో విజయనగరంలో అడుగుపెట్టిన పెద్దనార్యునికి విజయనగరం బ్రహ్మాండమైన స్వాగతమిచ్చింది.

ఇటీవలనే తమిళనాడులో మళ్ళీ అల్లరులు కొన్ని చెలరేగటంవల్ల వయసు మళ్ళిన పెద్దనార్యునికి తిరిగి పని కల్పించాడు మహామంత్రి, మహామంత్రి ఉద్దేశంలో తన తరువాత మంత్రి పదవికి వారసుడు పెద్దనగారే. అందువల్లనే మహామంత్రి ఈ విప్లవాన్ని అణచివేయటానికి పెద్దనగారిని ఎన్నుకున్నాడు.

విజయనగరం విడిచిపోయిన రాజ ప్రతినిధి పెద్దనగారు ఇంకా తిరిగి రాకపోవటంవలన గోష్ఠి మందిరం చిన్నబోయింది.

రాయలవారి ఆస్థానమందలి మహా కవులలో తరువాత ఎన్నదగినవాడు నంది తిమ్మన. తిమ్మనార్యుడు కృష్ణానదీ పరివాహిక ప్రదేశపువాడు. రాయలవారి ముద్దుల భార్య అన్నపూర్ణాదేవితో ఆమె పుట్టినింటి నుండి అరణముగా వొచ్చిన కవి, అందువల్ల మహారాజునకు విపరీతమైన అభిమానం తిమ్మనగారంటే. ఈ మహాకవి ఇంటి పేరు నందివారైనా ప్రపంచం ఇతనిని "ముక్కు తిమ్మన" అనే పిలుస్తున్నది.

ఇటీవల ఆయన "నానా సూన వితాన వాసనల నానందించు సారంగము...." అనే పద్యాన్ని వ్రాసి అందులో ముక్కును భలే సొగసుగా

వర్ణించాడు రాయలవారి ఆస్థానంలో. ఆ పద్యాన్ని అందరూ అతిగా మెచ్చుకున్నారు. ఆ మెప్పుదల పెరిగిపోయి, పెరిగిపోయి చివరికి నంది తిమ్మనగార్ని "ముక్కు తిమ్మనగారూ" అనే వరకూ వచ్చింది. దాంతో ఆ మహాకవి కుయ్యో, మొర్రో అంటూ ఆ పేరు పోగొట్టుకోటానికి భట్టుమూర్తిని బ్రతిమాలి ఆ పద్యాన్ని అతడు ప్రస్తుతం వ్రాస్తున్న వసుచరిత్రలో ఇరికించే ఏర్పాటు కూడా చేశాడు. ఆ తరువాత ఆ పద్యాన్ని నేను వ్రాయలేదని ఎలుగెత్తి చాటాడు. కానీ ప్రయోజనం....? భట్టుమూర్తి "ముక్కు భట్టు" కాలేదు. తిమ్మనగారికి ముక్కు ఊడిపోనూ లేదు.

ప్రస్తుతం ఈ మహాకవి పారిజాతాపహరణమనే ప్రబంధాన్ని వ్రాస్తున్నాడు. ఏ రోజు కారోజు - అ రోజు తాను వ్రాసిన పద్యాలను మహారాజుకు వినిపించి శహబాస్ అనిపించుకోవటం అయనకొక సరదా। ఆలా విని మెచ్చుకోవటం రాయలవారి సరదా। అందుకోసం వీరిద్దరూ ప్రత్యేకంగా సాయం సమయంలో, గోష్ఠి మందిరంలో కలుసుకుంటుంటారు.

సకల కథాసార సంగ్రహమనే గ్రంథరాజాన్ని తెలుగులో రచించిన అయ్యలరాజు రామభద్రకవి రాయల ఆస్థానాన్ని అలంకరించినవారిలో తిమ్మనగారి తరువాత ఎన్నదగినవాడు.

కృష్ణరాయ విజయమనే మహత్తర గ్రంథాన్ని వ్రాస్తున్న ధూర్జటి అంటే రాయలవారికి ఎనలేని వాత్సల్యం. తన జీవితాన్ని అక్షర పరంగా, సుస్థిరం చేయ సంకల్పించిన మహా చరిత్రకారుడుగా, ప్రతిభావంతుడైన కవిగా ధూర్జటి మహాకవిని రాయలు గౌరవిస్తాడు.

ఆతనితో సమాన గౌరవాన్ని పొందుతున్నాడు మాదయగారి మల్లన మహాకవి వీరిద్దరూ శైవులే, నిలువుబొట్టుల కొలవాలమైన రాయల వారి ఆస్థానమున వీరిరుపురి అడ్డబొట్లు పరమేష్ఠిని జ్ఞప్తికి తెస్తుంటాయ్ చూపరులకు,

పింగళి సూరన కవిత్వ లో అనన్య సాధారణ ప్రతిభాసమన్వితుడు. ప్రపంచ సాహిత్యంలో ఒక నూతన యుగానికి స్రష్ట. అతడు ప్రస్తుతం



వ్రాస్తున్న రాఘవ పాండవీయం ఒక అపూర్వ మేధస్సుకు ప్రతిబింబం, మహత్తర ద్వ్యర్థి కావ్యం. ఒక్కటే పద్యం-పద విభాగాన్ని బట్టి అర్థం మారుతుంది. ఇలా ఒక పద్యం కాదు; కొన్ని వందల పద్యాల వరుస- ఒక మహాభారతం, ఒక రామాయణం. క్రమం తప్పకుండా, అర్థంచెడకుండా- ఏ విధంగా చదువుకుపోతే ఆ విధంగా అర్థాన్నిస్తుంది. భారతం కావాలంటే అది భారతం ఔతుంది; రామాయణం కావాలంటే అది రామాయణం ఔతుంది.

తనవిశిష్ట కవిత్వశిల్పకళాచాతుర్యానికి, కల్పనాప్రౌఢికి నిదర్శనంగా కళాపూర్ణోదయ కావ్యాన్ని కూడా ప్రారంభించాడు సూరన.

రాయలకు సూరన అంటే అమితమైన గౌరవం.

సూరనను చూచి, యాదవ రాఘవ పాండవీయమనే త్ర్యర్థి కావ్యాన్ని ప్రారంభించాడు-తాను వ్రాస్తున్న వసుచరిత్రను వొదిలి వేసి రామరాజ భూషణుడు.

ఇది మరీ చిత్రం. ఒకే పద్యంలో రామాయణార్థం, భారతార్థం, భాగవతార్థం మూడూ వరుస తప్పకుండా, కథాగమనానికి భంగంరాకుండా తుదివరకూ సాగిపోవాలి ఎన్ని వేల పద్యాల వరకో.

అందరికన్నా ముఖ్యుడు, రాయలవారి అత్యంత ప్రీతిపాత్రుడు, క్షణికాగ్రహ కారకుడు తెనాలి రామకృష్ణుడు. అతడు రాజుకు కావాలని కోపం తెప్పిస్తాడు; క్షణంలో ఫక్కున నవ్విస్తాడు కాళీ వరప్రసాది. మహత్తర వికటకవి.

రాయలవారికి ఇతడంటే ఎంత ప్రేమో, అంత భయం.

ఇతని కథలు దేశమంతా మారుమ్రోగుతున్నాయి. తన శేముషీ ప్రతిభతో రాయలవారి సభా గౌరవాన్ని- పెద్దనాది మహా కవులకు కూడా సాధ్యం కాని సమయంలో రక్షించిన ఖ్యాతి రామకృష్ణుడికి ఉంది. అది కవిత్వమే కావొచ్చు, మల్ల యుద్ధాలే కావొచ్చు, అతని ప్రతిభ బహుముఖమైంది.

తానెంత మహాకవి అయినప్పటికీ ప్రజలు తన్ను 'వికటకవి' అని పిలుస్తున్నారనే ఉక్రోషంతో రామకృష్ణుడు 'పాండురంగ మహాత్మ్యం'

అనే మహా ప్రబంధాన్ని సర్వలక్షణ సమ్మతంగా, కవితాశిల్పం ఉట్టిపడేలా వ్రాయటానికి ఇటీవలనే ఉపక్రమించాడు, పెద్దనాదులను సవాలు చేస్తూ.

రాయలవారు స్వయంగా మహాకవి కవితా ప్రావీణ్య ఫణీశుడు; సాహితీ సమరాంగణ సార్వభౌముడు. సరస్వతి అతనికి ఉపాసనాదైవం. ఆరాధ్య దేవత. 'మదాలస చరిత్ర' 'సత్యభామా ప్రీణనము' అనే ప్రబంధాలను సంస్కృతంలో రచించాడు మహారాజు. యుద్ధకాలంలో కూడా తీరిక చిక్కినప్పుడల్లా కవితారచనలో నిమగ్నమవటం ఆయనకు అలవాటు.

విజయవాడ వద్ద కృష్ణాతటిపై గజపతిని ఓడించి పారద్రోలిన నాటి రాత్రి ఆయన ఆరాధ్య దైవమగు శ్రీకాకుళస్వామి కలలో కన్పించి విష్ణుచిత్తీయ ప్రబంధ రచన సాగించమని కోరాడు రాయలవారిని. ఆ రాత్రే మహారాజు కావ్య రచన కుపక్రమించి యుద్ధయాత్ర నుండి తిరిగి వచ్చేసరికి ఆ మహా ప్రబంధాన్ని పూర్తి చేశాడు. ఆ ప్రబంధానికి 'ఆముక్తమాల్యద' అని పేరు పెట్టాడు మహారాజు. చిత్ర విచిత్ర వర్ణనలతో, అపురూపమైన సన్నివేశాలతో, అసదృశమైన భాషాసౌష్ఠవంతో తాను సృష్టించిన ఈ కవితా కన్యను తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికే అంకితం ఇచ్చి, ఇహపరాలను సాధించాడు సార్వభౌముడు.

అష్టదిగ్గజాలుగా పేరు పొందిన కవి పండిత ప్రకాండులతో సకల కళానికేతనంగా విలసిల్లే రాయలవారి సభ భువన విజయంగా విఖ్యాతి గాంచింది. ఆ సభ కధినాథుడు ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు. సభాసదులలో ప్రతిఒక్కరూ సాహితీ సేవకులే! కవిత్వోపాసకులే!

ఒకనాటి భువన విజయ సమావేశం లేపాక్షిలో జరిగింది. సభలో దాశరథులు గొప్పా, పాండవులు గొప్పా అనే అంశం వివాదంలోపడింది. పెద్దన, తిమ్మన, రామకృష్ణాది మహాకవులంతా వాద ప్రతివాదాలలో పడ్డారు.

రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులే నిస్సందేహంగా అధికులు. లోక కంటకులైన, అనంత బలసంపన్నులైన, ఇంద్రజాల, మహేంద్రజాల బహుముఖ మహిమాన్వితులైన, బ్రహ్మ మహేశ్వర ప్రసాద రక్షితు



లైన దానవులను సంహరించి, శాంతిస్థాపన చేసినందువల్ల దాశరథులే గొప్పవారని పెద్దనాదుల వాదం.

దాశరథులు గొప్పవారైనా, వారు పరమేష్ఠి ప్రతిరూపాలనీ, అందువలన వారి గొప్పతనం గొప్పతనం కాదనీ, పాండవులు మానవమాత్రులుగా అధర్మాన్ని హతమార్చి, మహత్తర ధర్మ సంస్థాపన చేసిన వీరాధివీరులనీ, కాబట్టి దాశరథులకన్నా పాండవులే గొప్ప అనీ రామకృష్ణుడు ప్రతివాదం లేవదీశాడు.

వాదోపవాదాలైన తరువాత మహారాజు చిరునవ్వు దొంతరల మధ్య తన నిర్ణయాన్ని తెలియజేశాడు.

"పాండవులు దాశరథులకన్నా అత్యధికులు. రామకృష్ణా! నీ వాదం పసందుగా ఉందయ్యా!"

రామకృష్ణుడు విజయగర్వంతో సభా భవనాన్ని పరికిస్తూ- "ఏమంటారు తాతలూ?" అన్నాడు పెద్దనాదులవంక చూస్తూ.

పెద్దనాదులు తల వొంచుకున్నారు.

ఆ సమయంలో రాయలకు వింజామర వీస్తున్న చాకలివాడు-"మహాప్రభువులు. పూర్వజన్మ వాసాన అభిమానం యాడికి పోద్దీ" అన్నాడు

మహారాజు వాడివంక సాదరంగా వీక్షించాడు. "ఒరే పేరిగా! ఎదురుగా కనిపించే మేర అంతా నీదేరా. తీసుకోరా." అని దాన పత్రం వెంటనే వ్రాయించాడు. అదే దేవర కోట అగ్రహారం.

సభాసదులకు రాయలవారి చర్య వింతగా తోచింది. "ఏమిటి నిర్హేతుక పరిపూర్ణ కటాక్షం ఈ చాకలిపైన." పండితమ్మన్యులకు అర్థం కాలేదు. సభలో గుసగుసలు బయలుదేరాయి. ఇది గమనించి మహారాజు-

"ఒరే పేరిగా! మనసులోని మాట మహాకవులకు అర్థమయ్యేలా సెలవివ్వరా!" అన్నాడు.

వాడు తడబడుతూ - "ప్రభువులు శ్రీ కృష్ణావతారం. కృష్ణుడికి పాండవులంటేనే ప్రేమ!" అన్నాడు.

ప్రభువుల సాహిత్యాభిమానం ఆ విధంగా వెల్లివిరిసేది ఆ రోజులలో.

తీరిక సమయాల్లో తన కవితా వ్యాసంగానికి అనుగుణంగా ఒక దివ్య సౌధ రాజాన్ని నిర్మింప చేశాడు రాయలు. ఆ మందిరం అంతఃపురానికి అనతి దూరంలోనే ఉంది.

రాయలవారి గోష్ఠి మందిరం ఒక మహత్తరమైన విశిష్ట కళా నికేతనం. భారతదేశ చరిత్రలో ప్రసిద్ధికెక్కిన భోజరాజు ఆస్థానాన్ని అన్ని విధాల మించింది. అక్కడే మహారాజు-సర్వదా తన కవిపండిత మిత్రులతో సంతోషంగా గడుపుతుంటాడు. విజయనగరంలో మహారాజుకు సంతోషానిచ్చేవి, గోష్ఠి మందిరం, అన్నపూర్ణాదేవి అంతఃపురం. రాజ దంపతుల మధ్య భేదాభిప్రాయాలు కలిగినప్పటినుండీ, ఎక్కువగా గోష్ఠి మందిరంలోనే అధికంగా ప్రొద్దుపుచ్చుతున్నాడు.

నిజానికా మందిరం- వాగ్దేవి ఆరాధనా మండపం. ఆంధ్ర కవితా పితామహుడైన అల్లసాని పెద్దనాది మహాకవి శ్రేష్ఠులకు సమావేశ ప్రదేశమా దివ్యమందిరం. అష్టదిగ్గజాలుగా ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఆ మహాకవుల కవితా సుధారసా స్వాదనతో మహారాజు మైమరచిపోతుంటాడు.

ఆనాడు నంది తిమ్మనగారు వ్రాస్తున్న పారిజాతాప హరణ మహాకావ్యాన్ని వినటానికి మహారాజు ప్రత్యేకంగా గోష్ఠిమందిరానికి వొస్తున్నారు. అది గోష్ఠి మందిర అధికార సమావేశం కాక, ఇరువురు మహాకవుల అంతరంగిక సమావేశం కావటం మూలాన, మిగిలిన కవులెవరూ ఆనాడు గోష్ఠి మందిరానికి రాలేదు. పరిచారకులు మాత్రం మందిర ద్వారం వద్ద మహారాజు ఆగమనానికి ఎదురు చూస్తున్నారు. కాని, వారికి మహారాజుకు బదులు వీరేంద్రపాత్రుడు రావటం కనిపించింది. వీరేంద్రుడంటే సేవకులంతా పైకి గౌరవం నటిస్తూ వొంగి వొంగి నమస్కారాలు చేస్తారు. అతడు వెళ్ళిన మరుక్షణంలోనే 'పోరాశ్యాలకా' అంటూ గొణుక్కుంటారు. ఈ విషయం వీరేంద్రపాత్రుడు గమనించకపోలేదు. కాని, గమనించినా గమనించనట్లుండటమే అతని విశిష్టత. అతడు బహుశః మహారాజును కలుసుకోవటానికే గోష్ఠి మందిరానికి వొచ్చాడు. కాని. అక్కడికి అప్పటికింకా మహారాజు రాలేదు. అతని మనస్సు పరిపరి విధాల పోతున్నది. అతను వొచ్చి నెలలు గడుస్తున్నా, వొచ్చిన పని వొచ్చిననాటివలెనే



ఉంది. రాజు రాజ కార్యములందు విముఖుడవటమే వీరేంద్రునకొక విధమైన అవరోధం. అంతే కాకుండా, మంత్రి - రాజు కాకున్నా - రాజ్యాంగాన్ని అంతా అరచేతిలో పెట్టుకొని గర్భశత్రువులు కూడా గణుతించే విధంగా విజయనగర సామ్రాజ్య యంత్రాన్ని నడపటం వీరేంద్రునికి మరొక అవరోధం. వీరేంద్రపాత్రుడు ఇటీవలనే తన కార్యసానుకూల్యతను గురించి జోస్యం కూడా చెప్పించుకున్నాడు. అతనికి రేపటి సుప్రభాతమౌతుందని చెప్పి తమ ముడుపు తాము స్వీకరించారు భూత భవిష్యద్వర్తమాన పరిశీలనాకోవిదులయిన జోతిష్య పండితులు.

వీరేంద్రుని దృష్టి సింహద్వారం వైపు ప్రసరించింది. ఎదురుగా అల్లంత దూరాన ముక్కు తిమ్మన మహాకవి తన తాటియాకుల దస్త్రంతో వస్తున్నాడు. తిమ్మనగారు ఇటీవల అన్నపూర్ణాదేవి అంతఃపురానికి వెళ్ళి వచ్చిన సంగతి వీరేంద్రునకు తెలుసు. అందువల్ల ఎలాగయినా తిమ్మనగారిని పట్టుకొని విషయ సేకరణ చేయాలనుకున్నాడు వీరేంద్రపాత్రుడు. అతడికింతకన్నా మంచి అవకాశం లేదు. కాని, ఇంతలో వీరేంద్రుని శ్రవణాలకు మరో శబ్దం వినిపించింది. వీరేంద్రుడు ఛెంగున స్తంభం మాటున కొత్తిగిలి దూరాన రథాన్నవరోహిస్తున్న మహామంత్రిని చూశాడు. బుద్ధికి బృహస్పతిగా పేరుబడసిన తిమ్మరుసు మంత్రిని చూడటంతోనే వీరేంద్రుని గుండె గతుక్కుమంది. పాపం, అతడెంత ధైర్యంగా ఉందామని ప్రయత్నించినా, ఆ ముసలిమంత్రిని చూడగానే అతని మనస్సు కటకం వైపుకు పరుగులు తీస్తుంది. సాధారణంగా గోష్ఠి మందిరానికి రాని మహామంత్రి ఆనాడు గోష్ఠి మందిరానికి రావటం వీరేంద్రుడికి ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇంతలో మహామంత్రి నంది తిమ్మనగారితో కలసి గోష్ఠి మందిరంలో ప్రవేశించాడు.

"నిరంతర రాజకీయ సాగర మథనం తప్ప ఇతర మెరుగని మీరు ఈ నాడు ఈ గోష్ఠి మందిరానికి రావటం నిజంగా మా అదృష్టం, మహామంత్రీ! గోష్ఠిమందిర పక్షమున మహాకవి మహామంత్రిని సంభావించాడు.

"నిజమే, కాని, గోష్ఠి మందిరం రాజును సర్వవిధాలా కట్టివేసింది. మహామంత్రులమైన మాకు కూడా రాజదర్శనం గోష్ఠిమందిరంలోనే. మహామంత్రి వాక్కులలో ఒక విధమైన వ్యంగ్యమూ, విసుపూకూడా మిశ్రిత ఉన్నాయి.

"ప్రభువులు సారస్వత ప్రియులు" కవి తన కవిరాజును సమర్థించాడు.

మహామంత్రికి ఆ సమర్థన అసమర్థంగా కనిపించింది. "సార్వభౌముల సాహిత్యాభిమానం కేవలం సాహిత్యాభిమానంగానే ఉండాలి గాని, ప్రభుత్వ రాజ్యాంగ యంత్రాంగానికి అవరోధం కాకూడదు. మహాకవీ!" అన్నాడు మహామంత్రి.

ఆ మాట కాదనగల ధైర్యం మహాకవికి లోపించింది. కాని, విషయాన్ని మార్చి తన కవితాశక్తి ఆధిక్యతను రుజువు చేయాలని మహాకవి వాంఛించాడు.

"మహామంత్రులకు ఒక చిన్న సమస్యనివ్వాలని ఉంది."

"మేమేం మహాకవులం కాదే-పాదపూరణకు?"

"పాదపూరణే కావాలని లేదు, మహామంత్రీ! రాజకీయపరంగా పరిష్కారం సూచిస్తే చాలు."

"మంచిది." అమోదసూచకంగా మహామంత్రి తలనాడించాడు.

"ఒక రాజు...."

"ఎవరా రాజు? అతనికున్న గజబల మెంత? కాల్బల మెంత? అశ్విక బలమేమైనా ఉందా?"

"క్షమించాలి. ఇవన్నీ అప్రస్తుతాలు."

"ఊఁ, మంచిది - కానివ్వండి. ఒక రాజు...."

"ఆ రాజుకు ఒక అందాల రాణి."

"ఏ దేశపు రాజు కూతురు? ఆమెకు సోదరీ సోదరులెవరయినా ఉన్నారా? ఇతర వారసుల ప్రమేయమేమైనా ఉందా?"

"మహామంత్రీ! అవికూడా అప్రస్తుతాలే."

మంత్రి నవ్వుతూ ప్రత్యుత్తరమిచ్చాడు. "నా ప్రశ్నలన్నీ ప్రస్తుతం మీకు అప్రస్తుతాలుగా కనిపించినా, అచిరకాలంలోనే వాటిశక్తి మీకు అర్థమౌతుంది లెండి. ఆ పైన...."



"రాణి రాజుపై అలిగింది."

"అందుకు కారణం...."

"అదీ అప్రస్తుతమే. ఏదో ప్రణయ కలహం."

మహామంత్రి ఒక్క క్షణం ఆలోచించాడు.

"ఈ ప్రణయ కలహానికి పూర్వం పుట్టినింటి శని ఏ రూపాన అయినా మెట్టినింట అడుగు పెట్టిందా?"

"ఆఁ, అదీ అప్రస్తుతమే."

తిమ్మనగారి సమాధానాలు మహామంత్రికి విసువు జనింపచేశాయి. "మేము మిమ్మడుగుచున్నది ప్రస్తుతా ప్రస్తుత సమాధానాలను ఆశించి కాదు. మీకు తెలిసిన వాస్తవం మాకు కావాలి." మంత్రి శేఖరుడు గర్జిస్తూ పలికాడు. ఆ గర్జనకు మహాకవి హడలిపోయాడు. "ఏమిటిది, మహామంత్రీ?" అన్నాడు బిక్క మొహం వేసి.

"అవును. మాకు వాస్తవం కావాలి. పుట్టినింటి నుండి శని ఏ రూపంలోనైనా మెట్టినింట అడుగు పెట్టిందా - అని అడుగుతున్నాం."

"ఒకానొక బంధువుడి రూపంలో అడుగు పెట్టినట్లే ఉంది." అన్నాడు కవిశేఖరుడు అయిష్టంగా నసుగుతూ.

'అలా చెప్పండి. సరే, ప్రణయ కలహం అన్నారు కదూ! దాని స్థాయి ఎంత?' మహామంత్రి మళ్ళీ ప్రశ్నించాడు.

'రాణి రాజు వక్షస్థలిని వామపాదంతో స్పృశించింది.'

'సన్నివేశం పరాకాష్ఠ నందుకుందన్న మాట....? ఇప్పుడు చెప్పండి, రాజెవరు?'

'ఆఁ! ఎవరో ప్రబంధ సుందరుడు.' కవి తప్పుకొన చూచాడు.

'మాకిచ్చే సమాధానం వాస్తవానికి అత్యంత సన్నిహితంగా ఉండాలి. రాజెవరు?' సూటిగా కళ్ళల్లోకి చూస్తూ ప్రశ్నించాడు మహామంత్రి ఆ ధాటి కాగలేక కవిశేఖరుడు వెంటనే అప్రయత్నంగా తన మనసులోని పేరు బయటపెట్టాడు. 'రాయలవారు.'

మహామంత్రి ముఖ మండలాన ఒకచిన్న హాసరేఖ అంకురించింది. అయన మెల్లగా చిరునవ్వుతో 'మహాకవి! రాజ రహస్య గోపనంలో మీకున్న చాకచక్యం అమాత్యుని దగ్గర సాగదని మాత్రం తెలుసుకోండి. ఇంతకూ మీ సమస్య ఏమిటి, మహాకవీ!" అన్నాడు లాలింపుగా- గజ గజలాడుతున్న మహాకవి భయాన్ని పోగొట్టటానికి, మహాకవికి అప్పాజీ వారి దరహాస చంద్రికలలో కొంత స్థిమితం చిక్కింది.

"రాజునూ, రాణినీ కలపాలి. రాజకీయంగా మీరిచ్చే పరిష్కారం?" కవి మంత్రి వంక సాభిప్రాయంగా చూశాడు

మంత్రి ఒక్క క్షణం ఆలోచించాడు.

"పుట్టినింటినుండి వొచ్చిన శని మెట్టినిల్లు వదిలేవరకూ, రాజదంప తుల వియోగమే రాజకీయములకు రక్ష!" మహామంత్రి వాక్కులు నిర్ణ యాత్మకంగా వున్నాయి. మహాకవికి ఎదురాడే ధైర్యంలేదు.

'కాని అన్నపూర్ణాదేవి పశ్చాత్తాప హృదయంతో కుమిలిపోతు న్నారు.'

"కానివ్వండి. ఆవేదన మనస్సులోని మాలిన్యాన్ని క్షాళనం చేస్తుంది" మహామంత్రి నిర్ణయంలో మార్పు వొచ్చిన సూచన కనిపించలేదు.

"నిజమే! కాని, భార్యా వియోగంతో రాయలవారు కూడా వ్యధిత హృదయులై క్రుంగిపోతున్నారు." ఈ కారణం మంత్రిమీద విపరీతంగా పని చేసింది. రాయలవారంటే ఆయనకు పుత్ర వాత్సల్యం. మహారాజు బాధ మహామంత్రి సహించలేదు.

"అయితే రాజునూ, రాణినీ కలపాలని తీర్మానించారన్న మాట?" అన్నాడు మహామంత్రి.

"చిత్తం. మీ ఆజ్ఞకు లోబడి."

"మంచిది. ఆ విధంగానే కలిపేయండి."

"ఇదే మేమిచ్చే సమస్య రాజకీయపరంగా మీరే కలయికను సాధించగలరా?" మహాకవిలో అహంభావం తొంగి చూచి తిమ్మరుసు మూర్తిని చూచి నిలువునా కరిగిపోయింది.



"ఇదా? ఇదొక సమస్యా? రాజునూ, రాణినీ కలపటానికి మా మాట చాలదా?" అన్నాడు మహామంత్రి.

తిమ్మనార్యుడు ఆశ్చర్యంగా గుడ్లప్పగించి చూస్తున్నాడు.

"ఏం, మహాకవీ! అలా చూస్తారేం? అయిన రాయలవారితో చెప్పి చూడండి. అప్పాజీగారు మిమ్మల్ని ఈ రాత్రి అన్నపూర్ణాదేవి మంది రంలో శయనించమన్నారని, ఫలితం రేపు నాకు చెప్పండి.

మహాకవి కొక్కసారిగా అప్పాజీవారి శక్తి సామర్థ్యాలు, రాయల వారిపై వారికున్న విశేషాధికారాలు గోచరించాయి. అవును. ఘటనాఘటన సమర్థుడగు మహామంత్రి శేఖరులకు తానిచ్చినది ఒక సమస్యగా తోచ లేదు.

"మరి రాజునూ, రాణినీ కలుపుటకు అమాత్యులా మోదించినట్లు గ్రహించవచ్చా." అన్నాడు తిమ్మనకవి.

"ఆఁ. ఇది మాకూ ఒక విధంగా సమ్మతమే. ఉత్తర దిగ్విజయ యాత్రకు బయలుదేరే ఈ సందర్భంలో రాయలవారి హృదయం సమస్యారహితమవటమే మంచిది. కాని, మీ కటకేశ్వరుని అల్లుడు వీరేంద్రపాత్రుడి విషయంలో నాకు కొన్ని అనుమానాలున్నాయి. వాడి రాకకూ, ఈ ప్రణయ కలహానికీ సంబంధం ఉండేమోనని నా అనుమానం. భయమంటే ఎట్లాంటిదో ఎరుగని నా భద్ర హృదయం వాడంటే ఎందుకో రుసరుసలాడుతున్నది. అతని మానస వీధిలో చెరలాడే మంతనాలు మా చూపు లకు కూడా అందటంలేదు. అతని బాహ్య ప్రవర్తన అనుమానానికి ఏ మాత్రం అస్కార మివ్వటంలేదు; ఆంతర్యం నా స్వంత వేగులకు కూడా అందటంలేదు. కాని నానాటికీ మహారాజు కత్యంత సన్నిహితుడౌతున్నాడు" మహామంత్రి మనసులోని మాట విప్పి చెప్పాడు తిమ్మనార్యునికి.

ఇంతలో మహా దండనాయకుడు పెమ్మసాని రామలింగ నాయకుడు గోష్ఠిమందిరానికి మహామంత్రి నన్వేషిస్తూ వొచ్చి, మహామంత్రిని చూచి ప్రణామం కావించాడు.

"మీరు నా కొరకు కబురు పంపారా మహామంత్రీ?"

"అవును. ఉత్తర దిగ్విజయ యాత్రకు దైవజ్ఞులు నిర్ణయించిన

సుముహూర్తాన్ని మేమామోదించాం. ప్రభువుల ఆమోదముద్ర కొరకు మేమింత కాలమూ వేచి ఉన్నాం. మహాదండ నాయకా! మాకు మారుగా ఈ ముహూర్త పత్రం పైన రాజముద్రికను నీవు స్వయంగా సేకరించాలి. అశ్వక్రయమునకు బుడతకీచువారిని రమ్మనుటచే మేమత్యవసరంగా వెళ్ళాలి...." అంటూ ముహూర్త పత్రికను మహాదండ నాయకుల కిచ్చాడు మహామంత్రి.

"అలాగే మహామంత్రీ!" అన్నాడు ప్రధాన దండనాధుడు ముహూర్త పత్రాన్ని కళ్ళకద్దుకుంటూ.

మహామంత్రి తిమ్మనార్యుని వంక తిరిగి— "కవిరాజులు మాకు సెలవొసంగెదరా?" అన్నాడు.

"ఎంత మాట! కాని, రాజునూ, రాణినీ...."

"కలిపేయంత...." అంటూ మహామంత్రి నిష్క్రమించాడు.

కాని, నిష్క్రమించే ముందు రామలింగ నాయకులకు వీరేంద్రుని విషయం మహామంత్రి హెచ్చరిక చేసి వెళ్ళాడు.

"కలిపివేయుటకు మహామంత్రుల ఆమోదమును కూడా సాధింపగలిగాను" స్వగతాన్ని పైకి అనుకుంటూ తృప్తిగా నిట్టూర్చాడు తిమ్మన కవి.

"ఏమి కలుపుటకండీ?"

రామలింగ నాయకులు అక్కడున్న విషయం మహాకవి విస్మరించాడు. కాకపోతే పాపం, ఆయన పైకి అనుకునే వాడే కాదు.

"ఓ! మీరా— ఆ విషయం మీకు కేవలం అనవసరం?"

"అనవసరమే. అయినా వినాలని ఉంది."

"ఉంది? పాపం ఉండనివ్వండి. నా నాలికను కత్తితో పర-పరా కోసినా మీకా సమాచారం రాదు, రాబోదు" అన్నాడు తిమ్మనకవి సుదృఢ కంఠంతో.

"పోనీ నేను చెప్పనా?"

"తెలిస్తే చెప్పరాదమా? కాని, మీకా విషయం తెలీదని నాకు గట్టిగా తెలుసు."



"అయితే చెప్తున్నాను వినండి. మీరు రాజునూ, రాణినీ కలపాలని చూస్తున్నారు.

"ఆ! ఆ! మీకంతా తెలిసింది. మీకీ రాజ రహస్యం చెప్పింది ఎవరూ? ఎవరు మీకీ రహస్యాన్ని...."

"ఇస్....అది మీకప్రస్తుతం: అనవసరం" ఛాందస్తులను చూస్తుంటే దండనాయకులకు కూడా అప్పుడప్పుడు పరియాచకాలాడా లనిపిస్తుంటుంది.

"మీరు చెప్పకపోతే నేనూహించలేననుకున్నారా ఏమిటి? పట్టమహిషి తిరుమలాంబిక పరిచారికను గదా అని క్రొవ్వి, ఆ జలజే ఇంత పని చేసి ఉంటుంది. చూడండి— అన్నపూర్ణాదేవిగారితో చెప్పి దానికి కొరత వేయించకపోతే మారుపేరున పిలవండి.' మహాకవుల ఆవేశానికి దండ నాయకునికి నవ్వు వొచ్చింది.

'పట్టమహిషి పరిచారికను రెండవ రాణి ఏం చేస్తుందండీ?' అన్నపూర్ణాదేవి అంటే - రామలింగ నాయకులకు ఎందుకో మొదటి నుంచీ సదభిప్రాయం లేదు. అయినా, తనకెందుకు లెమ్మని అనవసర విషయాలలో జోక్యం కలిగించుకోడు. కాని, అప్పుడప్పుడలా నోరు జారటం కద్దు.

'ఏం చేస్తుందా? తాను చెయ్యకపోతే మహారాజుతో చెప్పి చేయిస్తుంది"

'రాజూ, రాణీ కలిశారా?'

'కలవకపోతే కలుపుతాను. అందాకా ఎందుకు! నేనే మహారాజుతో స్వయంగా చెప్పి, దాని పొగరు అణుస్తాను,' అన్నాడు తిమ్మనగారు. ఈ సారి దండనాయకులకు పెల్లుబుకుతున్న నవ్వాగింది కాదు. పక పకా నవ్వేశాడు.

'ఎందుకలా వెకిలిగా ఇహీహీ అని నవ్వుతున్నారు?' కవి శేఖరుడు కోపంగా ప్రశ్నించాడు.

'ఆ, ఎదుటివారి శక్తి తెలుసుకోలేని మీ అశక్తతకు....!'

'అంటే - ఆ దాసీది నా కంటే శక్తి గలదనా? నేనంత పనికి

మాలిన వాణ్ణిఖండీ? అంతేనా?' పాపం! కవిగారి కంఠం ఉక్రోషంతో తడబడసాగింది.

"తిమ్మనగారూ! జలజ అంటే సామాన్య పరిచారిక అనుకుంటున్నారేమో? తిమ్మరుసయ్యవారి మేనకోడలు, గోవిందరాయలకు కాబోవు భార్య. మీరు మిక్కిలి పట్టమహిషికి బహిఃప్రాణమే కాక, ఔరసపుత్రికా సమానం. తెలిసిందా? శిక్షించండి- చేతైతే రాయలవారిచేత.' అన్నాడు విషయ వివరణచేసి ప్రధాన దండనాథుడు.

ఇదంతా వింటున్న తిమ్మనకవి నిలువునా నీరయ్యాడు. 'పదహారేండ్ల పడుచుపిల్ల జలజ అనుకున్నానే కాని, ఇదంతా చూస్తుంటే శీర్షాసనం వెయ్యక తప్పేట్టు లేదు.' సరిగ్గా ఆ సమయంలో 'కవిరాజులు శీర్షాసనం వేస్తున్నారే - ఎందుకో?' అంటూ ప్రవేశించాడు వీరేంద్రపాత్రుడు. ఇంత కాలం నుండీ అక్కడి అభ్యంతరం వెనుకనే పొంచి వీరేంద్రుడి సవ్వడిని ఎవరూ గుర్తించక పోవటం నిజాని కతని అదృష్ట విశేషమనే అనాలి.

'తమవంటి చతురులు చెప్పి రాకపోవటం వల్ల.' ఎదురు దెబ్బ తీశాడు మహాకవి.

'ఒక వేళ వొచ్చినా ఎంత కాలానికీ పోక పోవటం వల్ల" శ్రుతి కలిపాడు మహా దండనాథుడు.

"నిజంగా నా రాక మీకంత కష్టంగా ఉందా?" జాలిగా చూశాడు వీరేంద్రుడు,

"అఁ, మాకేం కష్టం? ఏదో పరిహాసానికన్నాం కాని- అని రామలింగ నాయకులంటే, రాజశ్యాలకులను అటలు పట్టించటం ఇక్కడి వారి ఆచారం కెందని" వివరించాడు నందితిమ్మనగారు. ఎడా-పెడా తగులుతున్న ఈ తాకిడికి మరొకడైతే తోకముడిచి పారిపొయ్యేవాడే. కాని, వీరేంద్రుడు అంత మాత్రానికి బెదిరే రకం కాదు!

"నేను ఆచారాల్ని మన్నిస్తాను. మీరన్నారనే బాధ నాకు ఏ కోశానా లేదు. వీరేంద్రుని సమాధానం తాపీగానూ, లౌక్యంగానూ ఉంది. రామలింగనాయకులు వీరేంద్రుని వంక తిరిగి—



"అయితే ఒక్క మాటడుగుతాను. అసలు మీరేం పని మీద వచ్చారు?" అన్నాడు.

"రాచకార్యం!" వీరేంద్రుడు నోరు జారాడు.

"ఏమిటో అది?" ప్రధానసేనాని సాగదీశాడు.

"అతి నిగూఢం."

"అయిపోయిందా ?"

"ఇంకా లేదు."

"ఎప్పుడైపోతుందో ?"

"బహుశః రేపటిలోపున."

"మరి, తమరి ప్రయాణం!"

"పని అయిన మరు క్షణంలో."

"మళ్ళీ వొస్తారా !"

"రావాల్సి వొస్తే....మా చిట్టిబాబు పట్టాభిషేకానికి."

"ఎన్నాళ్ళనాటి మాటో అది! అస్థిరమైన ఈ జగతిలో అంతవరకూ మీరుండొద్దూ." అన్నాడు నంది తిమ్మన.

వీరేంద్రుడకందులోని అక్షింతలు అర్థం కాకపోలేదు; అయినా అర్థం కానట్టుగానే నటించాడు. వీరేంద్రుడన్నాడు.

"తలుచుకుంటే రేపే....రేపు ప్రాతఃకాలంలో జరిపించనూ."

"ఏమిటీ? తమకు విజయనగర రాజకీయాలలో అంత ఏలు బడి వొచ్చిందా?" అన్నాడు రామలింగనాయకుడు.

"ఊఁ, ఏమనుకున్నారు మరి - మనమంటే? అదుగో- బావ," అన్నాడు దూరంలో రథం దిగుతున్న మహారాజును చూచి - వీరేంద్రపాత్రుడు.

వీరేంద్రుడు తమ మహారాజును పట్టుకొని తోక కోసినట్లు "బావా - బావా!" అని పిలవటం మహాదండనాయకునికి కష్టంగా ఉంది.

"ఏమండోయ్! ఇక్కడ మీ ఒరయా పద్ధతులేం సాగవు. బావ

గారైనా, అన్నగారైనా మహారాజును "మహారాజా!" అని పిలవాల్సిందే! లేకపోతే శిక్ష తేలుసా ?"

"శిరచ్ఛేదమే...." అంటూ పూర్తిచేశాడు తిమ్మనార్యుడు.

ఇంతలో మహారాజు మందిరాన్ని సమీపించాడు. మహాకవి, మహ దండ నాథుడు ఎదురు వెళ్ళి వినమ్రతతో మహారాజును మందిరాంతర్భాగానికి తీసుకొని వొచ్చాడు. మహాకవి ఆశీర్వాదపురస్సరంగా కమ్మని కంఠ స్వరంతో ఈ విధంగా రాయలవారిని సంబోధించాడు- రాగయుక్తంగా -

శ్రీ వేంకటగిరి వల్లభ
సేవా పరతంత్ర హృదయ చిన్నమదేవీ
జీవిత నాయక కవితా
ప్రావీణ్య ఫణీశ కృష్ణరాయ మహీశా.

కమ్మని ఆ కవితామాధుర్యంతో కూడిన సంబోధనకు రాయల హృదయం పులకాంకితమైంది. 'మహాకవీ! తమవంటి ప్రాజ్ఞుల ప్రియ సంబోధనలతో మా జన్మ ధన్యమైంది. మీ లేఖిని ఉన్నంత కాలం మాపేరు కూడా ప్రపంచంలో మేము అంతరించినా శాశ్వతంగా ఉంటుంది." మహారాజు వాక్కులలోని అశ్లీలతకు ఒక్కింత కలత చెందినా, మహాకవి ప్రశంసా వాక్యాలను వినమ్రంగా స్వీకరించాడు. రాజు ఉపవిష్టుడు కాగానే రాజశ్యాలకుడు వీరేంద్రుడూ, కవి తిమ్మనార్యుడు తమ తమ ఆసనాలను అధిష్ఠించారు. మహారాజు సాదర దృక్కులతో కవిశేఖరుణ్ణి పరిశీలిస్తూ 'ఇవాళ కొంత ఆలస్యం కాక తప్పింది కాదు. అయినా, ఏదో చర్చ సాగుతున్నట్టుగానే ఉంది!" అన్నాడు.

"అవును, బావా!" వీరేంద్రుడు ధీమాగా అందుకున్నాడు అలవాటు ప్రకారం. రామలింగ నాయకుని చేయి అప్రయత్నంగా నడుమున అధికారసూచకంగా వ్రేలాడుతున్న ఖడ్గరాజం మీదికెళ్ళింది. వీరేంద్రుడది చూచి త్రుళ్ళిపడి నోటిలోని మాట నోటిలో నుండగనే వాక్యాన్ని ఆపివేశాడు. ఇది చూచి మహాకవి ముసి ముసి నవ్వులు నవ్వాడు. కాని, మహారాజుకు అసలు విషయం బోధపడలేదు.

"ఏమిటీ విపరీతమైన చూపులు; వీటికేమైనా ప్రాతిపదిక ఉందా?"



అని ప్రశ్నిస్తున్న మహారాజును చూచి, వీరేంద్రుడు "అవును, బావా!"- అనబోయి ఆగిపోయాడు. రాజు ఎంతో ధైర్యం చెప్పిన మీదటకాని, ముద్దుల మరిది అసలు విషయం బయటపెట్టలేదు. "నిన్న.... నిన్న.... బావా అని పిలచిన మరు క్షణంలోనే నాకు శిరచ్ఛేదనం జరుగుతుందని వారిరువురూ పందెం కాశారు. నీవు మహారాజువైనంత మాత్రాన నాకు బావవు కాకబోతివా అని."

"నిజమే, వీరేంద్రా! నీ అదృష్ట విశేషాన నీవు నన్ను బావా బావా అంటున్నప్పుడు అప్పాజీవారు సందర్భ పడలేదు. లేకపోతే, ఎన్నడో కైలాసానికి ప్రయాణం కట్టించేవారు నీ చేత."

"మీరయినా నన్ను రక్షింపలేరా, బా.... మహారాజా!"

"అనుల్లంఘనీయమైన అప్పాజీవారి ఆజ్ఞ త్రిప్పివేయటానికి మా శక్తి ఎంత మాత్రం, వీరేంద్రా?" మహారాజు తన అసమర్థతను వొప్పుకోవటం వీరేంద్రుడికి చాలా కష్టం కలిగించింది. ఒక్కసారి హుమ్మని ఛీత్కరించి వీరేంద్రుడు—

"ఈ దేశమునకు రాక ముందు ఆంధ్రదేశమునకు రాజు రాజే అనుకున్నాను. కాని, ఇక్కడికి వొచ్చి పరిస్థితిని పరిశీలించిన తరువాత— ఆంధ్రానికి మంత్రే రాజు అనే జనప్రథను వొప్పుకోక తప్పటంలేదు." వీరేంద్రుని కెటులయినా మహారాజు మనసును మంత్రినుండి మళ్ళించాలని ఆశ. కాని, అతని సనూధానం రాజు మనసును విసవలేకపోగా తద్వ్యతిరేకంగా పరిణమించింది.

"దాని కోసం నీ కెందుకు బాధ, వీరేంద్రా? అప్పాజీ అంటే, నీకేం తెలుసు?-చిన్ననాడే అంధుణ్ణి కావాల్సిన నాపైన జాలిగొని నయన దానం చేశారు. పెంచారు, పెద్ద చేశారు. సర్వ శాస్త్రాలలో, సకల శస్త్రాస్త్ర విద్యలలో దుర్నిరీక్షుని చేశారు. తుదకు నన్ను - అర్భకుడయిన నన్ను - పరరాజ మకుటాగ్ర పద్మరాగోజ్వల నీరాజనం ఇచ్చి, విజయనగర సామ్రాజ్య సింహపీఠిపైన తీవిగా నిలిపారు. నిలిపి మంత్రాంగం నెరపారు. మహా బలవంతులయిన మీ మదునాల్గురు పాత్రులనూ మట్టుబెట్టారు. మీ మామ గజపతిని కట్టి బంధించి, అస్త్రహస్తను

మా కిచ్చి పెండ్లి చేశారు. నేను ఆంధ్రదేశానికి చట్టరీత్యా రాజునేకావొచ్చు కాని, సకల శేముషీ సామ్రాజ్య చక్రవర్తి అయిన తిమ్మరుసు మహా మంత్రికి సామంత రాజును. మహారాజుకు అన్నపూర్ణాదేవి ప్రణయ కలహం నాటినుండి. గజపతుల సంబంధమన్న మోహం మొత్తింది. అందువలన సహజంగా వారికప్పాజీ వారి యందున్న అభిమానం వెల్లువికి కట్టలను తెంచుకొని ప్రవహించింది. కాని, వీరేంద్రు డంతటితో తన ప్రయత్నమును విరమింపలేదు.

"అం! కందకులేని దురద కత్తికి మాత్రమెందుకు? అయినా, నీవు మా బావవపటం వల్ల —"

రామలింగ నాయకుడు ఒక విచిత్రమైన కదలికతో వీరేంద్రుని నోరు కట్టివేశాడు. వీరేంద్రుడు గిల గిలా తన్నుకుంటున్నాడు, మహారాజు మరో సందర్భంలో ఏమనేవాడో కాని, ఈనాడు ఆయనున్న పరిస్థితిలో ఈ చిత్రాన్ని సంపూర్ణంగా అనుభవించాడు. చివరకు వీరేంద్రుణ్ణి వొదిలి పెట్టాడు ప్రధాన దండనాధుడు. ప్రసన్న వదనంతో రామలింగ నాయకుల వంక చూస్తూ "రామలింగ నాయకుల గోష్ఠి మందిరానికి రావటం ఆశ్చర్యంగానే ఉంది. అదేమిటో! ఇవాళ అప్పాజీవారు కూడా వొచ్చి వెళ్ళారట" అన్నాడు మహారాజు.

"చిత్తం మహారాజా! రాజకార్య నిర్వహణకు మహామంత్రి నన్ను నియమించటం వల్ల ఈ నాటికి గోష్ఠి మందిర సందర్శన భాగ్యం కలిగింది."

ప్రధాన దండనాయకుల మాటలకు మహారాజు చిరునవ్వు నవ్వాడు. తనకు గోష్ఠి మందిరమందున్న అభిమానం రాజకీయ యంత్రాంగ నిర్వహణాధికారులంతగా ఇష్టం లేదని మహారాజుకు తెలుసు. అయినా దాని కొరకంతగా మహారాజు బాధపడడు. రామలింగ నాయకులు ఉత్తర దిగ్విజయ యాత్రా ముహూర్త పత్రికను మహారాజుకు సమర్పించాడు. ఆమోద సూచకంగా రాజముద్ర వేయమని కోరుతూ. రాజు ముహూర్త పత్రాన్ని పరిశీలిస్తున్న కాలంలో వీరేంద్రుడన్నాడు :

"ఈ దేశమునకు మంత్రులే రాజు కదా? మరల దీనికై ప్రభువుల



ఆమోద ముద్రాసేకరణ అనే హాస్య ప్రహసనానికి అవసరమే మొచ్చిందో?"

వీరేంద్రుని వాక్కులు రామలింగ నాయకులకు అనంతమైనకోపం తెప్పించాయి. అయినా నిగ్రహించుకొని— "వీరేంద్ర పాత్రులు ఇది ఆంధ్రదేశ ఆంతరంగిక వ్యవహారమని తెలిసి మసలుట మంచిది...." అంటూ మందలించాడు.

వీరేంద్రుని ప్రవర్తన మహారాజుకు కూడా బాధాకరంగానే ఉంది. "వీరేంద్రా! చుట్టరికాన నన్ను చులకన చేసినా సహిస్తాను కాని, అప్పాజీ వారిని పల్లెత్తు మాట అంటుంటే విని సహించలేను, రాజకీయాలలో జోక్యం కలిగించుకోవటం మంచిది కాదు" అన్నాడు మహారాజు.

మహారాజు తన అంగుళితో రాజ ముద్రికను ముద్రించి, ముహూర్త పత్రాన్ని రామలింగ నాయకులకిస్తూ— "విశేషా లింకేమైనా ఉన్నాయా?" అని ప్రశ్నించాడు.

"ప్రభువులకు విన్నవింపదగినవేమున్నవి?"

"మరి మంత్రులకు విన్నవింపదగినవి?" వీరేంద్రుడు మరల అడ్డొచ్చాడు.

"అవి ప్రభువులకు అనవసరం: ఆ పైన మీకు అసలనవసరం" అన్నాడు రామలింగ నాయకుడు కోపాన్ని దిగమ్రింగుతూ. ఆయనకు ఆ గోష్ఠి మందిరంలో ఉండటం కష్టంగా పరిణమించింది. "ప్రభువులు సెలవు దయచేస్తే వెళ్ళివస్తాను...." అంటూ రాజానుమతితో నిష్క్రమించాడు.

"అబ్బ! రెండు నిమిషాలు రాజకీయ వ్యాసంగం చేయటంతో వేడెక్కిపోయింది మా మనస్సు. తిమ్మనగారూ! ఆ ఉష్ణాధిక్యతను తగ్గించటానికి ఒక పది కమ్మటి పద్యాలు మీ నోటి నుండి వినాలని ఉంది. ఇంతకూ మీ పారిజాతాపహరణ కావ్యం ఎంత వరకు పురోగమించింది, మహాకవీ!" అన్నాడు మహారాజు తిమ్మనార్యుల వంక చూస్తూ.

"మంచి రసకందాయానే పడ్డది. కాని, నాయకుడగు శ్రీకృష్ణ పర

మాత్రకు ఒక్క శ్యాలకుని సృష్టిస్తే కాని, కావ్యం పరిపూర్ణత పొందదేమో అని అనుమానంగా ఉంది."

రాయలు పక-పక నవ్వాడు. "మా వీరేంద్రుని చూసిన తరువాత మీకీ బుద్ధివిశేషం అంకురించినట్లుంది."

"మరేనండీ" తిమ్మనగారు ఆమోదించారు.

"కాని, మీరట్లాంటి పని తొందరపడి చేయకండి. రసం నీరసమై పోతుంది." అన్నాడు మహారాజు.

మహారాజు మాటలు వీరేంద్రునితో ఏ పరివర్తన తెచ్చాయో మరి-

"ఔను. నేను రాజశ్యాలకుడుగా కావ్య ప్రవేశం చెయ్యటమేమిటి? రాజుగానే కావ్య ప్రవేశం చేస్తాను. ఒక్క రోజు ఆగండి" అంటున్న వీరేంద్రుడి వచనాలను పరిహాస పూర్వకంగానే గ్రహించాడు మహారాజు.

"చిత్తం. మీ స్మారక సంచికను కూడా రేపే ప్రారంభిస్తాను." అంటున్న తిమ్మనగారి వంక చూచి రాయలవారు -

"పిచ్చుకమీద బ్రహ్మాస్త్రమా! ఇతని కన్నా మీకు వేరే నాయకుడు దొరకలేదేమిటి? ఆఁ! ఇంతకూ నేడు తమ కావ్యమెంత వరకూ పురోగమించింది మహాకవీ?" అని ప్రశ్నించాడు మహారాజు.

తాను వ్రాసిన కావ్యాన్ని ఏ రోజు కా రోజు ప్రతి సాయంకాలం మహారాజుకు అయినంత వరకూ చదివి వినిపించటం తిమ్మనార్యునకు అలవాటు. ఆనాడు ఆయన ఒక్క పద్యం మాత్రమే వ్రాయగలిగానని రాయలవారికి విన్నవించాడు.

"ఒక్క పద్యమేనా !"

"అవును, మహారాజా! అంతటితో లేఖిని ఆగింది."

"కారణం."

"ఆ ఒక్క పద్యంలోనే ఔచితీభంగం కలిగెనేమో అన్న అనుమానం వల్ల గంటం ఎదురు తిరిగింది."

"అంతేనా! లేకపోతే, విజయనగరంలో కరక్కాయలకు కరువొచ్చిందా!" అన్నాడు వీరేంద్రుడు. అతని వాక్కులలోని శ్లేష అర్థమైన మహాకవి తనకు కావాల్సిన అర్థాన్ని స్వీకరించాడు.



"హాస్యమునకన్నా విజయనగరవిద్యాగర్వ కారణమును పరోక్షంగానైనా ఒప్పుకున్నారు. విజయనగరంలో కవులు లేఖినిని సంతృప్తి పరచటానికి ప్రపంచంలో ఉన్న కరక్కాయలు చాలవు. కాని, నా లేఖిని ఆగటానికి కారణం ఔచితీభంగాన్ని గురించిన అనుమానం మాత్రమే!"

"తమరు ఔచిత్యభంగం కావించటమా! అసంభవం మహాకవీ!" అన్నాడు ప్రభువు.

"ఆ విషయాన్ని ప్రభువులే పరిష్కరించాలి. దేవలోకం నుండి నారదమహర్షి పారిజాత పుష్పాన్ని తీసుకొని వచ్చి రుక్మిణీమందిరాన ఉన్న కృష్ణునిచేత రుక్మిణికిప్పించి. ఆ విషయం నాయిక అయిన సత్యభామతో చెప్పాడు. పేరలుకం జెందిన సత్యభామ అలక గృహంలో ప్రవేశించింది. ఆమెను సుప్రసన్నను చేసుకోవటానికి శ్రీకృష్ణుడు ప్రయత్నించాడు.

పాటలగంధి చిత్తమున పాటిలు కోపభరంబు తీర్ప నె
ప్పాటను పాటుగామి మృదుపల్లవ కోమల తత్పదద్వయీ
పాటల కాంతి మౌళి మణిపంక్తికి పన్నియపెట్ట యా జగ
న్నాటక సూత్రధారి యదునందను డర్మిలి మ్రొక్కె
మ్రొక్కెనన్.

"మొత్తానికి పరమేష్ఠి అంతటి వాడిచేతనే మ్రొక్కించారే!" అన్నాడు వీరేంద్రుడు.

"కాని, ఇక్కడ కృష్ణుడు పరమాత్ముడు కాడు; ప్రియుడు. సన్నివేశం కేవలం ప్రణయం" తిమ్మనగారు వివరించారు.

"నిజమే! ఇచ్చట కృష్ణునకు దేవత్వం లేదు; ప్రణయమే ప్రధాన రసం" ప్రభువులామోదించారు.

"తరువాత ...."

తిమ్మనార్యుడు తరువాతి పద్యాన్ని చదివాడు,

జలజాతాసన వాసవాది సురపూజాభాజనంబై తన
ర్చు లతాంతాయుధు గన్న తండ్రి
శిరముచ్చో వామ పాదంబునన్

తొలఁగం బ్రోచె లతాంగి అట్లయగు నాథుల్
నేరముల్ సేయ పే
ర్లలుకం జెందిన యట్టి కాంతలుచిత
వ్యాపారముల్ నేర్తురే.

"ఔచిత్యం విషయ మెట్లున్ననూ, శృంగారం మహోన్నత దశను అందుకుంది" అన్నాడు వీరేంద్రుడు. రాయలవారికా పద్యం వింటుంటే మనసు మరొక చోటికి పరిగెత్తినట్లయింది. రెండు క్షణాల తరువాత- మహారాజు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.

"ఔచిత్య దోషం అణు మాత్రం కూడా లేదిందులో. సత్య శ్రీకృష్ణుణ్ణి ఎప్పుడూ పరమాత్ముడుగా పరికించలేదు. ఆమె దృష్టిలో అతడు కనీసం ఒక రాజైనా కాడు; కేవలం ప్రియుడు, తాను ప్రేయసి. ప్రేయసీ ప్రియుల మధ్య సంబంధం ప్రణయం. ప్రణయమున ఇరువురునూ సమాన భాగస్వాములే కాని, తారతమ్యాలు లేవు. కృష్ణుడు తనకు జరిగిన అవమానాన్ని ప్రియుడుగా సన్మానం క్రిందనే గ్రహించాలి...." అంటూ మహారాజు ఆసనం మీదినుండి లేచి "మహాకవీ! మన్నించండి...." అంటూ గోష్ఠిమందిరం నుండి వెళ్ళిపోయాడు.

"కలిపితివయ్యా రాజునూ, రాణినీ!" అన్నాడు వీరేంద్రుడు అభినందన సూచకంగా.

"చేతనైతే విడదియ్!" అన్నాడు తిమ్మనకవి- తాను సాధించిన విజయానికి మురిసిపోతూ.

"నా బుద్ధి బలానికి అది ఒక గణుతించాల్సిన విషయం కాదు. కాని, దానివల్ల ప్రయోజనం లేదు. ప్రయోజనరహితమైన కార్యాన్ని వీరేంద్రుడెప్పుడూ చేయలేదు: చేయబోడు!" అంటూ పాత్రుడు చరచరా వెళ్ళిపోయాడు.

వీరేంద్రుడు వెళ్ళిపోయిన కొన్ని నిమిషాల వరకూ తిమ్మన కవి- అతను వెళ్ళినవైపే చూస్తూండి పోయాడు. వీరేంద్రుని పోకడ తీరును పరిశీలిస్తున్న కొద్దీ ఆయనకు ఎందుకో అనేక అనుమానాలు రాసాగాయి. తన రచన నైపుణ్యంతో రాజునూ, రాణినీ కలిపిన సంతోషం క్రమంగా



అంతరించ సాగింది. మహామంత్రి కీడు శంకిస్తున్నా, ఈ పుట్టినింటి నుండి వొచ్చిన శనిమెట్టినిల్లు వదలక ముందే - రాజదంపతులను కలపటం ఏ తీవ్ర పరిణామాలకు దారితీస్తుందోనని భయపడసాగాడు. తిమ్మనార్యునికి జోతిష్యశాస్త్రంలో కొంత ప్రవేశం ఉంది. మహారాజు పరివర్తన ఘడియల ననుసరించి ఫలితార్థం నిర్ణయించటానికి పూనుకున్నాడు. అతని ముఖ భంగిమలు క్రమక్రమంగా మారిపోసాగాయి. ఇంతలో రామలింగ నాయకులు ప్రవేశించి, అన్యాసక్తుడై ప్రశ్న పడుతున్న మహాకవిని చూచి మెల్లగా ప్రశ్నించాడు.

'ఫలిత మేమని వొచ్చింది?'

తిమ్మనగారు తల ఎత్తకుండానే పరధ్యానంలో సమాధానం చెప్పారు: "పరిస్థితి కొంత వరకూ విషమంగానే ఉంది.

'ఎవరి పరిస్థితి?'

"చెప్పలేం ఒక అత్యున్నతోద్యోగి____అంటూ తల ఎత్తి ఎదురుగానున్న రామలింగ నాయకులను చూచి 'మీరా?' అని విస్తుపోయాడు. "మళ్ళీ ఎందుకు తిరిగి వొచ్చారు?"

"అసలు పోతే కదా - తిరిగి రావడానికి? మహామంత్రి నన్ను ఇక్కడే ఉండమన్నారు." రామలింగనాయకులు నవ్వుతూ సమాధానం చెప్పారు.

"అయితే, ఉండండి. నాకు సాయం సంధ్యకు వేళ అయింది. వెళ్ళాలి...." అంటూ లేచిన మహాకవిని కొద్ది కాలమాగండని అభ్యంతర పెట్టాడు రామలింగనాయకులు.

"కాదయ్యా! నేను పోవాలి."

"కాని, అట్లా పోవటానికి అనుమతి లేదే?"

"ఎంత మహా దండనాథులైనా కవులమైన మాపైన మీ అధికార మేమిటి?"

"తాము వచ్చేవరకూ మీరు గోష్ఠీమందిరం కదలరాదని మహామంత్రిగారి ఆజ్ఞ!"

"మహామంత్రులిచ్చటకు విచ్చేస్తారా-ఇప్పుడు?"

"అవును. వచ్చే వేళయింది. ఆఁ! కాని, జోస్యం సక్రమంగా గుణించినట్లేనా?" అన్నాడు దండనాథుడు విషయాసక్తతతో.

జోస్యపు ప్రశంస వచ్చేసరికి తిమ్మనార్యునకు పాషాణం మ్రింగినంత పనయింది.

"ఆఁ! జోస్యం ఏం జోస్యం? ఆ విషయం మర్చిపో. నేను గుణించనూలేదు; నువ్వు విననూలేదు. తెలిసిందా?"

"అంత తేలిగ్గా తప్పుకోగలరా, మహాకవీ? పోనీలెండి, నాకు చెప్పకపోతే మానె-మహామంత్రులకు కూడా చెప్పరా?" రామలింగనాయకుడు కావాలనే మంత్రి ప్రశంస ఎత్తాడు. ఆయనకు తెలుసు - మంత్రి పేరు మహత్తర కార్యాలను సాధిస్తుందని నిజంగానే సాధించింది. మహామంత్రి పేరు వినగానే కవిరాజు గజగజా వణికిపోయాడు.

"రామలింగ నాయకా! ఈ విషయం మంత్రిగారికి మాత్రం చెప్పబోకు - నీకు పుణ్యముంటుంది. ఒకవేళ నా జోస్యమే ఫలిస్తే; రాజునూ, రాణినీ ఈ విషగడియల్లో కలిపిన దోషానికి నా శరీరంలోనించే హంసను లేపగొడతారు...." అంటూ ప్రాధేయపడుతున్న మహాకవికి దండనాథుడు రహస్య గోపనంచేస్తానని మాట యిచ్చాడు. తిమ్మనార్యుడు అసలు విషయం చెప్పటానికి ఉపక్రమిస్తూ—

"ఒక్క సంగతి; నన్ను పిచ్చివాడి క్రింద జమ కట్టరు కదా?" అన్నాడు.

"లేదులెండి. మీ జోస్యంలో నాకు ఒక్కింత నమ్మకం లేకపోలేదు.

"అయితే జాగ్రత్తగా వినండి. తెల్లవారే లోపల ఒక మహజ్జాతకుడు అస్తమిస్తాడు."

"నిజంగా!" ఆశ్చర్యపోయాడు దండనాథుడు.

"నిజం కాకుండా చేయాలని విశ్వప్రయత్నం చేశాను. కాని, జోస్యం



విఫలమయ్యే అవకాశాలు కంచు కాగడాలు వేసి వెతికినా కనిపించటంలేదు. అంతే కాదు; పరిశీలిస్తున్న కొద్దీ ఆ పోయే మహజ్జాతకుడు మరొక మహా మహజ్జాతకుని తోడుకొని పోతాడు."

ఈ వార్త రామలింగనాయకులకు సంభ్రమాశ్చర్యాలను కలిగించింది. నిజానికి ఆ క్షణాన సామ్రాజ్యంలోని ఏ ప్రధాన వ్యక్తీ మరణశయ్యమీదలేడు. అయితే, మహాకవి జ్యోసం మీద ఆయనకు విపరీతమైన విశ్వాసం ఉంది, ఆయన తాను అర్ధరాత్రమున వారాంగనచేత చపేటము తిన్న సంఘటనను వివరించిన నాటినుండీ. అదుర్దా ప్రతిధ్వనించే రుద్ధ స్వరంలో అడిగాడు,

"అంత్యము సహజమా, లేక అసహజమా?" అని.

"దారుణం." మహాకవి వాక్కు నిజంగా దారుణంగా ఉంది.

"తప్పించటానికి అవకాశం ఉందా, మహాకవీ!"

తిమ్మనగారు పెదవి విరుస్తూ సమాధానం చెప్పాడు. "ప్రయత్నించటంలో దోషమేముంటుంది?" అంటూ ఒక్క క్షణమాగి - "ఈ అపరాధమంతా నాదే. మహామంత్రి అంతగా ఇష్టపడకున్నా వారిని ఒప్పించి ఈ దుర్ముహూర్తాన రాజదంపతులను కలిపి రెండు నిండు ప్రాణాలను ఎసరు పెట్టాను. కనీసం ఒక జాతకుడైనా శాస్త్రరీత్యా అస్తమించక తప్పదు." అన్నాడు తిమ్మనకవి పశ్చాత్తాపభారంతో - రామలింగ నాయకుడు కూడా వ్యధిత హృదయంతో పరిష్కారానికోసం ప్రాకులాడుతున్నాడు. మస్తిష్కంలో ఒక చిత్రాతి చిత్రమైన ఊహ మెరిసింది.

"ఒక్క పని చేస్తే."

"ఏమిటది?"

"విజయనగర రాజకీయాలలో ఈ మధ్య వీరేంద్రుడు అత్యున్నత స్థాయినందుకుంటున్నాడు. ప్రస్తుతం రాజుకు చాల కూర్పువాడు."

"నిజమే."

"అతణ్ణి అంతం చేస్తే."

"చాల చక్కగా ఉంటుంది."

"అయితే, తెల్లవారేసరికి అతడుండడు."

"కాని, ఈ విషయం అప్పాజీవారికసలు తెలియరాదు సుమా!" అంటున్న తిమ్మనార్యుని అమాయకతకు విపరీతంగా నవ్వాడు మహామంత్రి. అసలు మహామంత్రి వొచ్చి చాల కాలమైంది. కాని, తమ గుణకముల లోనూ - రహస్యాలోచనలలోనూ వారిద్దరూ మహామంత్రి ఆగమనాన్ని గుర్తించలేదు. తమ ఎదుట హఠాత్తుగా నవ్వుతూ సాక్షాత్కరించిన తిమ్మరుసు మంత్రిని చూచి తిమ్మనార్యుడు విచిత్రమైన అనుభూతిని పొందాడు.

"అలా చూస్తారేం! మీరు నా నుండి ఏది దాచాలని చూస్తున్నారో, ఆ విషయాన్ని సంపూర్ణంగా గ్రహించాను. కాని, మహాకవీ! మీది కేవలం రజ్జు సర్ప భ్రాంతి. మీ జ్యోతిర్విద్యా నైపుణ్యం సాటి లేనిదే కావచ్చును కాని, బుద్ధి బలమున విధినైనా త్రోసి రాజనవచ్చు..." అంటున్న మహామంత్రి మాటలకు సమాధానంగా తిమ్మనార్యుడు—

"తాము అశ్వక్రయమునకు వెళ్ళలేదా?" అని ప్రశ్నించాడు.

"వెళ్ళిన మాట నిజమే. కాని, సరియైన అశ్వములు క్రయమునకు రాలేదను మాట విని తిరిగి వచ్చాం. మేము వొచ్చేసరికి మీరు గుణకములలో ఉన్నారు."

మహామంత్రికన్ని విషయాలూ తెలిసిపోయాయని తిమ్మనార్యునకు అర్థమైంది. ఇక లాభం లేదనుకొని- తాను చేసిన పనికి మన్నించమని వేడుకున్నాడు.

మహామంత్రి సాదరంగా మన్నించమని మాట ఇస్తూ- తిమ్మన రహస్యాన్ని రహస్యంగానే ఉంచుతానని అభయమిచ్చాడు.

ఇంతలో తిమ్మనార్యునికి ఒక విషయం జ్ఞాపకం వొచ్చింది. "ఒక్క ముఖ్య విషయం మహామంత్రీ! వీరేంద్రుణ్ణి నేను వ్యంగ్యానికి రాజ శ్యాలకునిగా కావ్య ప్రవేశం చేయిస్తానంటే, ఒక్క రోజాగుము, రాజుగానే కావ్య ప్రవేశము చేస్తానని మహారాజు ముందే సవాలు చేశాడు."

తిమ్మనార్యుని వచనాలు విన్న మహామంత్రి వీరేంద్రుని వ్యక్తిత్వాన్ని నిర్వచించటానికి ప్రయత్నించాడు. "దీన్నిబట్టి వీడికి రాజ్యాశ కలదని ఊహించవొచ్చు. వీడు కేవలమొక పిచ్చివాడన్నా కావాలి, లేక పోతే మన కళ్ళలో నుండి దూరిపోయిన మహా మేధావి అయినా కావాలి.



"పరిస్థితులను బట్టి మహారాజుకు ప్రమాదం శంకించవొచ్చా, మహామంత్రీ?" అని ప్రశ్నించాడు దండనాథుడు అదుర్దాగా.

"ఏమైనా ఈ రాత్రి కొంత జాగ్రత్తగా ఉండటం మంచిది. ఈ క్షణం నుంచీ మహారాజుకు కనుచూపుమేర దూరమున ఉంటూ, మీరే స్వయంగా రాజ రక్షణా బాధ్యతను స్వీకరించండి, విశేషమేమైనా ఉంటే, మా రహస్యాలోచనా మందిరానికి వెంటనే కబురు పెట్టండి. ఇక మీరు వెళ్ళవొచ్చు...." అంటూ రామలింగ నాయకునికి అనుమతి నిచ్చాడు మహామంత్రి.

రామలింగ నాయకుడు అనలేక అనలేక అన్నాడు నాలిక పెకల్చుకొని- "తమరు కూడా తగు జాగ్రత్తలో ఉండండి మహామంత్రీ! అతడు మీ పైన కూడా పగపట్టి ఉన్నాడు" అని.

"అవును మహామంత్రీ! రాయలవారికి మీపైన అయిష్టత కలిగించటానికి, మా ఎదుటే ఈ మందిరంలోనే విఫల ప్రయత్నం చేశాడు," అన్నాడు తిమ్మనార్యుడు.

మహామంత్రి చిరునవ్వు నవ్వుతూ, సగర్వంగా "రాయలకు తిమ్మరుసు కేవలం అమాత్యుడే కాక, అప్పాజీ అనే విషయం అన్య దేశీయుడైన అతడికేం తెలుస్తుంది?" అన్నాడు. ఆ తరువాత అమాత్యుల వద్ద సెలవు తీసుకొని రామలింగ నాయకుడు వెళ్ళిపోయాడు.

మహామంత్రి తిమ్మనగారి వంక తిరిగి "తిమ్మనగారూ! మీరొక చిన్న పనిచేయాలి. చిన్న రాణిగారి అంతఃపురమున మీకు సర్వ స్వతంత్రం.

"అవును."

"ఈ రాత్రి మీరక్కడికి వెళ్ళి, ఎలాగైనా వీరేంద్రుణ్ణి కలుసుకొని మీరు వ్రాస్తున్న పారిజాతాపహరణానికి వాడే తగిన కృతి భర్త అని చెప్పి, మీ కావ్యగానంతో ఈ రాత్రంతా వాణ్ణి కదలనియ్యరాదు."

"ఒకవేళ వాడు వినకపోతే?" మహాకవి అమాయకంగా ఎదురు ప్రశ్న వేశాడు."

"వినకపోయినా ఇబ్బంది లేదు. వెంటబడి చదవండి." మహామంత్రి సలహా చెప్పాడు.

"వాడు లేచి పోతే?"

"మీరూ వాడి వెంటనే పొండి. ఆఁ! మరొక విషయం: ఈపాటికి రాజు-రాణిని కలిసి ఉంటాడా?"

"తమకు తెలియంది ఏముంది? ప్రథమ యామాంతాన కాని, మహారాజు సాధారణంగా అంతఃపుర ప్రవేశం చెయ్యరు."

"అట్లా అయితే రాజును, రాణిని కలువకుండా చేస్తే?"

"అది మంచి పద్ధతే. కాని, అది ఎట్లా సాధ్యమౌతుంది, మహామంత్రీ?"

మహామంత్రి ఒక్క క్షణం ఆలోచించాడు. ఆ తరువాత ఇట్లా అన్నాడు: ఆ విధంగా చేయమని మా మాటగా అచ్యుతరాయలవారితో చెప్పండి అతను సమయానుకూల సన్నివేశాన్ని సృష్టించి. మహారాజు దారి మళ్ళించి కార్యాన్ని సాధిస్తాడు."

# 5

అన్నపూర్ణాదేవి అంతఃపురాంతర్గత ఉద్యానవనంలో చంద్రకాంత శిలా వేదిక మీద ఒంటరిగా కూర్చొని, జయదేవుని గీత గోవిందకావ్యాన్ని గానం చేస్తున్నది. అనాటి రాధ హృదయానికి సన్నిహితంగా ఉంది - ఈనాటి ఆమె పరిస్థితి, అనుక్షణమూ మహారాణి ఆకాశంవంక ఆదుర్దాతో చూస్తూంది: ఏ క్షణాన చంద్రుడుదయిస్తాడో అని ఆమె భయం. ఆమె చిలిపి చంద్రుణ్ణి చూడకూడదనే అనుకుంటుంది. కాని, చూడకుండా ఉండలేదు. అసలానాడు అమావాస్య కాని, రాణికి ఆ విషయం గుర్తు లేదు. విరహబాధ నధికం చేసే ప్రతి వస్తువూ భయంకరంగా కనిపిస్తూంది మహారాణికి. కాని, వాటి మధ్యనే తిరుగుతూ తన బాధ నతిశయింపజేసుకోవటంలో మహారాణికి ఒక తెలియని సంతృప్తి ఉంది. ఆ విచిత్రమైన



మనస్తత్వంతోనే రాధికా విరహాన్ని హృదయం ద్రవించిపోయేలా తన మధుర కంఠంతో గానం చేస్తున్నది.

స్తన వినిహితమపి హారముదారం
సామనుతే కృశతను రివ భారం
రాధికా తవ విరహే కేశవ
రాధికా తవ విరహే.
సరస మసృణమపి మలయజ పంకం
పశ్యతి విషమివ వపుషి సశంకం
శ్వసితపవనమనుపమ పరిణాహం
మదన దహనమివ వహతి సదాహం
నయన విషయ మపి కిసలయ తల్పం
కలయతి విహిత హుతాశన కల్పం
త్యజతినపాణి తలేన కపోలం
బాల శశిన మివసాయము లోలం
హరిరితి హరిరితి జపతి సకామం
విరహ విహిత మరణేన నికామం.

మహారాణి పాట హృదయాన్ని కరగించి వేస్తూంది. ఆమె పరిస్థితికి సానుభూతి సూచకంగా ప్రకృతి నిశ్శబ్ద గాంభీర్యాన్ని దాల్చింది. అశ్రుకలితమైన మహారాణి చెక్కిళ్ళను రెండు హస్తపద్మాలు సోకటంతో మహారాణి పాట ఆగిపోయింది. వెనుక నుండి వచ్చి కళ్ళు మూసింది తన మనోహరుడైన మహారాజని గ్రహించింది. విరహవేదనాకులిత అయిన మహారాణి ఆనంద పారవశ్యంలో కళ్ళవెంట కారుతున్న దుఃఖాశ్రువులు ఆనందబాష్పాలుగా మారిపోయాయి.

"వచ్చారా?"

"ఊఁ!"

"నా మీద ఇప్పటికి దయ కలిగిందన్న మాట?"

"ఛా! అలా అంటావేం? ఊరుకో దేవీ!"

"నన్ను సంపూర్ణంగా క్షమించారన్న మాట?"

"తప్పుతుందా మరి!"

"అబ్బ! చేతులు వొదలండీ! బాధగా ఉంది."

"మరి పేరు చెప్పుకో!"

"ఇన్నేళ్ళు వొచ్చి, ఇన్నాళ్ళు సంసారం చేసి ఇదేం కోరికండీ?"

"ఊఁహూఁ!"

"సరే మీ మోజు ఎందుకు తీర్చకపోవాలి? రాయలవారికి కాక, మరొకరికి రాణీగారి మీద ఇంత చనువు ఉంటుందా?"

"నీకు తెలుసు. కావాలంటే అంతకన్నా చనువు పుచ్చుకోగలవాడు ఇంకోడు ఉన్నాడు."

ఈ సమాధానం విన్న వెంటనే మహారాణికి వళ్ళంతా జెఱ్ఱులు ప్రాకినట్లయింది. ఆమె కన్నులను బంధిస్తున్న హస్తాలు అబ్జాలులాగా కాక, యమపాశాలలాగా కనిపిస్తున్నాయి. పొరపాటు పడ్డానని గ్రహించిన మహారాణి క్షణ కాలంలో తన్ను వంచించింది వీరేంద్రపాత్రుడని తెలుసుకోగలిగింది. గాద్గదిక కంఠంతో— 'వీరేంద్రా!—' అంటూ తన బలాన్ని హస్తాల్లోకి సేకరించుకొని, వీరేంద్రుడి హస్తాలను విసిరి కొట్టి బయటపడ గలిగింది. "నీవేనా ఈ పని చేసింది వీరేంద్రా?"

వీరేంద్రుడు తొణికలేదు, బెణకలేదు. "అవును నేనే. 'వీరేంద్రుడా వీరేంద్రుడా!' అని పిలిచే కన్నా, ఒక్కసారి చిన్ననాటి నుండీ అలవాటు పడిన విధాన 'బావా!' అని సంబోధించరాదూ?" అన్నాడు రాణికి పూర్వ విషయాలు జ్ఞప్తికి తెస్తూ.

కాని, రాణి ఆ విషయాలను సంపూర్ణంగా మరచిపోయింది. మరచి పోకపోయినా మరచిపోవాలని ప్రయత్నిస్తున్నది.

"వీరేంద్రా! ఏమిటీ మాటలు? చిన్నప్పుడు నేను గజపతులబిడ్డను; నీవు గజపతుల మేనల్లుడవు. కాని, నేడు- నేను ఆంధ్ర సార్వభౌముని అర్ధాంగిని."

"అయితే నేను ఆంధ్ర సార్వభౌముణ్ణి ఔతాను."

మహారాణి ఈ సమాధానంతో మహోగ్రరూపం దాల్చింది.

"మతి భ్రమణ కలగటం లేదు కదా వీరేంద్రా?"



"నీ అదృష్ట విశేషాన ఇంతవరకూ అలాంటిది లేదు. కాని, అవసరానికి రమ్మంటే వొస్తుంది; పొమ్మంటే పోతుంది."

"అయితే, నీవంటున్న మాటలకు అర్థం తెలుసా?" మహారాణి ప్రశ్నించింది వీరేంద్రుడి వంక చురచురా చూస్తూ.

"అహా! నేను ఆంధ్ర సార్వభౌముణ్ణి అవుతాను. నీవు ఎలాగూ ఆంధ్ర సామ్రాజ్య మహారాణివి. అప్పుడు నన్ను బావా అని పిలవటానికి నీకు ఏ అభ్యంతరం ఉండదు ఏమంటావ్?"

వీరేంద్రుని ప్రవర్తన మహారాణికి అసహ్యాన్ని కలిగించింది. ఎంత పుట్టినింటివైపు బంధువైనా, హద్దు మీరి ప్రవర్తిస్తే మనసు విరిగి పోతుంది. "నీ ధోరణి మితి మీరుతున్నదంటాను. చట్టరీత్యా నీవు శిక్షార్హుడవంటాను." అన్నది రాణి కోపంగా.

"శిక్షా! హ హ్హా హ్హా! ఫిర్యాదీ ఎవరు?"

"నేనే" అన్నది మహారాణి అహంభావం ఉట్టి పడేలా.

వీరేంద్రుడు ఒక్కసారిగా వికటంగా నవ్వాడు. "నీవు ఫిర్యాదీ, నేను దోషి. బహు చక్కగా ఉంది. మరి, విచారణ చేసేవాడు నీ నాధుడు! వెఱ్ఱి బాగుల నాధుడు! నీ జాతకం నాకు తెలుసు; నా జాతకం నీకు తెలుసు, మన ఇద్దరి జాతకాలూ ఏ మాత్రం తెలియని వెఱ్ఱి బాగుల మహాజ్ఞాతకుడు విచారిస్తాడు. అహా! ఏం శృంగార సన్నివేశంలే!" వీరేంద్రుడి మాటలు వింటున్న మహారాణి కొయ్యబారిపోయింది. నిజానికి వీరేంద్రుడి వచనాలు ఆమెకు సమగ్రంగా అర్థంకాకపోయినా, వీరేంద్రుని ధోరణిని బట్టి- ఆమె అతని భావాలను కొంతవరకూ ఊహించుకోగలిగింది. అయినా, "నీవనేది ఏమిటో అర్థం కావటం లేదు, వీరేంద్రా!" అంది ఒక విధమైన నిస్సహాయతతో.

వీరేంద్రుడు కొంటెగా చూస్తూ- "అవును. 'వీరేంద్రా! వీరేంద్రా!' అని పిలిచినంతకాలం అర్థం కాదు. కాని, ఒక్కసారి 'బావా!' అని సంబోధించి, దాని అర్థం విచారించు, అంతా అర్థమౌతుంది?" అన్నాడు.

"నివనేది....?"

"మన ఇద్దరి ప్రణయం....

"ప్రణయమా?" మహారాణి ఆశ్చర్యపోయింది.

"ప్రణయమే కాదు వివాహం కూడా."

"వివాహమా?" పంచభూతాలూ ఒక్కసారిగా తన మీద విరుచుకు పడ్డట్లయింది మహారాణికి.

"అవును. ఆ రోజుల్లో- మనం ఆడుకునే రోజుల్లో, సరిగ్గా పాతిక సంవత్సరాల క్రితం -మన కోటలోని భవానీ ఆలయంలో, ఆ జగదాంబ ముందు రోజూ పెళ్ళిళ్ళు చేసుకునే వాళ్ళం. జ్ఞాపకం ఉందా, తుఖా?" వీరేంద్రుడు కావాలని మహారాణిని "తుఖా!" అని పాత పేరుతో పిలిచాడు.

"అది....అది ఒక బొమ్మల పెళ్ళి ఆట" అంది రాణి-వీరేంద్రుడి వాదనను త్రోసివేస్తూ.

"అయినా మనుషులకే జరిగింది.," అన్నాడు వీరేంద్రుడు.

"అప్పటికి నాకు వివాహమంటే ఏమిటో తెలీదు."

"కాని, నాకు తెలుసుగా?"

"అది అసలు వివాహమే కాదు," అంది మహారాణి.

వీరేంద్రుడు ఇక లాభం లేదనుకుని, తను ఇంతకాలంగా రాణిపై ప్రయోగించటానికి దాచి ఉంచిన మహాస్త్రాన్ని బయటకు తీశాడు. అతని ముఖం వివర్ణమై క్రమంగా అరుణారుణంగా మారిపోయింది. "మహారాణీ! అనుదినమూ మన వివాహం జరిపించిన భవానీ ఆలయ అర్చకశ్రేష్ఠుడింకా మరణించలేదు. అయినా, నాకీ ఇతర సాక్ష్యాధారాల ప్రశంస ఎందుకు? సరస శృంగార రతి సమయమున తప్ప అన్యథా వీక్షణీయము కాని కాసంత నల్లని పుట్టుమచ్చ నీ కటి ప్రదేశాన ఉంది. చాలదా ఇది-మన సంబంధాన్ని స్థాపించటానికి? బ్రతికినన్నాళ్ళూ నీ బ్రతుకు బండలు చేయటానికిది చాలదా?" ప్రశాంతమైన నీ ప్రణయ పయోధిలో ప్రళయాన్ని సృష్టించే హాలాహలాన్ని ఉద్భవింపజెయ్యటానికిది చాలదా? రాజు ముందర నిన్ను రచ్చకీడ్పించి, సహత్సులైన సాటి మానినీమణులలో పరువు తీయటానికిది చాలదా?" వీరేంద్రుని కంఠస్థాయి క్షణక్షణానికీ పెరిగిపోతోంది.



మహారాణి పరిస్థితి అను క్షణమూ దిగజారిపోతోంది. "నీ కుమారుడు-నవ మాసాలు మోసి, కని. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న నీ కుమారుడు భావి ఆంధ్ర సామ్రాట్టయిన నీ కుమారుడు-దారిన వెళుతుంటే, ప్రజలంతా కులటాపుత్రుడని వ్రేలెత్తి చూపించి, అపహాస్యం చేస్తూ గేలి చేయటానికి ఇది చాలదా, మహారాణీ? ఆలోచించుకో. నామాట వినకపోతే, బ్రతికి ఉండే నరకలోకానుభూతి పొందుతావు. ఎలాగో మగడు వొదిలేయకపోయినా, వొదిలేసినంత పని చేశాడు. ఇక నామాట కూడా వినకపోతే, నీకు ప్రపంచమే నరకంగా మారిపోతుంది."

వీరేంద్రుడి పోకడకు మహారాణి గుండెల్లో ఫిరంగులు ప్రేల్చినంత పనైంది. అతని భీకర వికృతాననం చూస్తుంటే, కాలుడి దున్నపోతు తలను దర్శించినట్లుంది. ఆమె ఆమూలాగ్రంగా వొణికిపోతున్నది. ఆ భయంకర పరిస్థితిని తలుచుకుంటుంటే, శరీరంలోని రక్తం గడ్డ కట్టుకుపోతున్నట్లుంది .మహారాణి విపరీతమైన ఆవేదనతో "వీరేంద్రా!వీరేంద్రా!" అని మాత్రం అనగలిగింది.

వీరేంద్రుడు క్షణమాత్రంలో తన ముఖభంగిమను మార్చుకుంటూ చిరునవ్వు తెచ్చిపెట్టుకోటానికి ప్రయత్నిస్తూ "బావా!" అను; "బావా!" అను "బావా!" అన్నాడు.

మహారాణి అనలేక అనలేక ఎట్టకేలకు తడబడుతూ "బావా!" అంది విధిలేక.

"మరొక్కసారి."

"బావా!"

"వేరొక్కసారి."

"బావా!"

"అదిగో-అందులో విషాదచ్ఛాయ ఏమాత్రం కనిపించకూడదు"

"బావా!" అంది మహారాణి లేని నవ్వు తెచ్చి పెట్టుకుంటూ చేసేది లేక.

"అహా! చాలు-చాలు, మహారాణీ! హృదయమానంద భరితమైంది. వెర్రిదానా! నేను నిన్ను ఏమేమో చేస్తానని భయపడుతున్నావు, ఏమా?

ఊహూ! నేను కామాంధుణ్ణి కాను. కాని, కార్యసాధనకు నాకు కామం ఒక ఆయుధ విశేషం మాత్రమే. నీ జీవితం నాశనం చేస్తే నాకే మొస్తుంది ?"

రాణి సంతృప్త హృదయంతో "వీరేంద్రా!" అంది.

"ఊఁ! 'బావా!' అను." వీరేంద్రుడు మరొక్కసారి విశ్వరూప ప్రదర్శనం ఇచ్చాడు.

అతని కంఠంలోని కఠోరతకు రాణి ఉలిక్కిపడి "బావా!" అంది.

"ఆఁ! అట్లా అను. చూడు, మహారాణీ! నేను అన్ని విధాలా నీ హితం కోరేవాణ్ణి. నీకొక మహత్తరమయిన ఉపకారం చెయ్యాలని నా కోరిక. దానికి నీ సహాయం కావాలి. పరిస్థితిని సంపూర్ణంగా అర్థం చేసుకున్న నీవు నన్ను వ్యతిరేకించవనే అనుకుంటాను." చివరి వాక్యాన్ని అనేటప్పుడు వీరేంద్రుని గొంతు కటువుగా ధ్వనించింది.

"నీవు నాకు చేసే ఉపకారం ఏమిటి?" అంది అనుమానంగా చూస్తూ మహారాణి.

"నీ కుమారుడు-కటక రాజు దౌహిత్రుడు-విజయనగర సింహాసనాధీశుడు కావాలి."

ఇది వీరేంద్రుని పాత పాటే. మహారాణికి తన కుమారుడు సార్వభౌముడౌతాడన్న నమ్మకం సంపూర్ణంగా ఉంది. ఇవాళ కాకపోతే రేపు. కాని, వీరేంద్రునకు మాత్రం బాలుని యువరాజ పట్టాభిషేకానికి వెంటనే మహారాజును సమ్మతింప చేయాలని పట్టుదల. అందులో అతని స్వార్థం లేకపోలేదు. దాని నుండి ఉద్భవించే సన్నివేశాన్ని తన కనుకూలంగా తిప్పుకోవాలని అతని ఆలోచన. అందుకే మహారాణిని సాధనంగా వినియోగించుకోవాలని, ముందు రాణిని బెదిరించి, తన చేతిలో కీలుబొమ్మగా తయారు చేశాడు ప్రథమ సోపానంగా.

"మహారాణీ! అలస్యాదమృతం విషమన్నారు. పరిస్థితులు నీకు అర్థమవటంలేదు. ఈ దేశానికి రాజు రాయలవారనే భ్రమలో ఉన్నావు. కాదు; పొరపాటు. ఆంధ్రదేశానికి అధిరాజు తిమ్మరుసు" వీరేంద్రుడు పరిస్థితిని వివరించటానికి పూనుకున్నాడు.



"కాదు. ఆంధ్రదేశానికి రాజు రాయలవారు. రాయలవారి హృదయానికి రాజు అప్పాజీవారు." అంది మహారాణి క్షణకాలం యోచించి.

మహారాణి నిర్వచనం వీరేంద్రునికి గిట్టలేదు. "నేను చెప్పేది వినాలి. అంతే కాని, నీతో వాద ప్రతి వాదాలకు నాకు తీరుబడి లేదు. అప్పాజీ వారు ఈ ఆంధ్ర సామ్రాజ్యాన సర్వాంతర్యామి. అతని కుమారుడు గోవిందరాయలు విజయనగర ప్రధాన దండనాయకులలో ముఖ్యుడు. పట్టమహిషి తిరుమలాంబికకు ఔరస పుత్రికగా పరిగణింపబడుతున్న జలజ గోవిందరాయని కాబోవు భార్య. ఇక నీ పరిస్థితినీ, అర్భకుడగు నీ బాలుని పరిస్థితినీ ఆలోచించు. ఆంధ్ర సామ్రాజ్య భావి సామ్రాట్టు నీ కుమారుడా, లేక గోవిందరాయలా?" మహారాణి కళ్ళలోకి చూస్తూ సూటిగా ప్రశ్నించాడు వీరేంద్రపాత్రుడు.

అయినా వీరేంద్రుని వచనాలను, అతని వాదనా పటిమను హర్షించలేకపోయింది మహారాణి. "అంతా బాగానే ఉంది కాని. వీరేంద్రా! నమ్మటానికి మాత్రం వీలులేకుండా ఉంది." అంది మహారాణి.

"అయినా నీ కుమారుడికి యువరాజ పట్టాభిషేకం ఇప్పుడే జరిగితే వచ్చే నష్టమేముంది ?"

"ఏమి లేదు. కాని, ఆరేళ్ళ బాలునికి పట్టాభిషేకమేమిటి?"

"వాడి కెన్నేళ్ళున్నా సరే, రేపు ప్రాతఃకాలానికి వాడి పట్టాభిషేకం జరిగితీరాలి. తెలిసిందా? అంతే! ఇదే నీవు నాకు చేయాల్సిన సహాయం" అన్నాడు వీరేంద్రుడు నిశ్చయానికి వొచ్చిన వాడిలా.

"పట్టాభిషేకం చేయటం నాచేతుల్లో ఉందా, వీరేంద్రా? పోనీ-మహారాజును ప్రాధేయపడి వొప్పిద్దామంటే, వారు ఈ వైపు రావటం కూడా మానేశారు నీకు తెలియంది ఏముంది?" మహారాణి తన నిస్సహాయతను సూచించింది. వీరేంద్రుడు - మహారాజును ఆ రాత్రి అన్నపూర్ణా మందిరానికి తీసుకొని వస్తానని అభయ ప్రదానం చేశాడు రాణికి. అతడు మహారాజు మనసు మారిన సంగతి-స్వయంగా గోష్ఠి మందిరంలో పరికించాడు. అయితే, ఆ విషయం మహారాణితో చెప్పలేదు. మహారాజును- మహారాణి మందిరానికి తీసుకొని వొచ్చిన ఘనత తనకే రావాలని తద్వారా రాణికి

తనమీద విశ్వాసమూ, తనశక్తి సామర్థ్యాలలో నమ్మకమూ పెంపొందాలని వీరేంద్రుడి ఉద్దేశం, వస్తుతః మహారాణికి వీరేంద్రుని శక్తిలో కొంత విశ్వాసముంది. అవును. తనను పది నిమిషాలపాటు నఖశిఖ పర్యంతం కేవలం మాటలతో దహించి వేసిన వీరేంద్రుడికి అసాధ్యమేముంటుంది అనుకుంది మహారాణి. వీరేంద్రుడు రాజును తీసుకొని వస్తానన్న తరువాత మహారాణి హృదయం సమస్యారహితమై సంతోషపూరితమైంది. ప్రియా గమనం జరిగినంత ఉత్సాహం ఆమె ముఖంలో వెల్లి విరిసింది. ఆ సంతోషాతిరేకంతో మహారాణి అలంకార మందిరానికి వెళ్ళిపోయింది. అవును. మరికొంత కాలంలో తన హృదయేశ్వరుడు తన మందిరానికి వస్తాడు. మోడు వారిన తన జీవితంలో మళ్ళీ మధుర వసంతం ఎన్నెచిన్నెలతో చిగురిస్తుంది.

మహారాణి వెళ్ళినదిక్కు చూస్తూ వీరేంద్రుడు ఒక చిన్న విషపు నవ్వు నవ్వాడు. జరుగబోయే సన్నివేశం అంతా అతని కళ్ళకు కట్టినట్లుంది. మహారాజు ఎలాగూ ఇప్పుడిక్కడికి వస్తాడు. తన యందుండే భయంతో రాణి-రాజును తన కుమారుడి యువరాజ పట్టాభిషేకాన్ని కోరుతుంది పునఃసమాగమానందాతిశయాన, పుత్రవాత్సల్య విశేషంతో రాజు అందుకు తప్పకుండా సమ్మతిస్తాడు. సహజంగా అమాత్య శేఖరుని ఆమోద ముద్ర కోసం ప్రయత్నిస్తాడు. ఉత్తర దిగ్విజయ యాత్రకు బయలు దేరే ఈ సందర్భంలో, యువరాజ పట్టాభిషేకం అశుభ సూచకం కాబట్టి అప్పాజీవారు అందుకు అంగీకరించరు. దానివల్ల రాజుకూ, మంత్రికీ కొద్దిగా అభిప్రాయ భేదాలు రావటానికి అవకాశం ఉంది. తనకది చాలు-సమయానుకూల వచనా రచనా నైపుణ్యంతో, ఆ చిన్ని అభిప్రాయ భేదాన్నే మహత్తరమైనస్పర్థగా మార్చివేయగల ప్రతిభా వ్యుత్పత్తి తనకున్నాయి. దాని విపరీత విషమ పరిణామమే మహామంత్రి తిమ్మరుసయ్యగారి మహోజ్జ్వల రాజకీయ జీవితమునకు సజీవ సమాధి ఔతుంది కాదు-మహామంత్రి విగత జీవుడే కావాలి. శత్రు శేషమునకు రాజకీయమున ప్రాజ్ఞులొప్పరు. దండతాడిత భుజంగం తోకపై, ఋస్సున కాటందిక మానదు. వీరేంద్రుని ఊహా ప్రపంచం మహామంత్రి ఆగమనంతో అదృశ్యమై



పోయింది, ఆ సమయాన మహామంత్రి అక్కడికొస్తాడని వీరేంద్ర పాత్రుడు కలలో కూడా అనుకోలేదు. అయినా, మహామంత్రిని చూడగానే వినయం ఉట్టిపడేలా తలవంచి నమస్కరించి—

మహాంధ్రదేశ రాజ తంత్ర మంత్రజాల భూషణా
అహీన శేముషీ దురంధరార్యలోక పూజితా
సుహాసపూర్ణ దివ్యతేజ శోభితా సుధాకరా
మహానుభావా సాళ్వ తిమ్మ మంత్రిదేవ పాహిమాం!

—అంటూ కమ్మటి కంఠంతో స్తోత్రం చేశాడు మహామంత్రిని-హృదయాంతర్గత భావాలను అణచుకుంటూ. వీరేంద్రుడి అతి వినయం ధూర్తలక్షణమని గ్రహించిన మహామంత్రి చిరునవ్వు నవ్వాడు.

"నేను రాయలవారిని కాను; అయితే నీవు వ్రాసిన పద్యానికి అక్షర లక్షలిచ్చి వుండేవాణ్ణి. నీవేనా అసలు వ్రాసింది?" అని ప్రశ్నించాడు మహామంత్రి.

"నేనే. అది నా ఆశుధార, మహామంత్రీ!"

"జానాను. నీ ధారలు చాలా నిశితంగా ఉన్నాయి," అన్నాడు మహామంత్రి-వీరేంద్రుణ్ణి ఆమూలాగ్రంగా పరికిస్తూ.

వీరేంద్రుడయినా తక్కువ తిన్నవాడు కాదు. ఆ చూపుల ధాటికి తట్టుకొని, మహామంత్రిని ఎదురు ప్రశ్న వేశాడు: "పొరపాటున మహామంత్రులు అంతఃపుర ప్రవేశం చేసినట్లున్నారు."

"పొరపాటున కాదు; కావాలనే వొచ్చాం. అంతఃపురమైనా మాకు అడుగిడరాని ప్రదేశం కాదుగా; ఆఁ, ఇంతకూ రాయలవారున్నారా?" అన్న మహామంత్రి ప్రశ్నకు వీరేంద్రుడు వెంటనే సమాధానం చెప్పాడు. రాయలవారు వొచ్చి చాల కాలమైందనీ, రాజూ-రాణీ పునస్సమాగమానందాతిశయంలో కాలక్షేపం చేస్తున్నారనీ, మహామంత్రి—వీరేంద్రునితో తమ ఆగమనాన్ని మహారాజుకు సూచించమని చెప్పాడు.

"అభ్యంతర మందిరంలో ఉన్నారే!"

"శ్యాలకులకు సర్వస్వాతంత్ర్యం," అన్నాడు మహామంత్రి సాభిప్రాయంగా.

"మీకు అడుగిడరాని ప్రదేశమే లేదంటిరే? వారి శృంగార ప్రణయ సన్నివేశాలను చూస్తూ, చూడనట్లు కళ్ళు మూసుకుని మాట్లాడటానికి ఎంత బెద్దా, బావను కాబట్టి వెళ్ళడానికి మనస్కరించటంలేదు." వీరేంద్రుడు తప్పుకోటానికి ప్రయత్నించాడు.

"అవునులే - మేము చెయ్యాల్సిన కార్యాలకు ఇతరులను ఎందుకు శ్రమపెట్టాలి?...." అంటూ మహామంత్రి ముందుకు సాగటంతో వీరేంద్రుడి పని ఇరకాటాన పడ్డట్టయింది.

వెంటనే మహామంత్రుల నుద్దేశించి "మహామంత్రీ! మీరు ఇచ్చే శ్రమ నాకు ఆనందదాయకం. ఒక్క క్షణంలో తమ ఆగమనాన్ని మహారాజుకు సూచించివస్తాను. ఉండండి...." అంటూ చరచరా వెళ్ళిపోయాడు వీరేంద్రపాత్రుడు.

రాయలవారు అప్పుడే అంతఃపురానికి వొచ్చారన్న వార్త అప్పాజీ వారికి ఆశ్చర్యాన్ని కలిగించింది. అయినా, పునస్సమాగం కాబట్టి. రాయలవారు కొంత వేగిరపడి ఉండవొచ్చనుకున్నాడు. ఇంతలో "మహారాజింకా అంతఃపురానికి రాలేదు!" అని తన చెవిలో చెప్పినట్లయింది మహామంత్రికి.

"ఎవరు....?" అంటూ ప్రక్కకు తిరిగాడు మహామంత్రి.

ముక్కు తిమ్మనగారు. ఆయన వీరేంద్రుణ్ణి అన్వేషిస్తూ చిన్నరాణి అంతఃపురానికి వొచ్చాడు.

"అదంతా బూటకమండీ! మహారాజు తిరుమలాంబిక అంతఃపురంలో ఉన్నారు. రాజు ఇక్కడకు వస్తుండగా మీ ఆజ్ఞానుబద్ధుడైన అచ్యుతరాయలవారు మహారాణి తిరుమలాంబికకు రుగ్మతగా ఉన్నదని చెప్పి రాజును అక్కడికి తీసుకొని వెళ్ళారు."

"పట్టమహిషి నిజంగా అస్వస్థురాలా?" మహామంత్రి ఆదుర్దాగా ప్రశ్నించాడు.

"ఆఁ, మామూలు రుగ్మతే! సన్నివేశానికనుకూలించింది. అంతే!"

"అయితే, రాజు ఇక్కడకు వస్తాడనే భయం లేదుగా?"

"ఆహా! ఈ రాత్రికా ప్రమాదం లేదు."

ఇంతలో వీరేంద్రపాత్రుడు వస్తున్న అలికిడయింది. "మహా



కవీ! ఈ వీరేంద్రుణ్ణో ఒక కంట కనిపెట్టి ఉండండి. వీడు సామాన్యుడు కాడు. వీడి నాల్కకసలు నరమే లేదు. మీరు తప్పుకోండి," అన్నాడు మహామంత్రి. తిమ్మనార్యుడు లతానికుంజాంతర్భాగంలోకి తప్పుకున్నాడు. ఎదురుగా వస్తున్న వీరేంద్రుని చూచి "రాయలవారేమన్నారు, వీరేంద్రా?" అని ప్రశ్నించాడు మహామంత్రి.

"క్షమించండి, మహామంత్రీ! రాయలవారిక్కడ లేరు." వీరేంద్రుడి సమాధానం.

"ఏమైనారో—మరి?"

"అసలు రానే లేదట."

"పాపం! ఇంతకు ముందు నీ కన్ను చెదిరింది కాబోలు!"

"ఆఁ! నేను మాత్రం చూశానా, మహామంత్రీ? ఆ దాసీముండ చెప్పింది." వీరేంద్రుడు బహు మెలకువగా తప్పుకున్నాడు.

"దానికేం లే. రాయలవారు రాగానే, మేం వారి దర్శనాన్ని వాంఛిస్తూ వచ్చి వెళ్ళామని చెప్పు...." అంటూ మహామంత్రి వెళ్ళిపోయాడు.

వీరేంద్రుడికి రాజు అంతఃపురానికి ఇంకా రాని సంగతి తెలియటం వల్ల, అంతఃపురానికి పోకుండా నాలుగడుగులువేసి తిరిగివొచ్చి, ప్రక్కనే ఉన్న వృక్షాన్ని అభ్యంతరంగా చేసుకొని మంత్రి అప్పాజీ, కవి తిమ్మనార్యుల సంభాషణ విన్నాడు. అందువల్ల అతనికి మహామంత్రి ఎంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాడో అర్థమైంది. రాయలను తిరుమలాంబిక మందిరాన బంధించాసన్న సంతోషాతిశయంతో ముసి ముసి నవ్వులు నవ్వుతూ, నిష్క్రమించిన వృద్ధ జంబుకానికి ముందు ముందు ముసళ్ళ పండుగ చూపించాలనుకున్నాడు వీరేంద్రుడు; ఇప్పుడతడి ప్రథమ కర్తవ్యం ఏ ఉపాయంవల్లనయినా సరే, తిరుమలదేవి ఇంట్లో మహామంత్రి అదృశ్య మేధాశక్తి వల్ల బంధింపబడిన మహారాజును విడిపించుకొని అన్నపూర్ణాదేవి అంతఃపురానికి తీసుకొని రావాలి. ఇదే అతను చెయ్యా

ల్సిన మొదటి పని. వీరేంద్రుడు కార్యాసక్తుడై తిరుమలాంబిక అంతః పురానికి బయలుదేరాడు.

అంతఃపుర సింహద్వారం సమీపించేసరికి, వీరేంద్రునికి ప్రక్క నున్న లతానికుంజం నించి ఓ కమ్మటి కంఠం శ్రావ్యంగా వినిపించింది.

అంధ్ర కర్ణాట సామ్రాట్టుకనుగు చెలిమి

వీరేంద్రునికా కంఠం సుపరిచితమైందే. అది తిమ్మనార్యునిది. ఎలాగైనా ఈ కవి శేఖరుడి పీడ వొదిలించుకోవాలనీ చక-చకా నడువ సాగాడు వీరేంద్రుడు.

గజపతీ సర్వ సామ్రాజ్య ఘనత నీది

కంఠం మరింత దగ్గరగా వినవొచ్చింది వీరేంద్రుడికి తప్పించు కునే ఉపాయం తోచటం లేదు. సరే, ఈ కుటిల కవిని ఏదో విధంగా సమాధాన పరచిన తరువాతనే పోదామనుకున్నాడు వీరేంద్రుడు.

మంత్రి అప్పాజీ సైదోడు రంత్రిజగతి
నిలుచువాడవు వీరేంద్ర అలఘుమూర్తి!

—అంటూ తిమ్మనార్యుడు ఎదురుపడ్డాడు.

"ఇవేం మాటలండీ! నక్కకూ, నాగలోకానికీ పోలికా?" అన్నాడు వీరేంద్రుడు తిమ్మనగారితో.

'ఆహా! ఎంత కాలానికి వినగలిగానండీ-మీ నోటినుంచి రత్నం లాంటి మాట!' అన్నాడు తిమ్మన కవి ఎద్దేవ చేస్తూ.

"ఏం? కవిరాజులు పురం వొదిలి అంతఃపురంలోకి ఊడిపడ్డారు!" పరామర్శ చేశాడు వీరేంద్రుడు.

"కొద్దిగా పని ఉంది."

"అయితే, రాణీగారు లోపల ఉన్నారు."

"లోపలివారితో మనకేం పని?"

"అయితే, రాజుగారు బయటే ఉన్నారు."

"బయట ఉన్నవారికోసం లోపలికెందుకొస్తానూ?"

"మరి మీ పని..."



"మీతోనే. ఇందాకటినుంచీ మీ కోసం తిరిగి-తిరిగి కాళ్ళరిగిపోయా యంటే నమ్మండి!"

"ఏం పనో పాపం!" వీరేంద్రుడు సానుభూతి చూపించాడు.

"ఇవాళ ముహూర్తం దివ్యంగా వుండటంవల్ల మీ స్మారక సంచికను ఇవాళే ప్రారంభిద్దామని...."

"చంపేశారు. నేనింకా బ్రతికే ఉన్నానండీ!"

"మీరు బ్రతికి ఉన్నా సరే, మీరు వ్రాయమన్నారూ: నేను వ్రాస్తా నన్నాను. అప్పుడే నూరు పద్యాలు వ్రాశాను కూడా," అన్నాడు తిమ్మ నార్యుడు సగర్వంగా.

"ఇదెక్కడి పాపమండీ! మీ చేత ఎవరైనా ఇంతవరకు స్మారక సంచిక వ్రాయించుకున్నారుటండీ, తిమ్మనగారూ?"

"ఓ! చాలామంది. మరొక్క విషయం: మనం స్మారకసంచిక వ్రాశామంటే, అద్యంతం అయిపోవాల్సిందే! వ్రాయించుకున్న వాళ్ళలో మచ్చుకి ఒక్కడంటే ఒక్కడు కనిపించటం లేదంటే నమ్మండి."

"అయితే, నేను బ్రతకాల్సినవాణ్ణి: పైకి రావాల్సిన వాణ్ణి: ఏ స్మారక సంచికనూ నేను వినదల్చుకోలేదు," వీరేంద్రపాత్రుడు ఖండితంగా చెప్పేశాడు.

"వ్రాసిన తరువాత వినకపోతే మాత్రం ఫలితం అగుతుందిటండీ?" అన్నాడు మహాకవి విపరీతమైన నమ్మకాన్ని సూచిస్తూ.

"ఏమైనా సరే నేనా పద్యాలు వినదల్చుకోలేదు" వీరేంద్రుడు తేల్చేశాడు.

"అయితే, నా ఇతర పద్యాలు వినండి." తిమ్మనకవి మంకు పట్టు పట్టాడు.

"రేపు వింటాలెండి-ఇప్పుడు నా కత్యవసర కార్యముంది."

"నాకు తెలుసులేవయ్యా-నీ పని." అన్నాడు తిమ్మనగారు సర్వ జ్ఞుడిలా.

"మీకూ తెలిసిందీ?"

"మనమిద్దరం ఉత్తరాది వాళ్ళమే. ఒకరి జాతకాలు ఒకరికి క్షొత్త

కావు. కాని, ఈ పద్యం విను: శోకరసాన్ని ఎంత చక్కగా పొలికించా ననుకున్నావ్- ఇందులో?"

"అవును. ముద్దు ముద్దుగా ఏడవటంలో మీకు మీరే సాటని అందరికీ తెలుసండీ! నాకు వేళయింది...." అంటూ తప్పుకోబోతున్న వీరేంద్రుణ్ణి నిలబెట్టి పద్యం ప్రారంభించాడు తిమ్మనకవి—

ఈసున బుట్టిడెందమున హెచ్చిన....

"అదిగో, మహారాణి!" అన్నాడు వీరేంద్రుడు వెనుకవైపు చూపిస్తూ. కవిశేఖరుడు వెనక్కి తిరిగాడు. నిజానికి మహారాణి అల్లంత దూరాన వొస్తున్నది. మళ్ళీ వెనక్కి తిరిగేటప్పటికి వీరేంద్రుడు ఉడాయిస్తున్నాడు. "ఏమండోయ్, మిమ్మల్నే!" అంటూ అనుసరించబోతున్న తిమ్మనకవిని మహారాణి పిలుపు బంధించి వేసింది.

"కవిగారూ! ఆ పద్యం పూర్తి చేసి వెళ్ళండి," అంది మహారాణి.

"కాస్త త్వరగా వెళ్ళాలమ్మా!"

"ఫరవాలేదు. పద్యం బాగుంది; చదివి వెళ్ళండి, మహాకవీ!" అన్నపూర్ణాదేవి కోరికను తిరస్కరించలేకపోయాడు తిమ్మనకవి.

ఈసున బుట్టి డెందమున హెచ్చిన శోకదవానలంబుచే
గాసిలి ఏడ్చె ప్రాణవిభు కట్టెదుటన్ లలితాంగి పంకజ
శ్రీ సఖమైన మోముపై చేల చెరంగిడి బాల పల్లవ
గ్రాస కషాయ కంఠ కలకంఠ వధూకలకాకలీధ్వనిన్

"పద్యం వింటుంటే సన్నివేశం కళ్ళకు కట్టినట్లుంది, మహాకవీ!" అన్నది మహారాణి అభినందన సూచకంగా. "మరొక్క పద్యం. సత్యాకృష్ణుల ప్రణయసన్నివేశం చదవండి-చాలు." అన్న మహారాణి కోరికను-ఆలస్యమౌతున్నదనే బాధ అంతర్గతంగా ఉన్నా, మన్నించక తప్పలేదు మహాకవికి.

నను భవదీయ దాసుని మనంబున నెయ్యపు గిన్క పూని తా
చిన యది నాకు మన్ననయ, చెల్వగు నీ పద పల్లవంబు మ
త్తను పులకాగ్ర కంటక వితానము తాకిన నొచ్చునంచు నే
ననియెద అల్క-మానవు కదా యికనైన నరాళ కుంతలా.



పద్యం మహారాణిని మరొక లోకానికి తీసుకొని పోయింది. "మహాకవీ! నా నాథుడు నన్నట్లా మన్నించే రోజు వొస్తుందా!" అని అడిగింది అన్నపూర్ణాదేవి.

"తప్పక వొస్తుందమ్మా, నేడో రేపో!" అంటూ తిమ్మనార్యుడు మహారాణి వద్ద సెలవు తీసుకొని, వీరేంద్రుణ్ణి వెతుక్కుంటూ బయలుదేరాడు.

తిమ్మన కవి ఎంత వేగంగా నడక సాగించినా, వీరేంద్రుణ్ణి కలుసుకోలేకపోయాడు. అతని కోసం రాజమార్గాలూ, రాజమందిరాలూ, అంతఃపురాలూ-అన్నీ గాలిస్తూ తిమ్మనకవి సాగిపోతున్నాడు. నిజానికి విజయనగర మంతటి మహాపట్టణంలో ఒక వ్యక్తిని కనుచూపు మేరలో అనుసరించటమే కష్టం. మరి ఇప్పుడు కను మరుగున ఉన్న వ్యక్తిని అన్వేషించటం చాల కష్టం. అయినా, తిమ్మనగారికి వీరేంద్రుణ్ణి విడిచిపెట్టటానికి వీల్లేదు. కాలం గడుస్తున్నా తిమ్మన కవికి వీరేంద్రుడి జాడ కూడా గోచరించింది కాదు. ఇంతలో ఆయన మనోపథంలో ఒక్క ఊహ తళుక్కున మెరిసింది. బహుశః వీరేంద్రుడు మహారాజు సందర్శనానికి వెళ్లి ఉంటాడేమోనని. నిజమే! అతనికిప్పుడు తిరుమలాంబిక ఇంటనున్న మహారాజును అన్నపూర్ణాదేవి మందిరానికి చేర్చాల్సిన అవసరం ఉంది. కాని, తనకు మహారాజు - అన్నపూర్ణ మందిరానికి రాకుండా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తిమ్మనగారు వడి-వడిగా తిరుమలాంబిక మందిరానికి నడక సాగించాడు. ఎలాగైనా సరే- భటుల సహాయం తీసుకొని అయినా సరే- వీరేంద్రపాత్రుణ్ణి పట్టమహిషి అంతఃపురంలో ప్రవేశించకుండా చేయగలిగితే తన కృషి ఫలిస్తుంది. లేకపోతే రాజు అన్నపూర్ణాదేవిని కలుసుకుంటాడు. పాపం, మహాకవికి సాహసం అలవాటు లేదు. ఆయన అప్పటికీ వడి-వడిగానే నడుస్తున్నాడు. కాని, దురదృష్టం. ఆయన తిరుమలాంబిక మందిరాన్ని సమీపించగానే ఎదురుగా వొస్తున్న వీరేంద్రుణ్ణీ, అతణ్ణి అనుసరించి వొస్తున్న మహారాజునూ చూచి నిర్జీవుడై పోయాడు వీరేంద్రుడు మహాకవి వంక 'చూశావా నా ప్రతాపం!' అన్నట్లు

చూశాడు. తిమ్మన కవి ప్రక్కకు తప్పుకున్నాడు. తల వొంచుకొని. మహారాజు తిమ్మనకవిని చూడకుండానే సాగిపోయాడు.

* * *

కవిశేఖరుడు వెళ్ళిపోయిన తరువాత కూడా ఆయన పాడిన మధుర భావపూరిత పద్యం మహారాణి చెవుల్లో గింగురుమంటూనే ఉంది. ఆ భావంతో ఆమె మనస్సు సంపూర్ణంగా ఆకర్షించబడింది.

"నెయ్యపు గిన్క పూని తాచిన యది నాకు మన్ననయ" సత్య కినుకను నెయ్యపు కినుకగా శ్రీకృష్ణుడు గ్రహించాడు. "నెయ్యపు కిన్క!" ఎంత సొగసైన పదజాలం! తన నాధుడు తన్ను ఉల్లేల పరిగ్రహింపరాదని మహారాణి ఆవేదన, ఆమెకు చివరి పద్యంలోని మూడవ పాదం మరీ-మరీనచ్చింది. ఆమె ఒకసారి ఆ పాదాన్ని మననం చేసుకొని ఉల్లాసంతో మధురంగా పైకి చదివింది.

"చెల్వగు నీ పద పల్లవంబు మత్తను పులకాగ్ర కంటక వితానము తాకిన నొచ్చు..." ఆ సమయంలో రాయలవారు అంతఃపురోద్యాన వనంలో ప్రవేశించి అన్నపూర్ణాదేవి వల్లిస్తున్న పద్య భాగాన్నివిని గొంతు హెచ్చించి మళ్ళీ అదే పాదాన్ని వల్లించాడు:

"మత్తను పులకాగ్ర కంటక వితానము తాకిన నొచ్చు."

మహారాణి ఉలిక్కిపడి వెనక్కి చూచింది. ప్రాణేశ్వరుడు. ఒకరి నొకరు ఒక విధమైన దృగ్భ్రమతో పరిశీలించుకున్నారు. కొద్ది క్షణాల క్రితం వరకూ ఒకరి కొరకు ఒకరు అమితంగా పరితపించినా, ఎదురుపడే సరికి ఏం మాట్లాడాలో, ఏం చెయ్యాలో తెలియలేదు. అలా కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచిపోయాయి. ఆ కొద్ది క్షణాలలో ఆ ప్రేయసీ ప్రేమికుల మానసంలో విహరించిన భావతరంగాలు అనేకం, అనిర్వచనీయం. చివరికి మహారాజు ఆ నిశ్శబ్దానికి భంగం కలిగించాడు.

"కోపం వొచ్చిందా దేవీ?"

"ఆడవాళ్ళకు కోపం వొచ్చి సాధించేదేమిటి? మాకు శోకమే నిత్యంతరం."



"అది కాదు, దేవీ! ఆడువారికి నిజానికి శోకం కన్నా రౌద్రమే మేలైన అలంకారం" అన్నాడు మహారాజు. దానిలోని అంతరార్థానికి మహారాణి పకపకా నవ్వింది. ఆ నవ్వులో మహారాజు ప్రపంచాన్నే మరిచిపోయాడు.

"పురుషులు అన్నిటికీ సమర్థులు. ఎన్నయినా చెప్తారు; ఏమైనా చేస్తారు," అంది మహారాణి మహారాజును క్రీగంట చూస్తూ.

"ఔనౌను. చేయలేంది నువ్వేనా, దేవీ? సార్వభౌముని అర్ధాంగివి, భావి ఆంధ్ర సామ్రాట్టుకు జన్మనిచ్చిన రాజమాతవు. కాబట్టే, సార్వభౌముడంతటివాణ్ణి పాదతాడన సన్మానం చెయ్యటమే కాకుండా, పాదాల దగ్గరకు తిరిగి రప్పించుకున్నావు. దేవీ!" కృష్ణరాయలకు "పారిజాతాపహరణం" లోని కృష్ణతత్త్వం బాగా వంటబట్టింది. అది మహారాణి కార్య సానుకూల్యతకు విపరీతంగా వినియోగపడ్డది.

"నిజంగా నేను రాజమాతనా, మహారాజా?" అంది మహారాణి క్యంగా.

"అందుకు సందేహమా, మహారాణీ? నీ కుమారుడు అనతికాలంలో ఆంధ్ర సింహాసనాన్ని అధిష్ఠిస్తాడు. అన్నాడు మహారాజు - ఆ గర్వంలో సగం పాలు పంచుకుంటూ.

"ఏమో! భవిష్యత్తులో దివ్యసౌధ నిర్మాణం చేయటం అన్నపూర్ణ కలవాటులేదు మహారాజా! నా కుమారుడు సింహాసనం అధిష్ఠించేవరకు నేను జీవించి వుండొద్దూ?" అంటూ కంట తడిపెట్టిన మహారాణిని చూచి-ప్రేమైక హృదయుడైన మహారాజు మనసు కలత చెందింది "ఛా! అవేం మాటలు? ఊరుకో, దేవీ!" అంటూ అనునయించాడు. కాని ఆమె విచార వదనంలో మార్పురాలేదు. బహుశః తనవియోగంవల్ల ఆమెకుజీవితంలోనిరాశ,నిస్పృహ కలిగిందేమో అనుకున్నాడు రాజు, ఆమెతో సుఖంగా, హాయిగా గడపాలని వచ్చిన మహారాజు ఆమె కంటితడిని చూడలేకపోయాడు. ఆమె సంతోషం కోసం ఏమైనా చేసే స్థితికి వచ్చాడు మహారాజు. "అలా బెంగపడతావేం దేవీ? వయసు మళ్ళి, అధికార కాంక్ష అద్యంతాలు చూచిన నాకు ఇంకా ఈ రాజ్యమెందుకు? నీవంతగా కావాలంటే, రేపే నీ కుమారుడి పట్టాభిషేకం

జరిపిస్తాను.... అంటూ మహారాణిని అక్కున చేర్చుకున్నాడు ఆప్యాయంగా. అంతటి సంతోష వార్త విన్నా, ఆమెలో సహజంగా ఉద్భవించాల్సిన ఆనంద రసం ఆవిర్భవించలేదు. ఆమె దృష్టి అల్లంత దూరాన లతానికుంజాల వెనుక తచ్చాడుతూ, తనవంక భయంకరంగా చూస్తూ సంజ్ఞలు చేస్తున్న వీరేంద్రుడి మీద కేంద్రీకృతమై ఉంది. ఆ విషయం రాజుకు తెలియదు, రాణికి చెప్పే అవకాశం లేదు.

"లేక కాదు, మహారాజా! నా కుమారుడి పట్టాభిషేకం రేపు ప్రాతఃకాలాన్నే జరగాలి. నేను చూడాలి." మహారాణి మాటలు మహారాజునుద్దేశింపబడ్డా-దృష్టి వీరేంద్రుని వైపే ఉంది. మహారాజుకీ కోరిక కొంత వింతగానే కనపడింది. తాను మాటవరుసకన్న మాటనుపట్టుకొని మహారాణి ఇంతగా సాగదీస్తుందనుకోలేదు, పాపం ఆయన.

"దైవజ్ఞులు సుముహూర్తం నిర్ణయించాలి. అదీకాక, అప్పాజీవారి ఆమోదం కూడా పొందాలి. ఒక్కరాత్రిలో ఇవన్నీ ఎలా సాధ్యమవుతాయి దేవీ?" అన్నాడు మహారాజు ప్రాతికూల్యతను సూచిస్తూ.

మహారాణికి కోపం వచ్చినట్లయింది. "మీకు నిజంగా నాపైన ప్రేమ ఉంటే అప్పాజీవారి, ఆమోదాన్ని పొందండి, అన్నీ విషయాలూ వాటంతట అవే జరిగిపోతాయి. లేకపోతే, నీ కుమారుడికి సింహాసనార్హత లేదని చెప్పండి. అంతే! కాని, మహారాజా! ఆపదానికి అడియాసలు పెట్టి ఏడిపించటం మహారాజుకు భావ్యమా!" అంది మహారాణి.

రాజుకు కూడా ఆరేళ్ళ తన పసిపాపను సింహాసనం మీద కూర్చోపెట్టి తాను, తనభార్య కలిసి ముచ్చట చూడాలనే ఉంది.

"దేవీ! నీ కోరిక తప్పకుండా తీరుస్తాను. అప్పాజీవారినీ సమ్మతింప చేయటానికి నేనే వెళ్తాను- స్వయంగా. లేకపోతే కార్యం అనుకూలించదు. నా చిట్టిపాప- ఏకైక పుత్రుడు సింహాసనం మీద కూర్చుంటే నాకూ చూడాలని వుంది...." అంటూ మహారాజు మహామంత్రి వద్దకు బయలుదేరాడు భార్యను సంతోషపెట్టటానికి.

మహారాజు వెళ్ళిన మరుక్షణంలో మహారాణి ముందు ఊడిపడ్డాడు వీరేంద్రపాత్రుడు. అతనికిప్పుడు చాలా సంతోషంగా వుంది. తన పథకం



కార్యరూపం దాలుస్తున్నందుకు, మహారాణి కూడా తన కుమారుని పట్టాభిషేకం జరుగబోతున్నదనే ఉత్సాహంతో వీరేంద్రుని ఆగమనాన్ని హర్షించకుండా ఉండలేకపోయింది.

"భళా! నీ పాత్రను అమోఘంగా నిర్వహించావు సుమా ...." అంటూ అభినందించాడు వీరేంద్రుడు.

మహారాణికి తన వద్దనున్న ఆయుధరాజాన్ని గుర్తు చేయ తలచుకున్నప్పుడల్లా మహారాణికి చిన్ననాటి సంఘటనలు జ్ఞప్తికి తెచ్చే పేరుతో పిలవటంలో సులువు సాధించాడు వీరేంద్రుడు.

"మహారాజు, కుమారుని యువరాజ పట్టాభిషేకానికి ఒప్పుకున్నారు- వీరేంద్రా!" అంది మహారాణి. "మహామంత్రి అప్పాజీవారి ఆమోదముద్ర సాధించటానికి స్వయంగా వెళ్ళారు రాయలవారు."

"నీ మగని రాజరికం అట్లా ఉంది. రాజనిర్ణయానికి మంత్రుల ఆమోద ముద్ర! అంతే కాకుండా, దాని కోసం రాజే ప్రాకులాడాల్సిన పరిస్థితి! హూఁ! అయినా, సర్వశక్తివంతుడైన మహామంత్రి దీని కొప్పుకుంటాడనే నమ్మకం నాకు లేదు." వీరేంద్రుడు తన అనుమానాన్ని వివరించాడు.

"మహామంత్రి అప్పాజీవారి విషయంలో నాకు అనుమానం లేదు. కాని, దైవజ్ఞులకు సరియైన ముహూర్తం లభించకపోతే కుమారుడి యువరాజ పట్టాభిషేకం ఆగిపోక తప్పదు."

మహారాణి ఊహించిన అభ్యంతరం అర్థం లేనిదిగా కనిపించింది వీరేంద్రపాత్రుడికి. అతడికి దైవజ్ఞుల శాస్త్రంలో కన్నా, లౌక్యంలో విపరీతమైన నమ్మకం ఉంది.

"మహారాణీ! ఆ విషయంలో నీకు బెంగ అనవసరం. నాకు వాదులు. దానధర్మాదులందు దండిగ ఆశగల ఈ సంతర్పణపు బ్రాహ్మణులకు పట్టాభిషేకం ఎంత త్వరగా జరిగితే అంత మంచిది. వారందరినీ ఒక్కక్షణంలో లోబరచుకోగలను. మనం ఏ సమయాన్ని సూచిస్తే, అదే

వారి గుణకముల ఫలితార్థం ఔతుంది." వీరేంద్రుడు కార్యసాధనకు ఏ పని చేయటానికైనా వెనుకాడడు. ఆ విషయం మహారాణికీ తెలుసు. కాని, తన కుమారుడి పట్టాభిషేక విషయంలో వీరేంద్రుడెందుకింత పట్టుదల చూపిస్తున్నాడో మహారాణికి అర్థం కావటంలేదు. అతడి సహృదయతను విశ్వసించటానికి ఆమె హృదయం సంపూర్ణంగా వ్యతిరేకిస్తున్నది. మహారాణి మౌనంలోనించి వీరేంద్రుడు విపరీతార్థాన్ని తీశాడు. "మహారాణీ! రాజమాతనౌతున్నానన్న గర్వం నీకుంటే ఉండొచ్చు. కాని, దాన్ని మాత్రం ఈ వీరేంద్రుడి విషయంలో ప్రయోగించకు. నీ రహస్యం నా చేతిలో ఉన్నంత కాలం, ఆ రహస్యాన్ని వినేందుకు నీ నాథుడు బ్రతికి ఉన్నంత కాలం, నీ పంచప్రాణాలూ నా చేతిలో ఉన్నాయని తెలుసుకో!...." అంటూ వెళ్ళిపోయాడు వీరేంద్రపాత్రుడు.

ఈ అనవసర ప్రేలాపనలోని అంతరార్థం అన్నపూర్ణాదేవికి బోధపడలేదు. ఆమె కూర్చున్న వేదికమీదనించి కదల్లేదు. ఆమె మనసు ఆలోచనా భారంతో వేడెక్కిపోతున్నది. కుమారుడి యువరాజ పట్టాభిషేక సంతోషం కానీ, తాను రాజమాతనౌతున్నానన్న ఆనందం కానీ ఆమెలో కనిపించటంలేదు. ఆమె మనస్సంతా వీరేంద్రుడి విచిత్ర ప్రవర్తనా దృశ్యాలతో నిండిపోయింది. "ఏమిటీ-అతడి నిజస్వరూపం!" అన్నదే ఆమె ఆలోచన తన్ను విపరీతంగా బెదిరిస్తున్నాడు. మాటిమాటికీ తుఘ్లా తుఘ్లా అనీ, బావా బావా అని పిలవమనీ తన మనస్సును వికలితం చేస్తున్నాడు. దేన్ని ఆశించి? దేనికోసం? ఏమో. ఆమె కిప్పుడున్న ప్రధాన సమస్య వీరేంద్రుణ్ణి వొదిలించుకోవటం. ఎలా? మహామంత్రి అప్పాజీవారి సహాయాన్ని అర్థిస్తే తప్ప వీరేంద్రుడంతటివాణ్ణి పారద్రోలటం సామాన్యులకు సాధ్యం కాదు. కాని, అప్పాజీవారి సహాయాన్ని అర్థిస్తే తన కథ అంతా వివరించాలి. అలా వివరించటం ఆమెకు ఇష్టంలేదు. మరి ఇంకేం చేయాలి? క్షణాలు నిముషాంలోకి పరివర్తన చెందుతున్నాయి. కాని, మహారాణి ఆలోచన తెగటంలేదు. ఇంతలో మహారాజు ఆగమనంతో ఆమె ఆలోచనా తరంగాలు అంతరించాయి. ఆ ప్రక్కనే ఉన్న వీరేంద్రపాత్రుణ్ణి చూడటంతోటే ఆమె గుండె ఆగిపోయినంత పనయింది,



"రాయలు సిద్ధసంకల్పుడు, దేవీ!" అన్నాడు మహారాజు మహాసంతోషంతో - అందులో పాలు పంచుకోటానికి రమ్మని మహారాణిని ఆహ్వానిస్తూ.

"అప్పాజీవారు అంగీకరించారా?" అన్నది మహారాణి, ఆమె ధోరణితో. అంగీకరించకపోయినా బాధ లేదనే అర్థం గోచరిస్తూనే ఉంది. కాని, ఆ విషయం మహారాజుకు మాత్రం అర్థం కాలేదు- వీరేంద్రుడి కర్థమైనా.

"ఆ! అప్పాజీవారు ఆమోదించారు. మొదట - యుద్ధయాత్రకు బయలుదేరుతున్న ఈ సమయంలో - యువరాజ పట్టాభిషేకం చేయటం అశుభ సూచకమని అనుమానించారు. అయినా, మన ఇద్దరి కోరికను మన్నించి, తగిన జ్యోతిర్విద్వాంసుల చేత సుముహూర్తం నిర్ణయింపజేసి పట్టాభిషేకాన్ని స్వయంగా నిర్వహిస్తామన్నారు, అప్పాజీ!" అన్నాడు రాయల సహధర్మచారిణి నుండి అభినందనా పరంపరకు ఎదురుచూస్తూ.

"అప్పాజీవారే స్వయంగా కార్యభారాన్ని స్వీకరిస్తే అంతకన్నా కావాల్సిందేముంది? ఏమంటావ్, వీరేంద్రా?" అన్నది మహారాణి - వీరేంద్రుడి వంక తిరిగి సాభిప్రాయంగా.

వీరేంద్రుడి దృష్టి ఎప్పుడూ వక్రంగానే ప్రసరిస్తుంది.

"అంటానికేముంది, మహారాణీ! బాధ్యతలు మంత్రిగారికి వదలటం బాగానే ఉంది. కాని, మహామంత్రికి అనుజులను తప్ప. ఆత్మజులను సింహాసనం ఎక్కించటం అలవాటు లేదే!"

ఈ సమాధానంతో రాయలవారికి గింగవెఱ్ఱులెత్తినట్లయింది. ఒక్కసారి రాయలవారి మనోపథంలో తాను విజయనగర సింహాసనాన్ని అధిష్ఠించిన పద్ధతి జ్ఞాపకం వొచ్చింది.

ఆ రోజున మహామంత్రి తన అన్నగారైన వీర నరసింహరాయలవారి కుమారుణ్ణి - ఆరేళ్ళ అర్భకుడనే నెపంతోనే - త్రోసిరాజని తన్ను సింహాసనం ఎక్కించారు. రాజనీతి ననుసరించి తన తమ్ముడైన అచ్యుతరాయలను ఆ రోజున విజయనగరానికి దూరాన ఉన్న కోటకు రాజకార్యార్థమనే మిషతో పంపించి అక్కడే ఖైదుచేశారు. తాను సింహాసనం

అధిష్ఠించిన కొద్ది రోజుల్లోనే తన అన్నగారి కొడుకు ప్రపంచానికి కనుమరుగై పోయాడు. ఎలా అస్తమించాడో, అసలు అస్తమించాడో లేదో ఎవరికీ తెలీదు; చివరికి తనకు కూడా.

రాయలవారు ఇక ఆ సంఘటనను గురించి ఆలోచించలేక పోయారు. అది అంత భయంకరమైనది. అయినా అప్పాజీవారు తన కోసం అవన్నీ చేశారు దేశ క్షేమం పేరుతో; ఆనాడు తన స్వార్థం కోసం ఆ సంఘటనలన్నిటినీ సహించటమే కాకుండా హర్షించాడు కూడా. కాని, ఈనాడు—తాను కొద్ది కాలం క్రితం కుమారుడి యువరాజ పట్టాభిషేకానికి అప్పాజీ వారిని సమ్మతింప చేయటానికి వెళ్ళినప్పుడు అప్పాజీవారు అచ్యుతరాయలవారితో మంతనాలాడుతున్నారు; ఏ విషయమో? ఏమో? ఒకవేళ అర్భకుడనే నెపంతో తన కుమారుణ్ణి కూడా త్రోసి రాజని, అచ్యుతరాయలను అప్పాజీ.... ఛీ! అనుకున్నాడు మహారాజు—ఈ నీచాతినీచమైన ఊహకు తన మనస్సు ఆలవాలమైందే అని. అతనికతని మీదే అసహ్యం పుట్టింది. ఆ అసహ్యం వీరేంద్రుడి మీదికి తిరిగింది,

“వీరేంద్రా! గర్జించాడు మహారాజు. “అనవసర విషయాలను మా ఎదుట ప్రస్తావించకు. అప్పాజీవారు మా ఎడల వాత్సల్యపూరితులు. ప్రవిమలమైన ఆ వాత్సల్యం తిరుగు లేనిది. ఆనాడు మా కొరకే అనుజులను సింహాసనం ఎక్కించారు. ఈనాడు మా కొరకే ఆత్మజులను సింహాసనం ఎక్కిస్తానని మాట ఇచ్చారు....” అంటూ వీరేంద్రుడి వంక తీక్షణంగా చూస్తూ మహారాజు శయ్యాగారానికి వెళ్ళిపోయారు.

మహారాణి మహారాజును అనుసరించింది.

తాను కొట్టిన చివరి దెబ్బ పడగ పైన పడినందుకు వీరేంద్రునికి సంతోషంగానే ఉంది. రాజు దాని ధాటికి తట్టుకోలేక విచలితుడై బూకరిస్తూ తప్పుకున్నాడు. కాని, తిమ్మరుసు మహామంత్రి బహు నేర్పుతో వ్యవహరించి తన పథకాన్నంతా పటాపంచలు చేసివేశాడు. రాజుకూ, మంత్రికీ కుమారుని యువరాజ పట్టాభిషేక సందర్భాన వొస్తుందని ఆశించిన స్పర్థ రానే లేదు. తన కార్య సానుకూలానికి అనుకూల వాతావరణాన్ని సృష్టించే ప్రాతిపదికగా ఈ స్పర్థ అత్యవసరం. కాని, మహా



మేధావి అయిన అమాత్యశేఖరుడి మీద తన ఎత్తులు సాగవని ఎప్పుడో తేల్చుకున్నాడు వీరేంద్రుడు. కాని, అతని బుద్ధిబలానికి రాజైనా లొంగి రాకున్నాడే అని అతని బాధ. అందుకోసం అతని మనస్సు వేరు వేరు మార్గాలను అన్వేషించసాగింది.

“రాజునకు అత్యంత అప్రియమైన కార్యాన్ని మంత్రి చేయాలి. మంత్రి ఎట్లాగూ ఆ పని చేయడు. కాని, చేసినట్లు రాజు నమ్మాలి; లేకపోతే నమ్మించాలి. ఆ సన్నివేశ సృష్టి మహారాజుకు మతిభ్రమణ కలిగించేదిగా ఉండాలి. ఆ సంఘటన అత్యంత భయంకరమై, అతని విచక్షణా శక్తిని ఆమూలాగ్రంగా నాశనం చేయాలి. పూర్వాపర మీమాంసలనూ, ఇహపరాలోచనలనూ అంతం చేయదగి ఉండాలి. గత చరిత్రను విస్మరింప జేయాలి. వాస్తవానికి అతణ్ణి అంధుణ్ణి చేయాలి. పిచ్చి ఎక్కించాలి. మానవత్వాన్ని సంపూర్ణంగా హరించి, అతణ్ణి కేవలం ఒక క్షుద్ర పశువుగా మార్చివేయాలి. అప్పుడు....అప్పుడు తన సంకల్పసిద్ధి....” అనుకున్నాడు వీరేంద్రపాత్రుడు. “కాని, అట్టి భయంకర సన్నివేశమేది ?” తన్ను తాను ప్రశ్నించుకున్నాడు. ఒక్క క్షణమాగి ‘ఆఁ – అదే....’ అంటూ సమాధానం చెప్పుకున్నాడు.

## 6

మహారాజు స్వయంగా తన మందిరానికి వచ్చి, కుమారుడి యువరాజ పట్టాభిషేకానికి ఆమోదించమని అడిగినప్పటి నుండీ మహామంత్రి హృదయంలో ఆందోళన అధికమైంది. అంతకు ముందువరకూ ఆ ఉద్దేశమే లేని మహారాజు—ఆ విధంగా కోరటానికి వెనుకనున్న రాజదంపతుల పునస్సమాగమ దృశ్యం మహామంత్రికి కళ్ళకు కట్టినట్లు సాక్షాత్కరించింది. అందు విశిష్ట పాత్ర వహించిన వీరేంద్రుడి మూర్తి మహామంత్రికి గోచరమైంది.

అవును. ఆ నాడు మహారాజును [illegible] హత్య చేయటానికి అన్నపూర్ణాదేవిని ప్రేరేపించి, బలవంతాన అంగీకరింప జేసింది

పరోక్షంగా. ఇతడు. కాని, ఆ నాడు విధి అతనికి ప్రతికూలించింది. ఆ నాటినుండీ అతనిలో ద్వేషజ్వాలలు భగభగా మండిపోతూ ఉండి ఉండాలి. తన క్రోధాన్ని సాధించుకోటానికే విజయనగరం వచ్చి ఉంటాడు. గజపతి సామ్రాజ్యాన్ని సర్వనాశనం గావించి, ఆంధ్రసామ్రాజ్యంలో కలిపేసి గజపతి సార్వభౌమత్వాన్ని నేతి బీరకాయ సామెతకు తీసుకొని వచ్చిన కృష్ణరాయల పైన పగ సాధించుకోటానికే పనిగట్టుకొని వచ్చిన వీరేంద్రుడికి రాజు పైననే కాకుండా, తన పైన కూడా వైర కారణం కావలసినంత ఉంది. తన్ను సర్వనాశనం చేస్తేనే గాని, విజయనగరాన్ని నేలమట్టంచేసి, గజపతిని మళ్ళీ సార్వభౌముణ్ణి చేసే అవకాశం వీరేంద్రుడికి లభించదు. వీరేంద్రుడు సాధారణ వ్యక్తి కాదు. అసాధారణుడే గాక అసాధ్యుడు; మెత్తని పులి.

వీరేంద్రుడి హృదయాన్ని మహామంత్రి దాదాపు అవగాహన చేసుకున్నాడు. వెంటనే యువరాజ పట్టాభిషేకం విషయంలో కూడా వీరేంద్రుడి విశిష్ట పాత్రను ఊహించుకోగలిగాడు.

దుర్మార్గుడి నిశిత వీక్షణం పరిపూర్ణ కటాక్ష రూపంలో ఎవరి మీద ప్రసరిస్తుందో వారి చావు మూడినట్లే చెప్తుంది రాజకీయ శాస్త్రం. మహామంత్రికి వెంటనే అనుమానం వేసింది. వీరేంద్రుని వల్ల యువరాజుకు కీడు శంకించాడు. ఆ ఊహ ఆయన మనోపథంలో మెరసిన తక్షణం తన నీలిరంగు కాశ్మీర పచ్చడాన్ని కప్పుకొని హయారూఢుడై, మహారాణి అన్నపూర్ణాదేవి అంతఃపురానికి అనతి కాలంలోనే చేరుకున్నాడు. అల్లంత దూరాన హయాన్ని అవరోహించి మెల్లగా అడుగులో అడుగు వేస్తూ మందిరం వైపు పురోగమించాడు మహామంత్రి - పరిసర ప్రదేశాలను తన నిశిత వీక్షణలతో పరిశీలిస్తూ.

# 7

రాత్రి రెండవయామం పూర్తయింది. అన్నపూర్ణాదేవి అంతఃపురం ప్రశాంతంగా ఉంది. ఆ సమయంలో ఒక ముసుగువ్యక్తి మెల్లమెల్లగా అడుగులో అడుగు వేస్తూ ప్రతి లతానికుంజం చాటునా నక్కుతూ భటుల అలికిడి అయినప్పుడు తాను కూడా ఒక శిలా నిర్మిత విగ్రహం లాగా భంగిమను ఇస్తూ, అంతఃపురాన్ని సమీపించాడు. రక్షక భటులు సింహద్వారాన్ని అప్రమత్తతో కాపలా కాస్తుండటంవల్ల, మందిర ప్రవేశానికి గవాక్షాధిరోహణ తప్పా గత్యంతరం కనిపించ లేదతనికి. మెల్లగా భవనపు వెనుక వైపుకు చేరి, అక్కడ ఉన్న ఒక తరువు నధిరోహించి, శాఖాగ్రాన్ని ఆధారంగా చేసుకొని అంతఃపురంలోకి దుమికాడు ఛెంగున. ఎదురుగా ఉన్న హంసతూలికా తల్పం మీద మహారాణి అన్నపూర్ణాదేవి మైమరచి నిద్రపోతున్నది. ఆమె కల్లంత దూరాన బాలుడు ఆంధ్ర సామ్రాజ్య భావి సామ్రాట్టు నిశ్చింతగా నిద్రపోతున్నాడు. ఆ ప్రక్కనున్న వేరొక భాగంలో మహారాజు గాఢనిద్రలో మునిగి ఉన్నాడు.

ఆ శరీరం ఒక్కొక్క స్తంభాన్నే చాటు చేసుకుంటూ, క్రమంగా రాజకుమారుడి శయ్యను సమీపించసాగింది.

ఆరేళ్ళ పసిబాలుడు రాకుమారుడు. పేరు తిరుమలరాయలు.

రాయలవారికి శ్రీవైష్ణవం పుచ్చుకున్నప్పటి నుంచీ తిరుపతి వెంకటేశ్వరుల యందు అత్యంత భక్తి. ఆయన అంతఃపురంలో తిరుమల శబ్దానికున్నంత విలువ దేనికీ లేదు. ఆయన పెద్ద కూతురు పేరుకూడా తిరుమలదేవే. కనీసం సంవత్సరానికొకసారైనా తన భార్యలతో కలిసి తిరుమలకు వెళ్ళి, ఏడు కొండలమీద అధిష్ఠించి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించి వస్తుంటాడు రాయలు.

పున్నామ నరకం నుండి ఉద్ధరించగల పుత్రులు లేని మహారాజు దాదాపు ఏడు సంవత్సరాల క్రితం వేంకటేశ్వరునికి బ్రహ్మోత్సవం మహా వైభవంగా జరిపించాడు సుపుత్ర ప్రాప్త్యర్థం. దాని ఫలితంగానేకావొచ్చు బ్రహ్మోత్సవం జరిగిన రెండు మూడు నెలల్లో అన్నపూర్ణాదేవి గర్భ ధారణ చేసింది. మహారాజు సంతోషానికి అవధిలేదు. వంశోద్ధారకుడు ఉద్భవించబోతున్నాడనే సంతోషంతో - మహారాజు విపరీతంగా దాన ధర్మాలూ. పూజా పునస్కారాలూ చేశాడు. బ్రాహ్మణులకు అగ్రహారాలు దానం చేశాడు. పుత్రుడు పుటకముందు చేసిన దానాలే ఇలా ఉన్నప్పుడు, పుత్రుడు పుట్టిన తరువాత చేసే దాన ధర్మాల విషయం చెప్పాల్సిన పనే లేదు. నవమాసాలు నిండిన తరువాత, అన్నపూర్ణాదేవి సార్వభౌమలక్షణ

లక్షితుడైన పుత్రుణ్ణి ప్రసవించింది. ఆ బిడ్డను చూచి మహారాజు మురిసి పోయాడు. బారసాల పీటలమీద తిరుమల గిరిపైన వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామిని స్మరించి, పొత్తిళ్ళలో ఉన్న పసిపాపకు "తిరుమలరాయ" అని పేరు పెట్టాడు మహారాజు. అందువల్లనే మహా రాజుకు తిరుమలరాయలను చూస్తుంటే తిరుపతి వేంకటేశ్వరుడు జ్ఞాపకం వొస్తుంటాడు.

తిరుమలుడు ఈనాడు ఆరేండ్ల బాలుడు. శుక్లపక్ష చంద్రుడిలా దిన దిన ప్రవర్ధమానమౌతున్నాడు. అందంలో తల్లి పోలికలు, అవయవ నిర్మాణంలో తండ్రి ఛాయలు, మేధస్సులో తాత అప్పాజీ పోలికలు – ఆ బాలుడిలో విచిత్ర సమ్మేళనాన్ని పొందాయి. అందుకే ఆ ముగ్గురికీ యువరాజంటే పంచప్రాణాలు. ఆనాడు యువరాజు హంసతూలికా తల్పం మీద హాయిగా నిద్రపోతున్నాడు. ఛాయా మాత్రంగా దృగ్గోచర మౌతున్న ఆ శరీరం యువరాజు తల్పాన్ని సమీపించి, ఒక్క క్షణం నిశ్శబ్దంగా నిలిచిపోయింది. ఇంతలో ఆ ఛాయ కుడి చేయి సట్టున పైకి లేచింది. ఆ హస్తాగ్రంలో తళ-తళ మెరిసిపోతున్నది ఒక ఛురిక- కాల నాగు వాడి తేరిన కోరలాగా. ఆ ఛురికను క్రిందికి దించటానికి ఆ ఛాయ విపరీతంగా ప్రయత్నం చేస్తున్నది. కాని, ఏదో ఒక మమకారం పైకి లేచిన హస్తాన్ని పైనే గాలిలో బంధించి వేసింది.

"శిశుహత్య మహాపతకం" అని ఎవరో ఆ ఛాయను బెదిరించినట్లయింది. శిశుహత్య మహాపతకం అయితే కావొచ్చు కాని, భ్రూణహత్యలే పరిపాటి అయిన రాజ వంశీయులలో శిశుహత్యలు పాతకం కావటానికి వీల్లేదని సరిపెట్టుకుంది-ఆ ఛాయ. ఈ మాటు మరింత బలాన్ని చేకూర్చుకున్నదా హస్తం. ఒక్క-క్షణం- ఒక్కలిప్తలో ఆ ఛాయ ఎడమ చేయి బాలుడి నోటిని గట్టిగా నొక్కేసింది. అదే క్షణంలో కుడిచేతిలోని ఛురిక విపరీతమైన వేగంతో బాలుడి శరీరంలోకి చొచ్చుకొనిపోయింది. ఆంధ్ర సామ్రాజ్య భావి సామ్రాట్టు అస్తమించాడు. ఇంతలో అలికిడయింది, అంతఃపుర ప్రాంగణంలో. ఆ ఛాయ క్షణమాత్రంలో కనుమరుగై మహా రాణి శయనించి ఉన్న హంసతూలికా తల్పం ప్రక్కకు తప్పుకొని



మంచపు నీడలో కలిసిపోయింది.

ఇంతలో మరో వ్యక్తి అడుగులో అడుగు వేసుకుంటూ కప్పుకున్న నీలి పచ్చడాన్ని సరిచేసుకుంటూ ప్రవేశించాడు. అతడు అమాత్య తిమ్మరుసు. వీరేంద్రుడి మీద ఆయనకు కలిగిన అనుమాన భావ పరంపర నుండి తన్ను తాను నివృత్తి చేసుకోవటం కోసం స్వయంగా వచ్చాడు- అన్నపూర్ణాదేవి మందిరానికి మహామంత్రి. ఆ మహల్లో ప్రవేశిస్తూనే అంతఃపుర పరిస్థితిని కలయజూచాడు. అంతా ప్రశాంతంగానే ఉన్నందుకు ఆయన స్థిమితపడ్డాడు. అయినా, ఒక్క-సారి రాజపుత్రుణ్ణి చూస్తేనే గాని ఆయన హృదయం శంకా రహితం కాదు. ఆయన మెల్లగా రాజకుమారుడు నిద్రిస్తున్న తల్పం వద్దకు బయలుదేరాడు.

సరిగ్గా మహామంత్రి రాజకుమారుడి తల్పం చేరేసరికి మైమరచి నిద్రిస్తున్న మహారాణికి ఎవరో నిద్ర లేపినట్లయింది. ఉలిక్కిపడి లేచి కూర్చుంది. ఎవరో తన కుమారుడి తల్పానికి సమీపంగా నుంచొని పరిశీలిస్తుండటం గమనించి "ఎవరది?" అని బిగ్గరగా ప్రశ్నించి తల్పం దిగింది మహారాణి.

మహామంత్రంతటివాడికే పరిస్థితి తారుమారైంది. ఆయన మహత్తర మేధాసంపత్తి ఆయనకు ఆ క్షణాన అక్కరకు రాలేదు. శిశుహత్య జరిగిన విషయానికే విచలితుడైన మహామంత్రి హతుడై ప్రక్కన వేళ కాని వేళ అర్ధరాత్రాన— అందులో మహారాణుల అంతఃపురంలో ఒంటరిగా ఉండటం ఎంత అసహ్యకర పరిస్థితితో ఆయనకు తెలుసు. తన్ను తాను సమర్థించుకునే మార్గం ఆయన ఊహాపథానికి అందలేదు.

మహారాణి చేదివ్వెతో కుమారుడి తల్పాన్ని సమీపించి ప్రక్కనే నిలబడి ఉన్న మహామంత్రిని చూచి "మీరా?" అని అడిగింది.

మహామంత్రికి ఏం చెప్పాలో పాలు పోలేదు. తల వొంచుకుని "నేనేనమ్మా!" అని మాత్రం అనగలిగాడు.

"ఈ అసమయంలో వచ్చారేం, అప్పాజీ?" అంది మహారాణి, మహామంత్రి ముఖపరిశీలన చేస్తూ.

మహామంత్రి సమాధానంగా మౌనం వహించాడు. కాని, అతని హృదయం మహోజ్జ్వలంగా దహించుకుపోతోంది. ఆ విషాదవార్తను మహారాణికి ఏ విధంగా అందించాలో, తత్ఫలితంగా ఉద్భవించే సన్నివేశాన్నుంచి తన్ను తాను ఎలా రక్షించుకోవాలో కూడా మహామంత్రికి అంతు చిక్కటంలేదు. అయినా, తన మీద దోషారోపణ చెయ్యగలవారెవరున్నారులే అనే అహంభావమే మహామంత్రికి ఆ క్షణంలో రక్షగా తోచింది. ఎవరు ఏమనుకున్నా అతని కిబ్బంది లేదు. అతనికి కావాల్సింది రాయలవారు నమ్మకుండా ఉండటమే. అలాంటి దుర్ఘటన ఈ జన్మానికి జరుగదని మహామంత్రి విశ్వాసం. ఇప్పుడు మహామంత్రి పరిస్థితి నిజానికి చాలా విషమంగా ఉంది. ఆయన తన నిర్దోషిత్వాన్ని ఋజువు చేసుకోటానికి పరిస్థితుల బలాన్ని కాకుండా రాజుకు అతని మీద ఉన్న విపరీతమైన విశ్వాసాన్నే ఆధారంగా వినియోగించుకోవాలి. ఇలాంటి ఊహలతో మహామంత్రి మనస్సు క్షణక్షణానికీ వేడెక్కిపోతున్నది.

ఇంతలో మహారాణి శయ్యపైన నిద్రిస్తున్న భావి సామ్రాట్టును ఒకసారి చూచింది. బాలుడి శరీరం రక్తసిక్తంగా ఉంది. కెవ్వున కేకేసి "ఇదేమిటి, మహామంత్రీ?" అంది.

"నీ కుమారుడు నిహతుడయినాడమ్మా!" అన్నాడు మహామంత్రి—తన సహజ గాంభీర్యంతో.

ఆ మాట విన్న మహారాణి క్షణ కాలంలో శోకమూర్తిగా మారిపోయింది. "నాయనా, తిరుమలా!" అంటూ పెద్ద పెట్టున శోకిస్తూ కుమారుడి శరీరం మీద తూలిపోయింది. ఆమె రోదన ధ్వనికి అంతఃపుర భటులూ, పరిచారికలూ పరుగెత్తుకుంటూ వొచ్చారు. వారిలో వీరేంద్రుడూ ఉన్నాడు. ఆ విషాద సన్నివేశాన్ని చూచి, రక్షకులకు ఏం చేయాలో పాలుపోలేదు, యువరాజు అస్తమయానికి విచారించటం కన్నా. అదీ కాక, ఎదురుగా ఆ సమయంలో తిమ్మరుసు మహామంత్రిని అక్కడ చూడటం వారందరికీ ఆశ్చర్యాన్నే కాక, భయాన్ని కూడా కలిగించింది.



వీరేంద్రుడు నిహతుడయిన బాలుడి వంక పరిశీలనా దృష్టితో చూచి, ఎదురుగా ఉన్న మహామంత్రి వంక తీక్షణంగా చూస్తూ "ఇది మీరు చేసిన ఘన కార్యమేనన్నమాట....?" అన్నాడు సాభిప్రాయంగా.

అప్పాజీవారు వీరేంద్రుడి వంక చూచి ఛీత్కరించాడు. ఆ ఛీత్కారం, ఈ పని చేసింది నువ్వేలే! నీ అంతు చూస్తాలే అన్నట్లుంది. వీరేంద్రుడదిరిపోయాడు. అయినా, రోటిలో తల దూర్చి – రోకటి పోటుకు వెరిస్తే తల చితికిపోవటం తప్ప మరొకటి జరగదనుకున్నాడు.

ఆ సమయానికి అంతఃపురంలో ప్రజ్వలించిన కల్లోలానికి మేల్కొని, మహారాజు శయ్య వీడి వొచ్చి అక్కడ చేరిన వారందరినీ చూచి ఆశ్చర్యపోయాడు. "ఏం జరిగింది. వీరేంద్రా?" అని ప్రశ్నించాడు మహారాజు. రాజు అప్పాజీ వారిని చూడలేదు.

వీరేంద్రుడు విపరీతమైన దుఃఖాన్ని దిగమింగుతున్నట్లుగా అన్నాడు: "ఇంకేముంది, మహారాజా! సర్వనాశనమైంది. రాజకుమారునకు శతాయుర్దాయం పూర్తయింది."

మహారాజు ఈ మాట నమ్మలేకపోయాడు. ఒక్కసారి సుతుడి శయ్య వంక చూశాడు. బాలుడి దుస్తులన్నీ రక్తసిక్తంగా ఉన్నాయి. భార్య అన్నపూర్ణాదేవి స్పృహతప్పి పడిపోయి ఉంది. తల్పం ప్రక్కనే అప్పాజీ వారున్నారు. అప్పాజీవారిని చూడటంతోనే "అప్పాజీ...." అంటూ మహామంత్రిని కావిలించుకొని భోరున ఏడ్చాడు మహారాజు. మహామంత్రికి రాయలవారిని ఏ విధంగా ఓదార్చాలో తెలీలేదు. ఆయన మనస్సు వీరేంద్రపాత్రుణ్ణి ఎప్పుడు భస్మం చేద్దామా అని ఆరాటపడుతున్నది.

"అప్పాజీ! చూశారా, ఈ ఘోరం! మీ మనుమడు ఇక మీకు లేడు, అప్పాజీ!" అంటూ మహారాజు తన దృష్టిని బాలుడివైపు మళ్ళించి, ఆ భయంకర దృశ్యాన్ని చూచి – దీనాతిదీనంగా "నాయనా. శత మాసములైనా నిండక ముందే నీకు శతయుర్దాయం పూర్తయిందా? సకల సామంత దండనాధుల సమక్షాన, నిన్ను రేపు సింహాసనం మీద కూర్చుండబెట్టి – స్వహస్తాలతో, నవరత్న ఖచితమైన

కిరీటంతో అలంకరిద్దామనుకున్నానే! ఇంతలోనే-నేను సార్వభౌముడుగా ఉండగానే- నీకు వల్లకాటి సామ్రాజ్య పట్టాభిషేకం చెయ్యాల్సి వచ్చిందా, తండ్రీ!" అని విలపిస్తూ, "అప్పాజీ!" ఇంత ఘోరం జరుగుతుందని కలలో కూడా ఊహించారా, అప్పాజీ! చూడండి. నా పసిపాపను. రేపు మీరు ఏ పసిపాపను సింహాసనం ఎక్కిస్తానని మాట యిచ్చారో, ఆ పసిపాప దౌర్భాగ్య పరిస్థితిని చూడండి," అన్నాడు మహారాజు.

"రాయా! ఇది అనుకోని హత్య కాదు." అన్నాడు మహామంత్రి వీరేంద్రుని వంక చూస్తూ.

"అవును. స్వాములు సంకల్పసిద్ధులు. ఈ హత్య చేసింది మీరు." వీరేంద్రుని దోషారోపణా పూర్వక సింహగర్జన భవన మంతటా ప్రతిధ్వనించింది. ఆ మాట వొచ్చిన తీరుకు మహామంత్రి కూడా క్షణమాత్రం విచలితుడైనాడు. రాయలవారికి రోషం వచ్చింది. "వీరేంద్రా! వారెవరో తెలిసే అంటున్నావా? వారు అప్పాజీ!" అన్నాడు మహారాజు అంత శోకంలో కూడా.

అయినా, వీరేంద్రుడు చలించలేదు. "అవును, మహారాజా! అప్పాజీవారు కాబట్టే-ఇంతపని, ఇంత సునాయసంగా చేయగలిగారు. మహామంత్రి ఇంత అర్ధరాత్రాన- అన్నపూర్ణాదేవి అంతఃపురానికి రావాల్సిన అవసరమేముందీ? హతుడైన బాలుని ప్రక్కన, ఆ సమయంలో నిల్చుండాల్సిన అవసరమేముంది? మహామంత్రి రాజకుమార హత్య చేస్తుండగా మహారాణీ స్వయంగా చూచింది. అడగండీ, మహారాజా!" అన్నాడు.

వీరేంద్రుని మాటలకు మహామంత్రి స్థాణువైపోయాడు. మహారాజు విచలితుడైనాడు. అప్పుడే సేదదేరి స్పృహలోకి వొచ్చిన దేవిని చూచి "మహారాణీ! అప్పాజీవారు హత్య చేస్తుంటే, నీవు స్వయంగా చూచావని చెప్తున్నాడు వీరేంద్రుడు. ఇది నిజం కాదని చెప్పు. ఇది అసత్యం అని చెప్పు, దేవీ! ఇదే నిజమైతే-పొంగిపొరలే తుంగభద్రా తరంగాలలో ఈ విజయనగరమే సర్వనాశనం అవుతుంది. కృష్ణా గోదావరీ మహా ప్రవాహముల వెల్లువలో ఆంధ్రదేశమే అంతరిస్తుంది. చెప్పు, దేవీ! అది నిజం కాదని చెప్పు," అన్నాడు మహారాజు.



"చెప్పు, మహారాణీ! చూచిన విషయం చెప్పటానికి సంకోచం ఎందుకూ?" వీరేంద్రుడు విచిత్ర దృష్టులతో మహారాణిని మంత్రబద్ధను చేసివేశాడు. మహారాణి శోకభారంతో మాట్లాడలేకపోయింది.

వీరేంద్రుడు మహారాణికి ధైర్యం చెప్పాడు. "చూసిన నిజాన్ని బయట పెట్టటానికి సందేహిస్తావెందుకు, మహారాణీ? అతడు ఘటనాఘటన సమర్థుడే కావచ్చు. కాని, మహారాజు ఉన్నాడు-భయంలేదు. చెప్పు, మహారాణీ!"

"చెప్పు, దేవీ! విషయాన్ని ఉన్నట్టు చెప్పు; సందేహించకు. అప్పాజీవారు హంతకుడంటున్నాడు వీరేంద్రుడు" అన్నాడు మహారాజు.

ఆ ప్రశ్నకు సమాధానంగా రాణి తల ఊపి ఇక అక్కడ నిలువలేక వెళ్ళిపోయింది. మహారాజుకు మతి చలించింది. శోక ప్రవాహం ఉప్పొంగి గట్లు త్రెంచుకొని వెల్లువగా ప్రవహించింది. అవయవ పటుత్వం అంతరించింది. ఆయనకు రెండందాల దుఃఖం, కుమారుడు హత్య చేయబడ్డాడే అన్న దుఃఖం కన్నా, ఆ హత్య చేసింది అప్పాజీవారే అన్న బాధ అధికంగా ఉంది.

రాయలు కళ్ళవెంట బొటాబొటా కన్నీరు కారుస్తూ "అప్పాజీ! నామమాత్ర సార్వభౌముడనైన నా వెనుక ఉండి, సర్వ సామ్రాజ్యాన్నీ మీరే ఏకఛ్ఛత్రాధిపత్యంగా పరిపాలించారే! ఎనభైవర్షాలు నిండిన తరువాత మీకు రాజ్యాశ కలిగిందా? ఆ మాట ఛాయామాత్రంగా తెలిస్తే, మిమ్మల్నే సింహాసనం మీద అధిష్టింపజేసేవాణ్నే! నేనే ప్రతిబంధకం కానప్పుడు మీకు నా కుమారుడా - నా పసిపాపడా, ప్రతిబంధకం? పుత్రశోక జనిత దవానల కీలలచే నా హృదయాన్ని దగ్ధం గావించేకన్నా, నన్నే అంతం కావిస్తే, మీ అభీష్టం సిద్ధించేదే, అప్పాజీ?" అని విలపిస్తున్న రాయలను చూచి మహామంత్రి కూడా కలత చెందాడు.

ఎవరు ఏమనుకొన్నా, తన రాయలు తన్ను విశ్వసిస్తాడనీ, ద్రోహులను క్షణంలో అణచివెయ్యవచ్చనీ మహామంత్రి ఆశించాడు. కాని, అందుకు వ్యతిరేకంగా మహారాజే తన్ను శంకించటానికి ప్రారంభించేసరికి మహామంత్రికి తన మీద తనకే విరక్తి కలిగింది. తనకు ఆత్మీయుడైన

మహారాజు- తన స్వంత చేతుల మీదుగా పెరిగిన మహారాజు- తన శిక్షణలో పరిపూర్ణత్వాన్ని పొందిన మహారాజే తన్ను శంకిస్తే, ప్రపంచంలో తన్ను ఇంకెవరు శంకించరు? ఏ అర్భకుడ్ని సుస్థిరం చెయటానికి తాను చేయ రాని ఘోర పాపాలు, అమానుషమైన కృత్యాలు, భయంకరమైన నిగూఢ హత్యలు అనంతంగా రెండవకంటికి తెలియకుండా చేయించాడో —అ అర్భకుడు ఈ నాడు మహారాజై స్వాశ్రయాన్నే శంకించసాగాడు. ఇంకేం కావాలి?....

మహామంత్రి మనసు విరిగిపోయింది. తన రాయలు తన్ననుమా నించిన తరువాత తనకు జీవితమే వ్యర్థమనుకున్నాడు. ఔను, కాదనలేదు మహామంత్రి. మహామంత్రి మౌనాన్ని దోషాంగీకారం క్రింద నిర్వచిం చాడు వీరేంద్రుడు.

మహారాజు మహామంత్రి వైపు తిరిగి “మీరేం చెప్తారు, మహ మంత్రీ?” అన్నాడు.

మహామంత్రి మాట్లాడలేదు.

“ఆయన చెప్పేందుకేముంది, మహారాజా? ప్రాడ్వివాకులకు కబు రంపి న్యాయసభ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేయండి. సాక్ష్యాధా రాలతో సహా నేరాన్ని ఋజువు చెయ్యటానికి నేను సిద్ధంగా ఉన్నాను” అన్నాడు వీరేంద్రుడు.

ఒక్కసారి మహామంత్రి వంక పరిశీలనగా చూశాడు మహారాజు. మహామంత్రిలో ఏ విధమైన చలనం కన్పించటం లేదు. ఏ విధమైన భావం స్ఫురించటం లేదు. చుట్టూ ఉన్న పరిజనం వంక చూచాడు. అందరూ భీతావహులై మహామంత్రి వైపే కన్నార్పకుండా చూస్తున్నారు. ఒక్కసారి విగతజీవుడై- రక్తసిక్త దేహంతో విగతజీవుడై- పడి ఉన్న కుమారుడి వంక చూచాడు.

తన ప్రతిరూపం నిర్జీవంగా పడివుంది చలన రహితంగా. ప్రాణాలు పోయినా, కుమారుడి దేహం సజీవంగానే వున్నట్లనిపించింది మహారాజుకు “నాన్నా!” అని పిలిచినట్లు వినిపించింది. “బాబూ!” అంటూ మహారాజు కుమారుడి దేహం మీద పడి వెక్కి వెక్కి ఏడ్చాడు పసిపాప



లాగా. బాలుడి శరీరం మీద తలపెట్టి ఏడుస్తున్న మహారాజుకు, తన తలకు ఏదో తగిలినట్లయింది. ఆశ్రుపూరిత నయనాలతో దాన్ని పరికిం చాడు. మహారాజుకు పిచ్చెక్కినట్లయింది. అది నవరత్నఖచితమైన ఛురిక.

ఆ ఛురికను తానే చేయించాడు స్వయంగా. ఈనాడు యువరాజు గుండెలలో దిగబడి వుంది. అమూల్యమైన మరకత, గోమేధిక, పుష్య రాగాది నవరత్నాలను ఆ ఛురిక పిడిలో పొదిగించి, తానే తన స్వహస్తా లతో తానువిజయనగర సింహాసనాసీనుడై నాడు, తన రాజరికానికి కారణభూతు డైన మహామంత్రి అప్పాజీ వారికి బహూకరించాడు. ఆనాటి నుండీ ఈనాటి వరకూ అప్పాజీవారు దాన్ని కేవలం అలంకారార్థంగానే అప్పుడప్పుడు వాడుతుండేవారు. ఈ నాటి వరకూ ఆ ఛురిక రక్తసిక్తం కాలేదు. కాని, ఈనాడు చూడకూడని స్థానంలో దాన్ని చూసినందుకు మహారాజు మనస్సు క్షోభించిపోయింది. వెంటనే ఆ ఛురికను తన చేత్తో కప్పివేశాడు మహా రాజు. మహారాజు మనస్సులో పెను తుఫాను రేగింది. పుత్రనష్ట జని తోన్మాదం క్షణక్షణానికీ హెచ్చు పెరిగి పోతున్నది. మహారాజు తన మన స్సును అదుపులో పెట్టుకోవాలని విపరీతంగా ప్రయత్నం చేస్తున్నాడు. కాని, సాధ్యం కావటం లేదు. మహారాజు అప్పాజీవారి వంక దీనంగా చూశాడు.

“అప్పాజీ! కర్ణకఠోరమైన- హృదయ విదారకమైన ఈ నగ్న సత్యాన్ని నమ్మకుండా ఉండాలని అన్నివిధాలా ప్రయత్నిస్తున్నాను.

“పుట్టినప్పటినుంచి పొరపొచ్చాలు లేకుండా తమరూ, నేనూ ఒక టని తలచి సంభావించాను.

“అన్ని వేళల్లోనూ, అష్టకష్టాల్లోనూ తమ నీడలో తల దాచు కున్నాను.

“ప్రవిమలంగా మీకు శుశ్రూష చేసి, అఖిల శస్త్రాస్త్ర విద్యలను అభ్యసించాను.

“మణిమయంబైన రత్న మాణిక్యమకుటం దాల్చి కూడా తమ ఆజ్ఞకు ఎన్నడూ ఎదురాడలేదు.

"నా అభ్యుదయమంతా మీదే అని తలచాను కాని, మీ తల పెరుగను. ఎరిగి ఉంటే, ఈ ఆంధ్రసామ్రాజ్య సర్వస్వాన్ని మహా సంతోషంతో తమకు ధారవోసి, తరుక్కుపోతున్న ఈ మహా బాధాకరమైన కడుపుకోతకు గురి కాకుండా భార్యాసుతులతో ఏ అరణ్యం మధ్యనో హాయిగా జీవితాంతం వరకు గడిపేవాణ్ణి...."

మహారాజు మాటలు మహామంత్రికి కర్ణశూలాయమానంగా ఉన్నాయి. రెండు చెవులు మూసుకున్నాడు మహామంత్రి. ఆ కఠోర వాక్కులు వినలేక నఖశిఖ పర్యంతం దహించుకు పోతున్నట్లుంది మహామంత్రికి.

"మహారాజా! విచారించి, శిక్షించదగిన మహా నేరాన్ని మా మీద ఆరోపించారు. విచారించు! శిక్షించు! అంతే కాని, అనవసరంగా మా హృదయాన్ని బాధపెట్టకు" అన్నాడు మహామంత్రి. మహామంత్రి వచనాలలో వీరేంద్రుడికి పట్టు దొరికింది.

"మంచి చక్కని ఊహ. మహారాజా! ఈ విచారణ వెంటనే జరిపించండి. విచారించి శిక్ష విధించండి. అప్పుడుగాని పుత్ర మరణ సంజనిత బాధా బాధితమగు మీ హృదయానికి శాంతి లభించదు. అప్పుడుగాని అకాలమృత్యువు కాహుతి అయిన మీ కుమారుడి ఆత్మకు శాంతి లభించదు." అన్నాడు వీరేంద్రపాత్రుడు - మహారాజుకు కర్తవ్య బోధ చేస్తూ.

మహారాజు ఒక్క క్షణం ఆలోచించాడు. వెంటనే రాత్రికి రాత్రే ప్రాడ్వివాకులను పిలిపించి న్యాయసభ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేయమని ఆజ్ఞ ఇచ్చాడు. వీరేంద్రుడు సంతుష్ట హృదయంతో కార్య నిర్వహణకు వెళ్ళిపోయాడు.

మరి కొన్ని క్షణాలు గడిచాయి. మహారాజు కనుసన్నలలో పరిజనులంతా నిష్క్రమించారు. అక్కడ సజీవంగా మిగిలి ఉన్నది ఇద్దరే! ఒకరు మహారాజు, రెండవవారు మహామంత్రి.

మహారాజు కుమారుడికి శయ్యవద్దనుండి లేచి; మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ ముఖాన శోకపూరిత గాంభీర్యం ఉట్టిపడుతుండగా



మహామంత్రిని సమీపించాడు. అతడి చేతిలో ఉన్న - ఎర్రని డాగులతో మలినమైనా తళతళా మెరిసిపోతున్న ఛురిక "దాహం! దాహం!!" అంటున్నట్లుంది.

రాజు మంత్రి దగ్గరకు వెళ్ళి "అప్పాజీ! ఈ ఛురిక మీది...." అంటూ రెండు చేతులతోనూ ఛురికను మహామంత్రి కళ్ళకు చూపించి, తన దక్షిణ హస్తంతో ఆ ఛురికను గవాక్షం గుండా ఉద్యానవనంలోకి విసిరివేశాడు.

ఆ ఛురిక తనది కావటం మహామంత్రికి ఆశ్చర్యం కలిగించలేదు. ఇలాంటి స్వల్ప విషయాలు మహామంత్రికి అప్రధానాలు. అతనికీ సమస్యలో ప్రధానమైనది రాయలే తన్ను అనుమానించాడే అని. అంతే!

మౌనంగా తల వంచుకున్న అప్పాజీవారిని చూచి "అప్పాజీ! కొద్ది కాలంలో మిమ్మల్ని విచారించటానికి న్యాయమూర్తులు సమావేశమౌతారు. ఒకవేళ మీరే ఈ నేరాన్ని సహజంగా చేసిఉన్నా, నిర్దోషినని నిరూపించుకోండి. మీరు నా కుమారుణ్ణి హత్య చేశారనే విషయాన్ని మీ అపూర్వ మేధాశక్తితో నన్ను విశ్వసించకుండా చేయండి. నేను మిమ్మల్ని బహిరంగంగా విచారించలేను. మీరు దోషం చేసినా, దోషి అని నమ్మి శిక్షించలేను. అప్పాజీ! నన్ను క్షమించండి...." అంటూ మహారాజు రెండు కన్నీటి బొట్లు రాల్చి గంట మ్రోగించాడు, వెంటనే అంతఃపుర రక్షక భటులు ప్రవేశించారు. "నిందితుణ్ణి తీసుకు వెళ్ళండి—" అంటూ మహారాజు వెళ్ళిపోయాడు.

# 8

రాత్రికి రాత్రే రాజకుమారుని హత్యావార్త పరిజనుల ద్వారా అంతఃపురం దాటి విజయనగర మహాపట్టణాన్ని గగ్గోలెత్తించింది. దాని కన్నా హంతకుడిగా మహామంత్రి అప్పాజీవారు అనుమానింపబడ్డారన్న వార్త దావానలంలాగా పట్టణంలోని మారుమూలలకు వ్యాపించింది.

ఆ సంఘటనను మహారాజూ చూశాడు. ఆయన కళ్ళ వెంట ధారాపాతంగా కన్నీళ్ళు కారుతున్నాయ్.

ప్రధాన ప్రాడ్వివాకుడు మహారాజు పేరిట సభ నుద్దేశిస్తూ అభియోగాన్ని చదివాడు.

"మహారాజా! తమ సన్నిహిత బంధువూ, ఆంధ్రసార్వభౌములకూ, అన్నపూర్ణాదేవికీ జన్మించిన కుమారులూ అయిన శ్రీశ్రీశ్రీ తుళువ తిరుమల రాయలవారిని, రాజ్య కాంక్షాపూరితులై - ఆంధ్ర సామ్రాజ్యానికి మంత్రాంగం నెరపుతున్న సాళువ తిమ్మరుసయ్యవారు హత్య చేశారని; విచారించి, నిందితుని శిక్షించి, న్యాయం ప్రసాదించమనీ అభియోగకారుడైన వీరేంద్రపాత్రుడు కోరుకుంటున్నాడు...." అంటూ ప్రధాన ప్రాడ్వివాకుడు - వీరేంద్రుని వంక తిరిగి "మీ అభియోగానికి సాక్ష్యాధారాలు ఉంటే, మహా ప్రభువుల ఎదుట సభ వారికి ఋజువు చేయండి," అని కూర్చున్నాడు.

వీరేంద్రుడు మహారాజుకు వంగి నమస్కారం చేసి "నా వాదాన్ని ఋజువు చేయటానికి నిందితుణ్ణి ప్రశ్నలడుగుతాను. సెలవిప్పించండి, మహారాజా." అని ప్రార్థించాడు. మహారాజు ఆమోద సూచకంగా తల ఎగురవేశాడు.

సభా భవనమంతా ఆదుర్దాగా - విచారణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్నది ఆంధ్రదేశ చరిత్రలోనే అంతటి అసాధారణమైన నేర విచారణ ఇంతెప్పుడూ జరుగలేదు. హతుడు మహారాజ కుమారుడు, భావి సామ్రాట్ ఆరేళ్ళు నిండని - ముక్కుపచ్చలారని పసిపాపడు. నిందితుడు తన అనంత మేధ సంపత్తితో - విజయనగర సామ్రాజ్యాన్ని ప్రపంచంలోకల్లా అద్వితీయంగా తీర్చిదిద్దిన మహా మహ్నీయుడు సాళ్వ తిమ్మరుసు మహామంత్రి; రాజుకు అత్యంత ప్రీతిపాత్రుడు. మహారాజు చేతనే "అప్పాజీ!" అని పిలిపించుకునే సాటిలేని మేటి. నేరానికి ప్రధాన సాక్షి కటక రాజపుత్రి, ఆంధ్ర సార్వభౌముని అనుంగు రాణీ, హతుడి తల్లి అన్నపూర్ణాదేవి. దోషారోపకుడు కటకేశ్వరుడి మేనల్లుడు వీరేంద్రపాత్రుడు. విచారణ కర్త మహారాజు - శ్రీకృష్ణ దేవరాయలవారు.



"మహామంత్రీ! అర్ధరాత్రివేళ మహారాణి అన్నపూర్ణాదేవి అంతఃపురాన్ని ప్రవేశించారు మీరు. కారణం తెలుసుకోవచ్చా?" వీరేంద్రపాత్రుడు ప్రశ్నించాడు.

మహామంత్రి ఒక్కసారి తల ఎత్తి చూశాడు. సభా భవనమంతా తన సమాధానం కోసం ప్రతీక్షిస్తున్నది, రాయలు తన వంక ఆదుర్దాతో చూస్తున్నాడు. పాపం! రాయలు మహామంత్రి తిమ్మరుసే హంతకుడని పరిస్థితుల సాక్ష్యాధారాలను బట్టి విశ్వసించాడు. కాని, మహామంత్రి యందుండే గౌరవాదరాభిమానాల కొద్దీ, తాను విశ్వసించిన విషయాన్ని విస్మరించాలని ప్రయత్నం చేస్తున్నాడు. ఈ ఊహ మనోపథంలోకి రాగానే - మహామంత్రికి రాయలవారి మీద జాలీ, తన మీద తనకు అసహ్యమూ కలిగాయి. మహామంత్రి మాట్లాడబోయినట్లు అగుపించాడు. సభాభవనం యావత్తూ నిశ్శబ్దంగా ఉంది మహామంత్రి వాక్యాల కొరకు ఎదురు చూస్తూ. కాని, మహామంత్రి మాట్లాడలేదు; తల దించేసుకున్నాడు. సభలో కల్లోలం బయలుదేరింది. వీరేంద్రుడు సగర్వంగా సభాభవనం వంకా, రాజు వంకా చూశాడు. వీరేంద్రుడు మళ్ళీ ప్రశ్నించాడు.

"మహామంత్రీ! ఈ రాత్రి బాలుడి యువరాజ పట్టాభిషేకానికి తమర్ని సమ్మతింప చేయటానికి మహారాజు స్వయంగా మీ వద్దకు వొచ్చారు కదూ?"

మహామంత్రి ఆ ప్రశ్న వింటున్నట్లే లేదు.

ఆయన మానాన్ని ఆమోదంగా పరిగ్రహించి. వీరేంద్రుడు తన ప్రశ్నను కొనసాగించాడు; "మీరు మొదట్లో ఆ కోరిక మహారాజు నోటి నుంచి వినేసరికి దిగ్భ్రాంతి చెందారు. కాని, మహా మేధావులవటం వల్ల వెంటనే దాన్ని కప్పిపుచ్చుకొని, రాజపుత్రుడికి పట్టాభిషేకం స్వయంగా జరిపిస్తానని మాట ఇచ్చారు. నిజంగానే రాజకుమారుణ్ణి మీ స్వహస్తాలతో వల్లకాటి సామ్రాజ్యానికి పట్టాభిషేకం చేశారు. అవునా, మహామంత్రీ?"

మహామంత్రి అవుననాలేదు, కాదనాలేదు.

"మహామంత్రీ! తుళువ వీరనరసింహరాయల అనంతరం ఆయన సంతానాన్ని త్రోసిరాజని శ్రీకృష్ణదేవరాయలవారిని సింహాసనం ఎక్కిం

చారు కదా, మీరు—నరసింహరాయలవారి సంతానం ఏమయిందో చెప్తారా?"

వీరేంద్రుడి ఈ ప్రశ్నకు సమాధానంగా మహామంత్రి నేత్రద్వయంలోనుంచి విస్ఫులింగాలు రాలాయి. తీక్షణంగా రాజు వంక చూశాడు మహామంత్రి. రాజు తన అసహాయతను సూచిస్తూ ప్రాడ్వివాకుల వైపు చూశాడు. ప్రధాన ప్రాడ్వివాకుడు వీరేంద్రుణ్ణి ఆ ప్రశ్న వేసినందుకు మందలించాడు: "వీరేంద్రపాత్రుల ప్రశ్న హద్దు మీరింది: అసందర్భమైంది. దానికి మహామంత్రులు సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదు."

"ఇది నిందితుడి నైతిక ప్రవర్తనను స్థాపించే ప్రశ్న." అన్నాడు వీరేంద్రపాత్రుడు.

అయినా, ప్రాడ్వివాకుడు ఆ ప్రశ్నను అనుమతించాడు కాదు. అనుమతించినా, అనుమతించకపోయినా మహామంత్రి సమాధానం మౌనం కాక, మరోవిధంగా ఉండేది కాదేమో,

"మీరు రాత్రి ప్రథమ యామంలో అన్నపూర్ణాదేవి అంతఃపురానికి వచ్చారు - కారణం?"

".... .... .... ...."

"మహారాజు ఈ రాత్రి మీ వద్దకు వొచ్చినప్పుడు మీరు రాజసోదరుడు అచ్యుతదేవరాయలవారితో మంతనాలాడుతున్నారు. వాటి సారాంశమేమిటో తెలుసుకోవొచ్చా?"

".... .... .... ...."

"మీ కుమారుడూ, విజయనగర సామ్రాజ్య ప్రధాన దండనాథులలో ముఖ్యుడూ అయిన గోవిందరాయలవారిలో ఉన్న సార్వభౌమ లక్షణాలకు మీరు మురిసిపోతుంటారట - నిజమేనా?"

".... ... .... ...."

"పట్టమహిషి తిరుమలాంబిక ఔరసపుత్రి జలజతో మీ కుమారుడు నెరపుతున్న ప్రణయం సంగతి మీదాకా వొచ్చిందా?"

".... .... .... ...."



"ఈ మధ్య మహాదండనాయకుడు పెమ్మసాని రామలింగ నాయకుడు మీ వద్దకు అనేక సార్లు వొచ్చి పోతున్నాడు- కారణమేమిటో?"

".... .... ...."

వీరేంద్రుడి ప్రశ్నలకు సభాస్థలి నలంకరించి ఉన్న రామలింగ నాయకులకూ, అప్పుడే మహామంత్రి విచారణ వార్త తెలిసి, అశ్వారూఢుడై ఆఘమేఘాల మీద సభాస్థలికి చేరుకున్న అచ్యుతదేవరాయలవారికీ, మిగిలిన న్యాయమూర్తులకూ కూడా విపరీతంగా కోపం వచ్చింది. కాని, ఏం చేస్తారు? మహామంత్రి నిశిత వీక్షణాలు వారిని బంధించివేశాయి. మంత్రబద్ధ భుజంగాల్లాగా అచేతనులై తలలు వొంచుకున్నారు. మహామంత్రి నోరు తెరచి ఏ ప్రశ్నకూ సమాధానం చెప్పలేదు. తన నిర్దోషిత్వాన్ని ఋజువు చేసుకోవటానికి ప్రయత్నించనూ లేదు.

తన ప్రశ్నలకు సమాధానం రాకపోయేసరికి వీరేంద్రుడికి ఉత్సాహం అధికమైంది మహారాజు వంక తిరిగి "మహారాజా! నిందితుడు ఆత్మసంరక్షణకు ప్రయత్నించకపోవటమే అతనిమీద ఆరోపింపబడ్డ నేరాన్ని ఋజువు చేస్తున్నది అంతేగాక, హత్యకు ప్రత్యక్ష సాక్ష్యంకూడా ఉంది. మహామంత్రి బాలుణ్ణి హత్య చేస్తుండగా మహారాణీ అన్నపూర్ణాదేవి స్వయంగా చూశారు. అదుగో, మహారాణీ- అభ్యంతరం వెనుక! అంతఃపురాంగన కావటంవల్ల సభకొచ్చి నిలబడి సాక్ష్యం చెప్పలేకపోయినా, ప్రధాన ప్రాడ్వివాకులు తెర ఇవతలి నుండి ప్రశ్నించి సమాధానాన్ని పొందవచ్చు" అని విన్నవించటంతో ప్రధాన ప్రాడ్వివాకుడు మహారాణి ఆసీనురాలైన అభ్యంతర స్థలాన్ని సమీపించి "మహారాణీ! వీరేంద్రపాత్రులు తమరిని హత్యకు ప్రత్యక్ష సాక్షిగా ప్రవచిస్తున్నారు. తమ అభిప్రాయాన్ని సెలవివ్వండి" అని ప్రశ్నించాడు.

మహారాణి కుమిలిపోతున్న హృదయంతో ఎంతసేపటికీ ఔను, కాదనే సమాధానాన్ని ఇవ్వలేకపోయింది. ఆమె మౌనాన్ని అంగీకృతిగా పరిగ్రహించి, తన స్థానంలోకి తిరిగి వొచ్చి, ప్రాడ్వివాకుడు ఆ విషయాన్ని సభవారికి హెచ్చరిక చేశాడు.

వీరేంద్రుడు తన వాదాన్ని కొనసాగించాడు: "మహారాజా! ధర్మాధర్మ విచక్షణాకోవిదులైన న్యాయమూర్తులారా!

"మీ ఎదుట ఈనాడు నిందితుడుగా నిలిచి ఉన్న మహామంత్రి గత చరిత్ర మనకు తెలియంది కాదు. మొదటనుండీ రాజ్యాశకు ఆలవాలం ఇతని గంభీర హృదయం.

"నిజానికి రాజ్యాధికారానికి భారతదేశం యావత్తులోనూ అతణ్ణి మించిన అర్హుడు కూడా లేడనేది నిర్వివాదాంశం. కాని, అతని అభిజాత్యం అతనికా అవకాశం లేకుండా చేసింది.

"గర్భదరిద్రులైన బ్రాహ్మణ దంపతులకు జన్మించిన ఈనాటి మహామంత్రి తన చిన్నతనంలో భిక్షాటన చేసి, పుల్లాకులలోని ఎంగిలి మెతుకులు తిని ఆకలి బాధను అణచుకొని జీవించేవాడు. అయినా తన మేధాసంపత్తితో అనతి కాలంలోనే అమాత్య పదవిని అలంకరించాడు. తాను కొలువు చేసిన వారి కోసం శక్తియుక్తులన్నీ వినియోగించాడు. ఎందుకు? తనకు తాను వినియోగించుకోలేక కాదు; ప్రజలలో ప్రచారంలో ఉన్న తన చరిత్ర తనకు రాజ్యాధికారం లేకుండా చేసింది కాబట్టి.

ఈనాడు ప్రజలంతా సాళ్వ తిమ్మరుసు మహామంత్రి గత చరిత్రను విస్మరించి, ఆయన్ను కేవలం దైవాంశ సంభూతునిగా హృదయ పీఠాలపైన నిలిపి ఆరాధిస్తున్నారు. తాను ఇంతవరకూ వేచి ఉన్న సమయమాసన్నమైందనుకున్నాడు మహామంత్రి.

"కాని, ఇంతలో మహారాజుకు సుపుత్రప్రాప్తి కలిగింది. ప్రజలంతా హృదయపూర్వకంగా వేడుకలు చేసుకున్నారు. కాని, ఆ శుభవార్త కర్ణశూలాయమానమై బాధించింది ఒక్క మహామంత్రిని మాత్రమే.

"ఈ దినం మహారాజు యువరాజ పట్టాభిషేకాన్ని తలపెట్టారు. మహామంత్రి జైత్రయాత్రా మిషతో దాన్ని వెనక్కు నెట్టాలని ప్రయత్నం చేశాడు; విఫలుడయ్యాడు. తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోటానికి రాజకుమారుడిపై ప్రేమ నటించి, పట్టాభిషేకాన్ని తానేస్వయంగా నిర్వహిస్తానని మాట ఇచ్చాడు. కాని, రాత్రికి రాత్రే అతి భయంకరంగా ఆ పసిపాపను తన రాజ్యకాంక్షకు ఆహుతి చేశాడు.



"గర్భశోకంతో రాజదంపతులు కృంగి, కృశించి, నశించిపోతారని ఆశించాడు. కాని మహామంత్రి కాని పని చేస్తుండగా మహారాణీవారు స్వయంగా చూశారు. లేకపోతే, ఈ ఆంధ్ర సామ్రాజ్యమే సర్వనాశనమయ్యే పరిణామాలు వొచ్చేవి తెల్లవారేసరికి. విజయనగరపు కోటగోడలు రక్తధారలతో అరుణారుణంగా ప్రకాశించేవి ప్రాతఃకాలపు బాలభానుని అరుణకిరణాలలో. కుమార సాళువ గోవిందరాయలవారి రాజరికానికి దారి నిష్కంటకమయ్యేది. విచారించండి, మహారాజా!"

వీరేంద్రుడి వాదనా పటిమను చూస్తుంటే, ధర్మపీఠం మీద ఆసీనుడైన మహారాజుకు భగభగమండే నిప్పుల మీద కూర్చున్నట్లుంది. నిజానికి మహారాజు మనసులో ఏది యోచించాడో–అదే వీరేంద్రపాత్రుని వాదంలో ప్రతిబింబించింది కాని, మహారాజు హృదయం మాత్రం వీరేంద్రుడి అభియోగాన్ని తిరస్కరిస్తోంది; అప్పాజీవారిని శిక్షించటానికి వ్యతిరేకిస్తూంది. మహామంత్రి ప్రతివాదం చేయకపోవటం మహారాజుకు ఎంతో కష్టంగా ఉంది.

"నిందితులు చెప్పుకోవాల్సింది ఏమన్నా ఉందా?" అన్నాడు మహారాజు.

మహామంత్రి ప్రశాంత దృష్టితో మహారాజును చూస్తూ "లేదు" అని సమాధానం చెప్పాడు.

"నిందితుడి పక్షాన ఈ న్యాయస్థాన సమక్షంలో వాదించే వారెవరూ లేరా?" మహారాజు కంఠం రుద్ధమైపోయింది.

మహారాజు ప్రశ్న వినటంతోనే ఒక్కసారిగా మహాదండనాథుడు రామలింగనాయకుడూ, రాజసోదరుడు అచ్యుతరాయలవారూ, మహారాజ అంగరక్షక దళాధిపతి విరూపాక్షప్పా—మొదలుగా గల ఉన్నతాధికారులనేకులు లేచి నుంచున్నారు.

మహామంత్రి ఒక్కసారి సభాభవనమంతా కలయ జూశాడు. ప్రతి వ్యక్తీ తన్ను రక్షించటానికి పూనుకోవటం చూసిన మహామంత్రి

కళ్ళనించి రెండు కన్నీటి బొట్లు రాలాయి. బహుశః ఆయన జీవితంలో అదే మొదటిసారేమో! కావు: అవి ఆనందబాష్పాలైనా కావొచ్చు. మహామంత్రి పెదవులు వొణికాయి.

"నా పక్షాన ఎవరూ వాదించటానికి నేను ఒప్పుకోను," అన్నాడు మహామంత్రి. ఆ మాటలంటున్నప్పుడు ఆయన ముఖం గంభీరంగా మారిపోయింది.

రాజోద్యోగులంతా అసహాయులై తలలు వంచి కూర్చున్నారు. మహామంత్రిది తిరుగులేని నిర్ణయమని అందరికీ తెలుసు.

ఆ క్షణంలో రాయలవారి మనోపథంలో చెలరేగిన భావతరంగాలకు భాష్యం చెప్పటం సాధ్యంకాని విషయం. మహారాజు ఒక్క క్షణం ఆలోచించాడు. వీరేంద్రపాత్రుని వైపు తిరిగి "నియోగ కర్తలు హత్యాయుధాన్ని సభా సమక్షాన ప్రదర్శించకుండా నేరం ఎలా ఋజువౌతుంది? నిందితుడు హత్యాస్థలం నుండి కదల్లేదు. నిందితుడే హత్య చేసి ఉంటే, ఆ ఆయుధం మరొక చోటికి నడిచి వెళ్ళే అవకాశం లేదు." అన్నాడు మహారాజు.

ఆయనలో ఆ మాటలంటున్నప్పుడు అంతర్లీనంగా ఉన్న విషాదవాహినిని మహామంత్రి అప్పాజీ తప్ప మరెవరూ పసిగట్టలేకపోయారు.

సభలో కలకలం బయలుదేరింది. తమ మహామంత్రికి అనుకూలమైన, బలమైన ఆధారం దొరికినందుకు సభాసదుల్లో సంతృప్తి గోచరించింది ప్రతివారూ వీరేంద్రుణ్ని అపహాస్య దృష్టులతో పరికించారు. అయినా. వీరేంద్రుడు చలించినట్లు లేదు.

"ఇదిగో మహారాజా! హత్యకుపయోగించిన ఛురిక. తాము తమ పట్టాభిషేకంనాడు కృతజ్ఞతా చిహ్నంగా - అప్పాజీవారికి బహూకరించిన నవరత్న ఖచితమైన ఛురిక చూడండి...." అంటూ ఛురికను సభ వారికి ప్రదర్శించాడు వీరేంద్రుడు.

మహారాజుకు పైప్రాణం పైనే పోయినట్లయింది ఆ ఛురికను చూడటంతోటే.

"యువరాజును హత్య చేయగానే, పహారా అలికిడి విని హంత



కుడు ఈ ఛురికను గవాక్షంగుండా బయటికి విసిరాడు. తమ ఆజ్ఞానుసారినై న్యాయసభ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేయటానికి పోతున్న నాకు దారిలో కనిపించింది చూడండి! తమ కుమారుని రక్తపు దాగులు దాని మీద చూడండి, మహారాజా!"

మహారాజు మరి మాట్లాడలేదు. తల వొంచుకున్నాడు.

ప్రధాన ప్రాడ్వివాకుడు నిందితుణ్ణి మరోసారి ప్రశ్నించాడు—

"మీరు చెప్పాల్సింది ఏమన్నా ఉందా?" అని.

మహామంత్రి ఏమీ లేదన్నట్లు తల ఆడించాడు.

విచారణ ముగిసిందని ప్రకటించాడు ప్రధాన ప్రాడ్వివాకుడు.

* * *

మరో కొన్ని క్షణాల అనంతరం ప్రధాన ప్రాడ్వివాకుడు మహారాజు ఆమోదంతో, ప్రాడ్వివాకుల ఏకగ్రీవ నిర్ణయాన్ని సభకు ప్రకటించాడు.

"నిందితుని మీద ఆరోపించబడ్డ హత్యానేరం బలమైన సాక్ష్యాధారాలతో ఋజువైనట్లుగా ప్రాడ్వివాకులు ఏకగ్రీవంగా అభిప్రాయ పడుతున్నారు. నిందితుని మౌనం అతని దోషాన్ని అన్నివిధాలా నిరూపిస్తున్నది. రాజ వంశీకులను రాజ్యకాంక్షతో హత్య చేసిన వారి రెండు కళ్ళూ పెరికివేసి, ఆహారం- నీరూ ఇవ్వకుండా, కారాగృహంలో మలమలా మాడ్చి చంపాలని ధర్మశాస్త్రం నిర్ణయిస్తున్నది."

"కాని, ఈ నేరంలో నిందితుడు విజయనగర ప్రధాన రాజకీయోద్యోగులలో అత్యున్నతుడు కాబట్టి, అట్టివారి మసుగడ సామ్రాజ్యంలో అంతఃకలహాలకు దారితీస్తుంది కాబట్టి, నిందితుడి కళ్ళు ప్రాతఃకాలప్పు నగారా గంట మోగిన వెంటనే పెరికివేయాలని న్యాయమూర్తుల నిర్ణయం.

"అయితే విజయనగర సామ్రాజ్యానికి వారు గతంలో చేసిన సేవల దృష్ట్యా వారు జీవితాంతం వరకూ అన్నపానీయాలకు లోటు లేకుండా కారాగృహంలో గడపటానికి మహారాజులు దయతో అంగీకరించారు...."

* * *

న్యాయసభా భవనం నుండి శృంఖలాబద్ధుడై రక్షాధికృతజన పరివేష్టితుడై వెలుపలికి వొచ్చిన మహామంత్రి తిమ్మరుసయ్య వారిని చూసి వెలుపల వేచి ఉన్న విజయనగర ప్రజానీకం హాహాకారాలు చేసింది. ఆ ధ్వనులకు సానుభూతి సూచకంగానా అన్నట్లు ఋష్యమూక మతంగాది పర్వతాలనుంచి గంభీరంగా ప్రతిధ్వనులు మిన్నుముట్టాయ్. ఏ నోట విన్నా అన్యాయం! అక్రమం!! అధర్మం!!! అనే శబ్దాలు, మహామంత్రికి జయజయధ్వానాలు, మహారాజుకు శాపనార్థాలు వినవస్తున్నాయి.

మహామంత్రి తన జీవితంలో ప్రథమ పర్యాయం అంజలితో విజయనగర పౌరులను సమాశ్వాసించాడు. తరువాత మెల్లగా తన కొరకు సిద్ధం చేయబడ్డ రథం దగ్గరకు నడిచి వెళ్ళి అధిరోహించాడు. అనురాగ పూరితులైన ఆంధ్రపౌరులు రథాన్ని ఒక్క అంగుళం కూడా ముందుకు వెయ్యనియ్యలేదు. రథం చుట్టూ గుమిగూడారు ప్రజలు. వారిని తరిమివేయటానికి రక్షకభటులెవరూ ప్రయత్నించటం లేదు. రథచోదకుడు రథం తోలటానికి గుఱ్ఱాల కళ్ళాలు చేతిలోకి తీసుకోలేదు.

మహామంత్రి ఒకసారి తలఎత్తి పరిస్థితిని అవలోకించాడు. ప్రభుత్వోద్యోగులెవరూ తమ విధి నిర్వహణలో ఆసక్తి చూపించటం లేదు. ప్రభుత్వ యంత్రాంగం స్తంభించిపోయింది.

మహామంత్రి అంజలి ఘటించి, ఆంధ్ర ప్రజానీకాన్ని ఉద్దేశించి "ఆంధ్ర మహాజనులారా! నా మీద మీకున్న అపార అనంత అసాధారణ ఆదరాభిమానాలకు జన్మ జన్మాలకూ కృతజ్ఞుణ్ణి. దేశ క్షేమానికి వ్యక్తుల కన్నా, సుశిక్షితమైన సామ్రాజ్య యంత్రాంగం అత్యవసరం. తిమ్మరుసు పోతే, మరొక తిమ్మరుసు వొస్తాడు. కాని, ఒక్కసారి ప్రభుత్వ రాజ్యాంగ యంత్రాంగంలో క్రమ శిక్షణారాహిత్యం ప్రవేశిస్తే, సామ్రాజ్య సుస్థిరత్వానికే ముప్పు వాటిల్లుతుంది. దయచేసి రాజోద్యోగులను వారి పనిని వారు చేసుకోనివ్వండి; మమ్మల్ని సాగిపోనివ్వండి...." అంటూ రథచోదకుని వంక చూస్తూ రథం తోలమన్నాడు మహామంత్రి.

మరు క్షణంలో రథం బయలుదేరింది. అరకన ఉన్న నాగటి కఱ్ఱుకు భూమి ఏ విధంగా విచ్చుకొని దారి ఇస్తుందో, మహామంత్రి



రథానికి ఆ విధంగానే దారి ఇచ్చింది ప్రజానీకం. మహామంత్రి అధిష్ఠించిన రథం కారాగృహాభిముఖంగా సాగిపోయింది.

# 9

న్యాయసభా భవనంనుంచి రాయలవారు నేరుగా అంతఃపురానికి వొచ్చి, శయనాగారంలో ప్రవేశించాడు. ఎదురుగా హజార రామాలయం గోచరించింది. తనకు పట్టాభిషేకం జరిగిన క్రొత్తల్లో-రోజూ తెల్లవారి లేస్తూనే తన ఆరాధ్య దైవం అయిన శ్రీరామచంద్రమూర్తిని దర్శించాలని ఉందని అప్పాజీవారికి చెప్పాడు. వెంటనే అప్పాజీ వారు స్వయంగా దగ్గర ఉండి, తన శయనాగారానికి ఎదురుగా-ప్రపంచంలో అపూర్వ శిల్ప కళాఖండంగా విఖ్యాతిగాంచిన ఈ రామాలయాన్ని నిర్మింపచేశారు. రాయలవారు ఆ రామాలయం వంక కన్నెత్తి చూడలేకపోయాడు. తిరిగి వచ్చి, అక్కడ ఉన్న ఒక ఆసనంమీద చేరగిలపడ్డాడు. ఆ ఆసనం మీదే అప్పాజీవారు అంతఃపురానికి వచ్చినప్పుడల్లా ఆశీనులై, తనకు రాజతంత్రం బోధిస్తుండేవారు. మహారాజుగారు వెంటనే లేచి, ప్రక్కన ఉన్న హంసతూలికా తల్పం మీద శయనించబోయాడు. ఊహూఁ! మంచి గంధపు చెక్కలో మలచబడ్డ ఆహంసతూలికాతల్పాన్ని అప్పాజీవారు మలయపర్వతప్రాంతాల నుండి ప్రత్యేకంగా తెప్పించి, తనకు బహూకరించారు. రాయలవారికి ఆయన చూసిన ప్రతి వస్తువులోనూ అప్పాజీమూర్తి గోచరించసాగింది. అంతఃపురంలోని ప్రతి వస్తువూ ప్రాణాన్ని తాల్చి, తన్ను పరిహసిస్తున్నది. మహారాజక్కడ నిలువలేకపోయాడు. ఇంతలో దాహం వేసింది మహారాజుకు. మంచినీళ్ళు త్రాగుదామని ఎదురుగా దంతపు బల్లమీద ఉన్న కలశాన్ని వొంచాడు. నవరత్నాలు పొదిగిన ఆ అమూల్య కలశం - ఒకప్పుడు బిజాపుర సుల్తానులది. దాన్ని గురించి విన్నదే తడవుగా, తాను దానిపై మరులుగొని మహామంత్రికి చెప్పాడు. అనతి కాలంలోనే బీజాపుర సుల్తానుల నోడించి, ఆ కలశాన్ని సాధించారు తన కోసం మహామంత్రి. మహారాజు మంచినీళ్ళు త్రాగలేకపోయాడు.

ప్రపంచమే తన మీద పగబట్టినట్లనిపించింది మహారాజుకు. పంచభూతాలూ భయంకరాకారాలతో విజృంభించి. తన్ను కబళించివేయాలని చూస్తున్నట్లయింది. మహారాజు మనసు ఆలోచనాభారంతో వేడెక్కిపోయింది. అంతఃపురంలో నిలువలేకపోయాడు. అల్లంత దూరాన వున్న హజారా రామాలయపు అరుగులమీదకు చేరి సొమ్మసిల్లి పడిపోయాడు,

పది క్షణాలు గడిచాయి. వాతావరణం ప్రశాంతంగా వుంది. దేదీప్యమానంగా వెలుగుతున్న హజారా రామాలయపు దీపాలు ఒక్కొక్కటిగా ఆరిపోసాగాయి. అల్లంత దూరాన కొమ్మలు రెపరెపా కొట్టుకుంటున్నాయి. ఇంతలో మహారాజు చెంప మీద "ఛళ్" అనే శబ్దం .... మహారాజు ఉలిక్కిపడి లేచాడు.

అంతా భ్రమేమో అనుకున్నాడు. మహారాజు. కాని, చెంప విపరీతంగా బాధ పెడుతూంది. మహారాజు చేత్తో చెంప తడిమి చూసుకున్నాడు. నాలుగు వేళ్ళు తన చెంపమీద పొంగి వున్నాయ్. సరిగ్గా ఇలాంటి దెబ్బే అనేక సంవత్సరాల క్రితం అదే ప్రదేశంలో తగిలింది తనకు. ఆనాడు తాను విజయనగర సింహాసనాన్ని అధిష్ఠించబోతున్నాడు. నగరమంతా పట్టాభిషేకానికి వచ్చిన సామంతరాజులతోనూ, వారి పరివారాలతోనూ ఉత్సవాన్ని చూడటానికి బయటి గ్రామాల నించి వచ్చిన అనంత ప్రజానీకంతోనూ కళకళలాడుతూంది. ఎక్కడ చూచినా ఆనంద కోలాహలాలు వెల్లివిరుస్తున్నాయి.

మంగళతూర్యారావాల మధ్య తాను నిద్ర మేల్కొన్నాడు. దాసదాసీజనం తన్ను పన్నీట స్నానమాడించారు. పట్టుపీతాంబరాలు ధరింపజేసి తన్ను వజ్ర వైడూర్య రత్న మాణిక్య ఖచితమైన అమూల్యాభరణాలతో అలంకరించారు. ఇంతలో మహామంత్రి అప్పాజీవారు విచ్చేశారు. వారితో కలిసి తాను విజయనగరాధీశ్వరులు తమ పట్టాభిషేకంనాడు అధిరోహించే ఆరు గుర్రాలు పూన్చిన బంగారు తేరును అధిరోహించి, తమ కులదైవమైన శ్రీ వరహామూర్తిని పూజించటానికి బయలుదేరాడు. దారి కిరుప్రక్కలా ప్రజలు పుష్పవర్షం కురిపించారు. ఆది వరహామూర్తి ఆలయాన్ని చేరగానే పండితోత్తములైన బ్రాహ్మణశ్రేష్ఠులు వేద వచనాలతో



తన్ను ఆశీర్వదించి, నుదుట కుంకుమ దిద్ది తనచేత కులదైవానికి అర్చన చేయించారు వేదోక్తంగా. ఆలయం వెలుపలికి వచ్చేసరికి సాలంకృతమైన పట్టపుటేనుగు బంగారు అంబారీతో తన్ను పట్టాభిషేక మందిరానికి తీసుకు వెళ్ళటానికి సిద్ధంగా ఉంది. ఆ భద్రగజాన్ని అధిరోహించాడు తాను. ఉత్సవాగ్రాన విజయనగర విజయ పతాకలను ధరించి కాల్బలం నడుస్తూంది. ఆ తరువాత అశ్వికదళం కవాతు చేస్తూ బయలుదేరింది - ఆరు వరుసల్లో. ఆ పైని తమ మహోన్నత శరీరాలతో విజయనగరపు గంధగజదళం నాల్గువరుసల్లో ఊరేగింపుకే సోయగాన్ని చేకూర్చింది. ఆ వెనుక తమ తమ రథాల నధిరోహించి విజయనగర సామ్రాజ్య అతి రథ మహా రథ శ్రేష్ఠులూ, మంత్రి సామంత దండనాయకులూ బయలు దేరారు.

వారందరి వెనక బంగారు తేరులో మహామంత్రి, అప్పాజీ, వారి ననుసరించి భద్ర గజంపై బంగారు అంబారీలో తానూ.

ఉత్సవం సభామండపాన్ని సమీపించింది. దిక్కులు పిక్కటిల్లేటట్లు మంగళతూర్య నినాదాలు మారుమ్రోగాయి. తాను భద్రగజం దిగి, అప్పాజీవారితో సభలో ప్రవేశించాడు. అప్పటికే సభాభవనమంతా రాజబంధువులతో, మంత్రి సామంతాదులతో, పుర ప్రముఖులతో నిండిపోయింది. ముత్తైదువుల మంగళహారతులను స్వీకరిస్తూ, తనకు జయజయధ్వానాలు చేస్తున్న సభాసదులను చిరునవ్వులతో సమాశ్వాసిస్తూ, దాసదాసీజనం కురిపిస్తున్న పుష్పవర్షం మధ్య సింహాసనాన్ని సమీపించాడు. అక్కడ వేద మంత్రాధ్యాయనం చేస్తున్న బ్రాహ్మణ శ్రేష్ఠులకు వొంగి నమస్కరించాడు తాను. ఆశీర్వాద పురస్సరంగా అక్షతలు చల్లారు వారు. రాజగురువుల చేతిలోని బంగారు పళ్ళెరంలో తరతరాలుగా విజయనగరాధీశ్వరులు ధర్మ సంరక్షణార్థం ధరిస్తూ వొచ్చిన నవరత్న ఖచితమైన కిరీటం మిలమిలా మెరిసిపోతున్నది.

వేదోక్తంగా జరగాల్సిన కార్యక్రమం అంతా అయిన తరువాత మంగళ తూర్యారావాలు శంఖకాహళీ ప్రచండధ్వనులు; జయజయ ధ్వానాలు మారుమ్రోగాయి, దిక్కులు పిక్కటిల్లేటట్లు. కిరీట ధారణకు తల వొంచాడు తాను. రాజగురువు తన శిర్షాన కిరీటం ఉంచబోతున్నాడు.

ఇంతలో "రాయా!" అనే పిలుపు వినవొచ్చింది తనకు. వెంటనే ప్రక్కకు తిరిగి చూశాడు. అప్పాజీవారు కూడా రమ్మని సంజ్ఞ చేసి, సభామండపం వెనుక ఉన్న అభ్యంతర ప్రదేశానికి వెళ్ళిపోయారు. తాను వెంటనే ఆయన్ను అనుసరించి, అభ్యంతరాన్ని ప్రవేశించాడు. అంతే! చెంప 'ఛెళ్' మంది. తల ఎత్తి చూశాడు.... ఎదురుగా మహామంత్రి అప్పాజీ. తనకళ్ళ వెంట బొటబొటా నీళ్ళు కారాయి.

"రాయా! మరి కొద్ది క్షణాల్లో నీవు సార్వభౌముడివి కాబోతున్నావ్. భారతదేశంలో మహోన్నత పదవినందబోతున్నావ్. అధికారం, ధనం, భోగం, అవీ-ఇవేమిటి, సర్వస్వం నీ అధీనంలో ఉంటాయ్.

"కాని, కిరీట ధారణ వీటి కోసం కాదు. నిగనిగా మెరుస్తున్న ఆ మణిమయ స్వర్ణమకుటం న్యాయ పరిరక్షణకూ, ధర్మ సంరక్షణకూ ఇనుప కవచం. మెత్తని పట్టు మెత్తలతో అలంకరింపబడ్డ ఆ సింహాసనంమీద-మేను వాల్చిన క్షణాన కంటకావృతంగా మారిపోతుంది. ఆ సింహాసనం మీద నిటారుగా కూర్చున్నంత కాలమే నీకూ - ప్రజకూ క్షేమంగా ఉంటుంది.

"ఈ సంతోష సమయంలో దుఃఖమంటే ఏమిటో- చవి చూపించటానికే నీమీదచేయి చేసుకోవాల్సి వచ్చింది. పద, నాయనా! ముహూర్తం మించిపోతూంది." అని సభాభవనానికి దారి తీశాడు అప్పాజీ.

వ్రాయటానికి ఇంతకాలం పట్టింది. కాని, మహారాజు మనోపథంలో ఈ సంఘటన అంతా క్షణ కాలంలో అగుపించి అదృశ్యమయింది. తలుచుకున్న కొద్దీ కళ్ళ వెంట బొట-బొటా నీళ్ళు కారుతున్నాయి. ఆనాడు - అప్పాజీ కొట్టినప్పుడు వొచ్చిన దుఃఖాశ్రువులు - ఆయన మాటలు వింటుంటే - ఆనంద బాష్పాలుగా మారిపోయాయి. కాని, ఈనాడు___

మహారాజు ఒక్కసారిగా "అప్పాజీ!" అంటూ పెద్ద పెట్టున కేక వేశాడు. ఇక అక్కడ ఉండలేక అంతఃపురానికి బయలుదేరాడు. కాని, అంతఃపురానికి వెళ్ళటానికి ఆయనకు మనస్కరించలేదు. అంతఃపురానికి ప్రక్కనే ఉన్న మరో దివ్య హర్మ్యంలో ప్రవేశించాడు. మహారాజ



సందర్శనానికి వొచ్చే ఇతర రాజన్యులకూ, సామంతులకూ, విదేశీయులకూ ఆ భవనంలోనే దర్శనమిస్తాడు మహారాజు. భవనం చిన్నదే అయినా, అపూర్వ శిల్ప సంపదతో అసాధారణ కళా ప్రౌఢిని చాటే ఆ భవన రాజాన్ని ఇటీవలనే నిర్మించారు కృత్రిమ సరస్సులతో, లతా నికుంజాలతో, చంద్రకాంత శిలావేదికలతో పరివేష్టించబడ్డ ఆ రమణీయ మందిరంలోకి అడుగుపెట్టాడు మహారాజు.

అడుగు పెడుతున్న మహారాజు దృష్టి - ఎదురుగా గోడమీద అలంకరించబడిన ఒక తైలవర్ణ చిత్రంమీద నిలిచిపోయింది. ఒక బ్రాహ్మణ శ్రేష్ఠుడు ద్వారబంధాని కడ్డంగా నిల్చుని, ఒక కాలు ద్వార పార్శ్వానికి ధట్టింప చేశాడు. ఆ కాలు క్రిందగుండా ఒక "బోయీ" దూరిపోతున్నాడు. ఆ చిత్రాన్ని చిత్రించింది తానే. తానే తన హస్తాలతో ఆ చిత్రాన్ని ఆ భవనంలో అంత ప్రముఖ స్థానాన అలంకరింపచేశాడు. తన సందర్శనార్థం వొచ్చిన ప్రతి వ్యక్తికీ ఆ చిత్రాన్ని చూపిస్తుంటాడు-తాను సగర్వంగా.

ఆనాడు మహామంత్రి మేధస్సుకు లొంగిపోయి - స్వాశ్రయాలను నాశనం చేసుకొని, గజపతి తమతో వియ్యానికి ఒప్పుకొని వివాహ సుముహూర్తాన్ని నిశ్చయించాడు. కాని, ఆ లోగానే జగదేక సుందరిగా ప్రసిద్ధి చెందిన కాబోయే భార్యను చూడాలనే కోరిక తనకు కలిగింది. అప్పాజీవారు శాత్రవకూటంలో ప్రవేశించటం తప్పనీ, ప్రాణాపాయకరమనీ ఎంత బోధించినా వినలేదు తాను.

అందువల్ల తన కోరిక నెరవేర్చటానికి మహామంత్రి రాజ జ్యోతిష్కులు వధువును చూడటానికి వొస్తున్నారని చెప్పి గజపతికి కబురు చేసి, తాను స్వయంగా జ్యోతిర్విద్వాంసుడి వేషం వేసుకొని తన్ను పల్లకీ మోసే బోయీలకు అధికారిగా తయారుచేసి, గజపతి కోటలో ప్రవేశించి అంతఃపురంలో అడుగు పెట్టాడు. రాకుమారి సవినయంగా వొచ్చి పండిత శ్రేష్ఠుడికి నమస్కరించింది. తమ కాబోయే

మహారాణిని చూడాలనే కుతూహలంతో, ఆయన ప్రక్కనే ఆశీనులయిన బోయీలతో పాటు తాను కూడా కలిసి నడుస్తున్నాడు. వేష భాషల వల్ల తన్ను ఎవరూ గుర్తించపోయినా, తన కాలిన ఉన్న మరకత-మాణిక్య వజ్ర-వైఢూర్యాలు పొదిగిన సువర్ణ గండపెండేరం తనను శత్రువుల అనుమానానికి పట్టి ఇచ్చింది. క్షణంలో అంతఃపురాన్ని గజపతి భటులు చుట్టివేయసాగారు. నిరాయుధులైన తనూ, తన మహామంత్రికీ ఆ అంతఃపురంలోనే సజీవ సమాధి తప్పదనుకున్నాడు తాను.

"బయట తమ్ము బంధించటానికి ఇంత ప్రయత్నం జరుగుతున్నా, మహామంత్రి అణుమాత్రం చలించలేదు. అసలాయనకు ఇంత జరుగుతున్నదని తెలియదేమో కూడా. చిరునవ్వుతో మహారాణికి ఆశీర్వచనం పలికి - ద్వార బంధాన్ని చేరి, దానికడ్డంగా ఒక పార్శ్వానికి తన కాలు ఘట్టించి "ఒరే బోయిలూ! ఇంకా అక్కడే ఉన్నారేంరా, మూర్ఖుల్లారా! పదండిరా. పల్లకీ దగ్గరకు!" అని గర్జించాడు.

వెంటనే బోయీలంతా "చిత్తం, బాబయ్యా!" అంటూ తలలు వాంచుకొని భయం నటిస్తూ - ఆయన కాళ్ళ పక్క నుంచి దూరిపోయారు.

అందరితో పాటే తానూ.

అదే ఆ దృశ్యంలోని సంఘటన.

తమ అవినాభావ సంబంధాన్ని సూచించే ఆ చిత్రం అనేక సంవత్సరాలుగా తనకు గర్వకారణమైంది. ఆనాడు మహామంత్రి ఆ సంఘటననే సృష్టించకపోతే, ఈనాడు తాను జీవించి ఉండేవాడే కాదు. మహారాజాధిరాజు, రాజపరమేశ్వర - బిరుదాంకితుడైన ఆంధ్రసార్వభౌముడు - ఒక సామాన్య జ్యోతిష్కుని కాళ్ళ సందునించి దూరిపోతాడా! తామే పొరపాటు పడ్డామనుకొని, గజపతి రాజోద్యోగులు తమకు దారి ఇవ్వకపోతే, చరిత్ర గతి మరో విధంగా ఉండేది.

మహారాజు ఆ చిత్రాన్ని అవలోకించి అవలోకించి "అప్పాజీ!" అని పొలికేక వేశాడు. ఆ శబ్దం విని భవనమంతా ప్రతిధ్వనించింది. దానికి సమాధానంగా ప్రతి వైపునించీ విపరీతంగా, వికటంగా పకపకా నవ్వులు వినిపించసాగాయి. మహారాజు ఆశ్చర్యంగా అన్ని వైపులా



చూశాడు. ఆ మందిరాన్ని ప్రకాశవంతం చేసే ఒక్కొక్క దీపమే నిష్కారణంగా ఆరిపోతోంది. ఇంతలో అడుగుల చప్పుడైనట్లుంది. మహారాజు ఉలిక్కిపడి వెనుతిరిగి చూశాడు. ఎవ్వరూ లేరు. అన్నివైపులా అంధకారం. మరు క్షణాన భవన మధ్యాన శిలావేదిక మీద ఉన్న బంగారు పళ్ళెం క్రింద పడి ఖంగున మ్రోగింది.

"ఎవరది?"

మహారాజు పరిసరాలు పరికించాడు. ఎవ్వరూ కనిపించలేదు. ఇంతలో భయంకర అట్టహాసం వినిపించింది. "హహ్హహ్హహ్హా, నేనే! నన్నే మరచిపోయావా, మహారాజా? అవునులే! చిన్ననాటి నుంచీ మిమ్మల్ని స్వంత బిడ్డలాగా సాకి, రక్షించి, సకల సామ్రాజ్యానికీ సార్వభౌముణ్ణి చేసిన అప్పాజీ వారినే విస్మరించిన మీకు ఆరేళ్ళ సంబంధం ఎలా జ్ఞాపకం ఉంటుంది?"

"తిరుమలా! నీవా? ఎక్కడున్నావ్, నా తండ్రీ? కనిపించవేం?"

"మీరు నన్ను చూడలేరు."

"అవును. చూడలేను. నీ భౌతిక శరీరాన్ని ప్రపంచానికే కనిపించకుండా చేశారు, మహామంత్రి. ఒక్కసారి నాన్నా అనయినా పిలు. చెవులారా వింటాను, బాబూ!"

"నేనిప్పుడు నీ కుమారుణ్ణి కాదు, మహారాజా! అధికార గర్వంతో కళ్ళు మూసుకుపోయిన ఒక కృతఘ్నుడికి - ఒక మూర్ఖాగ్రేసర చక్రవర్తికి గతంలో తనయుడిగా జన్మించానని ఈ పిశాచ రూపంలో కూడా చెప్పుకోటానికి సిగ్గుపడుతున్నాను."

"నీవు కూడా నన్నే దూషిస్తున్నావా, తిరుమలా? మహామంత్రి మహనీయుడే కావొచ్చు; మహానుభావుడే కావొచ్చు. వారి శేముషీ, ప్రతిభా సాటిలేనివే కావొచ్చు. అయినా, హంతకుడు. సిద్ధిపొందిన నీ హృదయానికున్న క్షమా దృక్పథం కృష్ణరాయలుగా నాకు ఉంది. కాని, నేను రాజును."

"హుం! నీ రాజరికం! నిన్ను రాజును చేద్దామనే ఉద్దేశంతోనే చిన్ననాడు దయదలచి నీకు నీ నేత్రద్వయాన్ని దానం చేశాడు మహామంత్రి.

ఈనాడు రాజువై క్రొవ్వి, ఏ మహామంత్రి నిర్హేతుక పరిపూర్ణ కరుణా కటాక్ష వీక్షణాఫలితంగా ఈ విశాలాంధ్ర సామ్రాజ్య సింహపీఠిపై ఇన్నాళ్ళుగా నిశ్చింతగా కాలం గడిపావో, ఆ మహామంత్రికి రాజసేవకు ఫలితాన్ని నిరూపించటానికి భౌతిక నేత్రాలు పెరికివెయ్యమని, పరమేశ్వర పర్యాలోకనకు ఆధ్యాత్మిక నయన దానం చేశావు. ముముక్షుచక్షువులు ప్రసాదించావు. హహ్హహ్హహ్హ."

క్రమంగా ఆ నవ్వు గాలిలో లీనమైపోయింది.

మహారాజు "అప్పాజీ...." అంటూ పెద్ద పెట్టున అరిచి విచలితుడై ఆ మందిరంలో నిలువలేక చరచరా వెళ్ళిపోయాడు.

మహారాజు వెళ్ళిన మరి కొన్ని క్షణాలకు ప్రేతాకారంలో వున్న ఒక నల్లని ఛాయ ఆ మందిరంలో మసలటం ప్రారంభించింది. ఒక్క క్షణం అటూ ఇటూ చూచి ఆ ప్రేతాకారపు ఛాయ గబగబ భవన ద్వారాన్ని సమీపించేసరికి ఎదురుగా వీరేంద్రుడు అడ్డుపడ్డాడు.

"అమోఘంగా నిర్వహించిన మీ పాత్ర అత్యద్భుతంగా ఉంది. చాలా సేపు నాకే అర్థం కాలేదు." అన్నాడు వీరేంద్రుడు.

దానికి సమాధానంగా ఆ మానవకారంలో వున్న ప్రేతం "హహ్హహ్హ" అని భయంకర వికటాట్టహాసం చేసింది.

"నీకంటకన్నా పెద్దగా నవ్వగలడు- కావాలంటే! నా దగ్గర నీ ఆటలేం సాగవు. చేతనైతే ఎగిరిపో...." అంటూ వీరేంద్రుడు ఆ ప్రేతాన్ని తన రెండు చేతులతోనూ వాటేసుకున్నాడు బలంగా.

నాలుక్షణాల క్రితం ఒక మహా బలిష్ఠుడయిన సార్వభౌముణ్ణి గజగజలాడించిన ఆ భూతరాజం వీరేంద్రుడి కబంధ హస్తాలలో గిలగిలా తన్నుకుంటున్నది. కాని, ఆ ఛద్మవేషికి బలం తక్కువ. క్రమంగా వీరేంద్రుడికి లొంగిపోయిందా భూతం. వీరేంద్రుడు ఆ భూతరాజాన్ని ఆవరించి ఉన్న నల్లని ముసుగును తీసివేశాడు.

"తిమ్మనగారూ! మీ వేషం చాలా బాగుంది. ఛద్మ వేషధారణలో ఇంత నిపుణులైన మిమ్మల్ని అసలు గుర్తించనివ్వరాదు. కాని బ్రహ్మహత్యా దోష భీతితో వదులుతున్నాను. మీరూ, ప్రపంచానికి సంబంధం లేకుండా



ఆ నేలమాళిగ గదిలో మీకు శాశ్వత నివాసం ఏర్పాటు చేస్తాను...." అంటూ తన ఉత్తరీయంతో మహాకవికి వాగ్బంధం చేసి, అంతఃపురానికి అనతి దూరంలో ఉన్న రహస్య కవాటం తెరచి తిమ్మనగారితో లోపలికి ప్రవేశించాడు.

మరి కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి. ముసుగుభూతం రహస్య కవాటం తెరచుకొని నేలమాళిగ నుండి బయటకు వచ్చి కవాటాన్ని బంధించి ఉద్యానవనంలో ప్రవేశించింది

ఆ భూతరాజుకు ఆ దారినే మహారాజు శయనాగారానికి వెడుతున్న రామలింగనాయకుడు ఎదురుపడ్డాడు. మహా దండనాథుడు ఆ ప్రేతాన్ని చూడటంతోనే ఒక్క లిప్తలో తన భయంకర ఖడ్గాన్ని ఒరనుండి బయటికి లాగాడు.

భూతం పకపకా నవ్వింది. విచిత్రమైన ధ్వనులను సృష్టించింది.

"ఓ ప్రేత వేషధారీ! నీ భుజపింపులు నా వద్ద సాగవు...." అంటూ విపరీతమైన వేగంతో ఖడ్గచాలనం చేశాడు దండనాథుడు.

"నీవు నన్ను ఏమీ చెయ్యలేవు. నేను అశరీరుణ్ణి!" భూతం వికృత హాసం చేసింది.

"అశరీరుడివో, సశరీరుడివో తెలుసుకోంది వొదిలిపెట్టను...." అంటూ మహాదండనాథుడు తన ఖడ్గాగ్రంతో ఆ భూతరాజపు ఛద్మవేషాన్ని కంక ఖండాలుగా చీల్చివేశాడు బహు మెలకువతో.

ముసుగు లోపల ఉన్న వీరేంద్రపాత్రుకి అసలు రూపు బయటపడింది. వీరేంద్రుడు రోషావేశంతో మొలనున్న ఒర నుండి ఖడ్గాన్ని నట్టున బయటికి దూశాడు. ఖడ్గాలు ఖంగు మన్నాయి. క్షణ కాలంలో వారి ద్వంద్వ యుద్ధం భయంకర రూపాన్ని ధరించింది. వీరేంద్రుడికి ఖడ్గ చాలనంలో రామలింగనాయకుని అంత బలం లేకపోయినా, ఖడ్గ విన్యాసపు మెలకువలన్నీ తెలియటంవల్ల నేర్పుగా ఉన్న తాను దండనాయకుని ఖడ్గ ఘాతాలనుండి తప్పించుకుంటూ పారిపోవటానికి ప్రయత్నం చేస్తున్నాడు. వీలయితే - ఏ పద్ధతిని అయినా సరే, దండనాథుణ్ణి మట్టుబెట్టాలని చూస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న దండనాయకుడు

తన శక్తినంతా హస్తంలో కేంద్రీకరించి, ఒక్క బలిష్ఠమైన వ్రేటుతో వీరేంద్రుడి ఖడ్గాన్ని గాలిలోకి ఎగురగొట్టాడు. అల్లంత దూరాన ఎగిరిపడిన తన ఖడ్గాన్ని తీసుకోవటానికి ప్రయత్నించాడు వీరేంద్రుడు. కాని, దండనాథుడు ఛెంగున లంఘించి, తన కుడికాలి పాదరక్షతో ఖడ్గాన్ని అణచిపట్టి వీరేంద్రుడి కంఠానికి ఆనించాడు తన ఖడ్గాన్ని.

"వీరేంద్రా! నీ కోసమే వస్తున్నాను. సమయానికి దొరికావు. నీకు దేవుడనేవాడు ఒకడుంటే ప్రార్థించుకో!" అన్నాడు మహాదండనాథుడు నిప్పులు కురిపిస్తూ.

"నిరాయుధుణ్ణి. ఒక్క ఆయుధం ఇచ్చి—" వీరేంద్రుడి వాక్యం పూర్తికాకుండానే అందుకున్నాడు మహాదండనాథుడు.

"గౌరవించి, నీతో ద్వంద్వానికి తలపడి సంహరించటానికి నీవు అర్హుడవి కాదు. నిరాయుధీకరణ ఆత్మ సంరక్షణకు అక్కరకు రాకపోయినా, అసువులర్పించటానికి అడ్డం రాదు!" మహా దండనాథుడు కత్తి ఝుళిపించాడు.

"నీ వెవరిని చంపాలనుకుంటున్నావో నీకు తెలియటంలేదు. మహాదండనాయకా? నన్ను విడిచిపెట్టు. అనన్య సాధ్యమైన అత్యున్నత భవిష్యత్తు నీకు చేకూరుస్తాను. నా అపూర్వ మేధా సంపత్తికి, మీ మహామంత్రి అప్పాజీ అంతటివాడే మొదలు నరికిన తరువులా కూలిపోవటం నీకు తెలియని విషయం కాదు." అన్నాడు వీరేంద్రుడు ప్రాణరక్షణకు మార్గాన్వేషణ చేస్తూ

"ఛీ! నీచుడా!" గర్జించాడు దండనాథుడు.

"తొందరపడకు - దండనాయకా! తీరిగ్గా ఆలోచించుకో. నా అమూల్య ప్రాణాన్ని ఒక్కసారి అంతం చేస్తే - నీ జన్మలో నీవు, మళ్ళీ ఏ పరిస్థితిలోనూ నా సహాయాన్ని పొందలేవు. నెమ్మదిగా ఆలోచించు...." అంటూ కాలయాపనకు ప్రయత్నిస్తున్నాడు వీరేంద్రపాత్రుడు.

"నన్ను ఆలోచించమంటూ ఈలోపున నీవు నిష్క్రమిద్దామనుకుంటున్నావ్. లాభం లేదు. ఈ ప్రపంచం నుంచీ నీ శాశ్వత నిష్క్రమణ కొద్ది క్షణాల్లో ఉంది."



"నాకేం అధికారామా? ధనమా? నన్ను చంపితే నీకేమొస్తుంది?"

"ఏమొస్తుందా? — ఈరాత్రి తిమ్మనార్యుల జాతకరీత్యా మరో మహాజాతకుడు అస్తమించాలి. ఆ జాతకుడివి నువ్వే! నువ్వు అస్తమించి తీరాలి! అన్నాడు రామలింగనాయకుడు ఖడ్గాన్ని బలిష్ఠంగా పట్టుకుంటూ.

"ఇదిగో, దండనాయకా! ఇటు చూడు, మహారాజు వ్యథిత హృదయంతో అంతఃపురంలో రక్షణ లేకుండా పరిభ్రమిస్తున్నాడు. ఆయనకన్నా మహాజాతకుడెవడు?" అన్న వీరేంద్రుడి మాటలకు మండిపడి 'ఛీ? అని ఛీత్కరించాడు దండనాథుడు.

"నేను రాజునైన వెంటనే నిన్ను మహామంత్రిని చేస్తాను."

"నోర్ముయ్, ద్రోహీ!"

"నీకంతగా ఇష్టం లేకపోతే-నువ్వే రాజుగా, నేనే మంత్రి నౌతాను ...."

వీరేంద్రుడు ఆశగా చూశాడు రామలింగనాయకుడి వంక. కాని, క్షణ-క్షణానికీ హెచ్చు పెరిగిపోతున్న మహాదండనాథుడి కోపజ్వాల ఆ క్షణాన ఆకాశాన్నంటుకుంది.

"నీ మంత్రాంగం నా దగ్గర కాదురా. యమధర్మరాజు దగ్గర. నిన్ను ఇంకా ఒక్క క్షణం బ్రతుకనిచ్చినా నా మహామంత్రి నాకు దక్కడు. నా రాజు నాకు దక్కడు. ఈ విజయనగర సామ్రాజ్యమే ఆంధ్రులకు దక్కదు!" అంటూ బలమైన ఖడ్గచాలనంతో వీరేంద్రుడి శిరస్సును ఖండించాడు.

కాని. వీరేంద్రుడు ఉక్కు శిరస్త్రాణం ధరించి ఉండటం వలన-అతని శిరస్సుకు బదులు శిరస్త్రాణం రెండు వ్రయ్యలై పడిపోయింది. అది చూసి మహాదండనాథుడు మితిలేని ఆగ్రహంతో మరోసారి కత్తిని పైకెత్తాడు. ఆ అదను చూసి వీరేంద్రుడు ఛెంగున ముందుకురికి పలాయనం ప్రారంభించాడు.

రామలింగ నాయకుని ఖడ్గ ప్రహారానికి బలి కావాల్సిన వీరేంద్ర పాత్రుడు చావు తప్పి కన్ను లొట్టపోయినట్లు ప్రాణాలు అరచేతిలో ఉంచుకొని బ్రతుకుజీవుడా అంటూ మహారాణి అన్నపూర్ణాదేవి అభ్యంతర

మందిరం వైపుకు పరుగులు తీస్తున్నాడు. అల్లంత దూరాన అదృశ్యమౌతున్న వీరేంద్రుణ్ణి చూసి రెట్టించిన కోపంతో, విపరీతమైన వేగంతో అనుసరించాడు రామలింగ నాయకుడు. అతని చేతిలో ఒరలో నుంచి దూసిన ఖడ్గం అకలిగొన్న కాలనాగునిలా అల్లులు చాస్తూ మిలమిలా మెరిసిపోతున్నది. ఎలాగైనా వీరేంద్రుణ్ణి అన్నపూర్ణాదేవి అభ్యంతర మందిరం చేరేలోగానే పట్టుబెట్టాలని మహాదండనాథుని సంకల్పం. రామలింగనాయకుడు తన్ను కలుసుకొనేలోగా ఎలాగైనా అన్నపూర్ణాదేవి మందిరంలో ప్రవేశించాలని ఆదుర్దా. ఆ మందిరం తనకు అన్ని విధాలా రక్షణను చేకూరుస్తుందని వీరేంద్రుడి ఆశ. ఆ ఆశతోనే అతను ప్రాణాల కోసం పరుగులు తీస్తున్నాడు. ఎలాగైనా వీరేంద్రుణ్ణి సంహరిస్తే, జాతక రీత్యా మహామంత్రికి చుట్టుకున్న పీడ విరగడైపోతుంది. తన మంత్రి క్షేమంగా ఉంటాడు. తన ఏలికకు శుభం చేకూరుతుంది. ఈ ఆశతో పగబట్టిన పాములా చరచరా వీరేంద్రుణ్ణి అనుసరిస్తున్నాడు దండనాథుడు. ప్రాణాల మీది తీపి ఆ క్షణంలో వీరేంద్రుని కాళ్ళకు జీవం పోసింది.

అసాధారణమైన వేగంతో క్రిందా, మీదా చూడకుండా వీరేంద్రుణ్ణి అనుసరిస్తూ, క్షణక్షణానికి దగ్గర పడుతున్నాడు దండనాథుడు. వీరేంద్రునికి పై ప్రాణాలు పైనే పోయినంత పనైంది. అయినా తన ప్రయత్నం మాత్రం విరమించలేదు. దండనాథుడు ద్విగుణీకృతోత్సాహంతో వీరేంద్రునికి కత్తి వేటు దూరానికి వచ్చేశాడు. రుధిర పానానికి బాగా అలవాటు పడిన ఆ ఖడ్గరాజం సర్రుమని శబ్దం చేస్తూ పైకి లేచింది, కాలపాశంలా. మరు క్షణంలో వీరేంద్రుడు ....

ఉద్యానవనంలో ఏపుగా పెరిగిన మాలతీలత అల్లుడు లేక క్రింద పడి దారి కడ్డు తగిలింది దండనాథునికి, కత్తి అల్లంత దూరాన ఎగిరి పడగా, దండనాథుడు ముందుకు తూలిపడ్డాడు. విధి ఎదురు తిరిగింది.

వీరేంద్రుడు ఎప్పుడూ అదృష్టవంతుడే!

దండనాథుడు పడిపోవటంతో వీరేంద్రుడికి కొద్దిగా ఊపిరి సలిపినట్లయింది. పైకి లేచిపోయిన పంచప్రాణాలు తిరిగి వీరేంద్రుడి శరీరంలో ప్రవేశించటమే గాకుండా, నూతనోత్సాహాన్ని కూడా కలుగజేశాయి.



వీరేంద్రుడు మరో పది క్షణాల్లో అన్నపూర్ణాదేవి అభ్యంతర మందిరాన్ని సమీపించి వెను తిరిగి చూశాడు. పడిపోయిన దండనాథుడు ఖడ్గాన్ని తీసుకొని రెట్టించిన బలంతో పరుగెత్తుకొస్తున్నాడు.

వీరేంద్రుడు దండనాథుని చూసి ఒక విషపు నవ్వు నవ్వి అన్నపూర్ణాదేవి అభ్యంతర మందిరంలో జొరబడ్డాడు. నిజానికి దండనాథుడు అన్నపూర్ణాదేవిని గాని, ఆమె అభ్యంతర మందిరాన్నిగాని లెఖ్ఖ చేసే స్థితిలో లేడు. అతడికి కావాల్సింది వీరేంద్రుడి చావు. అతని ఖడ్గానికి కావాల్సింది వీరేంద్రుడి రుధిరం. ఆ ఉద్దేశంతోనే దండనాథుడు అంతఃపుర మర్యాదలను లెఖ్ఖ చేయకుండా రాణివాసంలో ప్రవేశించాడు. ఆ క్షణాన అతని రూపం భయంకరంగా ఉంది. ముఖం జేవురించి అరుణారుణంగా మారిపోయింది. ఇంతవరకూ దండనాథుణ్ణి మోసగించినవారు, అతని చేతిలో నుండి తప్పించుకు పోయినవారు లేరు. కాని, ఈ నాడు ఆ ఖ్యాతి వీరేంద్రుడికి దక్కటం వల్ల దండనాథునికి అవమానం రెచ్చిపోయి ఆవేశంగా పరిణమించటంతో మనిషిలోని రోమ రోమాలూ నిక్కబొడుచుకున్నాయి ములుకుల్లాగా. చేతిలోని ఖడ్గరాజం దీపాల కాంతిలో చండ ప్రచండంగా మెరిసిపోతున్నది.

ప్రధాన ద్వారం దగ్గర ఒక్క క్షణం నిలబడి పరిశీలించి, ముందుకు సాగాడు దండనాథుడు. ప్రపంచంలోని ఏ శక్తి అయినాసరే, ఆ క్షణంలో అతడి కెదురుపడటానికి జంకుతుందా అన్నంత భయంకరంగా వున్న అతని రూపానికి ఎదురుగా ఒక అవనత శీర్షం అడ్డు నిలిచింది.

దండనాథుడు వొక్క క్షణం ఆగిపోయాడు. అది వీరేంద్రుడి తల మాత్రం కాదు. అది వీరేంద్రుడి తలకాని తరువాత ఎవరి తల అయినా అతనికొక్కటే. అందువల్ల ఆ శీర్షాన్ని పరిశీలనగా చూసే ఓపికా, తీరికా కూడా లేకపోయాయి దండనాథుడికి.

"ఎవరు నువ్వు? అడ్డు లే!" అన్నాడు దండనాథుడు విసువుగా. ఆ శీర్షం వినయం ఉట్టిపడేలా విన్నవించింది.

"మీకు కావాల్సింది మా శీర్షమేగా? తీసుకోండి ఈ కళేబరం మీద ఈ శీర్షం ఉండినా ఒకటే, లేకపోయినా ఒకటే! కానివ్వండి దండనాయకా!"

దండనాథుడు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. ఒక్కొక్క మాటకొక్కొక్క మెట్టు చొప్పున ఇహలోకానికి దిగి వొచ్చాడు. చివరి మాటతో తన ముందు అవనతంగా ఉన్న శీర్షాన్ని జాగ్రత్తగా పరిశీలించి "ప్రభూ...." అంటూ ఖడ్గాన్ని దూరంగా విసిరివేసి అంతఃపురంలో నుంచి వెను తిరిగి వెళ్ళిపోయాడు దండనాథుడు.

దండనాథుని విచిత్ర ప్రవర్తన చూసి క్షణకాలం విస్తుపోయి మహారాజు కూడా అతణ్ణి అనుసరించాడు.

* * *

భూగృహంలో పదిలపరచబడ్డ ముక్కు తిమ్మనగారికి పది పదిహేను క్షణాల తరువాత గాని తనకూ, ప్రపంచానికీ సంబంధం లేదనే విషయం అర్థం కాలేదు. అసలే అమావాస్యచీకటి. ఆపైన నేలమాళిగ.... తాను ప్రవేశించిన ద్వారబంధం తెరుచుకుంటుందేమోనని శతవిధాల ప్రయత్నించాడు. కాని, ద్వారం దృఢంగా ఉండటంవల్లా, ఆవతల బంధించబడి ఉండటంవల్లా ఆయనకు శ్రమ మాత్రమే మిగిలింది. అప్పటికీ ఆ దారిన ఎవరన్నా పోతుండే. విని గొళ్ళెం తియ్యకపోతారా అనే సంకల్పంతో సప్తమ స్థాయిలో అరుపులు కూడా సాగించాడు గాని, ఆ గొంతు అరుపులు ఆ కవాటాన్ని అధిగమించి బయటి ప్రపంచంలోకి ప్రవేశించలేకపోయింది. ఒకవేళ ఏ కొద్దిగానన్నా ప్రవేశించినా, ఆ అర్ధరాత్రాన ఆ నిర్జన ప్రదేశంలో దానినాలించే నాథులు కూడా లేరు.

క్షణాలు గడుస్తున్న కొద్దీ మహాకవికి నిస్పృహ ఎక్కువయింది. ఇక తాను ఆ నేలమాళిగలో సజీవంగా గోరీ కట్టబడ్డట్టే అనుకున్నాడు కవిశేఖరుడు. క్రమక్రమంగా బ్రతుకు మీద ఆశలన్నీ అంతరించటం ప్రారంభించాయి. తాను ఇక్కడ ఈ విధంగా ఉండిపోతే—వీరేంద్రుడి ఆట కట్టించేవారెవరు; మహామంత్రిని రక్షించేదెవరు, మహారాజు మనసు నిశ్చలం చేసేదెవరు; అని వాపోవటం మొదలుపెట్టాడు మహాకవి.



మహాకవి మనస్సు పరిపరి విధాల పోతున్నది, మహాకవి ఎంతటి గొప్పవాడయినా, వస్తుతః భావుకుడు. తాను ఆ నేల మాళిగలోనే అస్తమించాల్సి వస్తుందనే భావం కలిగేసరికి ఆయనలోని కవితాహృదయం ఒక్కసారిగా ఆక్రోశించింది. తాను సగపడ వ్రాసిన "పారిజాతాపహరణం" అసంపూర్తిగానే ఉండిపోతుందే అన్న బాధ ఆయన్ని ఆవహించింది.

ఆగిపోయినా బాధ లేదు. మరే కవి అయినా ఆ కొరవను పూర్తి చేసి తన భావాలను భగ్నం చేస్తాడేమో అనే బెంగ పట్టుకుంది కవిశేఖరుడికి.... నాలుగు క్షణాల తరువాత-తనలో కలుగుతున్న ఈ విచిత్ర భావాలకు తనకు తానే నవ్వుకున్నాడు మహాకవి.

ఆ క్షణాన-కాలానికున్న విలువ అమూల్యమైనది. అంతేకాకుండా తన జీవితానికి ఉన్న విలువకూడా అసాధారణమైనది. ఆంధ్ర సామ్రాజ్య భవితవ్యానికీ, తన భవితవ్యానికీ ఉన్న అవినాభావ సంబంధం క్రమక్రమంగా అర్థమవసాగింది తిమ్మనార్యునికి. ఆ విషయం అవగాహన అవుతున్న కొద్దీ - ఆయన మరింతగా కర్తవ్య నిష్ఠుడౌతూ బయటపడే మార్గాన్ని అన్వేషించసాగాడు. కాని, ఫలితం మాత్రం శూన్యంగానే ఉంది.

ఇంతలో వెనుక నుండి ఘల్లు-ఘల్లు మనే శబ్దం వినవొచ్చింది. మహాకవి వెనుతిరిగి పరిశీలనగా చూశాడు. అంతా గాఢాంధకారం. కాని, గజ్జెల సవ్వడి మరింత దగ్గరగా వినవస్తున్నది. మహాకవికి భూత-ప్రేత పిశాచాలను ఇదివరకు చూడకపోయినా అవి ఉంటాయనే విశ్వాసం ఉంది. అందుకని-అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ఆంజనేయ దండకం బిగ్గరగా చదవటం ప్రారంభించాడు. అయినా అది ఏ జాతి భూతమో కాని ఆంజనేయ దండకాన్ని కూడా నిర్లక్ష్యం చేస్తూ-ముందుకు సాగి వొస్తున్న సవ్వడి వినిపించింది మహాకవికి.

"ఘల్లు ఘల్లు-ఘల్లు ఘల్లు...." ఈసారి శబ్దం మరింత దగ్గరగా వినరావటం మొదలు పెట్టింది.

మహాకవికి గుండె ఝల్లుమంది. కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. అయినా శబ్దం మరీ దగ్గరకు జరిగి వొస్తున్నది. అదిగో! అడుగుల చప్పుడు కూడా వినరావటం మొదలు పెట్టింది. అమ్మో! ఇంకేముంది?-దగ్గరకు వొచ్చేసింది.

ఘల్లు ఘల్లుమనే శబ్దం ఆగిపోయింది. నిశ్శబ్ద ప్రశాంతత ఆవరించింది. భూత రాజం వెళ్ళిపోయి ఉంటుందనే ఉద్దేశంతో-మహాకవి మెల్లగా కళ్ళు తెరచి చూశారు. "అమ్మ బాబోయ్! కొరివి దెయ్యం!" అంటూ వెల్లకిలా విరుచుకు పడిపోయాడు.

ఆ వొచ్చింది-మహారాణి అన్నపూర్ణాదేవి. చేతిలోని కాగడా వెలుగులో దారి చూసుకుంటూ, ఆ రహస్య ద్వారం గుండా బయటకి నిష్క్రమించాలనే *ఉద్దేశ్యంతో బయలుదేరి* ఆ గుహ ద్వారాన నిలబడి, ఆంజనేయ దండకాన్ని చదువుతున్న తిమ్మనార్యుణ్ణి చూసి ఆశ్చర్యంతో ఒక్క క్షణం నిలిచి పోయింది. ఆ క్షణంలోనే తిమ్మనార్యుడు అంత గల్లంతూ చేసి చాలదన్నట్లు వెనక్కు విరుచుకు పడ్డాడు.

మహారాణి నాలుగడుగులు ముందుకు వేసి కాగడా వెలుగులో అ పడిపోయింది తిమ్మనార్యుడని తెలుసుకుంది. ఆమెకు తిమ్మనగారంటే పితృసమానుడు కావటం వల్ల, ఇదేమిటా ఈ మహాకవికి-ఈ గతి కలిగిందనే ఉద్దేశ్యంతో శైత్యోపచారాలు చేయటానికి పూనుకొంది. కాని, ఆ భూగృహ మార్గంలో నీటికి కూడా కరువు వొచ్చింది.

మహారాణి- వెంటనే వెను తిరిగి అంతఃపురంలోకి బయలుదేరింది. కాని, ఆమె ఆ మార్గం గుండా అంతఃపురాన్ని సమీపించేసరికి- తాను వొచ్చిన ద్వారాన్ని. అవతల ఎవరో బంధించిన విషయాన్ని అర్థం చేసుకుంది మహారాణి. ఆపని ఎవరు చేసి వుంటారో కూడా ఆమెకు తెలియక పోలేదు. అతడు వీరేంద్రపాత్రుడు. అతని రాకను చూసే-అతని బారి నుండి ఎలాగైనా తప్పించుకోవాలనే ఉద్దేశంతో మహారాణి ఈ సొరంగ మార్గాన్ని ఆశ్రయించింది. కాని, ఆ క్షుద్రుడికి అంతఃపుర రహస్యాలు అన్నీ తెలియటం వల్ల-ద్వారాన్ని అవతలి నుండి బంధించి వేశాడు.



మహారాణి-వెంటనే సొరంగపు రెండవ ద్వారం ద్వారా బయట పడాలనే ఉద్దేశంతో, మళ్ళీ వెనుతిరిగి తిమ్మనార్యుడు పడిఉన్న ద్వారం దగ్గరకు వచ్చి పరిశీలించింది. కాని, ఆమెకు ఆ వైపున నిస్పృహే ఎదురైంది.

ఇక ఏమి చేయటానికీ తోచక, మహారాణి తన పైట చెరగుతో భీతావహుడై-సొమ్మసిల్లిన మహాకవికి విసిరి సేద తీర్చటానికి ఉపక్రమించింది. మరో కొద్ది క్షణాల్లో తిమ్మనార్యుడు. ఆమె చేతి చలువ వల్ల కోలుకొని కాగడా వెలుగులో మహారాణిని గుర్తు పట్టాడు.

"మీరా, అమ్మా?"

"అవును, మహాకవీ! నేనే!"

"మీరెలా వొచ్చారమ్మా, ఇక్కడికి."

"కర్మ తరుముకొచ్చింది, మహాకవీ! చేసిన పాపాలు అనుభవించటానికి నరకం మరో చోట లేదు: ఇక్కడే ఉంది."

"అలా బాధ పడకండమ్మా! ఇప్పటికైనా ఉన్న విషయాన్ని మహారాజుకు మనవి చెయ్యండి. దానివల్ల మీకు ఆత్మశాంతి లభిస్తుంది. ఆంధ్రులకు మహామంత్రి శ్రీరామరక్ష మరికొంత కాలం ఉంటుంది.

"ఔను. మహాకవీ! చేసిన పాపాలు చాలు- ప్రపంచంలోని సమస్త భోగ భాగ్యాలు అనుభవించాను. ఇక అనుభవించాల్సింది లేదు; బ్రతుకు కోసం బాధ పడాల్సింది లేదు. మానహాని జరుగుతుందని మనసు చంపుకోవాల్సిన అవసరం కానీ, ఆత్మవంచన చేసుకోవాల్సిన పని కానీ లేదు నాకు. నిర్భయంగా ప్రాణాలర్పించటానికైనా సిద్ధపడి, మహారాజుకు వాస్తవాలను మనవి చేద్దామనే ఉద్దేశంతోనే బయలుదేరాను. అంతలో వీరేంద్రుడు హడావుడిగా అంతఃపురంలో ప్రవేశించాడు. అతడి బారినుండి తప్పించుకోవాలనే ఈ సొరంగ మార్గాన్ని ఆశ్రయించాను. కాని, దుర్మార్గుడు ఈ సొరంగాన్ని కూడా రెండు పక్కలా బంధించివేశాడు. ఏం చెయ్యమంటారు. మహాకవీ!" అంది అన్నపూర్ణాదేవి గద్గదిక స్వరంతో.

"ఈ బుద్ధి ఇంతకు ముందే ఉంటే ఎంత బాగుండేది!" అనుకున్నాడు మహాకవి మనస్సులో.

"అదేనమ్మా- నాకూ దిక్కుతోచటంలేదు. అవతల అంతా ముంచుకు వస్తున్నది. మనం ఇక్కడ మ్రగ్గిపోతున్నాం. అమ్మా! మనం బయట పడటానికి వేరే మార్గం లేదా?" అన్నాడు తిమ్మనార్యుడు.

మహారాణి మరి కొన్ని క్షణాలు ఆలోచించింది.

"మార్గమైతే ఉంది గాని, మహాకవీ! దాన్ని సూర్యోదయమైతేనే గాని కనుక్కోలేం. ఆ బిలం ద్వారా ఈ మార్గంలోకి గాలీ, వెలుతురూ వస్తుంటాయి. అర్ధరాత్రివేళ ఆ బిలద్వారాన్ని కనుక్కోవటం అసంభవం, మహాకవీ!"

"మహాకవి ఆశలడుగంటాయి. తెల్లవారితే బ్రతికి బయట పడగలమనే ధైర్యం చేకూరినా, తెల్లవారే లోగానే సర్వనాశనమైపోతుందనే బాధతో జీవన్మృతుడిలా మారిపోయాడు.

* * *

మహారాజు ఎదురు పడటంతో మరలి వచ్చిన దండనాథుడు అన్నపూర్ణాదేవి అంతఃపుర పరిసరాల్లోనే తారట్లాడుతున్నాడు. చేపట్టిన పనిని మధ్యలో విడిచిపెట్టటం దండనాథుడికి అలవాటు లేదు. ఏ విధంగానైనా సరే, ఆఖరికి అన్నపూర్ణాదేవి అభ్యంతర మందిరంలో ప్రవేశించయినా వీరేంద్రుడి తలను శరీరంనుండి వేరు చేయటానికి నిశ్చయించుకున్నాడు దండనాథుడు. కాని, ఆ పరిసరాల్లో మహారాజు తిరుగుతూ ఉండటంవల్ల ఎందుకైనా మంచిదనే ఉద్దేశంతో ఒక లతానికుంజాంతర్భాగాన్ని ఆశ్రయించాడు తాత్కాలికంగా.

## 10

దండనాథుణ్ణి అనుసరిస్తూ వెలుపలికి వచ్చిన మహారాజును నిశ్శబ్ద నిశీధి వెక్కిరించింది. కనుచూపు మేరలో దండనాథుడు కనిపించలేదు. మళ్ళీ అన్నపూర్ణాదేవి మందిరంలోకి వెళ్దామా అనే ఉద్దేశంతో వెనుతిరిగి అంతఃపురంలో ప్రవేశించబోయాడు. కాని, అతని హృదయం ఆ క్షణాన మందిర ప్రవేశానికి ఎందుకో ఎదురు తిరిగింది. అంతఃపురం



లోకి వెళ్ళకుండానే కాళరాత్రిలో కలిసిపోవటానికి నిశ్చయించుకున్నాడు. వెంటనే అన్నపూర్ణాదేవి భవనం నుంచి ఒక్కొక్క మెట్టే దిగటం మొదలుపెట్టాడు.

ఎదురుగా అనతిదూరంలో అంతఃపురాలను పరిరక్షించే ప్రాకారం కనిపించింది మహారాజుకు. పగలనక, రాత్రనక, ఆంధ్రవీరులనేకులు ఆ ప్రాకారాన్ని విచ్చు కత్తులతో కాపలా కాస్తూ రక్షిస్తుంటారు. ప్రచండ భానుని తీక్షణ కిరణాలు కాని, మహా వృక్షాలను సైతం గజగజలాడించే ప్రచండమారుతం కానీ, ఆ ఆంధ్ర వీరులను కర్తవ్య విమూఢులుగా చేయలేవు. అది మహామంత్రి శిక్షణ. ఎవరి కోసం? ఎవరి కోసం ఇదంతా??

"ఒక్క క్షుద్ర ప్రాణి ప్రాణ రక్షణకు!" అనుకున్నాడు మహారాజు.

మహారాజు మనస్సులో వైరాగ్యం అంకురించింది. ఆ వైరాగ్యంలోనే తాను మహారాజుని అనే విషయాన్ని కూడా విస్మరించి చరచరా నడుస్తూ ఆ మహోన్నత ప్రాకారాన్ని సమీపించి. మరి కొన్ని క్షణాల్లో దాన్ని అధిరోహించాడు. మహారాజు అంత ఆవేశంతో ఆ ప్రాకారాన్ని అధిరోహించింది ఒకందుకు. కాని, అక్కడ మరో దృశ్యం కనిపించింది. అహర్నిశలూ క్షణ కాలం అనుగులు కలపకుండా పహరా ఇచ్చే ఆంధ్ర సైనికులు ఆ క్షణాన మహారాజు ఆగమనాన్ని గ్రహించలేకపోయారు. వారు తన రాకడను గమనించటం తన ఉద్దేశ్యానికి అభ్యంతరం అని తెలిసి ఉండి కూడా మహారాజు వారిని ప్రశ్నించలేకపోయాడు. ఆయనలో ఉన్న వైరాగ్యం వైరాగ్యం కాదు, తాత్కాలిక రాగరాహిత్యం.

ప్రాకార రక్షకులంతా ప్రాకారపు వెలుపలి పిట్టగోడ నానుకొని క్రిందికి చూస్తున్నారు ఆదుర్దాగా. వారి దృష్టి అంతా ప్రాకారానికి వెలుపల ఉన్న దేని మీదో కేంద్రీకృతమై ఉంది. అందువల్లనే చీమచిటుక్కుమంటే కత్తులు ఝళిపించే ప్రాకార రక్షకులు మహారాజు ఆగమనాన్ని గ్రహించలేకపోయారు. వారి దృష్టిని అంతగా ఆకర్షించిన విషయమేదా అని ఆదుర్దాగా మహారాజు కూడా ఆ భట సమూహాన్ని సమీపించి, వారి

తలల మధ్య నుండి తన తలను కూడా చొప్పించి, కోట వెలుపల ఏమి జరుగుతున్నదో చూశాడు.

ఆశ్చర్యం! కొన్ని వందల-కాదు. కొన్ని వేల కాగడాలు వెలుగుతున్నాయ్. ఎక్కడెక్కడినించో చీమల బారుల్లా కాగడాలు రెండు-రెండు వరుసలుగా! నాలుగు - నాలుగు వరుసలుగా బయలుదేరి వొస్తున్నాయ్—ఈ కాగడాల సముచ్ఛయంలో కలవటానికి.

ఎక్కడో ముప్ఫై నలభై మైళ్ళ దూరాన అశ్వ ధూళి లేస్తే హెచ్చరికలు చేస్తూ మ్రోగే నగారా గంట ఆ రోజున మ్రోగలేదు. ప్రథమ ప్రాకారం దగ్గర చిన్న ద్వంద్వం జరిగితే ఏడవ ప్రాకారం నుండి కూడా పరుగులు తీసే రక్షాధికృత జనవ్రాతం ఆ రోజున తమ కంటి ముందు, తమ ప్రాకారం క్రింద అంత పెద్ద విప్లవపు పునాదులు త్రవ్వబడుతుంటే ఉలకలేదు, పలకలేదు. మహారాజు అక్కడున్న వారందరినీ పరిశీలనగా చూశాడు. అంతా తనకు కావలసినవాళ్ళే. అంతా నమ్మకమైన వాళ్ళే. కాని, అందరూ తమ ఆశలని ఆ విప్లవ వీరుల మీద పెట్టుకొని ఆ క్షణాన ఆ ప్రాకారం మీద ఉన్నందుకూ, క్రింది వారిలో కలవనందుకూ సిగ్గుపడుతున్నారా అనిపించింది మహారాజుకు.

మరొక్కసారి క్రిందికి చూశాడు మహారాజు. అక్కడ చేరిన వారిలో అన్ని జాతుల వారూ, అన్ని అంతస్థుల వారూ ఉన్నారు. విజయనగర పౌరులే కాకుండా, విజయనగర సైన్యంలోని చతురంగ బలాలకు సంబంధించిన అనేక ప్రముఖవ్యక్తులను గుర్తుపట్టాడు మహారాజు ఆ కాగడాల వెలుగులో. మరుక్షణంలో మతిపోయినంత పనైంది. ఈ విశాల విజయనగర సామ్రాజ్యంలో నమ్మదగిన మనిషే కనిపించలేదు మహారాజుకు.

నిన్నటి వరకూ తాను సర్వశక్తివంతుడైన చక్రవర్తినని విఱ్ఱవీగాడు. కాని, ఈ రోజున తన పిండిబొమ్మకన్నా కనాకష్టంగా ఉంది బ్రతుకు. ఇంతకాలంనించీ మహామంత్రి బలాన్ని చూసి, తనబలమని అపోహ పడ్డాడు. కాని, అవసరానికి మహామంత్రి బలం-మహామంత్రి బలంగానే ఉంటుంది కాని, మహారాజుకు ఏ విధంగానూ అక్కరకు రాదన్నది నగ్న



సత్యం అనుకున్నాడు మహారాజు. విప్లవం ఇంతగా ముంచుకు వొస్తున్నా తమకు పట్టనట్లుండటమే కాకుండా, వెలుపలి వారికి సానుభూతి చూపుతున్న ఆ రక్షక భటశ్రేణి దగ్గర ఉండటానికి మనస్కరించలేదు మహారాజుకు.

వివిధ రకాల ఆలోచనలతో- వ్యథలకాలవాలమైన అతని మస్తిష్కానికి శాంతి కావాలి. ఎక్కడికి వెళ్ళినా ఆయనకు శాంతి అందకుండా పోతున్నది. అశాంతి భయంకరంగా వెన్నాడుతోంది. కాని, ఎక్కడికో పోవాలి. ఈ బాధాక్షుభిత హృదయానికి విశ్రాంతి లభించే ఏ ప్రదేశానికన్నా పోవాలి. ఇదివరకైతే వెంటనే అప్పాజీవారి మందిరానికి పరుగులు తీసేవాడు. కాని, ఇప్పుడక్కడికి వెళ్ళే యోగమూ, యోగ్యతా లేకుండా పోయాయి. మహారాజు మనసులో తిరుమలాంబిక గుర్తుకొచ్చింది. ఇంతకు ముందు ఎన్నడూ-ఇంత అర్ధరాత్రాన తిరుమలదేవి ఇంటికివెళ్ళలేదు మహారాజు. అదీకాక-ఇంత విపత్తి పరిస్థితిలో ఊరట కోసం ఆమె భవనానికి వెళ్ళింది కూడా లేదు. ఆమె మహా పతివ్రతే! కాని, భర్తకు కావాల్సిన విశ్రాంతి చేకూర్చటం ఆమెకు చేతనౌనో, కాదో! మహారాజుకు ఎంత ఆలోచించినా తిరుమలాంబిక మందిరంకన్నా, ఆత్మశాంతి ఇచ్చే మరో ప్రదేశం కనిపించలేదు చివరికి అక్కడికే బయలు దేరాడు.

తిరుమల దేవి మందిరానికి అభిముఖంగా పోతున్న రాయల వారిని అన్నపూర్ణాదేవి అంతఃపురంలోనించే పసికట్టాడు వీరేంద్రుడు. అంతఃపురంలో ఉన్నా, అతడు కళ్ళను మహారాజు పోకడ మీదనే కేంద్రీకరించాడు. మహారాజు ప్రాకారం ఎక్కటం, ఆ తర్వాత కొద్ది క్షణాల్లో తిరిగి రావటం కూడా గమనించాడు అన్నపూర్ణాదేవి గవాక్షం నుంచి. మహారాజు ఉద్దేశాన్ని గ్రహించటానికి వీరేంద్రపాత్రుడికి అట్టే కాలం పట్టలేదు. ఆయన గమ్యస్థానం తిరుమలదేవి మందిరం. మహారాజు కనక తిరుమలాదేవి మందిరంలో ప్రవేశిస్తే, ఫలితం ఏ విధంగా పరిణమిస్తుందో వీరేంద్రుడికి తెలుసు. తిరుమలాంబికను తిమ్మరుసు అంటే

విపరీతమైన భక్తీ, విశ్వాసమూ. అంతే గాకుండా, తన ప్రార్థనల వన్నించి, తిరుపతి వేంకటేశ్వరుడు తన భర్త రక్షణకు పంపిన దేవతా మూర్తిలా చూసుకుంటుంది తిమ్మరుసును. తిమ్మరుసు శిక్షింపబడ్డాడనే విషయం ఇప్పటివరకూ ఆమెకు బహుశః తెలిసి ఉండదు. అలా తెలిసి తిరు ఉన్నపక్షంలో ఎన్నడూ అంతఃపురందాటి బయటికి అడుగుపెట్టని మలదేవి అంతఃపురంవదలి కోటనంతా ఈపాటికి తల్లక్రిందులుచేసి ఉండేది. అంతేగాక, మహారాజుకు ఆమె మీద ఎనలేని గౌరవం. ఆమె ఎదురుపడి "తిమ్మరుసు మహామంత్రిని రక్షించండి మహారాజా" అని నిలదీసి అడిగితే, కాదనే ధైర్యం రాయలవారికి లేదు: రాయలవారి అదృష్టవశాన అన్నపూర్ణాదేవిలా ఆమె చీటికి మాటికీ ఏ కోరికా కోరదు. కానికోరితే మహారాజయినా తలవంచి మన్నిస్తాడు. ఆమె మహారాజును ఇంతవరకూ శాసించలేదు; కాని, ఆమె ఒకవేళ శాసిస్తే, మహారాజయినా మంత్రిబద్ధుడిలా ఆమె ఆదేశాలను అనుసరిస్తాడు. కాబట్టి, మహారాజు తిరుమలాంబిక మందిరంలో ఏ పరిస్థితిలోనూ అడుగు పెట్టకూడదు. ఈ ఊహల నుండి బయటపడి చూసే సరికి మహారాజు చాలా దూరంలో వెళుతున్నాడు. "అరె! సమయం మించుకొస్తున్నదే." అనుకొని వీరేంద్రుడు "బావా...." అంటూ పెద్దకేక వేసి వొక్క ఉదుటున గవాక్షంలోనించి ఛెంగున క్రిందికి లంఘించాడు.

ఆ కేకకు ఉలిక్కిపడి మహారాజు వెనుతిరిగి చూశాడు. ఆ చీకటిలో ఉద్యానవనంలోని లతానికుంజం గాలి లేకపోయినా విపరీతంగా ఊగిస లాడటం గమనించాడు. కాని, ఆ విషయాన్ని నిర్లక్ష్యం చేస్తూ ముందుకు సాగిపోయాడు.

మహారాజు తిరుమలదేవి అంతఃపురానికి వెళ్ళిపోతున్నాడే అనే ఆదుర్దాతో గవాక్షంలోనించి ఉద్యానవనంలోకి లంఘించిన వీరేంద్ర పాత్రుడు ఒక లతానికుంజంలో పడ్డాడు.

పడిన పాటు ఆపసవ్యంగా పరిణమించినందువల్ల వళ్ళంతా పట్టుకపోయినట్లయింది వీరేంద్రుడికి. ఒక్కసారి వొళ్ళు విరుచుకొని లేద్దామని ప్రయత్నించాడు. కాని, లేవలేకపోయాడు. తన శరీరాన్ని ఏవో కొమ్మలు గట్టిగా అదిమి వేస్తున్నాయి. అవలు బలిష్ఠమైన రజ్జువులలా



తన శరీరం మీద ప్రాకుతున్నట్లయింది. ప్రపంచంలో అక్కడక్కడ మాంసాశనపు చెట్లు ఉంటాయని చదువుకున్నాడు గాని, ఈ అంతః పురోద్యానవనంలో అలాంటి చెట్టు పెరిగే ఆస్కారం లేదని తెలుసు. మరి ఏమిటా అంటూ కళ్ళు బాగా తెరిచి, చీకటిని చీల్చుకొని చూశాడు వీరేంద్రపాత్రుడు. క్షణకాలం తరువాత తన్ను బంధిస్తున్నది మహాదండ నాథుని పన్నగ హస్తద్వయం అని అర్థం చేసుకున్నాడు. పెద్దపెట్టున అరవబోయాడు. ఉగ్ర నరసింహుని మరపించే దండనాథుడి భయంకరాననం చూస్తుంటే, వీరేంద్రుడి నోటినుండి మాట పెగల్లేదు. శబ్దం అంగిటిలోనే అణగిపోయింది. తప్పించుకోవటానికి కాళ్ళూ, చేతులూ అప్రయత్నంగా చేసే కదలికలు వాటంతట అవే ఆగిపోయాయి. పై ప్రాణం పైన పోగా, జీవచ్ఛవంలా ఉన్న వీరేంద్రపాత్రుడి పైకి ఆకలిగొన్న మృగరాజు, మృగకళేబరం మీదకి వొంగినట్లు వొంగాడు మహాదండ నాథుడు.

* * *

మహారాజు తిరుమలదేవి అంతఃపురంలో ప్రవేశించాడు. తాను ఏ క్షణాన వచ్చినా బంగారు పళ్ళెంతో, పన్నీరు జలములతో, పూజాద్రవ్యాలతో ఎదురు వొచ్చే తిరుమలదేవి ఆనాడు ఎదురు రాకపోవటంతో ఈమె కూడా తనపై ఆగ్రహించిందేమోననే శంకతో క్షణకాలం విచలితుడైనాడు మహారాజు. కాని మరుక్షణంలో అర్ధరాత్రాన హఠాత్తుగా అంతఃపురంలో ప్రవేశించటమే గాక పాదపూజ చేయటానికి ఎదురు రాని దేవి హృదయాన్ని శంకించిన తన అల్పజ్ఞతకు తానే సిగ్గుపడ్డాడు. తన మతి తనలో లేదు. ఎక్కడ ఉందో తెలియదు నీరసంగా ఒక నవ్వు తనలో తానే నవ్వుకొని తిరుమలదేవి శయ్యాగారంలో అడుగు పెట్టాడు మహారాజు. అంతే! నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

సర్వదినాల్లో దేవతార్చనకు తప్ప, అంతఃపురం వెలుపల అడుగు పెట్టని దేవి ఆనాడు అర్ధరాత్రాన తన హంసతూలికా తల్పం మీద లేదు. ఏమైంది మహారాణి? ఏమైంది మహారాణి! "దేవీ! మహారాణీ! దేవీ తిరుమలా!...." అంటూ మహారాజు వెర్రెత్తినట్లు అంతఃపురం

అంతా కలయ తిరిగాడు. ప్రతి మూలనించి "దేవీ! తిరుమలా! మహారాణీ! దేవీ!" అనే శబ్దాలు ప్రతిధ్వనించాయి. ఎంత వెతికినా మహారాజుకు మహారాణి జాడ తెలియలేదు. అంతఃపురంలోని మారు మూల గదులూ, రహస్య ప్రదేశాలూ, పూజా మందిరాలూ, నర్తనశాలలూ అన్నీ గాలించాడు మహారాజు. ఫలితం శూన్యం కావటంతో మనసు కోల్పోయిన మదగజంలా అంతఃపురం నుండి వెలుపడ్డాడు.

ఎదురుగా తిరుమలాంబిక!....

తాను ఎదురుపడగానే మేలి ముసుగును సవరించుకొని, అవనత శీర్షగా నిలువబడు తిరుమలాంబిక అనాడు తల వంచుకో లేదు; మేలి ముసుగు సవరించుకోలేదు. మహారాజును చూడగానే వెదుకబోయిన తీగ కాల దగిలినంత తృప్తి చెంది—"ఏమిటీ అన్యాయం, ప్రభూ?" అంది. ఆ మాటలంటున్నప్పుడు ఆమె కంఠంలో జాలి లేదు. ప్రాధేయత లేదు. కరుణ లేదు గాద్గదికం లేదు. అసలు స్త్రీత్వమే లేదేమో కూడా. "న్యాయాన్ని, ధర్మాన్ని ప్రసాదించండి!" అని ప్రార్థిస్తున్నట్లుంది; కాదు, శాసిస్తున్నట్లుంది ఆ కంఠం.

సుపరిచితమైన వ్యక్తి నుండి వెలువడ్డ ఆ అపరిచిత కంఠాన్ని విని నిర్ఘాంతపోయాడు మహారాజు.

"మీరు కూడా మమ్మల్నే నిందిస్తున్నారా, దేవీ?"

"నేనే కాదు; మీరు చేయ సంకల్పించిన ఈ ఘోర కిరాతకానికి ఆంధ్రులంతా మిమ్మల్నే కారణభూతులుగా నిందిస్తున్నారు."

"అందుకని మీరు...."

"వారలా నిందించటంలో పొరబడటం లేదేమోనని నా అభిప్రాయం, మహారాజా!"

"దేవీ!" అన్నాడు రాయలు బిగ్గరగా.

"మీరేమన్నా అనండి; మీరేదైనా చేయండి, నాకనవసరం. కాని, ఎన్నడూ, ఏ కోరికా కోరని తిరుమలదేవి ఈనాడు మిమ్మల్ని ఒకే ఒక కోరిక కోరుతున్నది. మళ్ళీ ఈ జీవితంలో ఏ కోరికా కోరదు."



"మీ ఇష్టం వచ్చినన్ని కోరికలు కోరండి. ధర్మ విరుద్ధం కాని, ఏ కోరికయినా మన్నిస్తాను."

"అదే నే కోరే కోరిక, ప్రభూ! ధర్మాన్ని అనుసరించి శిక్షించే టప్పుడు ఏది ధర్మం, ఏది అధర్మం అనేది వాస్తవ సన్నిహితంగా, ధర్మబద్ధంగా నిర్ణయించండి; ఆ తరువాత శిక్షించండి. అప్పాజీవారు నేరస్థులని త్రికరణశుద్ధిగా మీరు విశ్వసిస్తేనే శిక్షించండి. అధర్మాన్ని రక్షించమనేటంత అజ్ఞానురాలు కాదు ఆంధ్ర సామ్రాజ్య పట్టమహిషి."

"నేను విశ్వసించినా, విశ్వసించకపోయినా ధర్మశాస్త్రం అప్పాజీ వారిని దోషిగా నిర్ణయించింది."

ధర్మశాస్త్రమూ, ధర్మమూ ఒకటేనా, ప్రభూ?"

"నా మటుకు నాకు భేదం కనిపించటం లేదు."

"సరిగ్గా ఆలోచించి చెప్పండి, ప్రభూ!"

"నా మటుకు నాకు భేదం కనిపించటం లేదు."

"సరిగ్గా ఆలోచించి చెప్పండి! హృదయం మీద చెయ్యి వేసుకొని చెప్పండి, ప్రభూ!"

"ప్రభువుకు ఆమె మాటల్లోని అంతర్యం అర్థం కాలేదు. అంతే కాకుండా, ఆనాటి ఆమె ధోరణి విపరీతంగా ఉండటం వల్ల నిర్ఘాంతపోయాడు. నిశ్చేష్టుడైనాడు. మాట్లాడుతున్నది తిరుమలదేవియేనా అనే అనుమానం కూడా కలిగింది క్షణకాలం.

ఏమంటారు ప్రభూ?" పట్టమహిషి రెట్టించి అడిగింది.

"ఆ రెండూ—వాస్తవంలో ఒకటి కాకపోవచ్చు. కాని, రాజ్యాంగ నిర్వహణలో ధర్మశాస్త్రం నిర్ణయించిన దానికే ధర్మమని పేరు. ధర్మశాస్త్ర నిర్ణయాన్ని—ఒకవేళ వాస్తవంగా అది అధర్మమయినా—మార్చటానికి నాకు హక్కు లేదు, మహారాణీ!"

"నిర్ణయాన్ని మార్చే హక్కు ప్రభువులకు లేకపోవచ్చు; కాని, ఆ నిర్ణయాన్ని అమలు జరిపే హక్కు మీది!"

"అయితే....?"

"వాస్తవం ప్రపంచానికి తెలిపే వరకూ శిక్ష అపు చేయండి.

అసలు విషయాన్ని ఋజువు చేసే బాధ్యతను నేను స్వయంగా స్వీకరిస్తాను."

"దాని వల్ల సామ్రాజ్యంలో కల్లోలం చెలరేగుతుంది."

"ఈ అక్రమ శిక్ష అసలు జరిగితే, సామ్రాజ్యంలో అంతకన్నా కల్లోలం చెలరేగుతుంది ప్రభూ!"

"అయినా, కల్లోలితమైన మా ఆత్మకు శాంతి చేకూరుస్తారనే ఉద్దేశ్యంతో మీ అంతఃపురానికి వస్తే, ఈ విధంగా నేనా మమ్మల్ని సమాశ్వాసించేది, దేవీ!" అన్నాడు మహారాజు జాలిగా.

"మన్నించండి, ప్రభూ! ఈ విపరీత విషమ పరిస్థితిలో ఆత్మశాంతి కోసమే నా అంతఃపురానికి వస్తే, అది మీకిక్కడ అణుమాత్రం కూడా లభించదని మనవి చేస్తున్నాను."

"ఇది అన్యాయం, దేవీ! బాధా పరితప్తమైన మా హృదయానికి మీ దగ్గర శాంతి లభించకపోతే ప్రపంచంలో మరెక్కడ లభిస్తుంది, దేవీ?" అన్నాడు మహారాజు.

ఆ క్షణాన అతడు మహారాజులా లేడు. మాతృదేవి ముందు గారాము చేసే అడ్డాలనాటి బిడ్డలా ఉన్నాడు.

దేవి ఒక్కసారి మహారాజు వంక తీక్షణంగా చూసింది. మరు క్షణంలో అంతకన్నా తీక్షణంగా సమాధానం చెప్పింది. 'కారాగృహంలో.'

అంతే! ఆ పైన ఆమెకు మహారాజు సమక్షంలో ఉండటానికి మనస్కరించలేదు. చర-చరా అంతఃపురంలోకి వెళ్ళిపోయింది నాథుని దగ్గర సెలవైనా తీసుకోకుండా!

"దేవీ!" అంటూ ఆమెను అనుసరించబోయిన మహారాజుకు అడ్డంగా అంతఃపుర ద్వార బంధాలు ఎదురు నిలిచాయి.

తన ముఖం మీదే "ఫడీ"మని మూసుకున్న అంతఃపుర ద్వారం వంక చూసి, మహారాజు నిశ్చేష్టుడై నిలచాడు.

ఎన్నడూ తన మాట కెదురాడని పట్టమహిషి అంత బాధాకరంగా ప్రవర్తించటం చూసి మహారాజు విచలితుడయ్యాడు.

మనశ్శాంతి లభిస్తుందని బిరుసులాంటక అంతఃపురానికి వచ్చిన



మహారాజుకు మతిభ్రమణ కలగటంతో గంగవెఱ్ఱులెత్తినట్లయింది. ఆ ఉన్మాదంతో కోట అంతా తిరగటం ప్రారంభించాడు మహారాజు ఆ భయంకర కాళరాత్రిని నిర్లక్ష్యం చేస్తూ. వెంట పరివారం లేదు. పైన ఉత్తరీయంలేదు. కాళ్ళకు పాదరక్షలు లేవు. ఆత్మరక్షణకు అక్కరకు వచ్చే నిశిత కృపాణం లేదు. ఆ క్షణాన మహారాజును చూసిన వారికి మహారాజును, మహారాజని గుర్తుపట్టటానికి అవకాశం లేదు. ఎవరో ఉన్మాది. అంతే!

ఎక్కడకు వెళ్ళినా మహారాజుకు క్షణకాలం కూడా విశ్రాంతి లభించటం లేదు. చెట్లు, పుట్టలు, గుట్టలు, పర్వతాలు—దారికేది అడ్డు వచ్చినా కనిపించటం లేదు. పోతున్నాడు - పోతున్నాడు. ఎక్కడికి పోతున్నాడో ఆయనకే తెలీదు. కొంత కాలమైన తరువాత భూమి సమాప్తమైనట్లనిపించింది. ముందుకు వేయబోయిన అడుగుకు నేల తగల్లేదు. ఒక్కసారి మహారాజు తన చుట్టూ ఉన్న గంభీర ప్రకృతిని తిలకించాడు. తానప్పుడు పర్వతాగ్రం పైన నిలబడి ఉన్నాడు. ఒక ప్రక్క తన అంతఃపురం కనిపిస్తున్నది- కళావిహీనంగా మిణుకు మిణుకుమనే దీపాలతో- మరో ప్రక్క ఋష్యమూక పర్వతం మూర్తీభవించిన బ్రహ్మ రాక్షసాకారంలో గోచరించింది. క్రిందికి చూశాడు. మతంగ పర్వత సానువుల్లో తన చేత నూతనంగా నిర్మింపబడ్డ విఠలాలయం కనిపించింది. అవును- విఠలాలయం....అనంత ధన వ్యయంతో తాను నిర్మించిన అపూర్వ శిల్ప కళాఖండం విఠలాలయం. అందులో తనకు శాంతి తప్పక లభిస్తుంది. విఠలదేవుడు తన్ను తప్పక అనుగ్రహిస్తాడు. తన బంగారు పిల్లనగ్రోవి రవళిలో తన హృదయానికి శాంతి చేకూర్చగల దైవం!

మహారాజు పర్వతాన్ని అధిరోహించటం ప్రారంభించాడు వడి-వడిగా. ఎంత త్వరగా వెళ్ళి విఠలస్వామి పాదాల నాశ్రయిస్తే, అంత త్వరగా తన హృదయవేదన అంతరిస్తుందనే ఆశ ఆయన్ను పరుగెత్తిస్తున్నది. ఓ పదడుగులన్నా వేశాడో, లేదో అతనికేవో గుస-గుసలు వినిపించాయి ఆ నిశీధిలో. నిజానికి అవి గుస-గుసలు కావు. మాటలు

పెద్దగానే వినవొస్తున్నాయ్. కాని, అనాశ్వాసిత మానసుడయిన మహారాజుకు మాత్రం ఏవో గుస గుసలుగా వినిపించాయి. అయినా, ఒక్కక్షణం ఆగిపోయాడు మహారాజు. ఆ నిశీధిలో మహారాజు నిశిత నేత్రాలు ఆ సవ్వడి వినవొచ్చే దిక్కును పరిశీలించాయి. వారు మతంగ పర్వతాగ్రాన్నించి కోటకు సమాచారాన్ని చేరవేసే చార బృందం. ఆ పర్వతాగ్రాన వొకొక ప్రత్యేకమైన మందిరం ఉంది, ఆ మందిరంలో రేబవళ్ళు ఒక చార దళం ఉంటుంది. ఆ పర్వతాగ్రాన ఉన్న ఆ మందిర శిఖరం మీదినించి, విజయనగరం చుట్టుప్రక్కల డెబ్బై మైళ్ళ దూరం వరకూ కనిపిస్తుంది. ఈ కైవారంలో- ఏ అనుమానాస్పదమైన విషయం జరిగినా, ఆ పర్వతాగ్రాన ఉన్న చారదళ నాయకుడు- అక్కడినించి వెంటనే ఆ విషయాన్ని కొంచెం క్రింద ఉన్న చారదళానికి హెచ్చరిక చేస్తాడు. అంత ఉన్నతమైన పర్వతాగ్రంలో చీమ చిటుక్కుమన్నా పర్వతము క్రింద ఉన్న ఒక ప్రత్యేక ప్రదేశంలో స్పష్టంగా వినిపిస్తుంది. ఆ ప్రదేశంలోనే రెండవ చారదళ శిబిరాన్ని ఏర్పాటు చేయించాడు మహామంత్రి. పైనించి వార్త అందిన మరుక్షణంలో- అది మహామంత్రికి అంచెల మీద అందె ఏర్పాటు చేయబడి ఉంది.

కృష్ణపక్షి తీక్షణ దృష్టిని సహితం అధిగమించగల వాడి చూపుల చారబృందం ఆ నాడు తనను గుర్తించకుండా తమ మాటలలో మునిగిపోయి ఉండడం మహారాజుకు అసహనాన్ని కలిగించింది. అయినా, వారి మాటలు వినాలనే కుతూహలంతో ఆ మందిరాన్ని సమీపించాడు మహారాజు.

"మహారాజు నిర్ణయం అక్రమం!"

"కన్నతండ్రిలాంటి వాడి కళ్ళు పొడిచిన వాడికి పుట్టగతులుంటాయుట్రా ?"

"అసలు రాజులకు సేవ చెయ్యటమే కత్తిమీద సాము చెయ్యటంరా!"

"ఇంతకు ముందు ఇంత అన్యాయమూ, ఇంత అక్రమమూ ఏ మహారాజూ చేసి వుండడు. ఎవరో రాక్షసులు చెయ్యాల్సిన పని మన మహారాజు చెయ్యటం మన దురదృష్టం."



"ఇష్! ఊరుకో! గోడలకు చెవులుంటాయి."

"ఉంటే ఉండనీరా! ఏ పాపమూ ఎరుగని మహామంత్రి అంతటి వాడే అన్యాయానికి బలి అవుతుంటే, అన్యాయమనే మాట అన్నందుకు మహారాజు మన తల తీసినా ఫరవాలేదు."

....ఇలాంటి వాగ్ధోరణిని వింటున్న మహారాజుకు శరీరమంతా భగభగా మండిపోయింది. ఆవేశంలో మందిర మధ్యానికి ఛెంగున లంఘించాడు.

ఒక్కసారి తమ మధ్య ఊడిపడిన మహారాజును చూసి చార బృందం ఒక్కక్షణం విస్తుపోయింది. మరుక్షణంలో వేగులంతా అవనత శీర్షులై లేచి నుంచున్నారు.

మహారాజు ఒక్కొక్కరినే పరిశీలనగా చూశాడు. ఎవరిలోనూ ఏ విధమైన కదలికా లేదు. వారి ముఖాలలో ఏ విధమైన భావం ప్రస్ఫుటం కావటం లేదు. కాని, నిర్వికారంగా గోచరిస్తున్న వారి వదనాలలో అంతర్లీనంగా దైన్యం కనిపిస్తూంది.

"మేము అన్యాయం చేశామా?" మహారాజు వేగుల వంక చూస్తూ గద్దించి పలికాడు.

కాని, వారినుండి ఏ విధమైన సమాధానం లేదు.

"మేము అన్యాయం చేశామా?" మహారాజు మళ్ళీ రెట్టించాడు. ఘనభోంతరాళాలు దద్దరిల్లేటట్లు.

ఈసారి కూడా వేగులనుండి సమాధానం రాలేదు.

"చెప్పరేం ?"

రెండు క్షణాలు గడిచాయి.

"మేము ఆన్యాయం చేశామా ?"

".... .... ...."

"మేము అన్యాయం చేశామా ? ;"

"…. …. …."

"మేము అన్యాయం చేశామా ? ? ?"

"…. … …."

"మేము అన్యాయం చేశామా!" అనే శబ్దాలు ప్రతిధ్వనించాయి. నాలుగు వైపులా వున్న ఋష్యమూకాది పర్వత శృంగాలనుండి.

మహారాజు క్షణకాలం నిర్ఘాంత పోయాడు.

ఆ ధ్వనులు ఆయనకు "మేము అన్యాయం చేశాము" అన్నట్టు వినిపించాయి ఆయనకు.

ఇంతలో "చెప్పరేం ...." అంటూ నాలుగు వైపులా ప్రతిధ్వని వినిపించింది.

"మేము అన్యాయం చేశామని చెప్పు!" అని అన్వయించుకున్నాడు మహారాజు. మనిషి నిలువునా వణికిపోసాగాడు. మాటలు తడబడసాగాయి.

"మేము అన్యాయం చేశామా ....?" అంటూ నిగ్గదీశాడు చార బృందాధ్యక్షుణ్ణి మహారాజు.

అవనతశీర్షుడైన చారదళాధ్యక్షుడు శిలాప్రతిమలా నిలుచుండిపోయాడు.

"చెప్పవేం ?"

"…. …."

"చెప్పు మేము అన్యాయం చేశామా ?"

"…. …."

చారదళాధ్యక్షుని ఉదాసీనతకి మహారాజుకు మితిమీరిన కోపం వచ్చింది. ఆ ఉక్రోషాన్ని ఆపుకోలేక చారదళాధ్యక్షుని చెంప ఛెళ్ మనిపించాడు. మరు క్షణంలో తనకు తానే సిగ్గుపడిపోయాడు. చూడలేక చూడలేక అతడి ముఖాన్ని పరిశీలించాడు మహారాజు. నిర్వికారంగా ఉన్న అతణ్ని అట్టే చూడలేక, వెను తిరిగి చర-చరా కొండ దిగటం ప్రారంభించాడు. పర్వత సానువులన్నీ "అన్యాయం! అక్రమం!!" అని ప్రతిధ్వనిస్తున్నాయి; ప్రతి చెట్టూ, ప్రతి గుట్టా అక్రమం! అన్యాయం!!



అని ఆక్రోశిస్తున్నాయి. ప్రకృతే తన మీద పగబట్టింది. మహారాజు రెండు చేతులతోనూ చెవులు మూసుకుని ముందుకు పరుగెత్తాడు. ఉన్నట్టుండి ఆకాశం మేఘావృతమైంది. ఘోర అన్యాయానికి పాలుపడిన నీ ముఖం కూడా చూడలేమన్నట్టు తారకలు మేఘ పంక్తుల మాటున దాగిపోయాయి. మహారాజు అక్రమ నిర్ణయానికి ఆకాశమే ఆగ్రహించినట్లు దట్టంగా క్రమ్మిన మేఘాలు భీకరంగా గర్జించసాగాయి. ఆ గర్జనలో కూడా "అక్రమం! అన్యాయం!!" అన్న మాటలు మహారాజు హృదయానికి శూలాలలా గుచ్చుకున్నాయి. ప్రచండంగా హోరుగాలి వీచసాగింది. ఆ గాలికి మహా వృక్షాలు తమ తలలను ఊగించసాగాయి. పెను గాలిలో ముంగురులు చెదరగా, పైనున్న పట్టు వస్త్రము వెనుకకు ఎగురుతుండగా ఆంధ్ర సామ్రాజ్యలక్ష్మి ప్రాణ ప్రియుడు, అఖండ బలపరాక్రమ సంపన్నుడు, అనవరత అష్టయిశ్వర్య భోగపరాయణుడు అయిన కృష్ణదేవరాయ సార్వభౌముడు ఏకాకిగా తూలుతూ పర్వతం అవరోహించి విఠలేశ్వరుని ఆలయ ప్రాంగణంలోకి పరుగు పరుగున వచ్చాడు.

అప్పటికి హోరుగాలి తీవ్రమైంది. ప్రచండ ఝంఝామారుతం తాకిడికి విఠలేశ్వరుని ఆలయంలో ఉన్న గంటలన్నీ ఒక్కసారిగా మ్రోగాయి. అప్పుడే గర్భాలయంలో ప్రవేశిస్తున్న మహారాజు చెవులకు ఆ గంటల నాదంనుండి కూడా "అన్యాయం! అక్రమం!!" అన్న ధ్వని ప్రబలంగా వినవచ్చింది. మహారాజు మ్రాన్పడి నిలచిపోయాడు. ఘంటానాదం తీవ్రతరమైంది. మహారాజు కంపించిపోతూ విఠలస్వామి వంక చూశాడు. సర్వకాల సర్వావస్థలయందు మృదు మధుర దరహాస వదనారవిందుడై, తన్ను ఆశీర్వదిస్తున్నట్టు ఆప్యాయంగా అనురాగంతో పలుకరిస్తున్నట్టు కనుపించే విఠలేశ్వరుని విగ్రహం ఆగ్రహంతో, ఎర్రనైన కన్నులతో తనను తీక్షణంగా చూస్తున్నట్టు గోచరించింది. "దేవా! మా స్వామీ! కన్నయ్యా! నీకు కూడా మాపైన ఆగ్రహమా?" అంటూ గభాలున విగ్రహం పాదాల చెంత వాలి, మహారాజుననే మాట కూడా మరచి, దీనాతిదీనంగా ప్రార్థించసాగాడు. జేగంటల నాదం క్షణ-క్షణానికీ తీవ్రతరం కాసాగింది. మహారాజు తల పైకెత్తి విగ్రహం వంక చూశాడు. విగ్రహ

నేత్రాలనుండి అగ్నివర్షం కురుస్తున్నట్లు గోచరించింది. "అక్రమం! అన్యాయం!!" అంటూ విగ్రహం నోటినుండి కూడా వెలువడినట్లుగా భావించి మహారాజు కంపించిపోయాడు. గభాలున విగ్రహం వద్దనుండి లేచాడు. అంతకంతకూ గర్భగుడి నలువైపుల నుంచీ అదే ధ్వని ప్రచండంగా, అతి వేగంగా వినవచ్చింది. మహారాజు ఇక అక్కడ నిలువలేకపోయాడు. గబ-గబా నడిచి బయటకు వచ్చాడు. వర్షధారలు ములుకుల్లా శరీరానికి తగిలి బాధించసాగాయి. ఆత్మవేదనా పరితప్తుడైన మహారాజుకు ఆ వర్షధారలు అమృతప్రాయంగా తోచాయి. ఉన్మత్తునివలె వర్షంలో తడుస్తూ తుంగభద్రానది వైపు బయలుదేరాడు. రెండు క్షణాలు తాప పీడిత శరీరానికి వర్షధారలు శాంతి నివ్వగలిగినా, అది శాశ్వత శాంతి మాత్రం కాలేదు. మేఘపటలం పగిల్లున గర్జించింది. వర్షం తీవ్రతరమైంది. గాలి మరింత భయంకర స్వరూపం దాల్చింది. ఆ భయంకర నిశీధిలో సర్వ మానవ ప్రపంచమేగాక, ప్రకృతే కినుక వహించగా, పంచభూతాలే తనను పరిహసించగా మహారాజు తుంగభద్రానది ఒడ్డుకు చేరుకున్నాడు.

ప్రతిసారీ తను తుంగభద్రా దర్శనం కోసం వచ్చినపుడు హర్షపులకిత గాత్రంతో, మధుర కలనాదం గావిస్తూ ఉత్తుంగ తరంగ పంక్తులను తన పాదాల వరకూ ప్రవహింపజేసే తుంగభద్ర ఆ భయంకర నిశీధిలో వడివడిగా సుడులు తిరుగుతూ మహోధృతంగా ప్రవహిస్తున్నది. దూరంగా పర్వత సానువుల నుండీ క్రిందకు జారే సెలయేటి ధ్వని మహా భయంకరమైన కేసరి గర్జనవలె తోచింది మహారాజుకు.

"అన్యాయం! అక్రమం!!"

మహారాజు చెవులు గట్టిగా మూసుకున్నాడు, నది ఘోషిస్తూనే ఉంది. ఆ ఘోషకు సంతత ధారగా కురుస్తున్న వర్షపు నీటిలో తడిసి కూడా-మహారాజు శరీరం అగ్నిగుండంవలె జ్వలించసాగింది.

"అవును. అక్రమం! అన్యాయం! అనండి! ఇంకా అనండి! మా నిర్ణయాన్ని అన్యాయమని గర్జించండి! ఓ ముక్కోటి దేవతాలారా! అష్ట దిక్పాలకులారా! బ్రహ్మ విష్ణు మహేశ్వరులారా! మీరు మాత్రం ఎందుకు



ఊరుకున్నారు? అనండి, గర్జించండి! అఖిలాంధ్ర కర్ణాటక రాజ్యాలకు ఏకైక ప్రభువులమనే అహంకారంతో విర్రవీగాము. అనేక అక్షౌహిణుల రథ గజ తురగ పదాతి దళాలు మా అధీనంలో ఉన్నాయని విశ్వసించాము. పరమేష్ఠికైనా ఎదురుంది గాని, మా మాటకు తిరుగు లేదని గాఢంగా నమ్మాము. కల్ల! అన్నీ కలలుగా మారిపోయినయ్. ఈ రాజ్యంలో జడ చర పదార్థాలన్నీ 'అప్పాజీ!' ఆజ్ఞాను బద్ధాలే! అప్పాజీ! చూశారా! మీరే గౌరవించిన మమ్ము - సామాన్య ప్రజలే గాక, మా పట్టమహిషే తూలనాడింది. పంచభూతాలూ పగ బూనాయి. అప్పాజీ! మేమెంత కఠిన హృదయులం! అప్పాజీ! అప్పాజీ!" అంటూ ఉన్మత్తునిలా బిగ్గరగా అరచి, ఆ భయంకర తుఫానులో ముందుకు పరుగెత్తాడు మహారాజు.

"అప్పాజీ!" విద్యానగరమే మారుమ్రోగింది.

"అప్పాజీ!" అంటూ ఎలుగెత్తి అరచిన మహారాజు నాలుగడుగులన్నా వేయక ముందే నిలిచిపోయాడు. కఠిన శిలలను సహితం ద్రవింపచేయగలిగిన ఒక కంఠనాదం అతణ్ణి ఆకర్షించింది. ఆ కంఠస్వరం వినవొస్తున్న వైపు ఒక్క క్షణం పరిశీలనగా చూశాడు. తుంగభద్రా నదీమతల్లి గర్భంలో స్నానమాడుతున్న గున్న ఏనుగులను జ్ఞప్తికితెచ్చే నునుపుతేలిన నల్లరాతిబండలు తప్ప మరేమీ కనిపించలేదు కాని, పాట మాత్రం స్పష్టంగా వినిపిస్తున్నది. అంతకంతకూ పాట స్థాయి పెరిగి పోతున్నది.

జరిగిందిరా మోసమూ
అంధ్రాన
పుట్టిందిరా ముసలమూ
కన్న తండ్రిని బోలి
కంటి రెప్పను మించి
కాపాడి రక్షించి
కనులనిచ్చిన సామి
కనులనే పొడిచాడురా
మహారాజు
కాని పని చేశాడురా

జరిగిందిరా మోసమూ
ఆంధ్రాన
పుట్టిందిరా ముసలమూ

అప్పుకుండా తనకు
అఖిల విద్యల నేర్పి
ఆంధ్ర సామ్రాట్టుగా
అభిషేక మొనరించి
మూరు రాయరగండ
జగనొబ్బ గండడని
విశ్వ విఖ్యాతునిగ
ఒనర చేసిన మంత్రి
కనులనే తీశాడురా
మహరాజు
కాని పని చేశాడురా

జరిగిందిరా మోసమూ
ఆంధ్రాన
పుట్టిందిరా ముసలమూ

పుత్రనష్టోన్మాద
పూరితుండౌ రేడు
భార్యా విధేయుడై
బధిరుడయ్యాడురా
గతమునే మరచాడు
మతిని గోల్పోయాడు
అధికార గర్వాన
అంధుడై పోయాడు

జరిగిందిరా మోసమూ
ఆంధ్రాన
పుట్టిందిరా ముసలమూ



మహారాజు ఇక పైన పాట వినలేకపోయాడు. ప్రపంచమే తల్లక్రిందులుగా కనిపించసాగింది. పాటలోని ఒక్కొక్క మాట అతని చెవులకు ఒక్కొక్క తూపులా తాకసాగింది. చెవులు రెండూ గట్టిగా మూసుకున్నాడు. కాని, ఆ పాట అతని హృదయంలోనించే ఉద్భవిస్తున్నదా అనిపించే స్థాయిలో అతని మనస్సులో జేగంట ధ్వనిలాగా మారుమ్రోగసాగింది. రోమ రోమాలూ నిక్కబొడుచుకో సాగాయి, ఆ పాట నాలకించటానికి చెవులు రిక్కించినట్లు.

ప్రజలంత ఎలుగెత్తి
"అక్రమం" "అక్రమం"
భవనరాజాలన్ని
"అక్రమం" "అక్రమం"
పర్వతాగ్రాలన్ని
"అక్రమం" "అక్రమం"
పంచ భూతాలన్ని
"అక్రమం" "అక్రమం"
ప్రకృతే గొంతెత్తి
"అక్రమం" "అక్రమం"
అనుచు ఆక్రోశించినా
మనసు మారా లేదురా
మహరాజు
మనసు మారా లేదురా

జరిగిందిరా మోసమూ
ఆంధ్రాన
పుట్టిందిరా ముసలమూ

మహారాజు నిలువెల్లా కంపించిపోతున్నాడు. అంతటి భయంకర ళయ సమయంలో కూడా ఆయన ముఖమంతా స్వేద బిందువులతో ండిపోయింది. నేత్రాలలో భయం గోచరించింది. పంచభూతాలూ ృంభించి ప్రళయ తాండవం చేస్తూ వికటాట్టహాసం గావిస్తున్నట్టు,

దిక్కులన్నీ "అక్రమం! అక్రమం!!" అని ఘోషిస్తున్నట్లు అనిపించింది.

ఇంతలో మరింత ఉచ్ఛస్థాయిలో పాట వినిపించసాగింది.

న్యాయంబు ధర్మంబు
నాశనమ్మైపోయి
ఆంధ్ర సామ్రాజ్యంబు
అంతరించే రోజు వొచ్చిందిరా

తుంగభద్రా తల్లి
కన్నీటి వెల్లువల
విజయనగరం మునుగు రోజొచ్చిందిరా

ఋష్య మూకం-పగిలి
చండ ప్రచండమై
అగ్ని కణముల గ్రక్కు రోజొచ్చిందిరా

పంపావతీ నేత్ర
జ్వాలలన్ ప్రజలెల్ల
భస్మమైపోవు రోజొచ్చిందిరా....
భస్మమైపోవు రోజొచ్చిందిరా.... ....

ఆ పాట మహారాజు హృదయాన్ని దహించి వేసింది. ప్రపంచాన్ని చూడటానికి భయం వేసింది. ప్రకృతిని తిలకించటానికి సిగ్గు వేసింది. కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. అయినా, అతని చెవులలో ఆ పాట గింగురుమంటూనే ఉంది. కళ్లూ, చెవులూ మూసుకున్నా - ఆ పాటకు అతని శరీరంలోని ప్రతి భాగం ప్రతిధ్వనిస్తున్నది.

కళ్ళు మెల్లగా తెరిచాడు మహారాజు. ఎదురుగా అల్లంత దూరాన, ఓ పదిహేను సంవత్సరాల బాలుడు నదీగర్భాన ఉన్న బండలమీద నుంచి లంఘిస్తూ, తుంగభద్రలో ఉద్భవించిన దేవతామూర్తిలా వొస్తున్నాడు. బహుశా ఆ పాట పాడింది అతడేనేమో! అవును. సందేహం లేదు. అతడే! అదిగో- "జరిగిందిరా మోసమూ! ఆంధ్రాన పుట్టిందిరా ముసలమూ!" అంటూ పాడుతున్నాడు.



మహారాజు అతణ్ణి సమీపించాడు. బాలుడు ఆగిపోయి, మహారాజు వంక పరిశీలనగా చూశాడు.

"నీ పేరేమిటి ?"

"మాధవుడు."

"మాధవుడా ?" మహారాజు నిర్ఘాంతపోయాడు. అతని మనస్సులో ఏదో ఊహ మెరుపులా మెరిసింది.

"ఆ పాట పాడింది నువ్వేనా !"

"ఏం !"

"అంహుం! ఏమీ లేదు. నీ కెవరు నేర్పారోనని."

"ఒకరు నేర్పటమేమిటి? ఛీ! ఛీ! నే నే పాడేశాను నోటికి వచ్చినట్లు."

"అలాగా !"

"ఏం, పాట బాగుందా? మళ్ళీ పాడమంటారేమిటి"" అన్నాడు మాధవుడు.

"వద్దు! వద్దు! ఆ పాట నేను వినలేను - ఆపాట నేను వినలేను."

"అయితే, మరో పాట పాడమంటావా ?"

మహారాజు బాలుడి వంక చూశాడు.

ఇది అక్రమ మన్యాయం
ఇది అధర్మ మమానుషం
ఇది రాక్షస రాజ్యాంగం
ఇది ఘోర పైశాచిక న్యాయం ....
ఇది సత్యానికి సమాధి
ఇది అధర్మ దిగ్విజయం
ఇది ఘోరం ఇది నేరం
అది దారుణ దురంహకారం
ఇది దారుణ మారణ హోమం ....

జరిగిందంతా మోసమూ
ఆంధ్రాన
పట్టిందిరా ముసలమూ

పాట అయిపోయింది.

మాధవుడు తల ఎత్తి చూశాడు.

మహారాజు అల్లంత దూరాన పరుగెత్తి పోతున్నాడు.

## 11

ఆ భయంకరమైన కాళరాత్రి గమనంలో నాల్గవ యామం ప్రవేశించింది. నగరమంతా మహామంత్రి శిక్షకు సంబంధించిన విషయాలతో, రాజకుమారుడి హత్యకు సంబంధించిన కథలతో అట్టుడికినట్టుడికిపోతోంది. కోట లోపల కూడా రక్షక భటులూ, రాజోద్యోగులూ, దండనాథులూ హడావుడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు. ఇద్దరు వ్యక్తులు తటస్థ పడినప్పుడల్లా నిశ్శబ్దంగా ఏ చెట్టు చాటునో, పుట్ట మాటునో చెవులు కొరుక్కుంటున్నా - బహిరంగంగా ఒకరితో ఒకరు మాట్లాడక పోవటం వల్ల కోటంతా ప్రశాంతంగానే కనిపిస్తున్నది.

కోటలో రాజప్రాసాదానికి ఈశాన్య దిశగా, దాదాపు వెయ్యిగజాల దూరంలో ఒక భవనం ఉంది. ఆ భవనాన్ని రాజకీయ ఖైదీల కోసం - ప్రత్యేకమైన పద్ధతిలో నిర్మింప చేశాడు మహామంత్రి. అతి దృఢంగా నిర్మింపబడ్డ ఆ కఠిన శిలానిర్మిత కారాగృహానికి ఒకే ఒక సింహద్వారం ఉంది. ఆ ద్వారాన్ని లోపలనుంచీ, బయటినించీ కూడా తాళం వేసి బంధించవొచ్చు. దాని తాళాలు మహారాజుకు అత్యంత విశ్వాసపాత్రులైన కాపలావాళ్ళ దగ్గర ఉంటాయి. కాపలావాళ్ళు అంచెలవారీగా రాత్రింబవళ్ళు ఆ భవనానికి కాపలా కాస్తుంటారు - లోపల ఖైదీ ఉన్నా, లేకపోయినా. కాపలావాళ్ళు లోపలి వ్యక్తిని పరిశీలించటానికి వీలుగా భవన ద్వారం ప్రక్కనే ఒక అరడుగు కైవారం గల రంధ్రం ఉంది గోడలో. దాని గుండా వెలుపలివాళ్ళు లోపలి వ్యక్తి ఏం చేస్తున్నదీ ఎప్పుడు కావాలంటే



అప్పుడు చూడవొచ్చు. అది రాజకీయ ఖైదీలను ఉంచే ప్రత్యేక కట్టడం కావటం వల్ల సాధారణంగా మహారాజు గాని, మహామంత్రి గాని అక్కడికి స్వయంగా వస్తేనో, లేక తమకు అనుమానాస్పదమైన విషయం లోపల జరుగుతున్నదని అనుమానంగా ఉంటేనో తప్ప వారు సాధారణంగా తాళాలు తియ్యరు.

నాల్గవ యామారంభంలో అంతవరకూ కాపలా కాస్తున్న సిపాయి వెళ్ళిపోయి కొత్త సిపాయి వొచ్చాడు ఆ స్థానంలోకి. లోపల ఏదో శబ్దమైనట్లు వినిపించిందతనికి. ద్వారబంధం ప్రక్కనున్న రంధ్రంలోనించి లోపలకు చూశాడు. ఎవరో ఒక ఖైదీ అస్థిమితంగా అటూ-ఇటూ పచార్లు చేస్తుండటం కనిపించిందతనికి. తాళంతీసి గదిలో ప్రవేశించి, మళ్ళీ తాళం బిగించి ఖైదీ చేరువకు వచ్చాడు. కాపలా వాడి కాలి సవ్వడి విన్న ఖైదీ తల త్రిప్పకుండానే ప్రశ్నించాడు—

"ఎవరది?" అతని కంఠంలో రాజసం ధ్వనించింది.

"కాపలావాణ్ని."

"ఏం పని మీద వొచ్చావ్?"

"తమకు నిద్ర పట్టనట్లుంది. అస్థిమితంగా తిరుగుతున్నారు" అన్నాడు కాపలావాడు.

అక్కడ బంధింపబడే వాళ్ళందరూ రాజులో, రాజబంధువులో కావడంవల్ల కాపలావాళ్ళు ఖైదీలకు మర్యాద ఇవ్వటం ఆ కారాగృహంలో ఒక ప్రత్యేక ఆచారం.

"బందితుడికి కారాగృహంలో తిరిగే స్వేచ్ఛ కూడా లేదా?"

"లేదని కాదు కాని, అలా తిరిగేవారిని వేయి కండ్లతో కనిపెట్టమని మహామంత్రిగారి ఆజ్ఞ."

కాపలావాడి సమాధానానికి ఖైదీకి పెద్దపెట్టున నవ్వు వొచ్చింది. "హహ్హహ్హహా! మహామంత్రి! కొద్ది క్షణాల క్రితం యావదాంధ్ర సామ్రాజ్యానికి అతడు మహామంత్రి!"

ఆ వికట హాసానికి కాపలావాడు గంభీరంగా సమాధానం ఇచ్చాడు. "చాలా పొరపాటు పడుతున్నారు. ఆ మహనీయుడికన్నా సమున్నతిలో ఆ

పదవిని నిర్వహించే మేధావి ఉద్భవించే వరకూ ఆంధ్రదేశ చరిత్రలోనే కాదు, యావద్భారత దేశ చరిత్రలోనే వారొక్కరే మహామంత్రి."

"రాజ విశ్వాసాన్ని కోల్పోయినవాడు మహామంత్రి ఎలా ఔతాడు?"

"ప్రజా విశ్వాసాన్ని కోల్పోలేదు గనక."

"యథా రాజా, తథా ప్రజా!"

"కాదు. రాజదృష్టిలో నేడాయన మహామంత్రి కాకపోవచ్చు. కాని, ఆంధ్ర ప్రజా హృదయ పీఠం పైన ఆసీనుడైన ఆయన్ను ఏ రాజశాసనం క్రిందికి పడదోయగలదు?" అన్నాడు కాపలావాడు ఒక విధమైన జిజ్ఞాసతో.

"నీవు రాజద్రోహివాయేం?" ప్రశ్నించాడు ఖైదీ ఆ సమాధానం వినటంతోటే.

"వాస్తవాన్ని ఒప్పుకోవటమే రాజద్రోహమా?"

"ఏమిటా వాస్తవం?"

"నరసరాయలవారి బిడ్డడు, జననిమాత్ర విశేషం చేత కేవలం ఒక దాసీ పుత్రుడు-కృష్ణదేవరాయలు ఈనాడు మూరురాయగండ, జగనొబ్బ గండ శ్రీ శ్రీ శ్రీ కృష్ణదేవరాయ భూపాలుడు! ఎలా అయినాడెంత వాడు?"

"నీ ఉద్దేశం?" అన్నాడు ఖైదీ కాపలావాడి భావాన్ని గ్రహించటానికి ప్రయత్నిస్తూ.

"ఆనాడు మహామంత్రి పట్టమహిషి ఆజ్ఞను శిరసావహించి పొత్తిళ్ళలోని ఆ పసికూన కనులు పెరకివేసిన ఈనాటి కృష్ణరాయభూపాలుడు "అన్నమో రామచంద్రా!" అంటూ భిక్షాటన వృత్తిగా జీవింపవలసినవాడు."

కాపలావాడు చెప్పుకుపోతుంటే ఖైదీ కళ్ళు చెమ్మగిల్లాయి.

"నీకా సంఘటన ఇంకా గుర్తున్నదన్నమాట?" అన్నాడు ఖైదీ.

"ఎంతమాట! చేసిన మేలు మరచిపోవటానికి మేమేం రాజ వంశంలో జన్మించామా? ఆ విషయం ఆంధ్రదేశంలోని ఆబాలగోపాలానికీ తెలుసు. తరతరాలుగా ఇంటింటా చెప్పుకుంటారు."

"దీన్ని గురించా?"



"దీన్ని గురించే కాదు; కళ్ళు పెరకమని చేతికిచ్చిన పసివాడి పైన జాలిగొని, మేక కనులు చూపి మహారాణిని మభ్యపెట్టి, రక్షించి, పెంచి, పెద్దచేసి, గురుడై, సఖుడై అమాత్యుడై, సకల సామ్రాజ్యాభిషిక్తుణ్ణి చేసినందుకు ప్రతిగా రాయలవారు మహామంత్రిని కృతఘ్నులై కనులు పెరకించి చంపించారని."

ఖైదీ కాపలావాడి మాటలాలకించి ఒక్క క్షణం ఆలోచించాడు. ఆ పైన ఇలా అన్నాడు: "మహారాజు నిర్ణయం న్యాయ సమ్మతం. మీ మహామంత్రి చేసిన నేరాన్ని న్యాయశాస్త్ర సమ్మతంగా విచారించాడు. అన్నపూర్ణాదేవిగారి వంటి అంతఃపురాంగన స్వయంగా సాక్ష్యమిచ్చి నేరాన్ని ఋజువు చేసింది. తిమ్మరుసు శిక్షింపబడ్డాడు."

"ఎవరు మీరు?"

"ఖైదీని."

"మహామంత్రిని పేరు పెట్టి పిలిచే ధైర్యం మీకు...... ......"

"పదభ్రష్టుడు. మహామంత్రిట! మహామంత్రి!"

"కావచ్చు. కాని, రాయలవారు సైతం ఆయన్ను ఈనాటికీ అప్పాజీ అనిగాక, వేరొక విధంగా పిలువగలరా?" కాపలావాడి కంఠం దీనంగా ధ్వనించింది.

"అది వాస్తవానికి సంబంధించిన విషయం," అన్నాడు ఖైదీ.

"ఔను. వాస్తవంగా మరోలా పిలువలేరు మహారాజు. నాకు తెలుసు. అప్పాజీని అప్పాజీ అని కాక, వేరు విధంగా సంబోధించ వలసి వచ్చిననాడు మహారాజుకు వేరే నరకం లేదు." కాపలావాడి కంఠం గాద్గదికమైంది. ఖైదీ అతడు కాపలావాడుగా ఉండ తగడనుకున్నాడు. ప్రస్తావనను మార్చివేశాడు ఖైదీ.

"అసలు మీ మహామంత్రిని ఎందుకు శిక్షించారో తెలుసా? ఆయన రాజకుమారుణ్ణి హత్య చేశాడు."

"అసంభవం. నేను నమ్మను." అన్నాడు కాపలావాడు విపరీతమైన నమ్మకంతో.

"నమ్మ-నమ్మకపో! అది రాజాస్థానంలో జరిగిన న్యాయనిర్ణయం. మీ మహామంత్రి హత్య చేశాడు."

"దానికి కారణం?" కాపలావాడు అయోమయపూరితమైన ఆశ్చర్యాన్ని ప్రకటించాడు. ఖైదీ జవాబు చెప్పాడు—

"తాను స్వహస్తాలతో పెంచి, వృద్ధి చేసి వ్యాప్తి నొందించిన ఈ ఆంధ్ర సామ్రాజ్యం సంతానరహితుడయిన రాయల అనంతరం తనకు వంశానుక్రమంగా దత్తమైపోతుందని ఆశించాడు మీ మహామంత్రి. కాని, తద్భిన్నంగా రాయలవారికి సుపుత్రప్రాప్తి కలిగింది తన దారిని నిష్కంటకం చేసుకోటానికి ఆ శల్యాన్ని పెరికివేశాడు. మీ మహామంత్రి. అంతే! కాని, కానికాలం వచ్చింది కట్టుబడ్డాడు; ఫలితం అనుభవిస్తున్నాడు."

ఖైదీ చెప్పిన కారణాలు కాపలావాడికి సంతృప్తి నిచ్చినట్లు లేదు. అతడు పెదవి విరుస్తూ—

"ఫలితం.... నిర్దోషిని శిక్షించిన నేరానికి మహారాజు కూడా ఫలితం అనుభవిస్తాడు!" అన్నాడు.

"ఏం?-మేము చెప్పింది నమ్మలేక పోతున్నావా?"

"ఎలా నమ్మటం? కోరినంత మాత్రాన మహద్భాగ్యమని భావించి, ఈ యావదాంధ్ర సామ్రాజ్యాన్ని తనకు ధారాదత్తం చేయరా, రాయలవారు? ఈపాటి దానికోసం మహామంత్రి రాకుమారుని హత్య చేశారంటే ఎవరు నమ్ముతారు?"

కాపలావాడికి తన మహామంత్రి మీద ఉన్న విశ్వాసానికి ఖైదీ విస్తుపోయాడు. ఒక్క క్షణం ఆగి కాపలావాడి వంక తిరిగి—"మంచిది. మీ మహామంత్రి నెప్పుడయినా చూచావా?" అని ప్రశ్నించాడు ఖైదీ. కాపలావాడి ముఖాన్ని పరిశీలిస్తూ.

కాపలావాడు తల వొంచుకొని సమాధానం చెప్పాడు—

"చూచాను. బహుశః చాలాసార్లు చూసి ఉంటాను. ఆయన వద్ద నుంచి అమూల్యమైన విషయాలు అనేకం నేర్చుకున్నాను కూడా."



"ఆయనకు నీతో పరిచయం ఉందన్న మాట?" ఖైదీ సాగదీశాడు. కాపలావాడిలో ఒక విచిత్రానుభూతి కలిగింది.

"లేదు, లేదు. ఆంధ్రదేశంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆయన శిష్యరికం చెయ్యని వాడెవడున్నాడు?"

"ఏకలవ్యుడివి నీకు మీ మహామంత్రి మీద వల్లమాలిన అభిమానం." ఖైదీ కాపలావాణ్ణి అభినందించాడు.

"ఆంధ్రదేశంలో లేని దెవరికి? చేసిన పనికి మహారాజు కూడా మదనపడుతున్నారు."

"నీ కెలా తెలుసు?" ప్రశ్నించాడు ఖైదీ.

ఇంతలో కారాగృహ ద్వారం వద్ద అడుగుల చప్పుడయింది. అది విని కాపలావాడు—

"ఇష్- ఎవరో వస్తున్నారు." అన్నాడు ఖైదీని మాట్లాడవద్దని సంజ్ఞ చేస్తూ.

"కానీ! ఇందులో ఏముంది?" ఖైదీ మాటల్లో తెగించినవాడి ధోరణి కనిపించింది.

"ఏమో ఉందని కాదు. రాజసేవ కత్తిమీద సాము. ఏ మాత్రపు ఏమరుపాటు చూపినా, దారిన పోయే మృత్యువును కోరి తెచ్చుకోవటం అవుతుంది." అంటూ కాపలావాడు ఖైదీని వదిలి ద్వారం సమీపించాడు.

"నిజమే! ఆ మాత్రపు కట్టుదిట్టాలు ఉంటేనే కాని రాజతంత్రం నడవదూ? సామ్రాజ్యాలు నిలువవూ!" అనుకున్నాడు ఖైదీ.

కాపలావాడు కవాటాన్ని సమీపించి "ఎవరది?" అని ప్రశ్నించాడు.

అవతల నుండి "తలుపు తియ్" అనే అధికార స్వరం ధ్వనించింది.

వెంటనే ద్వారం ప్రక్కన ఉన్న రంధ్రంలోనించి బయట ఉన్న వారిని పరిశీలించాడు.

ఇద్దరు ఉన్నత రాజకీయోద్యోగులు. అందులో ఒకరు - ఆ చిన్న గవాక్షం ద్వారా రాజ ముద్రికను చూపించారు కాపలావాడికి.

కాపలావాడు ద్వారం తెరిచి వారిద్దరినీ ప్రవేశపెట్టి తరువాత మళ్ళీ తలుపులు మూసి తాళం వేసి వారిని అనుసరించాడు

ఆ ఆగంతకులిద్దరూ ఖైదీని సమీపించి. వొంగి ప్రణామం చేస్తూ 'వందే మహామంత్రీ' అన్నారు.

కాపలావాడు ఒక్క-క్షణం దిగ్భ్రాంతి చెందినట్లు కనిపించాడు.

వెంటనే ఖైదీ రెండు కాళ్ళూ పట్టుకొని "మహామంత్రీ! మహామంత్రీ! మిమ్మల్ని గుర్తించక చేసిన నా అనుచిత ప్రవర్తనను మన్నించండి, మహామంత్రీ!" అన్నాడు.

"ఏం చేశావని నాయనా, మన్నించటానికి?"

"కాదు, మహామంత్రీ! మీ ఎడల మహాపచారం చేశాను. మీరు హృదయ పూర్వకంగా క్షమించానంటే కాని నాకు శాంతి లేదు." కాపలా కంఠం రుద్ధమైంది.

అతణ్ణి రెండు చేతులతో లేవనెత్తుతూ – "లే, నాయనా! క్షమించే అర్హతను కోల్పోయినా. దాని వల్ల నీకు తృప్తి కలిగితే అలాగే క్షమిస్తున్నాం....' అంటూ మహామంత్రీ– ఆ ఆగంతకుల వంక తిరిగి– "మహాప్రభువులు, దండనాధులు! నిలబడ్డారేం! దయచేయండి" అన్నాడు.

ఆగంతకులలో ఒకరు మహారాజ సోదరుడు అచ్యుతదేవరాయలు రెండవవారు, సర్వ సేనాధిపతి రామలింగ నాయకులు.

మహామంత్రితో అనేక అత్యవసర రాచకార్యాలు ముచ్చటించాలని వొచ్చారు. కాని, పదభ్రష్టుడై ఆసన్నమరణంలో వున్న మహామంత్రి ప్రవర్తన– ఈ కొద్ది క్షణాల్లోనే సంపూర్ణంగా మారిపోవటం, పాత సంబంధ బాంధవ్యాలను మరచిపోయి తమతో క్రొత్త ధోరణిలో మాట్లాడటం వారికి నిజంగా కష్టం కలిగించింది.

"ఏ అపరాధం చేశాడని ఈ అచ్యుతరాయలను మీరు కూడా ఈ విధంగా బాధ పెడుతున్నారు అప్పాజీ" అన్నాడు అచ్యుతరాయలు వ్యధిత హృదయంతో.

"బాధ. నిజమే! అంతఃపురాలలో హంసతూలికా తల్పాల పైన శయనించే మీరు ఈ కఠిన శిలానిర్మిత కారాగృహంలో గడ్డి పరకల మీద



సుఖాశీనులెలా ఔతారు? కాని, క్షమించండి! ప్రస్తుతం నేను పదభ్రష్టుణ్ని. ఇంతకు మించిన మర్యాద చేయటం అసాధ్యం...." అంటూ మహామంత్రి తన దృష్టిని దండనాధుని వంకకు మళ్ళించి—"మహా దండనాయకా! ఇంకా అలాగే ఉన్నారేం? ఇప్పుడీ కళేబరాంతస్థితి జీవి మహామంత్రి కాదు. కేవలం ఒక సామాన్య ఖైదీ. తమరు సర్వ సేనాధిపతులు. సుఖాశీనులు కావొచ్చు...." అంటూ ప్రక్కనే ఉన్న శిలా వేదికను చూపించాడు.

మహామంత్రి మాటలు చెవులకు ములుకుల్లాగా గుచ్చుకోగా దండనాధుడు—

"మహామంత్రీ! నా జీవితంలో నేనొక్క మహామంత్రినే చూశాను. ఆ పదవి ఆయనకు ఒకరిచ్చింది కాదు – మరొకరు తీసివెయ్యటానికి. అది ఆయన స్వార్జితం," అన్నాడు.

"మహామంత్రి తిమ్మరుసయ్యవారి స్వార్జితం కట కటాలూ, కారాగృహమూ. హాహాహా?" మహామంత్రి వికటంగా నవ్వాడు. ఆ నవ్వు అచ్యుతుని హృదయంలో శోకాగ్నిని ప్రజ్వలింప చేసింది.

"ఎందుకప్పాజీ, ఇంత నిర్దయగా మాట్లాడుతున్నారు? ఏ తప్పు చేశామని?" అన్నాడు అచ్యుతుడు దీనంగా. మహామంత్రికి కూడా తాను క్రూరంగా ప్రవర్తిస్తున్నానేమో అని అనుమానం కలిగి అనునయించాడు.

"నిర్దయ కాదు, నాయనా! మా జీవితంప రిసమాప్తి ఘడియల్లో ఉంది. కొద్ది క్షణాల్లో మీ అప్పాజీ అంధుడౌతాడు. ఆ తరువాత అతని బ్రతుకే దుర్భరమైపోతుంది. పాంచ భౌతికమైన అతని శరీరం పంచ భూతాలలో కలిసి పోతుంది. నా ఎనభై సంవత్సరాల జీవితంలో ఇహం కోసం ప్రాకులాడటమే తప్ప, ఇంతవరకూ పరం సంగతి ఆలోచించ లేదు. పరమేశ్వరుణ్ణి తలచలేదు. నిజానికి అందుకు నాకు తీరిక లేక పోయింది, అందుకే ఈ కొద్ది క్షణాలన్నా ఈ రాజకీయాలను విస్మరించి

ఆముష్మిక చింతలో గడపాలని ఏకాంతాన్ని వాంఛిస్తున్నామే కాని, మీరు తప్పు చేశారని కాదు నాయనా!"

"కాని, నేనూ తప్పు చేశాను. క్షణమాత్ర పూర్వాపర విచక్షణా విజ్ఞానహీనుడైన శ్రీకృష్ణరాయలకు సోదరుడనై జన్మించటమే నా తప్పు. అప్పాజీ!" అన్నాడచ్యుతుడు.

"అలాంటి మహారాజు వద్ద ఊడిగానికి ఒప్పుకోవటమే నా తప్పు మహామంత్రీ!" అన్నాడు దండనాధుడు.

వారికి సమాధానంగా — "తప్పులకు ఏం వచ్చిందిలే! దోష భూయిష్ఠమైన ఈ ప్రపంచాన మనుగడే ఒక పెద్ద తప్పు...." అంటూ మహామంత్రి — "అ! ఇంతకూ తమరు వచ్చిన పని?" అన్నాడు సాభిప్రాయంగా,

"మిమ్మల్ని ఒక్కసారి చూచి...."

"హూ! చూశారుగా!" అన్నాడు మహామంత్రి వచ్చిన పని అయిపోయింది కాబట్టి, వెళ్ళిపోవచ్చని హెచ్చరిస్తూ.

"అప్పాజీ! మరో సందర్భంలో అయితే తమ ఆజ్ఞను శిరసా వహించి ఉండేవాణ్ణి." అన్నాడు అచ్యుతుడు.

"అంటే, ఇప్పుడు అప్పాజీ మహామంత్రి కాడు, అంతేనా." రెట్టించాడు మహామంత్రి. ఆ ప్రశ్నకు ఎదురు చెప్పే సాహసం అచ్యుతుడికి లేకపోయింది, రామలింగనాయకుడు సమాధానం చెప్పటానికి ప్రయత్నించాడు.

"క్షమించండి, మహామంత్రీ, మీకు కష్టం కలిగించటం మా ఉద్దేశం కాదు. కాని, మీరు ఈ కారాగృహంలో ఈ విధంగా ఉండటం...."

"దాని కొరకు విచారించకండి. సర్వసేనాధిపతీ! చేసిన పాపం అనుభవిస్తే కాని తరుగదు. మేము చేసినవన్నీ పాపాలే!" అన్నాడు మహామంత్రి గత చరిత్రను గుర్తుకు తెచ్చుకుంటూ.

"అవును. పాముకు పాలుపోసి పెంచారు." కాపలావాడి నోటి నుంచి అప్రయత్నంగా వెలువడింది ఈ వాక్యం.

"సిపాయీ!" గర్జించాడు మహామంత్రి.



అప్పుడు కాని అర్థం కాలేదచ్యుతరాయలకు తమ సంభాషణను ఆలిస్తున్న మూడో వ్యక్తి అక్కడున్నాడని. వెంటనే కాపలావాడి వైపు తిరిగి — "సిపాయీ! నీ వింకా ఇక్కడే ఉన్నావనుకోలేదు. మేము మహామంత్రులతో ఏకాంతాన్ని వాంఛిస్తున్నాం," అన్నాడు అచ్యుతరాయలు.

"క్షమించండి. రాజకీయ ఖైదీలకు ఎవరితోనూ ఏకాంతం ఇవ్వకూడదని మహామంత్రులవారి ఆజ్ఞ!" కాపలావాడు సవినయంగా సమాధానం చెప్పి, రాజ సోదరులను కృణీకరించాడు.

"మహామంత్రీ!" అన్నాడు దండనాధుడు సాభిప్రాయంగా సిపాయి వంక కోర చూపు చూసి.

"ఉండనివ్వండి. ప్రమాదం ఏమీ లేదు," అన్నాడు మహామంత్రి సమాధానంగా.

"మీతో చాల విషయాలు మనవి చేసుకోవాలని వచ్చాం."

"చెయ్యండి. అయినా, కొద్ది క్షణాల్లో అంతరించబొయ్యే వారితో రాచకార్యాలేముంటాయ్? రహస్యాలేముంటాయ్."

"వీల్లేదు. అప్పాజీ! మీరీ విధంగా అంతరించటానికి వీల్లేదు!" అచ్యుతుడు కారాగృహం మారుమోగేటట్లు అరిచాడు.

"ఏమిటి నీ ఉద్దేశం, అచ్యుతరాయా?"

"క్షమించండి. దీన్ని స్వీకరించండి!...." అంటూ తాను భద్రంగా సేకరించిన రాజ ముద్రికను ఇవ్వబోయాడు మహామంత్రికి.

"ఏమిటది, అచ్యుతా?" అన్నాడు మహామంత్రి.

"రాజ ముద్రిక. అన్ని విషయాలూ తరువాత చూచుకోవచ్చు. ముందు దీని ఆధారంతో బయటికి చేరండి. రక్షణకు రామలింగ నాయకులు వెంట వస్తారు."

"వెర్రివాడా! నీకు యుక్తాయుక్త విచక్షణా పరిజ్ఞానం నశిస్తున్నది. మాకు పారిపోవాలనే ఉంటే, రాజ ముద్రిక కావాలా? రామలింగనాయకుల రక్షణ కావాలా? ఈ క్షణాన అయినా సరే, కృష్ణరాయలను త్రోసి రాజని యావదాంధ్ర సామ్రాజ్యాన్నీ మా కనుసన్నల పరిపాలించగల యుక్తి

ప్రపత్తులు మాకున్నాయి. కాని, మేము రాజద్రోహులం కాము, కాలేము!"
అచ్యుతుని పథకాన్ని నిరాకరించాడు మహామంత్రి.

దానితో నిరాశ చెందిన దండనాథుడు ఎదురు ప్రశ్న వేశాడు.

"ఆపద్ధర్మంలో ఆత్మ సంరక్షణకు పారిపోవటం రాజద్రోహమెలా అవుతుంది, మహామంత్రీ?"

"శాసనధిక్కారం ఏ పరిస్థితిలో జరిగినా రాజద్రోహమే! అయినా, మా రాయలు మమ్ము కాదన్న తరువాత ఎవరి కోసం బ్రతకాలి - పారిపోతూ బ్రతుకు?"

"అయితే, తమరీ విధంగానే అంతం కావటానికి నిశ్చయించుకున్నారా, మహామంత్రీ!" అన్నాడు ఖిన్నుడై దండనాథుడు.

"అది రాజశాసనం."

"మీరు సజీవులుగా వర్థిల్లటం ప్రజాభీష్టం" అన్నాడు ఆవేశంతో అచ్యుతుడు.

"ప్రజ.... తెలియని వారు మహామంత్రిని ప్రజామంత్రి అంటారు. కాని, రాయలు నా రాజు. నేనేం చేసినా, నా రాజు కోసం చేశాను ప్రధానంగా. ప్రజలు మా దృష్టిలో కడపంక్తి భోక్తలు."

"కాని, మీరు వారి హృదయాధినేతలు, అప్పాజీ" అన్న అచ్యుతుడి మాటలను బలపరుస్తూ, "సకల సామంతులూ - దండనాథులూ, చతురంగ దళాధినేతలూ ఈనాడు తమ ఆజ్ఞల కోసం ఎదురుచూస్తున్నారు, మహామంత్రీ" అన్నాడు ప్రధాన దండనాథుడు. మహామంత్రి ఒక్క క్షణం ఆలోచించాడు.

"కావచ్చు. అందుకనే కావొచ్చు - మమ్మల్ని మహారాజు రాజద్రోహిగా నిర్ణయించింది కాని, ఐచ్ఛికంగా దాని కొరకు వాంఛించి ప్రయత్నించిందీ లేదు; ఆ పరిస్థితికి మేము బాధ్యులమూ కాము."

"న్యాయవిచక్షణలో కొంత పొరపాటు జరిగినా, మహారాజు అంత అసూయాగ్రస్తుడు కాడు, మహామంత్రి!" అన్నాడు కాపలావాడు. వాడి మాటలు వినగానే అచ్యుతరాయలు కాపలా వాడి వంక చురచుర చూస్తూ-

"రాజ్యాంగరహస్యం మహా తెలిసినవాడివి. హుఁ! అతడొక గోముఖ



వ్యాఘ్రం! మూర్తీభవించిన కృతఘ్నతా స్వరూపం." అన్నాడు.

అచ్యుతుడి మాటలకు మహామంత్రి మనస్సు చాల కష్టపడింది.

"అచ్యుతరాయా! ఎవరనుకున్నావ్ - రాయలు? నీకు అగ్రజుడు; ఆ పైని సార్వభౌముడు."

"అగ్రజుడు!" అన్నాడు అచ్యుతుడు కటువుగా. ఒకనాడు శ్రీకృష్ణదేవరాయలకు సోదరుడనై జన్మించటమే నా భాగ్యమనుకున్నాను. కాని, ఈనాడు 'అన్నా!' అని పిలవటానికే అభిమానపడుతున్నాను."

"అచ్యుతరాయా! క్రూరతనంలో మంచి-చెడ్డలు మరచిపోయి అవధులు దాటి మాట్లాడుతున్నావ్. మహాదండనాయకా! పెద్దవాడివి నీవైనా చెప్పవేం?" అన్నాడు మహామంత్రి దండనాథుడి వంక తిరిగి.

"ఏం చెప్పమంటారు, మహామంత్రీ? మీరు మమ్మల్ని పెంచారు. మేమే కాదు; ఈ ఆంధ్ర సామ్రాజ్యమే తమ రక్షణలో రూపురేఖా విలాసాలు పొంది, దిన-దినప్రవర్థమానమై ఈనాటికి అద్వితీయం అయింది. అలాంటి మిమ్మల్ని రక్షించుకోవటానికి ఎంత నెత్తురు చిందించటానికైనా సరే- ఏ మాత్రం వెనుదీసినా, ప్రపంచం మమ్మల్ని కృతఘ్నుల క్రింద జమ కడుతుంది, మహామంత్రీ?"

"విప్లవానికి నాందీప్రస్తావన చేస్తున్నారా, సేనాధిపతీ?" మహామంత్రి కంఠం గంభీరంగా ధ్వనించింది.

"క్షమించండి నా ఉద్దేశం- మీరు ఏ విధంగానైనా సజీవులుగా వర్థిల్లాలని."

"వెర్రివాడా! రాజశాసనాన్ని మహామంత్రే ధిక్కరిస్తే. దేశంలో వేరే అరాజకం ఉంటుందా?"

"అందుకని ఒక అమూల్య ప్రాణాన్ని అంతం చేసుకుంటామా, మహామంత్రీ?"

"ఔను. దేశం కోసం! అన్నాడు మహామంత్రి. "అయినా, ఈ పరిస్థితిలో మీరేం చెయ్యాలని మీ ఉద్దేశ్యం?"

"మీరు ఆజ్ఞ ఇవ్వండి, అప్పాజీ." అన్నాడు వెంటనే అచ్యుతుడు.

అతను మహామంత్రి నించి ఇలాంటి ప్రశ్న కోసమే ఎదురు చూస్తున్నాడు.

"ఏం చేస్తావు నాయనా?" మహామంత్రి మృదువుగా ప్రశ్నించాడు.

"ఏం చేస్తానా? మీరే చూస్తారుగా! మూడు క్షణాల్లో జగదేక వీరుడైన మూరు రాయర గండడు తమకు పాదాక్రాంతుడౌతాడు."

ఈ సమాధానం మహామంత్రి కలలో కూడా ఆశించనిది.

"రాజద్రోహమా?"

"మీరు వానిని క్షమించి, రక్షించి విడిచి పెట్టవొచ్చు. పశ్చాత్తాప్తుడైన రాయలు మిమ్మల్ని తప్పకుండా ఆదరిస్తాడు. మీరు మళ్ళీ మహామంత్రి కావొచ్చు," అన్నాడు అచ్యుతుడు ఆశతో మహామంత్రిని పరికిస్తూ.

దానికి సమాధానంగా "లాభం లేదు. విరిగిపోయిన కొమ్మ తిరిగి అతుకోదు. ఎండి వాడి పోవాల్సిందే! నా రాయలు నేను సజీవుడుగా ఉండగా నా వద్దకు రాడు; రాలేడు. అసంభవం! అన్నాడు మహామంత్రి నిస్పృహతో.

"ప్రపంచంలో అసంభవమనేది ఏదీ లేదు అప్పాజీ! మీరు ఆజ్ఞ ఇవ్వండి. అసంభవాలు సంభవాలుగా మారుతాయి!"

మహామంత్రిలో మథన అధికమయింది. మనిషి కంపించి పోతున్నాడు.

'ఏమని ఆజ్ఞ ఇవ్వాలి? ఈ నా స్వంత చేతుల మీదుగా, అల్లారు ముద్దుగా ఏ రాయలను పెంచి పెద్దచేసి, సకల సామ్రాజ్యానికీ సార్వభౌముణ్ణి చేశానో-ఆ రాయలను బంధించి, నా కాళ్ళ ముందు పడేయమని నేను ఆజ్ఞ ఇవ్వాలి. ఎవరైనా వింటే నవ్విపోతారు. సాటి దేశాలవారు అపహాస్యం చేస్తారు...." మహామంత్రికి ఆపైన మాట పెగల్లేదు.

"ఎవరు ఏమైనా అనుకోవచ్చు" రామలింగ నాయకుల కంఠంలో అధికార సహజమైన నిర్లక్ష్యం గోచరించింది. కాని, తమ మహామంత్రిని రక్షించుకోవటానికి చతురంగ బలాలు ఉవ్విళ్ళూరుతున్నాయ్. వాటి దృష్టిలో తమరొక్కరే మహామంత్రి. కలకాలం తమరే మహామంత్రిగా ఉండాలని వాటి వాంఛ."



"మాకు మంత్రి పదవి మీద మమకారం లేదు."

"కాని, వాటికి మీ మంత్రిత్వం మీద మమకారం ఉంది."

"దయచేసి మీ ఆజ్ఞ ఇవ్వండి." అచ్యుతుడు మళ్ళీ ప్రాధేయపడ్డాడు.

కాని, ఈసూటు కూడా మహామంత్రి నిర్ణయంలో మార్పు కనిపించ లేదు.

మహామంత్రి కర్కశంగా ప్రశ్నించాడు: "అచ్యుతరాయా! కృష్ణరాయల దృష్టిలో నేను పతితుణ్ణైనా రాయలు నా రాజు. రారాజు-అహర్నిశలూ కష్టపడి, నా మేధస్సుకు ప్రతిరూపంగా నిర్మించాను ఈ ఆంధ్ర సామ్రాజ్యాన్ని అనన్య సాధారణంగా. ఆ ఈ ఆంధ్ర సామ్రాజ్య రాజ్యాంగంలో చిచ్చు పెట్టి, అంతఃకలహాలు లేపి, స్మశాన భూమిని సృష్టించటానికి మళ్ళీ నా ఆజ్ఞే కావాలా?"

"ఈ చిచ్చుకు మీరు కాదు కారణభూతులు; ఈ చిచ్చును మా సహోదరులే స్వయంగా...." అంటూ తల ఎత్తి మహామంత్రిని చూసి అచ్యుతరాయలు మరి మాట్లాడలేకపోయాడు.

"కావాల్సింది కారణాన్వేషణ కాదు; ఫలితం! చిచ్చు పుట్టింది: దాన్ని ఆర్పివేయాలి గాని వీవన తీసుకు విసురుతామా?" ప్రశ్నించాడు మహామంత్రి.

"ఎలా ఆర్పాలో మీరే సెలవీయండి మహామంత్రీ!" అన్నాడు రామలింగ నాయకుడు.

"చెప్తే చేస్తారా?"

"మీ మాటకేనాడైనా ఎదురు ఉందా, అప్పాజీ?"

"ఈ నాడు కూడా...?" అన్నాడు మహామంత్రి తన ప్రస్తుత స్థితిని జ్ఞాపకం చేస్తూ

"తమరు మా దృష్టిలో సర్వదా మహామంత్రులే! తమ ఆజ్ఞ మాకు సర్వదా శిరోధార్యం." సేనాని వాక్కులలో అచంచల విశ్వాసం గోచరించింది.

"ఈ చిచ్చుకు ఎవరయినా కారణభూతులు కావొచ్చు. కాని,

ఆర్పివేయటానికి ఒక్కటే మార్గం. అంతఃకలహాలు అంతరించటానికి ఏకైక మార్గం. అది తిమ్మరుసయ్య మరణం." మహామంత్రి గంభీర స్వరంతో మార్గాన్ని సూచించాడు.

ఆ నిర్ణయం అక్కడ ఉన్న ముగ్గురి చెవులకూ కర్ణ కఠోరంగా తోచింది. ఒక్కసారిగా "అప్పాజీ!" అన్నారు ముక్తకంఠంతో ఆవేశ పూరితులై. ఆ ధ్వనికి కారాగృహం దద్దరిల్లినట్లయింది. కాని, మహామంత్రి చెప్పుకుపోతున్నాడు—

"మమ్మల్ని ప్రశాంతంగా మరణించనియ్యండి. వయస్సు ఎనభై సంవత్సరాలు. బుద్ధి మందగించింది. బ్రతికి సాధించాల్సింది శూన్యం. పండిన పండు ఏనాడో నేల రాలక తప్పదు. ఈనాడే రాలిపోతే ఆంధ్ర సామ్రాజ్యంలో శాంతి స్థాపన జరుగుతుంది. కలహ జ్వాలను తుద ముట్టించి, మా మరణం అన్ని విధాల సత్ఫలితాలకే దారి తీస్తుంది. సుఖాంత మౌతుంది."

"అవాంఛనీయ మార్గాల ద్వారా వొచ్చే సత్ఫలితాలు వొచ్చినా ఒకటే, రాకున్నా వొకటే. మహామంత్రి." అన్నాడు దండనాథుడు.

అతని వంక తీక్షణంగా చూస్తూ మహామంత్రి—

"మాటకు కట్టుబడరా?" అని సూటిగా ప్రశ్నించాడు.

ఆయనను చూడటానికి ముఖం చెల్లక అచ్యుతరాయలు తలవంచుకునే సమాధానం చెప్పాడు,

"మీరు కేవలం ధర్మమూర్తులు. అప్పాజీ!"

"మమ్మల్ని ధర్మమూర్తి అనుకున్నవాడు వెర్రివాడు. మేము చేసినవన్నీ అధర్మాలే! మహారాజు ఆజ్ఞకు వ్యతిరేకంగా కృష్ణరాయలను రక్షించటం ధర్మమా, రక్షించితిమి పో! అగ్రజాత్మజుడు వర్ధిల్లుచుండగా ఇతణ్ణి సింహాసనం ఎక్కించటం ధర్మమా? ఉదయగిరి ముట్టడి ధర్మమా? రాయచూరు విజయము ధర్మమా? కొండపల్లి దోపిడి ధర్మమా? అంతా రాజ తంత్రం.... నా రాజు కొలుకు నేను నడిపిన రాజతంత్రం."

మహామంత్రి వచనాల్లో వెలువడుతున్న ఆయన వ్యక్తిత్వానికి



ఆశ్చర్యపోతూ "నిజమే! కాని, రాయలవారు ఏరు దాటి తెప్ప తగుల పెట్టారు." అన్నాడు అచ్యుత రాయలు.

"రాయలవారు నాకు ఏమి చేశారనేది కాదు- ప్రశ్న. రాయలు నా రాజు- రారాజు. అతను లేనినాడు- ఈ ఆంధ్ర సామ్రాజ్య రమ అనాథ ఐపోతుంది. ఆంధ్రదేశ భవితవ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, మీరీ ప్రయత్నం విరమించండి. మీరు మాకిచ్చిన మాట నిలబెట్టుకోండి."

"కాని, మహామంత్రీ ...."

"మాటలు పెంచకండి! ఆడి తప్పటం అల్పుల లక్షణం. మంచిది- మీరు వచ్చిన పని అయిపోయిందనుకుంటాను."

"మహామంత్రీ!"

"మాటి-మాటికి మమ్మా పేరుతో పిలిచి బాధించకండి. ఇప్పుడు తిమ్మరుసు మహామంత్రి కాడు. కేవలం ఒక సామాన్య ఖైదీ. అంతే!"

"ఒక్కమాట...." అన్నాడు అచ్యుతుడు నీళ్ళు నములుతూ.

"ఒక్క మాట కూడా వినను. సిపాయీ! ప్రభువులకు దారి చూపు" అంటూ మహామంత్రి మొహం తప్పించి, నాలుగడుగులు పెడగా వేశాడు.

ఇక ఆయన నిర్ణయాన్ని మార్చటానికి పరమేష్ఠి దిగి రావాలను కున్నారు అచ్యుతరాయలూ, దండనాయకుడూ.

సవినయంగా వొంగి ప్రణామం చేసి, తిరిగి వెళ్ళిపోయారు-కార్యం సానుకూలం కాలేదనే బాధతో.

కాపలావాడు వారిని పంపించి, తలుపు తాళంవేసి తిరిగి వచ్చాడు.

"వారు వెళ్ళిపోయారు. మహామంత్రీ" అన్నాడు. కాపలావాడు.

మహామంత్రి వాడివంక చూడకుండానే- "తెలుసు. వారిని చూస్తే ఏమనిపిస్తోంది నీకు?" అని ప్రశ్నించాడు.

"కృతాజ్ఞతా మాధుర్యంతో నిండిన మానవత్వం మూర్తీభవించి నట్లు."

"అంతేనా?"

ఆర్పివేయటానికి ఒక్కటే మార్గం. అంతఃకలహాలు అంతరించటానికి ఏకైక మార్గం. అది తిమ్మరుసయ్య మరణం." మహామంత్రి గంభీర స్వరంతో మార్గాన్ని సూచించాడు.

ఆ నిర్ణయం అక్కడ ఉన్న ముగ్గురి చెవులకూ కర్ణ కఠోరంగా తోచింది. ఒక్కసారిగా "అప్పాజీ!" అన్నారు ముక్తకంఠంతో ఆవేశ పూరితులై. ఆ ధ్వనికి కారాగృహం దద్దరిల్లినట్లయింది. కాని, మహామంత్రి చెప్పుకుపోతున్నాడు—

"నన్నుల్ని ప్రశాంతంగా మరణించనియ్యండి. వయస్సు ఎనభై సంవత్సరాలు. బుద్ధి మందగించింది. బ్రతికి సాధించాల్సింది శూన్యం. పండిన పండు ఏనాడో నేల రాల్చక తప్పదు. ఈనాడే రాలిపోతే ఆంధ్ర సామ్రాజ్యంలో శాంతి స్థాపన జరుగుతుంది. కలహ జ్వాలను తుద ముట్టించి, నా మరణం అన్ని విధాల సత్ఫలితాలకే దారి తీస్తుంది. సుఖాంత మౌతుంది."

"అవాంఛనీయ మార్గాల ద్వారా వొచ్చే సత్ఫలితాలు వొచ్చినా ఒకటే, రాకున్నా వొకటే. మహామంత్రీ." అన్నాడు దండనాథుడు.

అతని వంక తీక్షణంగా చూస్తూ మహామంత్రి—

"మాటకు కట్టుబడరా?" అని సూటిగా ప్రశ్నించాడు.

ఆయనను చూడటానికి ముఖం చెల్లక అచ్యుతరాయలు తల వంచుకునే సమాధానం చెప్పాడు,

"మీరు కేవలం ధర్మమూర్తులు. అప్పాజీ!"

"నన్నుల్ని ధర్మమూర్తి అనుకున్నవాడు వెర్రివాడు. మేము చేసినవన్నీ అధర్మాలే! మహారాజు ఆజ్ఞకు వ్యతిరేకంగా కృష్ణరాయలను రక్షించటం ధర్మమా, రక్షించితిమి పో! అగ్రజాత్మజుడు వర్ధిల్లుచుండగా ఇతణ్ణి సింహాసనం ఎక్కించటం ధర్మమా? ఉదయగిరి ముట్టడి ధర్మమా? రాయచూరు విజయము ధర్మమా? కొండపల్లి దోపిడి ధర్మమా? అంతా రాజ తంత్రం.... నా రాజు కొలుకు నేను నడిపిన రాజతంత్రం."

మహామంత్రి వచనాల్లో వెలువడుతున్న ఆయన వ్యక్తిత్వానికి



ఆశ్చర్యపోతూ "నిజమే! కాని, రాయలవారు ఏరు దాటి తెప్ప తగుల పెట్టారు." అన్నాడు అచ్యుత రాయలు.

"రాయలవారు నాకు ఏమి చేశారనేది కాదు- ప్రశ్న. రాయలు నా రాజు- రారాజు. అతను లేనినాడు- ఈ ఆంధ్ర సామ్రాజ్యము అనాథ ఐపోతుంది. ఆంధ్రదేశ భవితవ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, మీరీ ప్రయత్నం విరమించండి. మీరు మాకిచ్చిన మాట నిలబెట్టుకోండి."

"కాని, మహామంత్రీ ...."

"మాటలు పెంచకండి! అది తప్పటం అల్పుల లక్షణం. మంచిది- మీరు వచ్చిన పని అయిపోయిందనుకుంటాను."

"మహామంత్రీ!"

"మాటి-మాటికి నన్నూ పేరుతో పిలిచి బాధించకండి. ఇప్పుడు తిమ్మరుసు మహామంత్రి కాడు. కేవలం ఒక సామాన్య ఖైదీ. అంతే!"

"ఒక్క-మాట...." అన్నాడు అచ్యుతుడు నీళ్ళు నములుతూ.

"ఒక్క- మాట కూడా వినను. సిపాయీ! ప్రభువులకు దారి చూపు" అంటూ మహామంత్రి ముఖం తప్పించి, నాలుగడుగులు పెడగా వేశాడు.

ఇక ఆయన నిర్ణయాన్ని మార్చటానికి పరమేష్ఠి దిగి రావాలను కున్నారు అచ్యుతరాయలూ, దండనాయకుడూ.

సవినయంగా వొంగి ప్రణామం చేసి, తిరిగి వెళ్ళిపోయారు-కార్యం సానుకూలం కాలేదనే బాధతో.

కాపలావాడు వారిని పంపించి, తలుపు తాళంవేసి తిరిగి వచ్చాడు.

"వారు వెళ్ళిపోయారు. మహామంత్రీ" అన్నాడు. కాపలావాడు.

మహామంత్రి వాడివంక చూడకుండానే- "తెలుసు. వారిని చూస్తే ఏమనిపిస్తోంది నీకు?" అని ప్రశ్నించాడు.

"కృతజ్ఞతా మాధుర్యంతో నిండిన మానవత్వం మూర్తీభవించి నట్లు."

"అంతేనా?"

"అంతే, మహామంత్రీ."

"కాదు. పాపం, అమాయకులు. తమకు తెలీకుండానే రాజద్రోహులుగా మారిపోతున్నారు." మహామంత్రి సానుభూతి వెల్లడించాడు.

"కాని, మీరు వారి కోరికను నిరాకరించరు."

"ఔను."

"వారి కోరికనే మీరు మన్నించి ఉంటే, కృష్ణరాయసార్వభౌములు తమకు పాదాక్రాంతులయ్యేవారు మరి కొన్ని క్షణాల్లో."

"అది మాకు ఏ మాత్రమూ సంతోషింపదగ్గ విషయం కాదు. సిపాయీ! మాకు రాజ్యకాంక్ష ఏ కించిత్తు వున్నా, ఈ ఆంధ్ర సామ్రాజ్యం ఏనాడో మాకు హస్తగతమయ్యేది. గోటితో త్రుంచివేయదగిన స్థితిలోనే రాయలవారిని అంతం చేసి ఉండేవారం. అల్పుడైన అరణ్ణి ఇంత బలిష్ఠునిగా చేసి, గొడ్డలిపెట్టుతో కాని కార్యాన్ని సాధించలేని స్థితికి తీసుకొని వచ్చేవారమే కాదు. రాయలు నా రాజు.

"మీ కాయన మీద విపరీతమైన ప్రేమ."

"ఔను."

"కాని, వారికి మీ మీద విపరీతమైన క్రోధం."

"ఎవరన్నారు?" అన్నాడు మహామంత్రి ఒక్కసారిగా. "క్రోధం కాదు; మాపై మోపబడిన శిశుహత్యా నేరం న్యాయశాస్త్ర సమ్మతంగా నిరూపితమైంది. రాయలుగా ఆత్మపుత్ర హంతకుడగు అప్పాజీని క్షమిస్తే క్షమించవచ్చు. కాని, న్యాయాన్ని ప్రసాదించే మహారాజుగా ఆయనలో వ్యక్తిగత అభిమాన దురభిమానాలకు తావులేదు."

ఇంతలో కారాగృహ ద్వారాన్ని ఎవరో తడుతున్న చప్పుడైంది. మహామంత్రి కాపలావాడి వైపు సాభిప్రాయంగా చూశాడు—అదెవరో చూడమన్నట్లు. కాపలావాడు ద్వారాన్ని సమీపించి గవాక్షం గుండా పరిశీలించాడు. ఆ తరువాత తలుపు తెరచుకొని వెలుపలికి వెళ్ళి— రెండు క్షణాల్లో తిరిగివచ్చి—

"గజదళాధిపతి నరసనాయకులు, అశ్విక దళాధిపతి తిమ్మప్ప



నాయకులు, మహారాజు అంగరక్షక దళాధిపతి విరూపాక్షప్ప తమ దర్శనార్థం వేచి ఉన్నారు," అని విన్నవించాడు మహామంత్రికి.

"ప్రస్తుతం వారిని చూడటానికి వీల్లేదు."

"వారు తమ తుది దర్శనమనే వాంఛిస్తున్నారు."

"నీకు తెలీదు సిపాయీ! తుది దర్శనమనే పేరుతో వారు వచ్చి చెయ్యబోయే హితబోధ ఏమిటో మాకు తెలుసు," అన్నాడు మహామంత్రి.

"అయినా.........." కాపలావాడు ఏమో చెప్పబోయాడు.

"నీవు కూడా మమ్మల్ని రాజద్రోహివి కమ్మని ప్రోత్సాహిస్తున్నావా?" మహామంత్రి కఠోరంగా ప్రశ్నించాడు.

"అది కాదు, మహామంత్రీ!"

"ఏది కాదు?"

"వారి కోరిక అంత తీసివేయదగింది కాదేమో?"

"సిపాయీ!" గర్జించాడు మహామంత్రి. "మా ఆజ్ఞకు ఎదురు చెబుతున్నావా? ఛీ! ఒక సామాన్య సైనికుని నుండి కూడా తిరస్కారం. ఔను; ఇప్పుడు తిమ్మరుసు మహామంత్రి కాడు; అతడిచ్చేవి ఆజ్ఞలు కావు," అన్నాడు మహామంత్రి క్షుభిత హృదయంతో.

"అపచారం చేశాను; క్షమించండి. మీ ఆదేశాలు అక్షరాలా అమలు జరుగుతాయి....." అంటూ వెళ్ళిపోయాడు కాపలావాడు. ఆ తరువాత నాలుగు క్షణాల్లో తిరిగి ప్రవేశించాడు.

"వారు వెళ్ళిపోయారా?" ప్రశ్నించాడు మహామంత్రి.

"లేదు, మహామంత్రీ."

"ఔను. వారు మాత్రం ఎందుకు వెళ్ళాలి? తిమ్మరుసు ఆజ్ఞలకు శాసనాధికారం అంతరించి చాలా కాలం అయింది."

"వారు తమ దర్శనానంతరం గాని కదలమని బయట నిరీక్షిస్తున్నారు."

"మంచిది—ఉండనీ! మా ప్రేత దర్శనమయినా కాకపోదు."

"తమరీ కఠిన శిలా నిర్మిత కారాగృహంలో ఉండటం వారికి ఏంత మాత్రం ఇష్టం లేదు, మహామంత్రీ!"

"వారికేం తెలుసు? ఎనభై వసంతాల జీవితంలో ఎన్నడూ లభించని విశ్రాంతి ఈనాడు లభిస్తున్నది. నిరంతర కల్లోలితమైన మామనస్సుకు-ఈ కారా గృహంలో ఆందోళనా రహితంగా, హాయిగా ఉంది," అన్నాడు మహామంత్రి నిట్టూరుస్తూ.

"తమ హృదయం ఆందోళనా రహితమైననాడు - ఆంధ్రదేశమే కల్లోల పూరితం ఔతుంది, మహామంత్రీ! ఈనాడు తమర్ని రక్షించటానికి ఆంధ్రసేనావాహిని తన యావచ్ఛక్తినీ వినియోగించబోతోంది."

"నా కొరకు-నా రాజు మీద తిరుగుబాటా?" ప్రశ్నించాడు మహామంత్రి-కాపలావాడు మోసుకొచ్చిన వార్తకు కొద్దిగా విస్తుపోయి.

"ఔను. ప్రస్తుతం సార్వభౌముడు ఏకాకి. ఆయనకున్న బలం ఒక్కటే—ఈనాటికీ చెదరని అప్పాజీవారి అండ!" కాపలావాడు తనకు తెలీకుండానే మహామంత్రిని అభినందించాడు.

"కాదు - సేనానులూ, సామంతులూ అనేకులు. చతురంగ బలాలు అనంతంగా ఉన్నాయ్ ఆంధ్ర సార్వభౌములకు,"

"కాని, అవన్నీ తమ ఆజ్ఞానుసారం ప్రవర్తిస్తున్నయ్."

మహామంత్రి ఒక్క క్షణం జిజ్ఞాసువులా కనిపించాడు. తరువాత "బహుశా ఆ విషయాన్ని రాయలవారు మమ్మల్ని రాజద్రోహిగా నిర్ణయించబోతూ ఊహించారేమో?" అన్నాడు.

"రాయల వారు అలా ఊహించారంటారా?" కాపలావాడు అనుమానాన్ని ప్రకటించాడు.

"కాని, చిత్రం! ఈ అనుమానం వారికి తెలీకుండానే వారిలో ప్రవేశించి శలలు వేసింది."

మళ్ళీ ద్వారం వద్ద తలుపు తట్టిన శబ్దం వినవొచ్చింది. కాపలావాడు కారాగృహం తాళం తీసి బయటికి వెళ్ళాడు. ఈ మాటు వొచ్చింది గోవిందరాయలు. మహామంత్రి ఏకైక పుత్రుడు. మహా వీరాధి వీరుడు. విజయనగర ప్రధాన దండనాథులలో ఒకడు. మహామంత్రికి శిక్ష విధించే సమయంలో గ్రామాంతరాన ఉన్నాడు. ఈ విషయం తెలిసి, ఆఘమేఘాల మీద విజయనగరం చేరి, కారాగృహం వద్ద అశ్వాన్ని అవరో



హించి తలుపు తట్టాడు. అతని ప్రక్కనే మిగిలిన అతి రథ ప్రముఖులు కూడా ఉన్నారు. కాపలావాడు తిరిగి వొచ్చి మహామంత్రికి మనవి చేశాడు.

"తమ కుమారులు గోవిందరాయలవారు."

"గోవిందరాయలా? అతడెందుకొచ్చాడిక్కడికి." మహామంత్రిలో కలిగిన విచిత్రమైన మార్పును గ్రహించాడు కాపలావాడు.

"తమ దర్శనార్థం."

"దర్శనం! దర్శనం! వాణ్ని చూడటానికి మాకిప్పుడు ఇష్టం లేదు. వాణ్ని అటే పంపెయ్!" అన్నాడు మహామంత్రి.

"తమ కుమారులు...."

"మా కుమారునన్న విషయం మా కన్నా నీ కెక్కువ తెలుసా? కాని, వాణ్ని ఇప్పుడు చూడదలుచుకోలేదు."

కాపలావాడు ఒక్క క్షణం యోచించాడు.

"క్షమించండి. తమ ఆజ్ఞను ధిక్కరిస్తున్నాను...." అంటూ సిపాయి ద్వారాన్ని సమీపించాడు.

"సిపాయీ!" మేఘ గర్జనగా ధ్వనించిన మహామంత్రి కంఠస్వరానికి ప్రత్యుత్తరంగా కాపలావాడు—

"అమాత్య పుత్రులను ప్రవేశ పెడుతున్నాను...." అంటూ తాళం తీశాడు.

ఒక్క ఉదుటున తలుపు త్రోసుకొని లోపల ప్రవేశించాడు. గోవిందరాయలు. "నాన్నగారూ! .... నాన్నగారూ." అన్నాడు శోకావేశంతో గాద్గదికమైన కంఠంతో.

మహామంత్రి కుమారుణ్ణి చూడలేదు. పెడమొహం పెట్టి-"గోవిందరాయా! నీ శీఘ్ర నిష్క్రమణం నీ జనకునకు సంతోషదాయకం కాగలదు" అన్నాడు.

"నాన్నగారూ! నన్నేనా మీరిలా అంటున్నది?" కొడుకు కంఠస్వరంలో ధ్వనించిన దీనత్వానికి మహామంత్రి చలించిపోయాడు. కంఠం గాద్గదికమైంది.

"నిన్ను కాదు నాయనా! విధి బలీయమైంది. ప్రపంచంలోని ఏ

శక్తికీ భయపడక బుద్ధిబలాన విధినైనా త్రోసి రాజన వచ్చునని విశ్వసించిన తిమ్మరుసు- ఈనాడు విధి విపరీత విషమ పరిణామాలకు అమూలాగ్రంగా కపించిపోతున్నాడు. సర్వ మమ కారాలూ చంపుకున్న మాకు నీ ముఖం చూపించి, మళ్ళీ బ్రతుకు మీద ఆశ రేపెట్టకు" అన్నాడు.

గోవిందరాయల కళ్ళవెంట కన్నీళ్ళు జలజలా రాలాయి. "నాన్నగారూ! చరమదశలో కూడా నా తండ్రి ముఖం చూచే భాగ్యం నాకు లేదా? అనంత శేముషి సంపన్నులగు మీకు ఆత్మజుడనై జన్మించి, తమ దివ్య శిక్షణలో సకల శాస్త్రాస్త్ర విద్యలందారితేరి, ఈ విజయనగర సామ్రాజ్య ప్రధాన దండనాయకులలో ముఖ్యుడనైన నాకు-నా తండ్రిని దర్శించే అవకాశం కూడా లేదా! నేనొక మహామంత్రికి ఎందుకు జన్మించాలి? నా తండ్రి ఒక మహామంత్రి ఎందుకు కావాలి? నా తండ్రి ఒక మహా...."

"గోవిందరాయా!" మహామంత్రి కుమారుడి వాగ్ధోరణిని అరికట్టాడు. "నీ తండ్రి తన సర్వశక్తి యుక్తులనూ ఆంధ్ర సామ్రాజ్య సంక్షేమం కొరకు వినియోగించటానికే మహామంత్రి అయినాడు. ఆ ఆంధ్ర సామ్రాజ్య సంక్షేమం కోరకే ఈనాడు ఆత్మార్పణం చేయబోతున్నాడు.... తండ్రికి తగిన కొడుకనిపించుకో నాయనా!"

"నాన్నాగారూ!" అన్నాడు గోవిందరాయలు ఆప్యాయంగా.

"రాయలవారు ప్రమాదంలో ఉన్నారు. వెళ్ళి నీ మహారాజును నీవు రక్షించుకో."

"రాయలనా!" గోవిందరాయల కంఠం ఆశ్చర్యంతో, అసహనంతో కర్కశంగా ధ్వనించింది.

"రాయలును రాయలుగా చూసేది నేనురా, నీవు కాదు. రాయలను ఆంధ్రసామ్రాజ్యాధినేతగా చూడాలి నువ్వు."

"క్షమించండి. ఇంతవరకూ అలాగే చూశాను. కాని, ఇక ముందు చూడలేను. కన్నబిడ్డలైన నా కన్నా అందే ఎక్కువని ఆదరించి సంభావించి, ప్రేమించి సేవ చేసినందుకు మిమ్మల్ని ఈ విధంగా, ఇంత భయంకరంగా శిక్షించిన ఆ రాయలను రక్షించమని ఆజ్ఞ ఇవ్వటంకన్నా నాకు వేసే శిక్ష ఏమిటి నాన్నగారూ!"



"శిక్ష కాదు నాయనా! ఇది దేశానికి రక్ష."

"దేశం! రక్షణ !! ఎవరికి కావాలి, దేశం?.... ఈ ఆంధ్ర సామ్రాజ్యాన్ని దురాశాపూరితులగు శాత్రవుల దండయాత్రల నుండి రక్షించినప్పుడు ఈ దేశం—పదునార్గురు పాత్రులను ససైన్యంగా ఒక్క నెత్తుడు బొట్టు నష్టంలేకుండా పట్టుబెట్టినప్పుడు మహామంత్రికి జయ-జయధ్వానాలు పలికిన ఈ దేశం—గజపతి నెత్తిపై కృష్ణరాయల కాలు దట్టంప చేసినప్పుడు తలయూచి అభినందించిన ఈ దేశం—సకల సామ్రాజ్యాన్ని సర్వ సౌభాగ్యాలతో తులతూగజేసినప్పుడు అనుభవించి, ఆనందించిన ఈ దేశం—రాళ్ళసీమ అయిన ఈ రాయలసీమను రతనాల సీమగా మార్చినప్పుడు మాణికలతో కొలుచుకున్న ఈ దేశం - ఏది? ఎక్కడ ఉంది?? కనిపించదేం!?? ఈ నాడు తన సకలాభ్యుదయ కారకుడయిన నా తండ్రికి ఇంత అపచారం జరుగుతుంటే మాట్లాడదేం?" నిప్పులు కురిపిస్తున్న గోవిందరాయల ధాటికి మహామంత్రి అంతటివాడు సైతం అదిరిపోయాడు.

కొడుకు తీవ్రతను తగ్గించటానికి ప్రయత్నిస్తూ మహామంత్రి - "గోవిందరాయా! దేశాన్ని నిందించకు. "జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి!" అన్నాడు.

గోవిందరాయలు మళ్ళీ అందుకున్నాడు:

"కాను. దేశాన్ని ఎందుకు నిందించాలి? మీ ఈ దుస్థితికి దేశం కాదు కారణం; తర-తరాలుగా అహంభావాన్నీ, నియంతృత్వాన్నీ జీర్ణింప చేసుకున్న ఈ రాజరికం. మీరు త్రికరణ శుద్ధిగా - మీ సర్వ శక్తి యుక్తులను వినియోగించి సేవ చేసినందుకు సహజమైన విధాన దుష్క్రియా ఫలితాన్ని అనుభవిస్తున్నారు. కృతఘ్నత రాజరికంలోనే అంతర్లీనమైన భావ ప్రవాహం. సర్వానర్థదాయకమైన ఈ రాజరికమే అంతరించి, ప్రజాస్వామ్యం వర్ధిల్లుతేనే గాని దేశానికి సౌభాగ్యంలేదు."

తండ్రికి విధించబడిన శిక్షతో రాజరికమంటేనే మోహం మొత్తింది గోవిందరాయలకు

మహామంత్రి కొడుకు అమాయకత్వానికి నీరసంగా నవ్వి, ఇలా అన్నాడు:

"ప్రజల చేతిలోని ప్రభుత్వం నిలకడలేని గాలిపటం. పచ్చిక బయలు చూపితేనేగాని, పరుగులెత్తలేని గొఱ్ఱెల మంద ఈ ప్రజ. అన్నీ అమరుస్తే అనుభవిస్తారు. దాని కోసం పని చేయమంటే పని చేస్తారు. కాని, అలా పని చేయించి అమర్చి పెట్టేందుకు వేరొకడు ఉండాలి. అతడే రాజు-రాజరికం దేశాభ్యుదయానికి అత్యవసరం, నాయనా!"

"నిజమే! రాజరికాన్ని మాత్రం ఎందుకు నిందించాలి? కాని, ఈ నాడు దానికి చిహ్నమైన మీ స్వహస్తకృత పట్టాభిషిక్తుణ్ణి అనాలి. "అప్పాజీ! అప్పాజీ!" అని మీ వెంట తిరిగి అన్ని విధాలా - మీ అసమాన మేధాసంపత్తిని వినియోగించుకొని. తుదకు స్వార్థపిశాచప్రోద్బలంతో మిమ్మల్ని అందుణ్ణి చేయటానికి సాహసించిన మీ మహారాజుననాలి.

"అతడు మాత్రం చేయగలిగిం దేముంది? రాజుగా సింహాసనం మీద కూర్చున్నవాడు తన విధిని తాను నెరవేర్చక తప్పదు." మహారాజును సమర్థించాడు మహామంత్రి.

"రాజు - అతణ్ని రాజును చేసింది నా తండ్రి."

"గోవిందరాయా! నీ తండ్రికే లేని అహంభావాన్ని నీవాపాదించుకోకు."

గోవిందరాయలు తన తండ్రి వచనాలకు ఒక్క క్షణం నివ్వెరబోయాడు.

"లేదు. అతడిని రాజును చేసింది నా తండ్రి అనే అహంభావం నాకేనాడూ లేదు. కాని, మహామేధావి అయిన నా తండ్రి - కేవలం పెంచిన వాత్సల్యానికి లోబడి, ఒక కులహీనుడైన దాసీ పుత్రుణ్ణి సార్వభౌముణ్ణి చేశాడనే విచారిస్తున్నాను."

"గోవిందరాయా! రాయల అభిజాత్యాన్ని అమూలాగ్రంగా ఎగిరి ఉండి కూడా-నిందించిన నీ సద్వంశ సంజాతత్వానికి సిగ్గుపడవేంరా?"

"అవును, నిజమే. ఇంతకాలంగా మీ కాత్మజుడను గదా అని గర్వించాను. ఇంత ద్రోహం చేసినా ఆ రాయలే మీ పుత్ర వాత్సల్యానికి



తగిన వాడనీ ఇంతగా ప్రేమించినా నేను మీకు కాని వాణ్ణనీ-అర్థం చేసుకున్న తరువాత కూడా నేను బ్రతికి ఉన్నందుకు సిగ్గు పడాల్సిందే, నాన్నగారూ! మీ కన్న కొడుకు గోవిందరాయలు ఇక మీకు లేడు. "అప్పాజీ!" అని సంబోధించే దత్తుడు మాత్రం మిగిలి ఉంటాడు...."

కొడుకు మాటలు వింటుంటే తండ్రికి కన్నీళ్ళ పర్యంతం అయింది. నిజానికి కృష్ణరాయలనూ, గోవిందరాయలనూ రెండు కళ్ళుగా చూసుకున్నాడు తాను. కృష్ణదేవరాయలు తన్ను ఎలాగూ అపార్థం చేసుకున్నాడు. కన్న కొడుకు గోవిందరాయలు కూడా తన్ను అర్థం చేసుకోనందుకు కుమిలిపోయాడు మహామంత్రి.

"గోవిందరాయా! నీ తండ్రిని నీవు కూడా అపార్థం చేసుకున్నావు. పెంచాననీ, పెద్ద చేశాననీ కాదు-రాయలను నేను సింహాసనం ఎక్కించింది; సార్వభౌమునికుండాల్సిన సర్వ లక్షణ సముపేతుడైన రాయలను సింహాసనం ఎక్కించటంలో దేశ క్షేమాన్నే ప్రధానంగా చూశాను. అందుకే ఈనాడు అతణ్ణి రక్షించమని అడుగుతున్నాను. నేను రక్షించే స్థితిలో లేను కాబట్టి నా కన్న కొడుకును నా కొరకు ఆ పని చేయమని అడుగుతున్నాను."

"అవును; అడుగుతున్నారు. అతని రక్షణకై ఈ క్షణాన కూడా మీరింతగా పరితపిస్తున్నారే, మీ విషయంలో కేవలం సత్యాన్వేషణకైనా అతనిందులో సహస్రాంశం పరితపించాడా, నాన్నగారూ?"

"ఏమో, నాయనా-ఎవరు చూశారు? అతని హృదయాంతరాళంలో ఏ హాలాహలం ప్రవేశించి మహోజ్వలంగా దహించివేస్తుందో ఎవరు చూశారు? ఆవేదనా భరితమైన అతని హృదయం ఎంతగా పరితపిస్తుందో ఎవరు చూశారు?"

"ఆ క్షణాన కూడా మహామంత్రిలో ప్రస్ఫుటమౌతున్న రాజభక్తిని చూసి కాపలావాడు రెండు వేడి కన్నీటి బొట్లు రాల్చాడు. కాని, గోవిందరాయలకు మాత్రం ఆ వాదం అర్థరహితంగా తోచింది.

"మహారాజుకు ఆ పాటి మానవత్వమే ఉంటే, మీకీ దుస్థితే రాదు, నాన్నగారూ!"

గోవిందరాయల తాత్సారాన్ని సహించలేక మహామంత్రి తీవ్రంగా మందలిస్తూ—

"గోవిందరాయా! మాటలతో కాలయాపన చేయకు. వెంటనే వెళ్ళి మహారాజును రక్షించు. నీ తండ్రి నిన్ను మహావీరుడిగా, ప్రచండయోధుడిగా చేసినందుకు నీ పితృ ఋణం తీర్చుకో" అన్నాడు.

"క్షమించండి." తన అసమ్మతిని తెలియజేశాడు గోవిందరాయలు. తన మాటకెదురు చెబితే మండిపడే స్వభావం మహామంత్రిది. అందుకే ఆయనకెవరూ ఎదురాడటానికి సాహసించరు - ఆంధ్ర రాజ్యంలో. అలాగే సాగింది ఆయన ప్రభ - గత నలభై సంవత్సరాలుగా నిరాటంకంగా. కాని, ఈ నాడు - అందులో కన్న కొడుకు కూడా ఎదురు చెప్పటానికి సాహసిస్తున్నాడు,

"గోవిందరాయా! నిన్ను ఒప్పించటానికి అన్ని విధాలా వ్యర్థ ప్రయత్నం చేశాను. ఎన్నడూ మా మాట కెదురు చెప్పని నీకు ఇంత ధైర్యం ఎలా వొచ్చింది? ఇంత క్రమశిక్షణా రాహిత్యం ఎలా అలవాటు పడింది?" మహామంత్రి కంఠం కంచులా ధ్వనించింది.

"నాన్నగారూ!" అన్నాడు గోవిందరాయలు వణికిపోతూ.

"నాన్నగారూ! హుం. మాకంతా అర్థమౌతున్నది. నీకింత ధైర్యం ఒక్కసారిగా రాలేదు. మాకంతా అర్థమౌతున్నది. నీ ఈ అవినయ, అక్రమ సమాధానాలకు మూలం ఏమిటో మాకవగతం ఔతున్నది. నీ చేత ఇలా మాట్లాడిస్తున్న ఆ దుష్ట రాక్షస శక్తి ఏదో మా మేధా శక్తికి అందకపోలేదు. మా మీద ఆరోపించబడిన నేరం మేం చెయ్యకపోయినా, మా గర్భవాసాన జన్మించినవాడే చేసి ఉండాలి!"

"నాన్నగారూ! ..." గోవిందరాయలు అమూలాగ్రంగా కంపించిపోయాడు.

"నాన్నగారు! హుం. నాన్నగారు!.... నేను నీకు తండ్రిని కాదు. పంచ మహా పాతకాలకు ఆలవాలమయిన నీ ముఖం నాకు చూపించకు.



నీవే గంగలో కలసినా నా కిష్టమే! నీవే వల్లకాటి సామ్రాజ్యానికి పట్టాభిషేకం చేసుకున్నా నా కిష్టమే!"

"నాన్నగారూ!....నేను నిర్దోషిని. నా తండ్రే నన్నిలా అనుమానిస్తారని కలలో కూడా అనుకోలేదు. నన్ను విశ్వసించండి. నేను నా కన్న తండ్రికి అపఖ్యాతి తెచ్చే ఏ పనీ ఇంతవరకు చెయ్యలేదు; ఇక ముందు చెయ్యను కూడా. నాన్నగారూ! మీ ఆజ్ఞను శిరసావహిస్తున్నాను." గోవిందరాయలు తండ్రి పాదాలకు మోకరించాడు.

"గోవిందరాయా!...." అన్నాడు మహామంత్రి ఆనంద బాష్పాలు రాలుస్తూ.

"ఇంత కాలంగా మిమ్మల్ని ఎదిరించి వాదించింది మీ మీది అభిమానంతోనే గాని వేరే ఏ పాపమూ నేనెరుగను. స్వార్థరహితుడైన నా తండ్రికింత అపచారం జరుగుతుంటే...."

"గోవిందరాయా! నీ తండ్రి కేవలం ఒక వ్యక్తి మాత్రమే! వ్యక్తులు వస్తూ ఉంటారు; పోతూ ఉంటారు. కాని, సామ్రాజ్యం మాత్రం శాశ్వతంగా నిలవాల్సింది. ఆంధ్ర సామ్రాజ్య సంక్షేమం కొరకు రాయలవారి మనుగడ అత్యవసరం. వెళ్ళు- నీ ప్రాణాలైన అర్పించటానికి వెనుదీయకు. మీ మహారాజును రక్షించుకో, వెళ్ళు."

"అలాగే, ఇప్పుడే వెళ్తున్నాను. రాయలవారి రక్షణకై తన ప్రాణాలైనా అర్పించటానికి తిమ్మరుసు మహామంత్రి కుమారుడు సిద్ధంగా ఉన్నాడు...." అంటూ తండ్రివద్ద సెలవు తీసుకొని నిష్క్రమించాడు గోవిందరాయలు.

కొడుకు వెళ్ళినవైపే సంతృప్తిగా చూస్తూ నుంచున్నాడు మహామంత్రి.

ఇంతలో కాపలావాడు తిరిగి వొచ్చాడు. ఈ మాటు అతడు మహామంత్రిని చూసి కాస్త జంకాడు. ఆయన ఆజ్ఞకు వ్యతిరేకంగా గోవిందరాయలవారిని ప్రవేశపెట్టినందుకు.

"క్షమించండి, మహామంత్రీ! మీది రాజభక్తితో కరడు గట్టిన దొడ్డ హృదయం. నేను అల్పుణ్ణి. మానవ సహజమైన హృదయ స్పందనలో

మంత్రికుమారులను ప్రవేశపెట్టాను." అన్నాడు కాపలావాడు నొచ్చుకుంటూ.

"అవును. చాల తప్పు పని చేశావ్. ఇంత తిరస్కారం చివరకు నా రాయలనుంచి కూడా నేనెరుగను."

మహామంత్రి బాధను గ్రహించి కాపలావాడు తన ప్రవర్తనను తాను సమర్థించుకోవాలని ప్రయత్నించాడు.

"తమ కుమారుల విషయంలో కూడ తమరింత కాఠిన్యం వహించటం సహించలేకపోయాను. మహామంత్రీ!"

"నీకు తెలిసింది అంతవరకే. మా ప్రేమతత్వాన్ని నీవర్థం చేసుకోలేవు అతని ముఖం చూసిన తరువాత మాకు బ్రతుకు మీద వాంఛ కలిగితే, రాయలవారు రాజ్యభ్రష్టుడు కావటం పది నిముషాల పని. అది మాకు మరొక విధంగా దుర్భరం."

మహామంత్రి ఈ మాటలంటుండగా కోట వెలుపల బ్రహ్మాండమైన కోలాహలం వినిపించింది. క్షణ కాలంలో ఆ అలజడి కోట లోపలనే వినిపించటం ప్రారంభించింది. క్రమంగా క్షణ-క్షణానికీ వృద్ధి చెందుతున్నది.

"ఏమిటది, సిపాయీ?" అన్నాడు మహామంత్రి.

సిపాయి గవాక్షంలోనించి వెలుపలికి చూశాడు. కోటంతా అల్లకల్లోలంగా ఉంది కొరివి దయ్యాలలాగా కాగడాలు అటూ-ఇటూ పరుగెత్తుతున్నాయి. విచ్చు కత్తులు తీసుకొని సైనికులు వీర విహారం చేస్తున్నారు. వారితో విజయనగర పౌరులంతా చేతులు కలిపారు. వారి ఇష్టం వొచ్చిన చోటికల్లా పోతున్నారు. కనిపించిన తాళాన్నల్లా పగులగొడుతున్నారు. వారేం చేసినా, ఎక్కడికి పోయినా అడ్డే సాధుడెవరూ కనిపించలేదు. వారికి ఎవరితో పోట్లాడాలో అర్థం కావటంలేదు. ఎదురు తిరిగి పోరాడవలసిన అంతఃపుర రక్షాధికృత జనం తిరుగుబాటుదారుల్లో కలిసిపోయింది. మొత్తంమీద కోట పరిస్థితి ఆందోళనకరంగా ఉంది - రక్తపాతం జరగకపోయినా. కాపలావాడు తిరిగి వొచ్చి మహామంత్రికి విన్నవించాడు—



"విప్లవం చెలరేగింది. మహామంత్రీ! ఆంధ్ర సైనికులు విచ్చుకత్తులతో శివమెత్తినట్లు రాజప్రాసాదం వైపుకు పరుగులు తీస్తున్నారు."

"రాజప్రాసాదానికి రక్షణ....?" మహామంత్రి ఆదుర్దాగా ప్రశ్నించాడు,

"ఎవ్వరూ లేరు. తుదకు మహారాజు అంగరక్షక దళాధిపతి విరూపాక్షప్ప కూడా తమ దర్శనార్థం కారాగృహ ద్వారంపద్ద నిరీక్షిస్తున్నారు."

"బయట రామలింగ నాయకులున్నారా ?"

"ఉన్నారు, మహామంత్రీ!"

"వెంటనే ప్రవేశపెట్టు."

కాపలావాడు వెళ్ళిపోయాడు.

"లేదు; కారాగృహంలో ఉన్నా శాంతి లేదు. రాజకీయాల్లో జీవించేవాడికి చివరకు రుద్రభూమిలో అయినా శాంతి ఉంటుందో, ఉండదో!" అనుకున్నాడు మహామంత్రి.

ఇంతలో రామలింగ నాయకుడు ప్రవేశించాడు.

"ఏమిటీ అలజడి సేనాధిపతీ!" ప్రశ్నించాడు మహామంత్రి.

"అలజడి కాదు, మహామంత్రీ! విప్లవం" సమాధానం చెప్పాడు దండనాథుడు.

"మీరంతా ఏం చేస్తున్నారు?"

"ఏం చెయ్యటానికైనా పరిస్థితి ఎప్పుడో చెయ్యిజారి పోయింది. సైన్యమంతా తమ మహామంత్రిని రక్షించుకోవటానికి వీరావేశంతో ప్రళయ తాండవం చేస్తున్నది."

"విప్లవాన్ని నిర్దాక్షిణ్యంగా అణచివెయ్యండి." మహామంత్రి కర్కశంగా శాసించాడు.

"అసాధ్యం, మహామంత్రీ! మహోదాత్తాశయంతో ఆంధ్ర సేనావాహిని ఉప్పొంగి గట్లు దిగి పరవళ్ళు త్రొక్కుతుంది, ఆ ఒరవడిలో ఎంత పెద్ద ద్రుమానైనా కూకటివేళ్ళతో సహా కూలిపోవాల్సిందే, మహామంత్రీ!" అన్నాడు రామలింగనాయకుడు."

"సర్వ సైన్యాధిపతులు, తమ సైన్యాన్ని తామే అదుపులో పెట్టుకో లేనంత అసమర్థులా, మీరు!" మహామంత్రి తీక్షణంగా ప్రశ్నించాడు.

"మా అసమర్థతకు చింతిస్తున్నాం."

"ఔను. చేయవలసినదంతా చేశారు, అసమర్థులం అన్నారు సైన్యాధిపతీ! మీకు కూడా ఇందులో భాగం ఉంది!"

"క్షమించండి తమ కిచ్చిన వాగ్దానం మేరకు నాకిందులో ఏ సంబంధమూ లేదింతవరకూ."

"ఇక ముందు కలగవచ్చంటారు. అంతేనా, సర్వసేనానీ? మేము రాజభక్తులుగా మరణించటమే దేశానికి శ్రేయస్కరం. వెళ్ళి ఆ తిరుగుబాటును అణచివేయండి. ఇది మా ఆజ్ఞ!... కాదు... మా మాటగా మిగిలిన దండనాథుల సహాయం కూడా పొందండి, వెళ్ళండి."

"కాని దానివలన అట్టే ప్రయోజనం ఉండదు, మహామంత్రీ!"

"ఉంటుంది. త్వరగా వెళ్ళండి. మహారాజుకు ఏ ప్రమాదమూ రాకూడదు, జాగ్రత్త! వెళ్ళండి."

మహామంత్రి ఆజ్ఞకు ఎదురు చెప్పలేక "ఆజ్ఞ." అంటూ రామలింగ నాయకుడు వెళ్ళిపోయాడు.

కాపలావాడు కవాట బంధనం చేసి తిరిగి వచ్చాడు.

మహామంత్రి అంత్య ఘడియల్లో ప్రక్కన ఉండే మహద్భాగ్యం లభించినందుకు అతడికి ఒక విధంగా సంతోషంగా ఉన్నట్లుంది. మరో ప్రక్క దుఃఖం ముంచుకొస్తున్నా.

"మహామంత్రీ! సాహసానికీ క్షమించండి. ఒక్క మాట అడుగుతాను." అన్నాడు కాపలావాడు.

"అడగవచ్చు"

"రాయలవారంటే మీ కెందుకింత ప్రేమ?"

"ఎంత వెర్రి ప్రశ్న! ఈ నా స్వంత చేతుల మీదుగా రక్షించానొక పసికందును మృత్యు ముఖం నుండి అల్లారు ముద్దుగా చూసుకున్నాను. గుజ్జు గూళ్ళు తినిపించాను. చందమామ కథలు చెప్పాను. పెంచాను.



పెద్దచేశాను సకల సామ్రాజ్యానికీ సార్వభౌముణ్ణి చేశాను. రాయలవారంటే మాకు కాక మరెవరికుంటుందోయ్ ప్రేమ?"

"నిజమే. కాని, మీ మీద ఆయనకు విశ్వాసం నశించింది.

"ఉహూం! మహారాజు మేము చేసిన నేరాన్ని శిక్షించారు. అంతే! మమ్మల్ని కాదు శిక్షించింది," అన్నాడు మహామంత్రి ధీమాగా.

"ఆ నేరం మీరు నిజంగానే చేశారా?"

"న్యాయస్థానం అలా నిర్ణయించింది. దానికి తగిన ఆధారాలు నిరూపితమైనయ్."

"కాని, ఆ నేరం మీరు చెయ్యలేదు." కాపలావాడు తన్నెక్కడికో లాక్కెళ్తున్నాడని గ్రహించాడు మహామంత్రి.

"మహామంత్రులు, అపూర్వమేధాసంపన్నులు. చేసిందెవరో మీకు తెలుసు."

"నీలో న్యాయవాది లక్షణాలు కనిపిస్తున్నాయ్. ఔను; తెలుసు." ఆ మాట అన్న తరువాత నోరు జారానని గ్రహించాడు మహామంత్రి.

"మీరా విషయాన్ని న్యాయస్థానంలో వెల్లడించాల్సింది, మహామంత్రీ!"

"దానివల్ల ప్రాణ రక్షణ జరిగినా, తరువాతి కాలంలో నా జీవితంలో సుఖం ఉండదు. సిపాయీ! నా హృదయంలో అప్పుడు ఆనందం కన్నా, ఆందోళనే అధికమౌతుంది..... ఆ రహస్యం మాతోనే అంతరిస్తుంది," అన్నాడు మహామంత్రి.

"ఇది చాలా దారుణం, మహామంత్రీ! ఈ విషయం రాయలవారికి తెలిస్తే, ఎంత నరకవేదననుభవిస్తారో గ్రహించారా, మహామంత్రీ?"

"ఇది రాయలవారికి తెలిసే అవకాశం లేదు. ఒకవేళ నిజం తెలిసి రాయలు నన్ను మన్నిస్తే మన్నించవచ్చు. కాని, విడిపోయిన మా రెండు హృదయాలూ కలుసుకోవటం కల్ల. నేను నా రాయలకు కాకుండా దూరంగా జీవించటంకన్నా, మరణాన్నే గాఢంగా వాంఛిస్తున్నాను."

మహామంత్రి మాటలు వింటుంటే కాపలావాడి హృదయం కరిగిపోయింది. కళ్ళు బైర్లు కమ్మాయి. ప్రపంచమే తల్లక్రిందులైనట్లుంది.

ఆ హృదయోద్వేగాన్ని అణచుకోలేక "అప్పాజీ!" అని పొలికేక పెట్టాడు సహజ స్వరంతో. ఆ కేక విన్న మహామంత్రి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు.

"అదిగో- అదే గొంతు! అలాగే పిలుస్తాడు నా రాయలు నన్ను.... అలాగే పిలుస్తాడు నా రాయలు నన్ను.... అంతా భ్రమ నా రాయలెందుకు వస్తాడిక్కడికి."

"మీకు రాయలవారిని చూడాలని వుందా?" అన్నాడు కాపలావాడు, తన కుడి చేత్తో కళ్ళవెంట జల-జలా రాలుతున్న అశ్రుకణాన్ని తుడిచి వేసుకుంటూ.

"అవును, నాయనా! అన్ని కోరికలూ చంపుకున్న నాకు ఈ కోరిక చావకుండా వచ్చింది.

"ఒకవేళ రాయలవారే వచ్చి ఆ శిశు హంతకుని పేరడిగితే చెప్తారా మహామంత్రీ?"

"చెప్పను. నా నిర్ణయం తిరుగులేనిది. ఆ రహస్యం నాతోనే అంతరిస్తుంది."

"అసలాయనకు క్షమాభిక్ష లభిస్తుందా? వారు చేసిన ఈ ఘోర పాతకానికి మీరు వారిని క్షమిస్తారా?" అడిగాడు కాపలావాడు.

మహామంత్రి చిరునవ్వు నవ్వాడు. "అతడు నాకు రాజేకాదు; కన్న బిడ్డకన్నా మిన్న అయినవాడు. తనయుల తప్పిదాలను తండ్రులు తప్పక క్షమిస్తారు."

"మీరు మూర్తీభవించిన ప్రేమ స్వరూపులు- పై రూపు కర్కశంగా కనిపిస్తున్నా, అతడు ఎంత మధురంగా కనిపించినా అంతరాల్లో కరడు కట్టిన కృతఘ్నుడు" కాపలావాడు ఆవేశంలో ఏమేమో అనేశాడు.

"సిపాయీ!" మహామంత్రి వృద్ధ కేసరిలా గర్జించాడు. అవును. మహారాజు అవమానం తనకు ఈనాటికీ సహించరానిది. "కృష్ణరాయల వారు సార్వభౌములనే విషయాన్ని మాటి-మాటికీ మరచిపోతున్నావ్ జాగ్రత్త."



"క్షమించండి, మహామంత్రీ! వాస్తవాన్ని అణచుకోలేకపోయాను" అన్నాడు కాపలావాడు.

ఇంతలో కారాగృహ ద్వారం వద్ద "మహామంత్రికీ జై!" అనే నినాదాలు ఉద్భవించి మిన్నుముట్టాయి. ఎలాగైతేనేం పౌరులూ, సైనికులూ మహామంత్రిని బంధించిన భవనాన్ని పసిగట్టారన్నమాట! కాపలావాడు ద్వారం దగ్గరకు పరుగెత్తాడు. గవాక్షం గుండా బయట ఉన్న పౌరులకూ, లోపల ఉన్న కాపలావాడికీ ఘర్షణ జరుగుతూంది.

"ఏమిటది సిపాయీ?" ప్రశ్నించాడు మహామంత్రి.

"తలుపులు తెరవమని సైన్యాలూ, ప్రజలూ కోరుతున్నారు, మహామంత్రీ!" అన్నాడు కాపలావాడు.

"వీల్లేదు. తలుపులు తెరవడానికి వీల్లేదని చెప్పు మా మాటగా" అన్నాడు మహామంత్రి.

కాని, ఆ మాటల్ని ప్రజలు కాదు కదా, కాపలావాడన్నా విన్నాడంటానికి వీల్లేదు- ఆ గందరగోళంలో. ఇంతలో బయట ఉన్న ప్రజానీకం బలమైన సమ్మెటలతో తాళాన్ని భేదిస్తున్నారు. ఖణేల్-ఖణేల్ అని శబ్దాలు వినవొస్తున్నాయి. మహా బలాఢ్యమైన ఆ ప్రజావాహిని ధాటికి లోహ నిర్మితమైన ఆ ద్వారబంధం విచ్చి తావిచ్చింది. బిల-బిలా ప్రజలూ, సైన్యాలూ లోపలికి రావాలని ద్వారం వద్ద త్రొక్కిసలాడుతున్నారు. ప్రజలంతా ముక్తకంఠంతో "మహామంత్రికీ జై!" అని నినాదాలు చేస్తున్నారు. సంతోష పారవశ్యంతో గంతులేస్తున్నారు. విజయాన్ని సాధించిన వీరాగ్రేసరుల్లా జేజేలు కొడుతున్నారు.

"సిపాయీ! వారినడ్డగించు, అన్నాడు మహామంత్రి.

"వారంతా సామంతులూ, అతిరథులూ, మహారథులూ. వారినడ్డగించే బలం నాకు లేదు, మహామంత్రీ" కాపలావాడు తన అసమర్థతను వెల్లడించడు.

"ఛీ! పిరికిపందా!" అన్నాడు మహామంత్రి. నిజానికి మహామంత్రి

వెనుక ఉండి "ఊఁ" అంటే ఏ ఆంధ్ర సైనికుడయినా శత్రు సేనా వాహినిలోకి ఒంటరిగా దూకుతాడు చీల్చి చెండాడడానికి అభిమన్య కుమారుడిలా. ఆ విషయం తెలిసిన కావలావాడు అట్టే బాధపడలేదు. ఇక వీడితో పని కాదనుకొని మహామంత్రి ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తూ గంభీరంగా ఇలా అన్నాడు:

"ఆగండి. ఒక్క అడుగు ముందుకు వేసినా మీరు ఏ మహా మంత్రిని రక్షించుకోటానికి ఇంతగా పరితపిస్తున్నారో, ఆ మహామంత్రి తనకు తానై మీకు దక్కడు.

త్రోక్కిసలాడుతూ లోపలికి రావాలని చూస్తున్న సేనావాహిని ప్రథమ భాగం స్తబ్ధమైపోయింది ఒక్క క్షణంలో. ఇంతలో వెనుకనున్న ప్రజానీకం "మహామంత్రికీ జై!" అని నినాదాలు లేవదీసింది.

"మహామంత్రికి కావలసింది జయ-జయధ్వానాలు కాదు; మీరంతా ప్రశాంతంగా ఇళ్ళకు వెళ్ళిపోవటం."

ప్రజావాహిని కదల్లేదు; మెదల్లేదు; ఒక్క అడుగుకూడా ముందుకు వెయ్యలేదు. వేసే ధైర్యం లేదు. వెనక్కు పోయే మనసు లేదు. ఇంతలో ఆ ప్రజానీకాన్ని చీల్చుకొని అచ్యుతరాయలు—రామలింగనాయకులు, తిమ్మనాయకులు, నరసనాయకులు, విరూపాక్షప్ప మొదలయిన రాజకీయోద్యోగులతో కారాగృహంలో ప్రవేశించాడు దూకుడుగా. అచ్యుత రాయల హస్తంలో ఏదో లీలగా మిల-మిలా మెరవటం అంత దూరాన్నించే చూశాడు మహామంత్రి - దృష్టి సరిగ్గా ఆనకపోయినా.

"ఏమిటది, అచ్యుతరాయా?" అన్నాడు మహామంత్రి.

"రాజదండం అప్పాజీ!"

క్షణ కాలం మహామంత్రి నివ్వెరపోయాడు. ఏం జరిగిఉంటుందో ఊహించుకున్నాడు.

"మహారాజెక్కడ? ఏం చేశావు, మహారాజుని?" అంటూ అచ్యుతుని రెండు చేతులూ పట్టుకుని ఊపి పారేశాడు ఆ వృద్ధకిశోరం.

"మహారాజు జాడ తెలియటం లేదు." అచ్యుతుడు తల వొంచుకుని సమాధానం చెప్పాడు.



"ఆంధ్ర సార్వభౌముని స్థితి ఈ గతికి తెచ్చాయన్న మాట, మీ సైన్యాలు?" అన్నాడు మహామంత్రి కోపోద్రేకంతో రామలింగనాయకులను చూస్తూ.

"మమ్మల్ని నిందించి లాభంలేదు, మహామంత్రీ! ఇది వారి స్వయంకృతాపరాధం. విప్లవ సైన్యాలు రాజ...." రామలింగనాయకుని సమాధానాన్ని మధ్యలోనే త్రుంచివేశాడు మహామంత్రి.

"విప్లవం! మహా పెద్ద విప్లవం! మేము మంత్రిగా ఉండక పోతిమి. చూసేవారం-మీ వీర విప్లవ రణరంగ సారమేమిటో!"

"తమరు మహామంత్రులుగా ఉంటే విప్లవానికి అవసరమేముంది, మహామంత్రీ!" అన్నాడు కావలావాడు.

"సిపాయీ! అనవసర విషయాలలో నీకేం జోక్యం....?" అంటూ విసుక్కొని మహామంత్రి అచ్యుతరాయల నుద్దేశించి "ఇంతకూ మహారాజెక్కడ?" అని ప్రశ్నించాడు.

"ఏమో-ఏమైపోయారో తెలియటం లేదు. బహుశా పారిపోయి ఉండవొచ్చు."

"కనుపించనిదే చాలునంటూ రాజదండం పట్టుకొచ్చావా-పారిపోయారనే వార్త చెప్పటానికి? ఛీ! సిగ్గులేదూ? తిమ్మరుసు బ్రతికి ఉండగానే ఆంధ్రసామ్రాజ్య రమ నేటికొక అనాథ రాయలులేని రాజ్యానికి రక్షణ ఎవరు?" మహామంత్రి వచనాలలో ఆందోళన విపరీతంగా కనిపిస్తోంది?

"అదొక సమస్య కాదు, అప్పాజీ! ప్రజలూ, సైన్యమూ ఈ సమస్యను ఏ క్షణానో పరిష్కరించాయి. ఈ ఆంధ్రసామ్రాజ్యానికి మీరే శ్రీరామరక్ష," న్నాడు చ్యుతుడు.

"రథ గజ తురగ పదాతి దళాల పక్షాన, సకల సామంత దండనాథుల పక్షాన తమకీ కోరిక విన్నవించుకొంటున్నాం." అన్నాడు దండనాథుడు సవినయంగా.

"స్వీకరించండి, అప్పాజీ! స్వీకరించి ఈ ఆంధ్రసామ్రాజ్య రక్షణ బాధ్యతను వహించండి...." అంటూ అచ్యుతరాయలు రాజదండాన్ని మహామంత్రి కర్పించబోయాడు.

కాని మహామంత్రి ప్రచండ రూపాన్ని చూచి ముందుకు వాచిన చేతులను వెనక్కు తీసుకున్నాడు. బహుశః మహామంత్రి అంత భయంకరంగా తన జన్మలో ఎవ్వరికీ దర్శనమివ్వలేదేమో కూడా.

ఆ వృద్ధ కేసరి కళ్ళు ఎఱ్ఱబడ్డాయ్. పండిపోయిన జుట్టు నిక్కబొడుచుకుంది. మొహం జేవురించింది. విశాలమైన నొసలు ముడిపడ్డాయి. కాని, ఆ గంభీర భయంకర స్వరూపం అట్టే కాలం నిలువలేదు. క్షణకాలంలో మనిషి మంచులా కరిగిపోయి వల-వలా ఏడ్చాడు.

"అచ్యుతరాయా! మీ విప్లవానికి ఫలితం మా రాజరికమా? ఇందుకేనా మీరు రాయలవారిని రాజ్యభ్రష్టుణ్ణి చేసింది? మీ రాజరికం మాకక్కర్లేదు. తిమ్మరుసు బ్రతికినన్నాళ్ళూ మహామంత్రిగా బ్రతికాడు; మహారాజుగా కాదు. కావాలనే వాంఛ అతనికేనాడూ లేదు."

ఇంతలో ప్రాతఃకాన సూచకంగా నగారా గంట మ్రోగింది. మహామంత్రి మళ్ళీ గంభీర మూర్తి అయినాడు. ఆ క్షణాన ఆయనతో మాట్లాడే సాహసం ఎవరికీ లేకపోయింది. రెండు క్షణాలు నిశ్శబ్దంగా గడిచిపోయినయ్.

మహామంత్రి ఒక్కసారి అందరి ముఖాలూ పరికించాడు. చివరికి కాపలావాణ్ణి ఉద్దేశించి, "సిపాయీ! నగారా గంట మ్రోగింది. సూర్యోదయం కావొస్తుంది. సమయం ఆసన్నమైంది. వధ్యస్థానం వద్దకు రావటానికి సిద్ధంగా ఉన్నాం. మమ్మల్ని తీసుకువెళ్ళి మీ రాజాజ్ఞ ప్రకారం కళ్ళు పెరికివెయ్యవొచ్చు," అన్నాడు మహామంత్రి.

కాపలావాడు కంపించిపోయాడు.

"క్షమించండి. అది నా చేతకాని పని," అన్నాడు బాధగా. అతడా విషమ పరిస్థితిలో నుంచి తప్పుకోవాలనే ప్రయత్నంలో ఉన్నాడు.

మహామంత్రి ఒక్కొక్కరి వంకే చూస్తూ 'మీరు....మీరు... మీరు అన్నాడు.

అందరూ ఒక్కొక్కరే తలలు వొంచుకున్నారు.

"నాకు తెలుసు- మీరంతా రాజద్రోహాలు, కానివ్వండి. పదవిని కోల్పోయినా, రాజ్యభ్రష్టుడైన రాయలే నా రాజు, నా రాజు ఆజ్ఞను నేనే



శిరసావహించుకుంటాను." అంటూ మహామంత్రి హఠాత్తుగా తన రెండు చేతులతోనూ, రెండు కళ్ళను పెకల్చుకోబోయాడు.

ఈ హఠాత్సంఘటనను చూచి కాపలావాడు పరుగెత్తుకుంటూ వచ్చి మహామంత్రి చేతివ్రేళ్ళను కళ్ళలోనించి తీసివెయ్యటానికి పెనుగులాడాడు. కాని, అతని వేళ్ళూ రక్తసిక్తమైనాయి. ఆ రక్తవర్ణాన్ని చూచి - హృదయ విదారకంగా "అప్పాజీ" అంటూ కేకవేసి పడిపోయాడు కాపలావాడు. మిగిలిన వారంతా జరిగిన దానికి దిగ్భ్రమ చెందుతూ "అప్పాజీ మహామంత్రీ!" అని గగ్గోలు పెట్టారు.

ఇంతలో దండనాథుడు క్రింద పడిపోయిన కాపలావాణ్ణి చూచి "మహారాజా!" అంటూ కేకపెట్టాడు.

క్రింద పడటంలో అతని తలపాగా ఎగిరిపోయింది. కట్టుడు గడ్డం జారిపోయింది. అతని ఛద్మవేషం బయట పడింది.

కళ్ళవెంట రక్తం ధారగా కారుతున్నా, క్షణ-క్షణానికి బాధ అధికమౌతున్నా మహారాజు పేరు వినటంతోటే వృద్ధ మంత్రికి నూతనోత్సాహం కలిగింది.

"ఎవరు? రాయలా? ఎక్కడ? ఎక్కడ- రాయా! వచ్చావా, నాయనా! చివరిచూపు చూడటానికైనా దయ కలిగిందా, ఈ వృద్ధుడి మీద? ఎక్కడ నా రాయా! నిన్ను నేను చూడలేను. నీ ఆజ్ఞలను శిరసావహించాను. నిన్ను నేను చూడలేను. రా, రాయా! ఎక్కడున్నావ్....?" అంటూ తడబడే అడుగులతో మహామంత్రి అడ్డు తగిలిన ప్రతి వారినీ తడుముతున్నాడు. ఆయన్ను రాయలు చేత్తో పట్టుకుని దగ్గర ఉన్న శిలా ఫలకం మీద పడుకోబెట్టాడు. అచ్యుతరాయల ఒడిలో. ఆ క్షణాన ఆ అపూర్వ శేముషీ సామ్రాజ్య చక్రవర్తి శీర్షాన్ని వాళ్ళో ఉంచుకునే భాగ్యం అచ్యుతరాయలకు దక్కింది అందువల్లే అనతి కాలంలో అతను సార్వభౌముడైనడేమో!

"రాయా! దగ్గరకు రా" అన్నాడు ఆప్యాయంగా మహామంత్రి.

"దగ్గరే ఉన్నాను, అప్పాజీ! నేను సృష్టించిన ఈ ఘోర రక్త

పాతాన్ని కళ్ళారా చూస్తూ అనుభవించటానికి ఇంకా బ్రతికే ఉన్నాను, అప్పాజీ!"

"నీవు చేసింది ఏముంది, నాయనా! న్యాయం కోసం. ధర్మంకోసం తనకు ప్రాణాధికమైన తిమ్మరుసు మహామంత్రినే శిక్షించిన ధర్మమూర్తిగా ఆంధ్ర చరిత్రలో నీ నామాక్షరాలు సువర్ణాక్షర సుస్థిరత చెందుతాయి."

"అప్పాజీ! మీ వాక్కు మీరన్న అర్థంలో కాకపోయినా, వ్యంగ్యోక్తిలో పరమ సత్యం" అన్నాడు మహారాజు కృంగిపోతూ.

"వ్యంగ్యం ఏమిటి నాయనా?"

"మీరా నేరాన్ని చేయలేదు."

"పొరపాటు పడుతున్నావేమో, రాయా?"

"లేదు. మీరే చెప్పారు."

"నేనా?"

"ఔను- మీరే! క్షమించండి. ఇంతవరకూ కాపలావాడి వేషంలో ఉండి, మిమ్మల్ని అనేక విధాలుగా పీడించి, చివరికి మీ కన్నులను రక్షించే ప్రయత్నంలో వాటిని సమూలంగా నాశనం చేసింది కూడా నేనే!"

"లేదు, నాయనా-లేదు. నేనే పొడుచుకున్నాను." అన్నాడు మహామంత్రి మహారాజు మాట కడ్డం వస్తూ.

"నా పాపానికి ప్రాయశ్చిత్తం లేదు. నా దుర్మార్గానికి నిష్కృతి లేదు. నా జీవితానికి శాంతిలేదు. అప్పాజీ! నేను మానవుణ్ణి కాదు; రాక్షసుణ్ణి. క్షమాభిక్ష నర్థించే అర్హతను సైతం కోల్పోయిన కిరాతకుణ్ణి. మీరు తీసినది కృష్ణరాయలే కాదు, ఆంధ్ర సామ్రాజ్యమే అంతరిస్తుందన్న పరమ సత్యాన్ని విస్మరించిన అజ్ఞానిని...." అంటూ విపరీతంగా బాధ పడుతున్న మహారాజును అప్పాజీ అనునయించాడు.

"బాధపడకు నాయనా! దైవికంగా జరగాల్సిందేదో జరిగిపోయింది దాని బాధ్యత అంతా నీదేనని నెత్తిన వేసుకొని బాధ పడటం అజ్ఞానం. మా మహోజ్జ్వల రాజకీయ జీవితానికి ఈ విధమైన ముగింపు మా పాపానికి ప్రాయశ్చిత్తం.

మహారాజులో దుఃఖం మళ్ళీ పెల్లుబికింది.



"పాపం మీదికాదు: నాది. నన్ను రాజుగా విశ్వసించిన ఈ ఆంధ్ర ప్రజలది, ఈ విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన చక్రవర్తులలో నాకన్నా దురదృష్టవంతుడు లేడు; నా వంటి దౌర్భాగ్యుడూ లేడు. గతమును విస్మరించిన పితృ ఘాతకుణ్ణి. భావినూహించలేని భావుకుణ్ణి. విజ్ఞాన విహీనుడయిన విధ్వంస జనితుణ్ణి. రాజతంత్ర మెరుగని రాజ పరమేశ్వరుణ్ణి. న్యాయమెరుగని న్యాయమూర్తిని, మానవత్వం లేని మానవాధముణ్ణి: స్వాశ్రయాన్ని చేతులారా నాశనం చేసుకున్న బుద్ధి హీనుణ్ణి. అప్పాజీ! ఇక నేను కేవలం జీవన్మృతుణ్ణి:" భోరున ఏడ్చాడు మహారాజు అప్పాజీ కాళ్ళ మీద పడి.

"రాయా! జరిగిందేదో జరిగిపోయింది. ఆత్మ నిందన అసమర్థుల లక్షణం? నేను మిమ్మల్నందర్నీ కోరేదొక్కటే! ఆంధ్ర సామ్రాజ్య భవితవ్యాన్ని దృష్టిలో నుంచుకొని. అంతఃకలహాలకు స్వస్తి చెప్పండి. సింహాసనానికి తలఒగ్గండి. కృష్ణరాయా! తాత్కాలికోద్రేకంలో నా కొరకు రాజద్రోహం తలపెట్టిన వీరిని నా కొరకే క్షమించు?" అన్నాడు మహామంత్రి ప్రార్థనాపూర్వకంగా.

"క్షమించే అర్హతను రాయలేనాడో కోల్పోయాడు అప్పాజీ! వారు నాకు మార్గ దర్శకులు. మానవత్వంలోని కృతజ్ఞతా మాధుర్యాన్ని చవి చూపించిన మహాశయులు. వారిని క్షమించే అర్హత నాకు లేదు. నేను చేసిన ఈ ఘోర పాతకానికి ఆంధ్ర ప్రజలే నన్ను క్షమించాలి."

"క్షమించే హక్కు ప్రభువులది. క్షమించమంటున్నాం మేము!" అన్నాడు మహామంత్రి.

ఆ క్షణాన కూడా ఆ ప్రాధేయతలలో అధికారమే ధ్వనించింది మహామంత్రి కంఠంలో.

"అప్పాజీ!" అన్నాడు రాయలు ఆమోద సూచకంగా.

"ఇక మేము నిశ్చింతంగా వెళ్ళిపోవచ్చు. మాది ఒక సమగ్రమగు జీవితం. వెలుగు నీడల మేలు కలయిక. ఒక దరిద్ర బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాను. మధూకర వృత్తి చేసి చంద్రగిరిలో ప్రొద్దుపుచ్చాను. పెనుగొండ సత్రపుటరుగుల మీద పడిగాపులు కాచి, పాంథజన శేషాన్న

భోజనంతో కడుపు నింపుతున్నాను. పలు దుర్గాధీశుల తాంబూలపు తిత్తులు మోశాను, తుదకు స్వశక్తితో ఈ విజయనగరాంధ్ర సామ్రాజ్యానికి మహామంత్రినై . అనన్య సాధారణ శేముషీ విభవంతో మధ్యందిన మార్తాండుని వలె ప్రకాశించాను, ఈనాడు ఆ మార్తాండుని చూచే అవకాశం కూడా లేకుండా అంధుణ్ణయాను. ఇది పరమాత్ముని లీల."

అప్పాజీ మాటల్లో ఉద్రేకం పెరుగుతున్నా శక్తి నీరసిస్తున్నది. క్షణ-క్షణానికి మనిషి కృంగిపోసాగాడు. ఆయన స్థితి ఆందోళనకరంగా పరిణమించింది.

"అప్పాజీ, తమ పరిస్థితి...." అన్నాడు అచ్యుతుడు అట్టే మాట్లాడ వొద్దని సూచనగా.

"ఔను. క్షణాల్లో ఉంది. ఎనభై సంవత్సరాలు నిండాయి. రాజ సేవలో ఈ శరీరం ఎండిపోయింది. నిరంతర రాజతంత్ర మంత్రాలోచనలో ఈ శిరస్సు పండి పోయింది. ఇక భూమి మీద రాలిపోక తప్పని రోజు ఏనాడో వచ్చింది" మహామంత్రి క్రమ-క్రమంగా దిగజారి పోతున్నాడు. నోట మాట రావటం లేదు. అవయవాల కదలిక సడలిపోయింది. అసలే వృద్ధుడు. ఆ పైని అంధుడు. తీవ్ర వేదనాభరితుడు.

"అప్పాజీ! ఒక్క మాట" అన్నాడు రాయలు.

"అడుగు బాబూ." అన్నాడు అప్పాజీ.

"శిశు హంతకుడెవరో మీకు తెలుసు...."

"ఆ రహస్యం మాతోనే అంతరిస్తుంది."

ఆ క్షణాన కూడా ఆయన మాటల్లో హుందాతనం గోచరించిరెడి. ఆ ద్రోహి పేరు రామలింగనాయకునికి తెలుసు; అచ్యుతరాయలకూ తెలుసు. అయినా, ఆ విషయం చెప్పే సాహసం లేదు. మహామంత్రి నోటినుండి హంతకుడి పేరు రావటం సామ్రాజ్యానికి క్షేమం. రాయల వారి తరువాత వారసుడు కాబట్టి. అచ్యుత దేవరాయలకు అది ముఖ్య రక్షణ.

"అలా అంటే వీలులేదు, అప్పాజీ! ఆ దుర్మార్గుడి పేరు మీరు చెప్పి తీరాలి. లేకపోతే మా మనస్సులకు బ్రతికి ఉన్నంతకాలం శాంతి



లేదు. ప్రతి ఒక్కరికీ, ప్రతి ఒక్కరి మీదా అనుమానమే! అంతః కలహాలు ఆరిపోవు. ప్రజ్వలిస్తాయి. చెప్పండి అప్పాజీ!" అంటూ ప్రాధేయ పడ్డాడు అచ్యుత దేవరాయలు.

"నిజమే అప్పాజీ! అచ్యుతుడు చెప్పింది అక్షరాలా నిజం. ఈ రహస్యం రహస్యంగానే ఉంటే, భ్రాతృ కలహానికి ఏనాడైనా దారి తీయొచ్చు. ఆంధ్ర సామ్రాజ్యం ఏ క్షణాన అయినా అంతః కలహానికి ఆట పట్టు అయ్యి సర్వనాశనం కావచ్చు. చెప్పండి! చెప్పండి, అప్పాజీ!" అన్నాడు మహారాజు- ఒకప్రక్క సత్యాన్వేషణాసక్తితో, మరో ప్రక్క భగ్న హృదయంతో.

"ఔను. ఆ మాటా నిజమే, రాయా! గజపతుల కన్య శోభనపు గది జ్ఞాపకం లేదూ?" అన్నాడు మహామంత్రి నీరసంగా.

"అన్నపూర్ణా?" గర్జించాడు మహారాజు భూనభోంతరాళాలు దద్దరిల్లేటట్లు.

ఆ అరుపుకు మహామంత్రి అదిరిపోయాడు.

"కాదు, రాయా! అన్నపూర్ణ కాదు, ఆమె నిర్దోషి."

మహామంత్రిని విపరీతమైన ఆవేశం ఆవహించింది. ఉద్రేకం ఉచ్ఛదశను చేరుకుంది. "రాయా!" అన్నాడు పెద్దగా అచ్యుతుడి వొళ్ళో నుంచి లేవటానికి ప్రయత్నిస్తూ. "నేనే! నేనే హంతకుణ్ణి."

ఆంధ్రసార్వభౌముని పట్టపుటేనుగు అసాధారణంగా ఘీంకరించింది.

ఆకాశాన తోకచుక్క ఆవిర్భవించింది.

దారుణ ఉల్కాపాతంతో విఠలస్వామి కళ్యాణ మండపం ముక్కవోయింది.

లోకబాంధవుడైన బాలభానుడు అరుణ కాంతులతో ఆవిర్భవించాడు.

విజయనగర సామ్రాజ్యపు అదృష్టభానుడు అస్తమించాడు.

ఆంధ్రదేశం అంధకారంలో మునిగిపోయింది.

విజయనగర ప్రజల కన్నీటి ధారలతో తుంగభద్ర పొంగి పొరల సాగింది.

ఆంధ్ర దేశాధీశుని ఆక్రందనంతో పర్వతసానువులు ప్రతిధ్వనించాయి.

శని దేవుని వికృత వికటాట్టహాసంతో విజయనగరం మార్మ్రోగింది.

నిన్నటి వరకూ ప్రపంచంలో ఆయన నిర్ణయానికి ఎదురులేదు, దారుణాఖండల శస్త్రతుల్యమైన ఆయన మాటకు తిరుగులేదు. సామాన్యుని నుండీ సార్వభౌముని వరకూ ఆయన మేధస్సుకు జేజేలు కొడుతూ అడుగులకు మడుగులొత్తినవారే.

కాని, ఈనాడు.... ఈనాడు జోహారులర్పిస్తున్నారు.

జేజేలు కొట్టే శోభనపు రోజులు అంతరించి జోహారులర్పించవలసిన దౌర్భాగ్యపు దినాలు వొచ్చాయి.

* * *

ఆనాటి సాయం సమయాన మహామంత్రి భౌతికదేహం తన అంతిమ యాత్రను ప్రారంభించింది. దారి కిరుప్రక్కలా లక్షలాది విజయనగర పౌరులు స్త్రీ పురుష బాల వృద్ధ వివక్షత లేకుండా మహామంత్రి అంతిమ దర్శనం కోసం బారులు తీర్చి నిలబడ్డారు. అది ఒక అపూర్వ దృశ్యం.

సంధ్యా సమయాన శవ వాహక శకటం బయలుదేరింది. అనేక సంవత్సరాలుగా మహామంత్రి వుపయోగిస్తూ వచ్చిన ఆరు గుఱ్ఱాల బంగారు తేరునే ఆ నాడు మహామంత్రి అంతిమ యాత్రకు కూడా సిద్ధం చేశారు. ఆ శకటం వద్దకు మహామంత్రి భౌతిక దేహాన్ని గోవిందరాయలు, గౌండరాజు, నాదెళ్ళ గోపన్న, దమ్మానాయకుడు తమ భుజాల మీద మోసుకుని తీసుకొని వచ్చి తేరుపై వుంచారు. మహామంత్రి దేహాన్ని చూడటంతోటే బయట వేచి వున్న ఆంధ్ర ప్రజానీకం హాహాకారాలు చేసింది. ప్రతి వ్యక్తీ తన సర్వస్వం కోల్పోయినట్లుగా ఆక్రోశించారు. కన్నీటి వెల్లువలు ధారలై కాలువలుగా ప్రవహించసాగాయి.



ఒక్కసారిగా దిక్కులు పిక్కటిల్లేటట్లు ఫిరంగులు మ్రోగాయి.

కోట వెలుపల మహామంత్రి దర్శనార్థం వేచి ఉన్న ఆంధ్ర ప్రజానీకం హృదయ విదారకంగా హాహాకారాలు చేసింది.

అవనత శీర్షాలతో వేయిమంది ఆంధ్రవీరులు పాదచారులై నిరస్త్రులుగా కోటనుండి బారులు తీర్చి వెలువడ్డారు.

ఆ తరువాత అయిదువందల అశ్వికదళానికి నాయకత్వం వహిస్తూ తిమ్మప్పనాయకుడు సింహద్వారంనుండి వెలువడ్డాడు.

ఆ పైన మూడువందల గజాలు నిరాభరణంగా వెంట రాగా పాదచారుడైన సరసనాయకుడు బయలుదేరాడు.

ఆ వెంట మేలుజాతి అశ్వాలు పూన్చిన నూరు రథాలు వెనుక రాగా కామనాయకుడు ముందు నడిచాడు.

ఆ తరువాత.... అదిగో-అదే మహామంత్రి భౌతికదేహాన్ని గొని వొస్తున్న స్వర్ణరథం.

వయసు ముదిరినా చెక్కు చెదరని గంభీరమైన విగ్రహం. అనేక సంవత్సరాలుగా ప్రపంచంలోని అపూర్వ మేధస్సునూ, అనన్య సాధారణ ప్రతిభనూ, అప్రతిహత పరాక్రమానికి ఆలవాలమైన మహామంత్రి పంచ భౌతికమైన శరీరం.... పంచభూతాలలో కలవటానికి బయలుదేరింది.

ఆ తేరు వెనక మహారాజు-ఆంధ్రసామ్రాజ్య రమాహృదయేశ్వరుడు పాదచారుడై అవనత శీర్షంతో అనుగమించాడు. అతని ప్రక్కనే పట్టమహిషి తిరుమలాంబిక, మహారాణి అన్నపూర్ణాదేవి మూర్తీభవించిన శోకదేవతల్లా బయలుదేరారు. వారి వెనుక అచ్యుతరాయలు, రామరాయలు మొదలుగాగల రాజబంధువులు; గోవిందరాయలు, దమ్మానాయకుడు, గౌండరాజు, గోపన్న మంత్రి మొదలైన మహామంత్రి బంధువులూ బయలుదేరారు. మహాకవి కవి పండిత శ్రేష్ఠులయిన అష్టదిగ్గజాలూ వారిని అనుసరించారు.

వారి వెనుక ఉన్నత రాజోద్యోగులు బయలుదేరారు. ఆ దృశ్యం మహామంత్రి ఆంధ్రసామ్రాజ్య లక్ష్మినే వెంటగొని పోతున్నాడా అనిపించేటట్లు ఉంది.

సూర్యాస్తమయ సమయంలో మహామంత్రి భౌతిక శరీరం స్మశాన వాటికకు చేరింది.

* * *

మంచి గంధపు చెక్కల మంటలు స్మశాన భూమిలో ఉవ్వెత్తుగా లేచాయి.

* * *

"ఒక మహామంత్రి అస్తమించాడు. ఒక మహత్తర శక్తి
అంతరించింది. విజయ నగరాంధ్ర సామ్రాజ్య చరిత్రలో ఒక వైభ
వోజ్వల మహా యుగానికి మంగళా చరణం పాడిన మహామంత్రి వెళ్ళి
పోయాడు. చరమ గీతిక నాలపించిన అపఖ్యాతి నాకు మిగిలింది.
గురుడై, సఖుడై, అమాత్యుడై నన్ను సకల సామ్రాజ్యాభిషిక్తుని
గావించి, కంటికి రెప్పవలె కాపాడినందుకు ప్రతిగా- అప్పాజీని
పుత్ర నష్ట జనితోన్మాదంతో, విచక్షణను కోల్పోయి, పశుప్రాయుడనయి
స్వహస్తాలతో అంతం చేశాను- రాజుగా సింహాసనం అధిష్ఠించిన దోషా
నికి. పరిపూర్ణ హృదయులైన ఆయన నన్ను క్షమించారు. కాని, ఆంధ్ర
దేశం నన్ను క్షమించదు.

"ఒక మతిచెడిన మహారాజు నిర్ణయం ఆంధ్రదేశ భవితవ్యాన్ని భస్మం చేసింది ఆంధ్రదేశ భవితవ్యాన్ని భస్మం చేసిందని చరిత్రకారులు రక్తాక్షరాలతో లిఖిస్తారు...."

మహారాజు కన్నీళ్ళతో మహామంత్రికి బాష్పాంజలి ఘటించాడు.

అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ
ఓం శాంతి శాంతి శాంతిః

★ ★ ★